శనివారం
27•7•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 9 • సంచిక 32
• పేజీలు: 16 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE
PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD






శుక్రవారం తెలంగాణభవన్‌లో నియోజకవర్గ సభ్యత్వ, డిజిటల్ నమోదు ఇంచార్జీలతో జరిగిన సమీక్షాసమావేశంలో మాట్లాడుతున్న టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు. చిత్రంలో ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ కూడా ఉన్నారు.

• థాయ్‌లాండ్ బాక్సింగ్ టోర్నీ

## పైనల్లో నిఖత్, హుస్సాముద్దీన్

సత్తాచాటిన తెలంగాణ బాక్సర్లు

వివరాలు 'ఆట'లో






## జయజయహే కార్గిల్

- పాక్‌పై ఘన విజయానికి 20 వసంతాలు
- దేశవ్యాప్తంగా ఘనంగా కార్గిల్ విజయ్ దివస్
- అమరవీరులకు జాతి ఘననివాళి
- జవాన్లకు దేశం రుణపడి ఉంటుందన్న రాష్ట్రపతి కోవింద్
- మళ్లీ దుస్సాహసానికి తెగిస్తే ముక్కు పగులుతుంది
- పాకిస్థాన్‌కు ఆర్మీ చీఫ్ రావత్ హెచ్చరిక

5

## ప్రాణహిత ప్రయాణం

# వంద కిలోమీటర్లు



అన్నారం పంప్‌హౌస్‌లోని నాలుగు మోటర్లు ఎత్తిపోసిన నీరు డెలివరీ సిస్టర్న్ నుంచి దుంకుతున్న దృశ్యం

| బరాజ్‌లలో నీటినిల్వ | |
|---|---|
| అన్నారం | : 7.87 టీఎంసీలు |
| మేడిగడ్డ | : 5.7 టీఎంసీలు |
| సుందిల్ల | : 2.5 టీఎంసీలు |

**మేడిగడ్డ, అన్నారం, సుందిల్లను దాటి గోదావరిలో ఎగువకు నీటి ప్రవాహం**

**నేడు గోలివాడ ఫోర్‌బేలోకి సుందిల్ల జలాలు.. రేపు 1వ నంబర్ మోటర్‌తో నీటి ఎత్తిపోత**

**కన్నెపల్లిలో ఆరు మోటర్లతో ఎత్తిపోత.. మేడిగడ్డ బరాజ్‌లో నిలకడగా నీటి నిల్వ**

**వర్షాలతో పెరుగనున్న నీటి ప్రవాహం**



అన్నారం పంప్‌హౌస్ డెలివరీ చానల్ నుంచి వచ్చి డ్రాప్ పాయింట్ ద్వారా సుందిల్ల బరాజ్‌లోకి చేరుతున్న నీరు

**మంథని, నమస్తే తెలంగాణ/ మంథని రూరల్ /అంతర్గాం/ కాళేశ్వరం/ మహదేవ్‌పూర్:**

కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి ఎదురు బయల్దేరిన ప్రాణహిత జలాలు.. సుమారు 100 కిలోమీటర్లు ప్రయాణించాయి. మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బరాజ్‌లను దాటుకుని, ఎల్లంపల్లి బరాజ్ సమీపానికి చేరుకుంటున్నాయి. కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి 1, 2, 3, 4, 5, 6వ మోటర్ల ద్వారా రోజుకు 1.2 టీఎంసీల నీరు అన్నారం బరాజ్‌కు చేరుతున్నది. ఏడో నంబర్ మోటర్‌ను ఏ క్షణంలోనైనా ప్రారంభించనున్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి అన్నారం బరాజ్‌కు గురువారం వరకు 10.5 టీఎంసీల నీరు చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. బరాజ్‌లో శుక్రవారం సాయంత్రానికి 7.87 టీఎంసీల నీటినిల్వ ఉన్నది. అన్నారం పంప్‌హౌస్‌లోని నాలుగు మోటర్ల ద్వారా సుందిల్ల బరాజ్‌కు 2.70 టీఎంసీల నీటిని తరలించినట్లు ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రాణహిత నుంచి

మిగతా 3వ పేజీలో

## నెలలోనే 40 లక్షల

# గులాబీసేన

### టీఆర్‌ఎస్ సభ్యత్వాలకు విశేష స్పందన

**పాలకుర్తి, గజ్వేల్ నియోజకవర్గాల్లో అత్యధికంగా సభ్యత్వాల నమోదు**

**30లోగా సభ్యత్వాలు, డిజిటల్ నమోదు పూర్తి.. ఆగస్టు 1 నుంచి పార్టీ సభ్యులకు బీమా వర్తింపు**

**అన్ని మున్సిపాలిటీలపై గులాబీ జెండా ఎగురాలి.. బూత్‌కమిటీల ఏర్పాటుతో పురపోరుకు సిద్ధంకండి**

**టీఆర్‌ఎస్ సభ్యత్వ నమోదుపై సమీక్షలో వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి విశేషస్పందన లభించిందని, నెల వ్యవధిలో దాదాపు 40 లక్షల మంది సభ్యులుగా చేరారని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు చెప్పారు. ఇందులో దాదాపు 20 లక్షలమంది వివరాలను డిజిటలైజ్ చేసినట్టు చెప్పారు. 50 వేల సభ్యత్వాలు పూర్తయిన నియోజకవర్గాల్లో కమిటీల ఏర్పాటుకు అనుమతిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలపై గులాబీ జెండా ఎగురాలని పిలుపునిచ్చారు. బూత్‌స్థాయి కమిటీలు వెంటనే ఏర్పాటుచేసి, నాయకులు, కార్యకర్తలు మున్సిపాలిటీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. టీఆర్‌ఎస్ సభ్యత్వ నమోదుపై శుక్రవారం తెలంగాణభవన్‌లో నియోజకవర్గ సభ్యత్వ, డిజిటల్ నమోదు ఇంచార్జీలతో కేటీఆర్ సమీక్షించారు. ప్రతి నియోజకవర్గంవారీగా పూర్తయిన సభ్యత్వం, వాటి డిజిటలైజేషన్‌పై వివరాలు తెలుసుకున్నారు. నెలాఖరులోపు సభ్యత్వ నమోదు పూర్తిచేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కార్యకర్తల పూర్తి వివరాలను సేకరించాలని ఇచ్చిన మార్గదర్శకాలను పాటిస్తున్నారో లేదో తెలుసుకున్నారు. ఈ వివరాల ఆధారంగానే కార్యకర్తల బీమా సౌకర్యం

మిగతా 2వ పేజీలో

## వానందుకున్నది

రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు

- నేడు, రేపు మోస్తరు నుంచి భారీ వానలు
- గ్రేటర్ హైదరాబాద్‌కూ వర్ష సూచన
- పలు జిల్లాల్లో పొంగిన వాగులు వంకలు
- బొగత జలపాతంలో పెరిగిన నీటి ఉద్ధృతి

3



ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం అందూర్ వాగులో నీటి ప్రవాహం

| చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.) | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 81.00 | రిటైల్ లైవ్ | 103.00 |
| డ్రెస్డ్ | 149.00 | స్కిన్‌లెస్ | 170.00 |

| గుడ్ల ధరలు (వందకు) (రూ.) | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 302.00 | రంగారెడ్డి | 302.00 |
| మెదక్ | 302.00 | కరీంనగర్ | 305.00 |
| వరంగల్ | 305.00 | చిల్లర ధర | 3.62 |

## 12 ఎకరాలు అన్యాక్రాంతం

- రికార్డుల్లో మారిన పట్టాదారు పేరు
- న్యాయంకోసం వెళ్తే ఫైల్ దొరకడంలేదంటున్న తాసిల్ సిబ్బంది
- అక్రమాలను కప్పిపుచ్చుకొనేందుకు దేవరకొండ అధికారుల సాకు
- ఫైల్ మాయంపై బాధితుల ఆందోళన
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన బాధిత వృద్ధ మహిళలు

ధర్మగంట

9

రైతు సర్వన్‌కు
### పట్టా మంజూరు

సమస్యను పరిష్కరించి 1-బీ అందించిన గార్ల తాసిల్దార్

'పట్టాల కోసం పాట్లు' కథనానికి అధికారుల స్పందన



## కన్నడ పీఠంపై యెడియూరప్ప

- నాలుగోసారి సీఎంగా ప్రమాణం
- ఎల్లుండి అసెంబ్లీలో బలపరీక్ష
- సంఖ్యాశాస్త్రం ప్రకారం పేరులోని అక్షరాలను మార్చుకున్న బీజేపీ నేత!

5

పార్లమెంట్ ఆవరణలో
## హరితహారం!

- ఉత్సాహంగా పాల్గొన్న ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు
- కీసర రిజర్వ్ ఫారెస్ట్ దత్తతపై ఎంపీ సంతోష్‌కు ప్రశంసలు

2

• ఆసరాతో ఆనందం

7



శుక్రవారం యాదగిరిగుట్టలో ఆసరా పెంఛన్ డబ్బులు తీసుకొని మురిసిపోతున్న దివ్యాంగురాలు








శుక్రవారం హైదరాబాద్‌లో సిరిసిల్ల నియోజకవర్గం రాచర్ల తిమ్మాపూర్‌కు చెందిన దివ్యాంగుడు సాగర్‌కు మూడు చక్రాల వాహనాన్ని అందజేస్తున్న టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ వాసుదేవరెడ్డి, గడ్డంపల్లి రవీందర్‌రెడ్డి ఉన్నారు.



శుక్రవారం హైదరాబాద్‌లో ఎన్ఐఎన్ పోటీ పరీక్షల్లో జాతీయస్థాయి మొదటి ర్యాంకు సాధించిన లావణ్యకు ఆర్థిక సహాయం అందజేస్తున్న కేటీఆర్. చిత్రంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే వివేకానంద తదితరులు ఉన్నారు



శుక్రవారం హైదరాబాద్‌లో తెలంగాణ మెడికల్ ఎంట్రన్స్ మొదటి, నీట్ 50వ ర్యాంకర్ కుశ్వంత్‌కు రూ.5 లక్షల సహాయాన్ని అందజేస్తున్న టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.



# నెలలోనే 40 లక్షల గులాబీసేన

మొదటిపేజీ తరువాయి...

ముడిపడి ఉన్నదని చెప్పారు. సభ్యత్వ నమోదు సందర్భంగా ప్రజలనుంచి వచ్చిన అభిప్రాయాలను ఇంచార్జీల ద్వారా కేటీఆర్ తెలుసుకున్నారు. సభ్యత్వ నమోదుకు అన్నివర్గాలనుంచి పెద్దఎత్తున స్పందన వస్తున్నదంటూ సంతృప్తి వ్యక్తంచేశారు. లక్ష్యాన్ని మించి సభ్యత్వాన్ని నమోదుచేసిన పలు నియోజకవర్గాల్లో మరిన్ని సభ్యత్వ నమోదు పుస్తకాలను పార్టీ కార్యాలయం నుంచి తీసుకున్నారని కేటీఆర్ తెలిపారు. సభ్యత్వాల నమోదు, డిజిటలైజేషన్ లక్ష్యాన్ని ఈ నెల 30లోగా పూర్తిచేయాలని సూచించారు. పట్టణప్రాంతాల్లో పెద్దఎత్తున సభ్యత్వ నమోదు చురుకుగా కొనసాగుతున్నదని ఇంచార్జీలు కేటీఆర్‌కు తెలిపారు. రానున్న పురపాలక ఎన్నికల నేపథ్యంలో పట్టణప్రాంతాల్లో వస్తున్న స్పందనపై కేటీఆర్ సంతృప్తి వ్యక్తం చేశారు. లక్ష్యంమేరకు సభ్యత్వాన్ని పూర్తిచేసిన ఇంచార్జీలు, స్థానిక ఎమ్మెల్యేలను అభినందించారు. నెలాఖరులోగా మొత్తం ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు.



శుక్రవారం తెలంగాణభవన్‌లో టీఆర్‌ఎస్ నియోజకవర్గ సభ్యత్వ, డిజిటల్ నమోదు ఇంచార్జీల సమావేశంలో మాట్లాడుతున్న వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

### సభ్యత్వాల్లో పాలకుర్తి, గజ్వేల్ టాప్

సభ్యత్వ నమోదులో పాలకుర్తి, గజ్వేల్ నియోజకవర్గాలు ముందువరుసలో నిలిచాయి. పాలకుర్తిలో 73 వేలమంది, గజ్వేల్‌లో 70 వేల మంది సభ్యత్వాలు స్వీకరించారు. సిద్దిపేటలో 63వేలు, సత్తుపల్లిలో 62వేలు, పరకాల, మహబూబాబాద్, మహేశ్వరం, మేడ్చల్, సూర్యాపేట, ములుగు, ధర్మపురి, సిరిసిల్ల, కామారెడ్డి నియోజకవర్గాల్లో 60 వేలకు పైగా, గద్వాల, నకిరేకల్‌లో 50 వేలకుపైగా సభ్యత్వ నమోదు జరిగినట్టు కేటీఆర్ వెల్లడించారు.

### జీహెచ్ఎంసీ సభ్యత్వాలపై ప్రత్యేక సమీక్ష

అత్యంత కీలకమైన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పార్టీ సభ్యత్వ నమోదుపై బుధవారం ప్రత్యేకంగా సమీక్షించాలని నిర్ణయించారు. జీహెచ్ఎంసీ పరిధిలో అత్యధికంగా 24 మున్సిపాలిటీలు ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం.

### ఆగస్టు 1 నుంచి సభ్యులకు బీమా

పార్టీ సభ్యత్వం పొందిన సభ్యుల వివరాలను జూలై 30లోగా డిజిటలైజ్‌చేసి, ఆగస్టు 1 నుంచి బీమా వర్తింపజేయనున్నట్టు కేటీఆర్ వెల్లడించారు. సమావేశంలో ప్రభుత్వ విప్‌లు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బోడకుంటి వెంకటేశ్వర్లు, ఎంపీ వెంకటేశ్ నేతకాని, ఎమ్మెల్సీలు నారదాసు లక్ష్మణ్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యేలు బాల్క సుమన్, దానం నాగేందర్, రవీంద్రనాయక్, వనమా వెంకటేశ్వరరావు, పార్టీ నేత తుల ఉమ, కార్పొరేషన్ల చైర్మన్లు మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు కేటీఆర్‌కు జన్మదినోత్సవాన్ని (24వ తేదీన) పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలిపారు.

### జలమండలి విజేతలకు అభినందన

హైదరాబాద్ మెట్రో వాటర్‌బోర్డు (జలమండలి) యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో గెలిచిన నాయకులను కేటీఆర్ అభినందించారు. టీఆర్‌ఎస్కేవీ అనుబంధ వాటర్ వర్క్స్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు రాంబాబుయాదవ్.. కామ్‌గార్ యూనియన్ నాయకుడు సతీశ్‌కుమార్‌పై 367 ఓట్ల మెజారిటీతో గెలిచారు. ఈ సందర్భంగా రాంబాబు నేతృత్వంలో యూనియన్ ప్రతినిధులు రాజిరెడ్డి, నారాయణ, జహంగీర్, అఖ్తర్‌అలీ, జయరాజ్, లక్ష్మీనారాయణ, ఆనంద్‌రెడ్డి, షకీల్ తదితరులు కేటీఆర్‌ను కలిశారు. వారిని అభినందించిన కేటీఆర్.. యూనియన్ సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. టీఆర్‌ఎస్కేవీ యూనియన్‌కు మద్దతు తెలిపిన సంఘాల నేతలకు రాంబాబు ధన్యవాదాలు తెలిపారు.

### హలో.. నేను కేటీఆర్‌ను మాట్లాడుతున్న..

**సభ్యత్వ** నమోదుపై సమీక్షించిన కేటీఆర్.. సభ్యత్వ నమోదు పుస్తకాల్లోంచి కొందరు కార్యకర్తల నంబర్లకు స్వయంగా ఫోన్లు చేశారు. మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గానికి చెందిన పలువురు కార్యకర్తలకు ఫోన్‌చేసి, సభ్యత్వ రుసుమును సభ్యత్వం పొందినవారే చెల్లించారా? లేక ఎమ్మెల్యేలు చెల్లించారా? అనేది వాకబుచేశారు. ఊహించని విధంగా కేటీఆర్ స్వయంగా ఫోన్ చేయడంతో కార్యకర్తల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.



తెలంగాణ భవన్‌లో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్. చిత్రంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కర్నె ప్రభాకర్, శ్రీనివాస్‌రెడ్డి, సత్యవతి రాథోడ్ ఉన్నారు



తెలంగాణభవన్‌లో కేటీఆర్‌కు మొక్కను అందజేస్తున్న పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా. చిత్రంలో ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

## టీఆర్‌ఎస్‌పై ప్రజల్లో అపార నమ్మకం

- ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి

**దేశచరిత్రలో** నెలరోజుల్లో 40 లక్షల సభ్యత్వాలను పూర్తిచేసిన ఘనత టీఆర్‌ఎస్‌కే దక్కిందని ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సభ్యత్వాల నమోదుపై శుక్రవారం తెలంగాణభవన్‌లో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన జరిగిన సమావేశం అనంతరం పార్టీ నేతలు గట్టు రామచంద్రరావు, ఎం శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్, వాసుదేవరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలో టీఆర్‌ఎస్‌పట్ల ప్రజలు అపారమైన నమ్మకం, ప్రేమ కలిగి ఉన్నారని చెప్పారు. గత ఎనిమిది నెలల్లో జరిగిన వివిధ ఎన్నికల్లో టీఆర్‌ఎస్‌కు అద్భుతంగా, ఏకపక్షంగా పట్టం కట్టడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఇప్పటికే 40 లక్షలకుపైగా సభ్యత్వాలు పూర్తయినట్టు చెప్పారు. సభ్యత్వ రుసుముకు సంబంధించి రూ.15 కోట్లు పార్టీ రాష్ట్ర కార్యాలయానికి అందినట్టు తెలిపారు. సభ్యులందరికీ ఈ ఏడాది కూడా రూ.2 లక్షల బీమా వర్తిస్తుందని చెప్పారు. 50 వేల సభ్యత్వాలు పూర్తయిన నియోజకవర్గాల్లో కమిటీల ఏర్పాటుకు కేటీఆర్ అనుమతిచ్చినట్టు పల్లా తెలిపారు. టీఆర్‌ఎస్ సభ్యులందరికీ రాజకీయ శిక్షణ ఇచ్చి, దేశంలో క్రమశిక్షణ కలిగిన సైనికులుగా తీర్చిదిద్దాలనేది కేసీఆర్, కేటీఆర్ లక్ష్యమని చెప్పారు. దసరానాటికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పార్టీ కార్యాలయాల నిర్మాణం పూర్తి చేసి, శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించాలని కేటీఆర్ ఆదేశించినట్టు వివరించారు. అసెంబ్లీ, సచివాలయాల నిర్మాణాలపై హైకోర్టులో కేసు ఉన్న నేపథ్యంలో దానిపై ప్రభుత్వమే కోర్టుకు సమాధానమిస్తుందని విలేకరులు అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా పల్లా చెప్పారు.



## ఆపన్నులకు అండగా కేటీఆర్

**సరస్వతీపుత్రుడికి రూ.ఐదు లక్షల ఆర్థిక సహాయం**

- బీటెక్ విద్యార్థికి హాస్టల్ ఫీజు రూ.65 వేలు అందజేత
- దివ్యాంగుడికి మూడు చక్రాల వాహనం పంపిణీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/భూపాలపల్లి టౌన్/సిరిసిల్ల, నమస్తే తెలంగాణ/ఎల్లారెడ్డిపేట:** ఆపదలో ఉన్నామని చెప్పుకోగానే తక్షణమే స్పందించే టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. జాతీయస్థాయి నీట్‌లో 50వ ర్యాంక్ సాధించిన కుష్వంత్ చదువుకు రూ.ఐదు లక్షలు అందజేసి అండగా నిలిచారు. ఆర్థికస్తోమత లేని బీటెక్ విద్యార్థి పవన్‌కు రూ.65 వేల తక్షణసాయం అందించి భరోసాగా నిలిచారు. ప్రమాదంలో ఒక కాలును కోల్పోయిన కాంబోజ సాగర్ త్రిచక్ర వాహనం ఇప్పించాలని కోరగా, టీఆర్‌ఎస్ సీనియర్ నేత గడ్డంపల్లి రవీందర్‌రెడ్డి 'గిఫ్ట్ ఏ స్మైల్ చాలెంజ్'లో భాగంగా కేటీఆర్ సమక్షంలో వాహనాన్ని అందజేశారు. శుక్రవారం ఈ మూడు కార్యక్రమాలకు హైదరాబాద్ వేదికైంది.

### సరస్వతీ పుత్రుడికి భరోసా

మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌కు చెందిన లక్ష్మీనారాయణ రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఆయన భార్య అనిత బతుకుతెరువు కోసం భూపాలపల్లికి వచ్చి దుస్తులు కుడుతూ కుమారులను చదివిస్తున్నారు. కుమారుడు కుష్వంత్ ఈ ఏడాది నిర్వహించిన తెలంగాణ ఎంసెట్ రాష్ట్రస్థాయిలో తొలిర్యాంకు, ఏపీ ఎంసెట్‌లో ఎనిమిదో ర్యాంకు, జాతీయస్థాయి నీట్‌లో 50వ ర్యాంక్ సాధించాడు. ఢిల్లీ ఎయిమ్స్‌లో సీటు లభించింది. ఫీజు చెల్లించే స్తోమత లేకపోవడంతో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి దంపతులు రూ.రెండు లక్షల నగదు, ల్యాప్‌టాప్ అందించారు. విద్యార్థి పరిస్థితిని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కేటీఆర్ శుక్రవారం తెలంగాణభవన్‌కు పిలిపించి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.ఐదు లక్షల చెక్కును కుశ్వంత్‌కు అందజేశారు. ఉన్నత చదువులకు సహకరిస్తానని హామీఇచ్చారు. మంచి వైద్యుడిగా పేరుతెచ్చుకొని తెలంగాణ ప్రజలకు సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, వరంగల్ రూరల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, టీఆర్‌ఎస్ నాయకులు పోలుసాని లక్ష్మీనర్సింహారావు, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

### నిరుపేదల చదువుకు కొండంత అండ

రాజన్న సిరిసిల్ల జిల్లాకేంద్రంలోని సుందరయ్యనగర్‌కు చెందిన సాంబారం శ్రీనివాస్, లలిత దంపతులు ఫుట్‌పాత్‌పై టీస్టాల్ నిర్వహిస్తున్నారు. వీరి కుమారుడు పవన్ ఈసెట్‌లో 98వ ర్యాంక్ సాధించగా హైదరాబాద్‌లోని వీఎన్ఆర్ విజ్ఞానజ్యోతి ఇంజినీరింగ్ కాలేజీలో సివిల్ విభాగంలో అడ్మిషన్ లభించింది. విద్యాభ్యాసం కొనసాగించేందుకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో సమస్యను కేటీఆర్‌కు వివరించారు. ఆయన సూచన మేరకు శుక్రవారం హైదరాబాద్‌కు రాగా, హాస్టల్ వసతి, ల్యాబ్, ఇతర ఖర్చుల కోసం రూ.65 వేల నగదును సొంతంగా పవన్‌కు అందించారు. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, భవిష్యత్తులోనూ తన సహకారం ఉంటుందని కేటీఆర్ భరోసా ఇచ్చారు. 'మా పవన్‌కు అన్న లెక్క చదువులో సాయం చేసిండు. దయాగుణం గల సార్‌ను మరిచిపోం. మా ఇంటి మనిషి లాగా ధైర్యం చెప్పిండు. సార్‌ను దేవుడు సల్లంగా సూడాలి' అని పవన్ తల్లిదండ్రులు శ్రీనివాస్, లలిత పేర్కొన్నారు. కార్యక్రమంలో సిరిసిల్ల 25వ వార్డు కౌన్సిలర్ బత్తుల వనజారమేశ్ పాల్గొన్నారు. ఇటీవల జాతీయపోటీ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థి ఫీజుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని కేటీఆర్ సొంతంగా అందించారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ పోటీపరీక్షల్లో దేశవ్యాప్తంగా తొలిర్యాంకు సాధించిన మేడ్చల్ జిల్లా గాజుల రామారానికి చెందిన నిరుపేద విద్యార్థిని కే లావణ్యకు ఆర్థిక సహాయాన్ని అందించారు.

### దివ్యాంగునికి ఆసరా

సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్‌కు చెందిన కాంబోజ సాగర్ ఉపాధి కోసం దుబాయ్ వెళ్లి ప్రమాదంలో కాలు కోల్పోయాడు. తర్వాత సొంతూరికి వచ్చి కిరాణం దుకాణం నడుపుతున్నాడు. వ్యాపార నిర్వహణకు అంగవైకల్యం ఇబ్బందిగా మారిందని, త్రిచక్ర వాహనం ఇప్పించాలని ట్విటర్‌లో కేటీఆర్‌కు విన్నవించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న టీఆర్‌ఎస్ సీనియర్ నేత గడ్డంపల్లి రవీందర్‌రెడ్డి త్రిచక్ర వాహనం అందించేందుకు ముందుకొచ్చారు. కేటీఆర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని చేపట్టిన 'గిఫ్ట్ ఏ స్మైల్ చాలెంజ్'లో భాగంగా శుక్రవారం తెలంగాణభవన్‌లో కేటీఆర్ చేతుల మీదుగా సాగర్‌కు వాహనాన్ని అందజేశారు. సాగర్ జీవనోపాధి కోసం అవసరమైన సహాయాన్ని అందిస్తామని ఈ సందర్భంగా కేటీఆర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, టీవీసీసీ చైర్మన్ వాసుదేవరెడ్డి, టీఎస్‌టీఎస్ చైర్మన్ చిరుమళ్ల రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రియుడి నుంచి న్యాయం కోసం విజ్ఞప్తి

**ఓ యువకుడు** తనను ప్రేమించి మోసం చేశాడని, అతడి నుంచి తనకు న్యాయం జరిగేలా చూడాలని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఓ యువతి కోరారు. ఏపీలోని కృష్ణా జిల్లాకు చెందిన అశోక్ తనను ప్రేమించి మోసంచేశాడని వనపర్తి జిల్లా వెల్లటూర్‌కు చెందిన యువతి శుక్రవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌కు ఫిర్యాదుచేశారు. 20 రోజుల్లో పెండ్లి చేసుకుంటానని కుషాయిగూడ పీఎస్‌లో ఒప్పుకొని ఏడాది గడుస్తున్నా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. సమస్యను తెలుసుకొని ఆమెకు న్యాయం చేయాలని టీఆర్‌ఎస్ మహిళా విభాగం ప్రతినిధులకు కేటీఆర్ సూచించారు. యువతి నుంచి టీఆర్‌ఎస్ మహిళా ప్రతినిధులు వివరాలు సేకరించి నుంచి న్యాయం చేస్తామని హామీఇచ్చారు.

### ముహూర్తం

సూర్యోదయం: 5.58 గంటలకు

సూర్యాస్తమయం: 6.48 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, కృష్ణపక్షం, దశమి రాత్రి 7.48 వరకు, తదుపరి ఏకాదశి, నక్షత్రం: కృత్తిక రాత్రి 7.31 వరకు, తదుపరి రోహిణి, అమృత ఘడియలు: సాయంత్రం 5.03 నుంచి 6.39 వరకు, రాహుకాలం: ఉదయం 9.10 నుంచి 10.46 వరకు, దుర్ముహూర్తం: తె.జా. 5.58 నుంచి ఉదయం 7.40 వరకు, వర్జ్యం: ఉదయం 7.14 నుంచి 8.50 వరకు.



65వ జాతీయ రహదారిపై పల్టీ కొట్టిన కారును తొలగించేందుకు సహాయక చర్యలు చేపడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

## కారు తొలగించి.. ట్రాఫిక్ పునరుద్ధరించి..

ప్రమాద ఘటనలో సహాయక చర్యలు చేపట్టిన మంత్రి జగదీశ్‌రెడ్డి

**చివ్వెంల:** జాతీయ రహదారిపై పడిపోయిన కారును పక్కకు తొలిగించి, ట్రాఫిక్‌ను పునరుద్ధరించేందుకు మంత్రి జగదీశ్‌రెడ్డి సహాయచర్యలు చేపట్టారు. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం గుంజలూరులో శుక్రవారం 65వ జాతీయ రహదారిపై విజయవాడ వైపు వెళ్తున్న కారు డివైడర్‌ను ఢీకొని రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది. కారు లోపల ఇద్దరు యువకులు చిక్కుకోగా, స్థానికులు వారిని కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో అరకిలోమీటర్ మేర ట్రాఫిక్ జామ్ అయింది. అదే సమయంలో కోదాడ నుంచి సూర్యాపేటకు వస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి కారును పక్కకు తొలగించేందుకు సాయం చేశారు. వర్షంలోనే 10 నిమిషాల పాటు సహాయక చర్యలు చేపట్టి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. కారు నుంచి బయటికి వచ్చిన యువకులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

## టీఎస్‌పీఎస్సీకి రూ.7 కోట్లు విడుదల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ :** తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.7 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు సాధారణ పరిపాలనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అధర్‌సిన్హా ఉత్తర్వులు జారీచేశారు.

## వరంగల్ అర్బన్ జిల్లా అభివృద్ధికి రూ.6.2 కోట్లు

వనపర్తి, నాగర్‌కర్నూల్ నియోజకవర్గాలకు నిధులు విడుదల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వరంగల్ అర్బన్ జిల్లాకు ప్రత్యేక అభివృద్ధి నిధి నుంచి రాష్ట్రప్రభుత్వం రూ.6.262 కోట్లు విడుదల చేసింది. వనపర్తి నియోజకవర్గానికి రూ.57.84 లక్షలు, నాగర్‌కర్నూల్‌కు రూ.23.93 లక్షలు విడుదల చేసింది. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీచేశారు.

### లోకం పోకడ



ఎవరింటికి వాళ్లని వెళ్ళిపొమ్మని కాదయ్యా!

## ఆగస్టు 7 నుంచి ఐసెట్ కౌన్సెలింగ్

- అడ్మిషన్ కమిటీ నిర్ణయం
- ఒకట్రెండు రోజుల్లో కౌన్సెలింగ్ షెడ్యూల్, నోటిఫికేషన్ జారీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ఎంబీఏ, ఎంసీఏ కాలేజీల్లో సీట్ల భర్తీ కోసం ఆగస్టు 7 లేదా 8 నుంచి ఐసెట్-2019 కౌన్సెలింగ్ ప్రారంభించాలని అడ్మిషన్ కమిటీ నిర్ణయించింది. రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఈ కమిటీ సమావేశమై ఐసెట్ కౌన్సెలింగ్‌పై చర్చించింది. ఒకటి లేదా రెండు రోజుల్లో ఐసెట్-2019 కౌన్సెలింగ్ షెడ్యూల్‌తోపాటు నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నట్లు అడ్మిషన్ కన్వీనర్ నవీన్‌మిత్తల్ చెప్పారు. ఎంబీఏ, ఎంసీఏ కాలేజీల్లో ట్యూషన్ ఫీజుల ఖరారు ప్రక్రియ వారంరోజుల్లో పూర్తవుతుందని తెలంగాణ ఫీజ్ అండ్ అడ్మిషన్ రెగ్యులేషన్ కమిటీ (టీఎఫ్ఏఆర్సీ) చైర్మన్ పీ స్వరూప్‌రెడ్డి తెలిపారు. ఈ కాలేజీల్లో 15 నుంచి 20 శాతం మేరకు ఫీజులను పెంచేందుకు ప్రయత్నిస్తున్నామని, కాలేజీలవారీగా వసతి సదుపాయాలతోపాటు ఆదాయ వ్యయాలు, జీతాల చెల్లింపు లాంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్నామని వివరించారు.

## గ్రూప్-2 ఇంటర్వ్యూల గిరిజన అభ్యర్థులకు ప్రత్యేక శిక్షణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహించే గ్రూప్-2 ఇంటర్వ్యూలకు అర్హులైన గిరిజన అభ్యర్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్టు గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ క్రిస్టినా జడ్ చోంగ్తూ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్వ్యూలో పాల్గొనేందుకు శిక్షణకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 27 నుంచి 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 040-27540104 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.



వీఎన్నార్ విజ్ఞాన్‌జ్యోతి కాలేజీలో ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్న సిరిసిల్లకు చెందిన పవన్‌కు ఆర్థిక సహాయం అందజేస్తున్న కేటీఆర్

## పార్లమెంట్ ఆవరణలో హరితహారం!

- ఉత్సాహంగా పాల్గొన్న ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు
- కీసర రిజర్వ్ ఫారెస్ట్ దత్తతపై ఎంపీ సంతోష్‌కు ప్రశంసలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

పార్లమెంట్ ఆవరణలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు పాల్గొన్నారు. తెలంగాణ ఎంపీల ఆహ్వానం మేరకు రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్‌సింగ్, కేంద్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్, వైద్యారోగ్యశాఖ మంత్రి హర్షవర్దన్, ఎంపీలు సుప్రియా సూలే, సుమలత తదితరులు మొక్కలు నాటారు. లోక్‌సభలో టీఆర్‌ఎస్ పక్షనేత నామా నాగేశ్వర్‌రావు, రాజ్యసభ పక్ష నేత కే కేశవరావు, ఎంపీలు సంతోష్‌కుమార్, బండ ప్రకాశ్ తదితరులు ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఐదేండ్లుగా హరితహారంలో భాగంగా తెలంగాణలో 130 కోట్లకు పైగా మొక్కలు నాటినట్టు ఎంపీలు వెల్లడించారు. తెలంగాణలో హరితహారంలో భాగంగా తానుకూడా మొక్కలు నాటానని కేంద్రమంతి ప్రకాశ్‌జవదేకర్ గుర్తుచేసుకున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా హైదరాబాద్ శివారులోని కీసర రిజర్వ్ ఫారెస్ట్‌ను దత్తత తీసుకొని అభివృద్ధి చేయనున్నట్టు ఎంపీ సంతోష్‌కుమార్ తెలిపారు. ఎంపీ ల్యాడ్స్ నిధులను ఎకో టూరిజం అభివృద్ధికి వెచ్చిస్తున్నట్టు వివరించారు. పర్యావరణ పరిరక్షణలో ఇది కీలక అడుగని, వినూత్న ప్రయత్నమంటూ సంతోష్‌ను కేంద్రమంత్రులు, ఎంపీలు అభినందించారు.



పార్లమెంట్ ఆవరణలో మొక్కనాటిన కేంద్రమంత్రి ప్రకాశ్‌జవదేకర్. చిత్రంలో టీఆర్‌ఎస్ ఎంపీలు కేకే, నామా, సంతోష్‌కుమార్, బండ ప్రకాశ్, ఎన్సీపీ ఎంపీ సుప్రియా సూలే ఉన్నారు.



ఉప్పొంగిన బొగత

ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి అటవీప్రాంతంలో 'తెలంగాణ నయాగరా'గా ప్రసిద్ధి పొందిన బొగత జలపాతం ఉప్పొంగుతున్నది. గురువారం రాత్రి, శుక్రవారం ఉదయం కురిసిన భారీవర్షానికి ఛత్తీస్‌గఢ్, పాలవాగు గుట్టలతోపాటు పెనుగోలు నల్లందేవి వాగు నుంచి వస్తున్న వరదనీటితో ఈ జలపాతం అద్భుత అందాలను సంతరించుకున్నది. నింగినుంచి నేలకు జాలువారిన పాలసంద్రంలా వరద నీటితో కళకళ లాడుతూ పర్యటకులను కట్టిపడేస్తున్నది. బొగతకు తరలివస్తున్న పర్యాటకుల రక్షణకు ఎఫ్ఆర్వో డోలీ శంకర్ నేతృత్వంలో జాలర్లను ఏర్పాటుచేశారు. -వాజేడు (ములుగు)



లక్నవరం.. జలశోభితం

ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని లక్నవరం సరస్సు జలశోభతో కళ కళ లాడుతున్నది. గురువారం మధ్యాహ్నానికి 13 అడుగులున్న నీటిమట్టం.. అర్ధరాత్రి నుంచి కురుస్తున్న భారీవర్షాల వల్ల శుక్రవారం ఉదయానికి 15.2 అడుగులకు చేరింది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాల వల్ల శనివారం నాటికి మరో 2 అడుగుల మేర నీరు పెరుగొచ్చని రైతులు అంచనావేస్తున్నారు. -గోవిందరావుపేట (ములుగు)



# ప్రాణహిత ప్రయాణం వంద కి.మీ.



శుక్రవారం మంథని గోదావరి తీరంలో పుష్కరఘాట్లను తాకుతూ ప్రవహిస్తున్న నీరు

మొదటిపేజీ తరువాయి...

గోదావరికి 14,000 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నదని చెప్పారు. మేడిగడ్డ బరాజ్‌లో శుక్రవారం నీటినిల్వ నిలకడగా ఉన్నది. గురువారం నుంచి శుక్రవారం వరకు 5.7 టీఎంసీల నీరు ఉన్నట్లు ప్రాజెక్టు ఇంజినీర్లు తెలిపారు. గురువారం రాత్రి నుంచి మహదేవ్‌పూర్ మండలంలో ఎడతెరిపి లేకుండా వాన పడుతుండటంతో మేడిగడ్డ బరాజ్‌కు ప్రాణహిత నుంచి శుక్రవారం అర్ధరాత్రికల్లా నీటిప్రవాహం పెరిగే అవకాశాలున్నాయని చెప్తున్నారు.

### రేపు గోలివాడలో ఎత్తిపోత

కన్నెపల్లిలో ఎత్తిపోసిన ప్రాణహిత జలాలు పరవళ్లు తొక్కుతూ అన్నారం పంపుహౌస్ నుంచి సుందిల్ల బరాజ్‌ను నింపుకొంటూ అంతర్గాం మండలం పెద్దపేట దాటి, రాయదండి, గోలివాడ వైపు పరుగులు తీస్తున్నాయి. అన్నారం పంపుహౌస్‌లోని నాలుగు మోటర్లు నిరంతరం నడుస్తుండడంతో రోజుకు టీఎంసీ చొప్పున నీరు సుందిల్ల బరాజ్‌లోకి చేరుతున్నది. శుక్రవారం రాత్రి వరకు సుందిల్లలో 124.30 మీటర్లకు నీటిమట్టం చేరుకోగా, నీటినిల్వ 2.5 టీఎంసీలుగా ఉన్నది. ఇప్పటికే బ్యాక్‌వాటర్ 20 కిలోమీటర్ల దూరం వ్యాపించాయి. మరో మూడు కిలోమీటర్లదూరం ఎదురు ప్రవహిస్తే శనివారం గోలివాడ పంప్‌హౌస్ హెడ్‌రెగ్యులేటరీ గేట్లను తాకి ఫోర్‌బేలోకి చేరనున్నాయని ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ నేపథ్యంలో గోలివాడ పంపుహౌస్‌లో ఆదివారమే 1వ మోటర్‌ను ప్రారంభించి ఎల్లంపల్లిలోకి నీటిని ఎత్తిపోయాలని యోచిస్తున్నట్టు చెప్పారు. శుక్రవారం పంప్‌హౌస్‌లోనే మకాం వేసి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.



జలాభిషేకం

కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద ఆరు మోటర్లు ఎత్తిపోసిన ప్రాణహిత జలాలు





శుక్రవారం గ్రామస్థుల సాయంతో వాగు దాటి, గుట్టల్లో నుంచి నడిచివస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

## వాగులుదాటి వైద్యసాయం

### వాజేడు డాక్టర్ వెంకటేశ్వర్లు సాహసం

**వాజేడు(ములుగు):** ములుగు జిల్లా వాజేడు మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు మంకిడి వెంకటేశ్వర్లు సాహసం చేశారు. వాగులు పొంగుతున్నా.. నిరుపేదలకు వైద్య సేవలు అందించేందుకు 20 కిలోమీటర్ల దూరంలోని పెనుగోలు గ్రామాన్ని సందర్శించారు. వైద్యసిబ్బంది పెనుగోలు గ్రామస్థులతో కలిసి కర్రల సాయంతో మూడువాగులు, మూడు గుట్టలు కాలినడకన దాటారు. బండరాళ్ల మధ్యలోంచి నడిచివెళ్లారు. గ్రామంలోని 23 ఇండ్లలో దోమల నివారణ మందు పిచికారీ చేయించడంతోపాటు 53 మందికి దోమతెరలను పంపిణీ చేశారు. వైద్య శిబిరం ఏర్పాటుచేసి గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి పలువురికి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పెనుగోలుకు నడిచివెళ్లి వైద్యం అందించిన వైద్యుడిగా వెంకటేశ్వర్లు ఘనతకెక్కారు. ఆయనవెంట ఇతర సిబ్బంది ఉన్నారు.



ములుగు జిల్లా వాజేడు మండలం పెనుగోలులో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు



ఛత్తీస్‌గఢ్‌లో కురుస్తున్న భారీ వర్షాలతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని తాలిపేరు రిజర్వాయర్‌లో నీటిమట్టం పెరిగింది. ప్రాజెక్టు 13 గేట్లను ఎత్తి 24 వేల క్యూసెక్కుల నీటిని దిగువన గోదావరిలోకి విడుదలచేస్తున్నారు. సింగరేణి ఏరియా ఓసీల్లో వరదనీరు చేరడంతో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. - భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ



ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం గంగారం సమీపంలోని దేవాదుల ఇన్‌టేక్ వెల్ వద్ద గోదావరి నీటిమట్టం 71.5 మీటర్లు ఉన్నది. ఇప్పటిదాకా మూడు మోటర్ల ద్వారా నీటిని ఎత్తిపోయగా, శుక్రవారం సాయంత్రం రెండు మోటర్లను నిలిపివేశారు. శుక్రవారం నాటికి 1.234 టీఎంసీల నీటిని భీం ఘనపూర్ రిజర్వాయర్‌కు తరలించారు. - ఏటూరునాగారం

### ఆల్మట్టికి 11,679 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కృష్ణాబేసిన్‌లో ఎగువన కర్ణాటక ప్రాజెక్టులకు ఓ మోస్తరు వరద కొనసాగుతున్నది. ఆల్మట్టికి 11,679 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో రిజర్వాయర్ (129.721 టీఎంసీల పూర్తిస్థాయి)లో నీటిమట్టం 121.75 టీఎంసీలకు చేరుకున్నది. అవుట్‌ఫ్లో 128 క్యూసెక్కులున్నది. తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో 16124 క్యూసెక్కులు, ఉ జ్జయినికి 1729 క్యూసెక్కులు ఉన్నాయి.

**గోదావరిలో స్థిరంగా వరద ప్రవాహం**

గోదావరిలో వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతున్నది. కడెంకు 382 క్యూసెక్కులు, ఎల్లంపల్లికి 482 క్యూసెక్కులు వస్తున్నాయి. ఎల్లంపల్లి నుంచి దిగువకు 597 క్యూసెక్కులు విడుదలచేస్తున్నారు. శ్రీరాంసాగర్ వద్ద ఇన్‌ఫ్లో 202 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 226 క్యూసెక్కులుగా ఉన్నది. మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం కందకుర్తి వద్ద గోదావరిలో శుక్రవారం వరద స్వల్పంగా పెరిగింది. ధర్మపురి వద్ద గోదావరిలో స్వల్ప వరద ఉన్నది. ధవళేశ్వరం వద్ద వరద 25,193 క్యూసెక్కులుండగా.. 25,425 క్యూసెక్కులను సముద్రంలోకి వదులుతున్నారు.

# వానందుకున్నది

- రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు.. పొంగిన వాగులు, వంకలు
- నేడు, రేపు మోస్తరు నుంచి భారీ వానలు.. హైదరాబాద్‌కూ వర్ష సూచన

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** రాష్ట్రంలో వాన జోరందుకున్నది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం వరకు ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. బంగాళాఖాతంలో అల్పపీడనం , చురుకుగా కదులుతున్న నైరుతి రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రం తడిసి ముద్దయింది. పలు జిల్లాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. జలపాతాలు కొత్త కళను సంతరించుకున్నాయి. చెరువులు, కుంటల్లోకి భారీగా నీళ్లు చేరుతున్నాయి. శని, ఆదివారాల్లోనూ విస్తారంగా వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. గ్రేటర్ హైదరాబాద్‌లో శుక్రవారం ఓ మోస్తరు నుంచి భారీవర్షం పడగా, శనివారం కూడా వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలపై రైతన్నలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఎండుముఖం పట్టిన ఆరుతడి, పత్తి పంటలకు ఈ వర్షం జీవం పోసిందని చెప్తున్నారు. వ్యవసాయ పనుల్లో బిజీ అయ్యారు.

**ఉమ్మడి వరంగల్ జిల్లాలో భారీ వర్షాలు**

ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురిశాయి. ములుగు జిల్లాలోని వాజేడు, వెంకటాపురం(నూగూరు), ఏటూరు నాగారం, మంగపేట, కన్నాయిగూడెం మండలాల్లో జోరు వాన కురిసింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. బొగత జలపాతంలో నీటి ఉద్ధృతి పెరిగింది. గోవిందరావుపేట మండలంలో లక్నవరం నీటిమట్టం 15 అడుగులకు చేరుకున్నది. తాడ్వాయి మండలం మేడారంలోని జంపన్నవాగు, ములుగు మండలంలోని బొగ్గులవాగు పొంగిపొర్లింది. ములుగు జిల్లాలో 6.61 సెం.మీ, వరంగల్ అర్బన్ జిల్లాలో 3.47 సెం.మీ వర్షపాతం నమోదైంది. వరంగల్ నగరంలో రోడ్లు జలమయ్యాయి. మహబూబాబాద్ జిల్లాలో ఓ మోస్తరు వర్షం కురిసింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో వాగులు వంకలు ఉప్పొంగాయి. ఏజెన్సీలోని పలిమెల మండలం లెంకలగడ్డ, పంకెన, సర్వాయిపేట వాగులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో రవాణా సౌకర్యానికి అంతరాయం వాటిల్లింది. జిల్లాలో 4.57 సెం.మీ. వర్షపాతం నమోదైంది. రేగొండ మండలంలో అత్యధికంగా 8.2 సెం.మీ. వర్షం కురిసింది. వరంగల్ రూరల్ జిల్లాలో మోస్తరు వర్షం కురిసింది. పరకాల మండలంలో 6.2 సెం.మీ. వర్షం కురిసింది. జనగామ జిల్లావ్యాప్తంగా ఓ మోస్తరుగా వర్షం కురిసింది. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 12.6 సెం.మీ. వర్షం కురిసింది. కాగజ్‌నగర్ డివిజన్‌లోని బెజ్జూర్, చింతలమానెపల్లి, పెంచికల్‌పేట్, కౌటాల, దహెగాం, సిర్పూర్–టి మండలాల్లో వర్షం పడింది. మంచిర్యాలలో 3.9, చెన్నూర్‌లో 3.6, ఆదిలాబాద్ జిల్లాలో అత్యధికంగా నేరడిగొండ మండలంలో 46.8, బోథ్ మండలంలో 36.2 సెం.మీ వర్షం కురిసింది.

**కిన్నెరసానిలోకి వరద నీరు**

ఖమ్మం జిల్లావ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. జిల్లాలో 3.49 సెం.మీ వర్షం పడగా, అత్యధికంగా ఖమ్మం రూరల్ మండలంలో అత్యధికంగా 6.58 సెం.మీ., ఖమ్మం అర్బన్‌లో 6.42 సెం.మీ. వర్షపాతం నమోదైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. అత్యధికంగా ములకలపల్లి మండలంలో 2.92 సెం.మీ వర్షం కురిసింది. ఏజెన్సీలో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. గుండాల మండలంలోని కిన్నెరసాని వాగులోకి వరద నీరు చేరింది. సింగరేణి పరిధిలోని ఓపెన్‌కాస్ట్ గనుల్లోని ఉత్పత్తి నిలిచిపోయింది.



శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న లెంకలగడ్డ బండల వాగు

**పలు జిల్లాల్లో ముసురు వానలు**

మహబూబ్‌నగర్ జిల్లాలో ముసురు వానలు పడ్డాయి. హన్వాడ, కోయిల్‌కొండ, గండీడ్, మహబూబ్‌నగర్, జడ్చర్లతోపాటు, నారాయణపేట జిల్లాకేంద్రం, దామరగిద్ద, మక్తల్ తదితర మండలాల్లో, వనపర్తి జిల్లాలో, జోగుళాంబ గద్వాల జిల్లాలోని గట్టు, కేటీదొడ్డి, వడ్డేపల్లి తదితర మండలాల్లో, నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. రంగారెడ్డి జిల్లాలోని తలకొండపల్లి, ఆమనగల్లు, చేవెళ్ల, ఇబ్రహీంపట్నం, మంచాల మండలాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం పడింది. నల్లగొండ జిల్లా అంతటా చిరుజల్లులు కురిశాయి. సూర్యాపేట జిల్లావ్యాప్తంగా ముసురు వర్షాలు పడ్డాయి. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంతోపాటు పలు మండలాల్లో భారీ వర్షం కురిసింది. నిర్మల్ జిల్లాలోని 19 మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. జిల్లావ్యాప్తంగా 1.97 సెం.మీ. వర్షపాతం నమోదైంది. సిద్దిపేట జిల్లాలో 2.55 సెం.మీ. వర్షం పడగా, బెజ్జంకిలో 5.55 సెం.మీ., మెదక్ జిల్లావ్యాప్తంగా 1.52 సెం.మీ వర్షపాతం నమోదైంది. కరీంనగర్ జిల్లాలో శుక్రవారం 3.94 సెం.మీ. వర్షం కురిసింది. హుజూరాబాద్‌లో అత్యధికంగా 6.65, వీణవంకలో 6.33, దాపూర్‌లో 61.7 సెం.మీ వర్షపాతం నమోదైంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 27.2 సెం.మీ. సగటు వర్షపాతం నమోదైంది.

### నేడు, రేపు విస్తారంగా వానలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పశ్చిమ బెంగాల్ కోస్తా తీర ప్రాంతాల్లోని వాయవ్య బంగాళాఖాతంలో శుక్రవారం ఏర్పడిన అల్పపీడనంతో తెలంగాణ మీదుగా నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులుతున్నాయి. మరోవైపు పశ్చిమబెంగాల్ దాని పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నదని, దీని ప్రభావం రాష్ట్రంపై కూడా ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు వెల్లడించారు. అల్పపీడనం కారణంగా శని, ఆదివారాల్లో రాష్ట్రమంతటా విస్తారంగా వర్షాలు కురుస్తాయని, కొన్నిప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వానలు కురుస్తాయని తెలిపారు. గురువారం మధ్యాహ్నాం నుంచే సూర్యాపేట, ఖమ్మం, భూపాలపల్లి, ములుగు, హైదరాబాద్ తదితర జిల్లాల పరిధిలోని పలు ప్రాంతాల్లో భారీనుంచి ఓ మోస్తరు వానలు పడ్డాయని తెలిపారు.



వర్షం పడటంతో సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలంలో ఉత్సాహంగా ఎరువులు వేస్తున్న రైతులు



సూర్యాపేట జిల్లా కేంద్రంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

### గ్రేటర్ హైదరాబాద్‌లో ఓ మోస్తరు వర్షం

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** రుతుపవనాలు చురుకుగా కదలడం, బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రెండ్రోజులుగా గ్రేటర్ హైదరాబాద్‌లో విస్తారంగా వానలు కురుస్తున్నాయి. శుక్రవారం గ్రేటర్‌లోని పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు పడ్డాయి. రాజేంద్రనగర్, అత్తాపూర్, కార్వాన్, మెహిదీపట్నం, బంజారాహిల్స్, శంషాబాద్, ఆదిబట్ల, శేరిలింగంపల్లి, సరూర్‌నగర్, మల్కాజిగిరి, మేడ్చల్, ఉప్పల్, నాగోల్, నాంపల్లి, అబిడ్స్ తదితర ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. రాగల 24 గంటల్లో గ్రేటర్‌లోని పలుచోట్ల ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు గరిష్ఠ ఉష్ణోగ్రత 29.7 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 24.2 డిగ్రీలు, గాలిలో తేమ 80 శాతంగా నమోదైందని చెప్పారు. వర్షం వల్ల నగరంలో వాతావరణం చల్లబడి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి.

















శుక్రవారం 'ప్లాంటేషన్ డే'లో భాగంగా పార్లమెంట్ ఆవరణలో మొక్క నాటుతున్న ప్రధాని మోదీ. చిత్రంలో స్పీకర్ ఓం బిర్లా, హోంమంత్రి అమిత్‌షా, ప్రతిపక్ష నేత అధిర్ రంజన్ చౌదరి తదితరులు

## చంద్రయాన్-2 రెండో భూకక్ష్య పెంపు

వెల్లడించిన ఇస్రో

**బెంగుళూరు, జూలై 26**: చంద్రయాన్-2 వాహకనౌక భూ కక్ష్యను పెంచే రెండో ప్రక్రియను శుక్రవారం వేకువజామున విజయవంతంగా పూర్తి చేసినట్టు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) పేర్కొంది. దీంతో వాహకనౌక చంద్రునికి మరింత చేరువైనట్టు శాస్త్రవేత్తలు తెలిపారు. భూ కక్ష్యను పెంచే ప్రక్రియ శుక్రవారం వేకువజామున 1.08 గంటలకు జరిగింది. దీంతో ప్రస్తుతం చంద్రయాన్-2 వాహకనౌక 251X54,829 కిలోమీటర్ల ఎత్తున ఉన్న భూ కక్ష్యలోకి చేరినట్టు శాస్త్రవేత్తలు తెలిపారు. ప్రమాణాల పరంగా వాహకనౌక సాధారణంగానే ఉన్నట్టు, మూడోసారి కక్ష్యను పెంచే ప్రక్రియను జూలై 29న చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు. మొదటి భూ కక్ష్య పెంపును ఇస్రో బుధవారం విజయవంతంగా నిర్వహించింది. ఆగస్టు 14 వరకు మరో రెండు కక్ష్యలను పెంచే ప్రక్రియను చేపడతామని ఇస్రో వెల్లడించింది.

## పాలపుంతలో 28 కొత్త నక్షత్రాలు

భారత శాస్త్రవేత్తల ఆవిష్కరణ

**నైనిటాల్(ఉత్తరాఖండ్):** పాలపుంత గెలాక్సీలో 28 కొత్త నక్షత్రాలను ఆర్యభట్ట రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అబ్జర్వేషనల్ సైన్స్ (ఏఆర్ఐఈఎస్) శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఈ నక్షత్రాలు అస్థిరమైన(వేరియబుల్) లక్షణాన్ని కలిగి ఉన్నట్టు వాళ్లు పేర్కొన్నారు. నక్షత్రాల వెలుగులో హెచ్చుతగ్గులు ఉన్నట్లయితే వాటిని అస్థిర నక్షత్రాలుగా పిలుస్తారు. పాలపుంతలో అస్థిర నక్షత్రాలను కనిపెట్టడం ఓ అసాధారణ విజయంగా ఏఆర్ఐఈఎస్ డైరెక్టర్ వాహబ్ ఉద్దీన్ అభివర్ణించారు. కోమా బెరెనిసెస్ నక్షత్ర సమూహంలోని గోళాకార నక్షత్రాల గుంపు ఎన్‌జీసీ 4147లో అస్థిర నక్షత్రాలను కనుగొనడం ఇదే ప్రథమమని ఏఆర్ఐఈఎస్ మాజీ డైరెక్టర్ అనిల్ పాండే తెలిపారు. 'గోళాకార నక్షత్ర సమూహాల అధ్యయనానికి అస్థిర నక్షత్రాల సమాచారం చాలా కీలకం' అని పాండే అన్నారు.

## గౌతమ్ నవలఖ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్ చేసిన కోర్టు

**ముంబై:** సామాజిక కార్యకర్త గౌతమ్ నవలఖ దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పును బాంబే హైకోర్టు శుక్రవారం రిజర్వ్ చేసింది. ఆయనను అరెస్ట్ చేయకుండా గతంలో జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులు తీర్పు వెలువడే వరకు వర్తిస్తాయని పేర్కొంది. ఎల్గార్ పరిషత్-భీమా కోరేగావ్ ఘటనలకు సంబంధించి పోలీసులు ప్రవేశపెట్టిన కొన్ని రికార్డులు గౌతమ్ నవలఖకు సంబంధం లేదని సూచిస్తుండగా మరికొన్ని పత్రాలపై దర్యాప్తు అవసరమని బెంచ్ అభిప్రాయపడింది.



# మోదీపై బురద జల్లేందుకే.. ఆ లేఖ!

రాజకీయ లక్ష్యం కోసమే ప్రధానికి లేఖ రాశారు

దేశాన్ని ముక్కలు చేయాలన్న వేర్పాటువాదులను ఎందుకు ప్రశ్నించరు?

నక్సల్స్, ఉగ్రవాద బాధితులకు ఎందుకు అండగా నిలువరు?

మోదీకి లేఖ రాసిన 49 మందిని ప్రశ్నించిన 61 మంది ప్రముఖులు



కంగనా రనౌత్ / మధుర్ భండార్కర్ / ప్రసూన్ జోషి

**ముంబై, జూలై 26**: దళితులు, మైనార్టీలపై మూకదాడులు జరుగుతున్నాయని, జై శ్రీరాం పేరుతో దాడులు చేస్తున్నారని, వాటిని నిరోధించాలంటూ ఇటీవల 49 మంది ప్రముఖులు ప్రధాని మోదీకి లేఖ రాసిన సంగతి తెలిసిందే. దీనిపై వివిధ రంగాలకు చెందిన 61 మంది ప్రముఖులు శుక్రవారం స్పందించారు. 'ప్రత్యేక లక్ష్యంతోనే తప్పుడు ప్రచారం' చేస్తున్నారని మండిపడ్డారు. పక్కాగా రాజకీయ దురుద్దేశంతోనే ఆ లేఖ రాశారని ఆరోపించారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. నటులు కంగనా రనౌత్, పల్లవి జోషి, విశ్వజిత్ ఛటర్జీ, రచయిత ప్రసూన్ జోషి, డ్యాన్సర్ సోనాల్ మాన్‌సింగ్, దర్శకులు మధుర్ బండార్కర్, వివేక్ అగ్నిహోత్రి, నిర్మాత సైకత్ ముఖర్జీ, గాయకురాలు మాలిని అవస్థి, నేతాజీ సుభాష్ ఓపెన్ యూనివర్సిటీ మాజీ వీసీ రాధారమణ్ చక్రవర్తి, శాంతినికేతన్‌లోని విశ్వభారతికి చెందిన దెబశీష్ భట్టాచార్య, అవధ్ యూనివర్సిటీ వీసీ మనోజ్ దీక్షిత్, డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ రీసెర్చ్ ఫౌండేషన్‌కు చెందిన అనిర్బన్ గంగూలీ, జర్నలిస్ట్, ఎంపీ స్వప్నాదాస్ గుప్తా తదితరులు దీనిపై సంతకం చేశారు. ఆ లేఖలో.. 'అంతర్జాతీయంగా భారత ప్రతిష్ఠను మసకబార్చడం, భారతీయ విలువలైన జాతీయవాదం, మానవతావాదం పునాదులపై దేశ ప్రజలకు సుపరిపాలన అందించేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేస్తున్న నిరంతర కృషిని అడ్డుకొని, ప్రతికూల కోణంలో చూపించడమే ఆ లేఖ ఉద్దేశం' అని ఆరోపించారు. తప్పుడు కథనాలు, అబద్ధాలతో మన ప్రజాస్వామ్య విలువలను కించపరుచడానికి, దేశ ప్రజల ఐక్యతను దెబ్బతీయడానికి చేస్తున్న కుట్రగా అభివర్ణించారు. గిరిజనులు, అట్టడుగు వర్గాల ప్రజలు నక్సలిజం, ఉగ్రవాదానికి బలై బాధితులుగా మారినప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారని 49 మంది ప్రముఖులను ప్రశ్నించారు. 'వేర్పాటువాదులు కశ్మీర్‌లో పాఠశాలలను తగులబెట్టాలంటూ రెచ్చగొట్టినప్పుడు, భారత్‌ను ముక్కలు చేయాలని డిమాండ్ చేసినప్పుడు, దేశంలోనే ప్రముఖ యూనివర్సిటీలో ఉగ్రవాదులు, ఉగ్రవాద సంస్థలకు అనుకూలంగా నినాదాలు ప్రతిధ్వనించినప్పుడు సదరు ప్రముఖులంతా ఎందుకు నోరుమూసుకొని ఉన్నారు?' అని నిలదీశారు. మూకదాడులను ప్రధాని మోదీ తరుచూ ఖండిస్తూనే ఉన్నారని గుర్తుచేశారు. మూకదాడులకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉన్నదని చెప్పారు. ఒకే అంశం లేదా ఒకే వ్యక్తిని లక్ష్యంగా చేసుకోవద్దని కోరారు. మూకదాడులు, వివక్ష, మతపరమైన ప్రదేశాలను అవమానించడం వంటి ఘటనలు ఎక్కడ జరిగినా ప్రతి ఒక్కరూ ఖండించాలని విన్నవించారు. సమాజంలో మంచి హోదాలో ఉన్నవారు సంకుచిత ఆరోపణలకే పరిమితం కాకుండా మూకదాడులకు కారణమయ్యే పరిస్థితులను, దాడులు చేసే వారి మానసిక స్థితిని మార్చడానికి ప్రయత్నించాలని సూచించారు. 'వారు (మోదీకి లేఖ రాసిన 49 మంది) ప్రత్యేక లక్ష్యంతోనే పనిచేస్తున్నారని, భారతదేశాన్ని ముక్కలు చేయాలనుకునేవారి చేతుల్లో కీలుబొమ్మలుగా మారుతున్నారని భావిస్తున్నాం' అని 61 మంది ప్రముఖులు తమ ప్రకటనలో పేర్కొన్నారు. జై శ్రీరాం పేరుతో కొట్టి చంపుతున్నారని ఆరోపిస్తున్నవారు కశ్మీర్ లోయ నుంచి కశ్మీరీ పండిట్లను తరిమివేసినప్పుడు, ఉత్తరప్రదేశ్‌లోని కైరానా నుంచి హిందువులను వెళ్లగొట్టినప్పుడు వారు నోరువిప్పలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రిపుల్ తలాక్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్న మహిళలకు ఎందుకు అండగా నిలువడం లేదని ప్రశ్నించారు.

## ఆవు ఆక్సిజన్‌ను విడుదల చేస్తుంది

ఉత్తరాఖండ్ సీఎం త్రివేంద్రసింగ్ రావత్ వ్యాఖ్య



**డెహ్రాడూన్, జూలై 26:** గాలిలోని ఆక్సిజన్‌ను శ్వాసించడంతోపాటు బయటకు కూడా వదిలే ఒకే ఒక జంతువు ఆవు అని ఉత్తరాఖండ్ సీఎం త్రివేంద్ర సింగ్ రావత్ పేర్కొన్నారు. ఆవుకు మసాజ్ చేస్తే శ్వాసకోశ సంబంధిత వ్యాధులు నయమవుతాయని, ఆవుతో సన్నిహితంగా జీవిస్తే క్షయ వంటి వ్యాధులు కూడా నయమవుతాయని ఆయన చెప్పారు. డెహ్రాడూన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆవు పాలు, మూత్రంలో ఔషధ గుణాలున్నాయని త్రివేంద్రసింగ్ ప్రశంసిస్తున్న ఓ వీడియో వైరల్ అయింది. సీఎం వ్యాఖ్యలను ఓ ప్రభుత్వ ఉన్నతాధికారి సమర్థించారు. 'ఆవులు తమకు ఆక్సిజన్ ఇస్తాయని ఉత్తరాఖండ్ పర్వత ప్రాంతాల్లో నివసించే అనేక మంది ప్రజలు నమ్ముతారు' అని తెలిపారు.

దేశంలో మూకదాడులు పెరిగిపోతున్నాయంటూ మోదీకి రాసిన లేఖ శ్రీరాముని ప్రతిష్ఠను ఏ విధంగానూ తగ్గించదు. అయోధ్యలో రామమందిరం ఆందోళనలు చెలరేగుతున్న సమయంలోనే జై శ్రీరామ్ నినాదం రాజకీయ రంగు పులుముకున్నది. ఆ తర్వాత మనుషులపై దాడులకు సూచికగా మారింది. మైనార్టీలపై దాడులకు వ్యతిరేకంగా ప్రధాని పార్లమెంట్‌లో మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో ఆ స్ఫూర్తిని అమలుచేయాలి.

– శ్యామ్ బెనగల్, సినీ దర్శకుడు

నన్ను చంద్రమండలానికి వెళ్లాలన్న కేరళ బీజేపీ నేత సలహాను స్వాగతిస్తున్నాను. అక్కడికి వెళ్లడానికి టిక్కెట్టు బుక్ చేయాల్సిందిగా ఆయనను కోరుతున్నాను. చిన్నప్పటి నుంచి చంద్రుడి మీదికి వెళ్లాలని కోరుకునేవాడిని. అదో అందమైన యాత్ర. రాముడి పేరుతో దేశంలో హింస కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలోనే ప్రధానికి లేఖ రాశాం. దానిపై కొందరు చిన్న నేతలు పిచ్చి వ్యాఖ్యలు చేస్తున్నారు

– ఆదూర్ గోపాలకృష్ణన్, సినీదర్శకుడు



పులిని కొట్టి చంపారు..

ఉత్తర్‌ప్రదేశ్‌లోని పిలిబిత్ జిల్లా మటైనా గ్రామస్థులు విచక్షణ కోల్పోయారు. ఓ ఆడపులి తమ గ్రామానికి చెందిన తొమ్మిది మందిపై దాడి చేసిందన్న కారణంతో దాన్ని కొట్టి చంపారు. కర్రలు, ఈటెలతో బలంగా కొట్టడంతో పులి పక్కటెముకలు విరిగిపోవడంతోపాటు శరీరంలోని దాదాపు అన్ని అవయవాలు దెబ్బతిన్నాయి. దీంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. ఈ దాడికి సంబంధించి అటవీ అధికారులు 43 మందిపై కేసు నమోదు చేశారు.

## 130 మందిని రక్షించిన లిబియా కోస్ట్‌గార్డులు

**కైరో:** మధ్యధరా సముద్రంలో రెండు పడవలు నీట మునిగిన ఘటనలో మరణించిన పలువురి మృతదేహాలను లిబియా కోస్ట్ గార్డులు శుక్రవారం వెలికితీశారు. గురువారం రెండు పడవల్లో సుమారు 350 మంది వలస కార్మికులు యూరప్ దిశగా వెళుతుండగా ఈ విషాదం చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఇప్పటి వరకు 130 మందికి పైగా వలస కార్మికులను రక్షించామని లిబియా అధికారులు చెప్పారు. ఈ ప్రమాదంలో సుమారు 150 మంది ఆచూకీ గల్లంతైందని భావిస్తున్నారు.

### మూకదాడులపై కేంద్రం, రాష్ట్రాలకు

## సుప్రీంకోర్టు నోటీసులు

**న్యూఢిల్లీ, జూలై 26:** మూక హత్యలు, మూక దాడులపై కేంద్రంతో సహా పలు రాష్ట్రాలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. మూక హత్యలు, మూక దాడులను అరికట్టాలని గత ఏడాది జారీ చేసిన మార్గదర్శకాలను కేంద్ర ప్రభుత్వం విస్మరించిందని వస్తున్న ఆరోపణలపై స్పందన తెలియజేయాలని అత్యున్నత న్యాయస్థానం కేంద్రాన్ని ఆదేశించింది. మూకదాడులను అరికట్టడానికి సుప్రీంకోర్టు గత ఏడాది రూపొందించిన మార్గదర్శకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయంటూ దాఖలైన పిటిషన్‌ను శుక్రవారం సుప్రీంకోర్టు విచారించింది. ఈ క్రమంలో ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్, జస్టిస్ దీపక్ గుప్తా నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం .. కేంద్రం సహ పలు రాష్ట్రాలకు నోటీసులు జారీ చేసింది. మూకదాడుల విషయంలో నమోదైన కేసు విచారణలో భాగంగా సుప్రీంకోర్టు 17, జూలై 2018న రాష్ట్రాలకు కొన్ని మార్గదర్శకాలను సూచించింది.

## ఇర్ఫాన్‌భాయ్.. జైశ్రీరాం అనవా!

కాంగ్రెస్ ఎమ్మెల్యేను కోరిన జార్ఖండ్ మంత్రి సీపీ సింగ్

**రాంచీ, జూలై 26:** జార్ఖండ్‌కు చెందిన పట్టణాభివృద్ధి, రవాణాశాఖ మంత్రి సీపీ సింగ్ తన తోటి ఎమ్మెల్యే ఇర్ఫాన్ అన్సారీని జైశ్రీరాం అని నినదించాలని కోరారు. రాష్ట్ర అసెంబ్లీ బయట జరిగిన ఈ ఘటన వీడియో బయటికి వచ్చింది. ఎమ్మెల్యే భుజంపై చెయ్యివేసిన మంత్రి మాట్లాడుతూ 'ఇర్ఫాన్‌భాయ్ నేను నిన్ను ఓ విషయం కోరుతున్నాను. జైశ్రీరాం అని గట్టిగా ఒక్కసారి అనవా' అని అన్నారు. దీంతో కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇర్ఫాన్ స్పందిస్తూ 'ప్రజలను భయపెట్టడానికి మీరు రాముడి పేరును వాడుకుని ఆయనను దిగజార్చుతున్నారు. రాముడు అందరివాడు' అని సమాధానమిచ్చారు.



ఎస్సీ యువతికి ఉద్యోగ నియామకపత్రం అందజేస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

## కేసీఆర్‌తోనే దళితుల ప్రగతి

- మంత్రి కొప్పుల ఈశ్వర్
- ఎస్సీ నిరుద్యోగ యువతకు ఉద్యోగ నియామకపత్రాలు అందజేత

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో దళితులందరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందుతున్నాయని సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. సీఎం కేసీఆర్‌తోనే దళితుల ప్రగతి సాధ్యమని చెప్పారు. ఇంజినీరింగ్ పూర్తిచేసి నిరుద్యోగాలుగా ఉన్నవారికి తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో టెక్‌నాలెడ్జ్ డెవలప్ సంస్థ ఇచ్చిన శిక్షణ ద్వారా అవకాశాలు పొందిన ఎస్సీ యువతకు శుక్రవారం హరితప్లాజాలో నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. ఎస్సీ సబ్‌ప్లాన్‌ను సక్రమంగా అమలుచేస్తూ ఎస్సీ కుటుంబాల ప్రగతికి కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నైపుణ్య శిక్షణను మరింత విస్తరించి ఎనిమిదో తరగతి చదువుకున్నవారికి కూడా ఆయా అంశాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఎండీ లచ్చిరాం భూక్యా, టెక్ నాలెడ్జ్ సంస్థ ఎండీ సాయికుమార్, ఎస్సీ కార్పొరేషన్‌కు చెందిన పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# రోడ్ల నిర్మాణంలో రాష్ట్రం ముందంజ

- 2,527 కి.మీ. నుంచి 3,834 కి.మీ.కు పెరిగిన హైవేలు
- సీఎం కేసీఆర్ నిరంతరకృషివల్లే సాధ్యం
- ఇండియన్ రోడ్ కాంగ్రెస్ వర్క్‌షాప్‌లో మంత్రి ప్రశాంత్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నాయకత్వంలో భారీ ఎత్తున రోడ్ల నిర్మాణం చేపట్టామని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రం ఏర్పడినప్పుడు తెలంగాణలో కేవలం 2,527 కి.మీ. జాతీయ రహదారులు మాత్రమే ఉన్నాయని, సీఎం కేసీఆర్ నిరంతర కృషివల్ల ఇప్పుడు రాష్ట్రంలో జాతీయ రహదారులు 3,834 కిలోమీటర్లకు పెరిగాయని చెప్పారు. శుక్రవారం ఎంసీఆర్ హెచ్చార్డీలో ఇండియన్ రోడ్ కాంగ్రెస్ దక్షిణాది రాష్ట్రాల వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రోడ్ల నిర్మాణంతోనే తెలంగాణ అభివృద్ధి చెందుతుందని సీఎం కేసీఆర్ భావించారని, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను హైదరాబాద్‌తో కలిపేలా మంచి రోడ్లు నిర్మించాలని నిర్ణయించి తెలంగాణ ఏర్పడిన తొలి ఏడాదిలోనే రూ.12 వేలకోట్లు కేటాయించారని అన్నారు. 145 మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు డబుల్ లేన్ రోడ్లు లేవని, వీటిలో 139 రోడ్లను రూ.2,587 కోట్లతో నిర్మిస్తున్నామని చెప్పా రు. రెండో ప్రాధాన్యంగా జిల్లా రోడ్లు, రాష్ట్ర హైవేలను వెడల్పు చేస్తున్నామని, రాష్ట్రవ్యాప్తంగా రూ.7,915 కోట్లతో 5,595 కి.మీ. రోడ్లను వెడల్పుచేసే పనులు చేపట్టామని వివరించారు. మూడో ప్రాధాన్యంగా రూ.2,495 కోట్లతో వివిధ కాల్వలు, వాగులు, నదులపై 511 వంతెనల నిర్మాణ పనులను చేపట్టి 400 వంతెనల నిర్మాణాన్ని పూర్తిచేశామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగున్నరేండ్లలో పలుచోట్ల పెద్ద బ్రిడ్జిలను నిర్మించడంతోపాటు వర్షపు నీటిని నిల్వచేసుకునేందుకు చెక్ డ్యాంలు కమ్ బ్రిడ్జిలుగా నిర్మించిందని చెప్పారు. వర్క్‌షాప్‌ను హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న నిర్వాహకులకు మంత్రి ప్రశాంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు. రోడ్ల నాణ్యతను పెంచుకోవడంతోపాటు నిర్మాణ ఖర్చును తగ్గించుకునేందుకు వీలయ్యే కొత్త టెక్నాలజీని అభివృద్ధి చేయాలని ఇంజినీరింగ్ నిపుణులను కోరారు. కార్యక్రమంలో ఇండియన్ రోడ్ కాంగ్రెస్ సెక్రటరీ జనరల్ ఎస్కే నిర్మల్, ఆర్ అండ్ బీ ఈఎన్సీలు గణపతిరెడ్డి, పీ రవీందర్‌రావు, ఎంసీహెచ్చార్డీ అడిషనల్ డైరెక్టర్ జనరల్ హర్‌ప్రీత్‌సింగ్, సీఈ రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



శుక్రవారం హైదరాబాద్‌లో ఇండియన్ రోడ్ కాంగ్రెస్ దక్షిణాది రాష్ట్రాల వర్క్‌షాప్‌ను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

## అమెజాన్ ప్రైమ్‌లో టీ శాట్



- ఘనంగా టీ శాట్ ద్వితీయ వార్షికోత్సవం
- మొక్కలు నాటిన సీఈవో శైలేశ్‌రెడ్డి, వీ హబ్ సీఈవో దీప్తి రావుల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీ శాట్ నెట్‌వర్క్‌కు చెందిన నిపుణ, విద్య చానల్స్ ఇకనుంచి అమెజాన్ ప్రైమ్, ఆండ్రాయిడ్ టీవీలో కూడా అందుబాటులోకి రానున్నట్టు సీఈవో ఆర్ శైలేశ్‌రెడ్డి శుక్రవారం ప్రకటించారు. గత రెండేండ్లుగా యూట్యూబ్‌లో సబ్‌స్క్రైబర్ల సంఖ్య 3,16,000, యాప్ డౌన్‌లోడ్స్ సంఖ్య 1,40,000 కు చేరుకొన్నాయని తెలిపారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని ప్రధాన కార్యాలయంలో టీ శాట్ రెండో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీ హబ్ సీఈవో దీప్తి రావుల, సిబ్బందితో కలిసి శైలేశ్‌రెడ్డి మొక్కలు నాటారు. అనంతరం కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకొన్నారు.

## ఆయుష్ ప్రవేశాలకు 30 నుంచి ధ్రువపత్రాల పరిశీలన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని వైద్య విద్య కళాశాలల్లోని ఆయుష్ కోర్సుల్లో ప్రవేశాలకు అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 30 నుంచి ఆగస్టు 3 వరకు నిర్వహిస్తున్నట్టు కాళోజి ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పూర్తి సమాచారం కోసం knruhs.in, knruhs. telangana. gov.in వెబ్‌సైట్లను పరిశీలించాలని సూచించారు.

## కేబీఆర్ పార్క్‌లో పులుల దినోత్సవం నేడు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్‌లోని కేబీఆర్ జాతీయపార్క్‌లో శనివారం అంతర్జాతీయ పులుల దినోత్సవం నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమంలో హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ, వైల్డ్‌లైఫ్ కన్జర్వేషన్ సొసైటీ, వరల్డ్ వైల్డ్‌లైఫ్ ఫండ్ వంటి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొంటారని అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

## కొత్త అసెంబ్లీకి 25 ఎకరాలు అవసరం

- హైకోర్టుకు తెలిపిన ఈఎన్సీ గణపతిరెడ్డి
- హైదరాబాద్ మాస్టర్‌ప్లాన్-2031ను సమర్పించాలి
- ఏఏజీని ఆదేశించిన హైకోర్టు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఎర్రమంజిల్‌లో నూతన అసెంబ్లీ నిర్మాణానికి 20 నుంచి 25 ఎకరాల స్థలం అవసరమవుతుందని రోడ్లు, భవనాలశాఖ ఇంజినీర్ ఇన్‌చీఫ్ (ఈఎన్సీ) గణపతిరెడ్డి శుక్రవారం హైకోర్టుకు తెలిపారు. అసెంబ్లీ, శాసనమండలి భవనాలతోపాటు సెంట్రల్‌హాల్, మండలి చైర్మన్, స్పీకర్, డిప్యూటీ స్పీకర్, అసెంబ్లీ కార్యదర్శుల కార్యాలయాలు, గృహసౌకర్యాలు, లాన్ నిర్మాణానికి ప్రణాళిక సిద్ధంచేస్తున్నట్టు తెలిపారు. అసెంబ్లీ కాంప్లెక్స్ ఆర్కిటెక్చర్ ప్లాన్ తుదిదశలో ఉన్నదని, ప్రభుత్వం నియమించిన మూడు కన్సల్టెన్సీల ఆర్కిటెక్టులు దీనిపై పనిచేస్తున్నారని వివరించారు. హైకోర్టు ఆదేశాల మేరకు గణపతిరెడ్డి శుక్రవారం కోర్టుకు హాజరయ్యారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అసెంబ్లీ, మండలి భవనాల ప్రణాళికలు సిద్ధంచేస్తున్నట్టు తెలిపారు.

**ముగిసిన ఏఏజీ వాదనలు**

ఎర్రమంజిల్ ప్యాలెస్ కూల్చివేత, నూతన అసెంబ్లీ భవనాల నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాల్లో అదనపు అడ్వకేట్ జనరల్ (ఏఏజీ)రామచంద్రరావు తన వాదనలను ముగించారు. రెగ్యులేషన్ 13 తొలగింపునకు జనరల్ క్లాజెస్ యాక్ట్ వర్తించదని పేర్కొన్న ఆయన.. పలు సుప్రీంకోర్టు తీర్పులను ధర్మాసనం ముందుంచారు. కాగా, కొత్త అసెంబ్లీని నిర్మించాలని క్యాబినెట్ భేటీలో నిర్ణయించిన నేపథ్యంలో.. ఆ సమావేశం ఎజెండా వివరాలను సమర్పించాలని ఏఏజీకి హైకోర్టు సూచించింది. ఆ వివరాలను సోమవారం కోర్టుకు సమర్పిస్తామని ఏఏజీ తెలిపారు. 2008 హెచ్ఎండీఏ రూపొందించిన హైదరాబాద్ మాస్టర్ ప్లాన్-2031ను కూడా సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది. సదరు మాస్టర్‌ప్లాన్‌లో ఎర్రమంజిల్ ప్యాలెస్ ప్రాంతాన్ని ప్రత్యేక పరిరక్షణ జోన్‌గా గుర్తించారా? అనే అంశం తెలుస్తుందని పేర్కొన్నది. మరోవైపు పిటిషనర్ల తరపున న్యాయవాది నళిన్‌కుమార్ కౌంటర్ వాదనలు ప్రారంభించారు. ఎర్రమంజిల్‌ను హెరిటేజ్ సైట్‌గా పేర్కొంటున్న హుడా జోనింగ్ రెగ్యులేషన్ యాక్ట్‌లోని రెగ్యులేషన్ 13 తొలిగింపు చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. ధర్మాసనం కేసు విచారణను ఈనెల 30కి వాయిదావేసింది.

**ప్యాలెస్ వారసుల కేసులో కౌంటర్ దాఖలు**

ఎర్రమంజిల్ భవనం కూల్చివేతపై ఎర్రమంజిల్ ప్యాలెస్ నిర్మాత నవాబ్ ఫక్రుల్ ముల్క్ వారసులు దాఖలుచేసిన కేసులో ప్రభుత్వం కౌంటర్ అఫిడవిట్‌ను ధర్మాసనానికి సమర్పించింది. ఎర్రమంజిల్‌కు సంబంధించిన యాజమాన్య వివాదం ఇంకా హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నదని నవాబ్ ఫక్రుల్ ముల్క్ వారసులు రిట్‌పిటిషన్ దాఖలుచేశారు. ఇతర వ్యాజ్యాల్లో అదనపు కౌంటర్ అఫిడవిట్‌ను కూడా ప్రభుత్వం హైకోర్టు ముందుంచింది.

### బాలుడి చికిత్సకు

## మంత్రి మల్లారెడ్డి చేయూత

**మేడిపల్లి:** కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఇచ్చిన 'గిఫ్ట్ ఏ స్మైల్' చాలెంజ్‌ను స్వీకరించిన మంత్రి మల్లారెడ్డి.. మెదడు సంబంధ వ్యాధితో బాధపడుతున్న బాలుడి చికిత్సకు ఆర్థిక సాయం అందిస్తానని ముందుకువచ్చారు. మేడిపల్లికి వచ్చిన మంత్రిని పీర్జాదిగూడ బుద్ధానగర్‌కు చెందిన రాజుచారి, లత కలిసి తమ కుమారుడు శ్రీనివాసచారి.. నాలుగేండ్లుగా మెదడు సంబంధ వ్యాధితో బాధపడుతున్నాడని విన్నవించారు. వెంటనే స్పందించిన మంత్రి బాలుడికి పూర్తి వైద్యం అందిస్తానని హామీ ఇచ్చారు. స్థానిక టీఆర్ఎస్ నేత దయాకర్ రెడ్డి బాలుడి వైద్యం ఖర్చులకు రూ.50 వేల చెక్కును అందజేశారు.



'గిఫ్ట్ ఏ స్మైల్'!

మెదడు సంబంధ వ్యాధితో బాధపడుతున్న శ్రీనివాసచారికి ఆర్థిక సహాయం అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి

## ఎన్నారై ఓటుహక్కుపై సుప్రీంలో విచారణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ :** ప్రవాస భారతీయులకు దేశంలో జరిగే ఎన్నికల్లో ఓటువేసే హక్కు కల్పించేలా సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్)పై ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్, జస్టిస్ దీపక్ గుప్తాలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ప్రవాసీ భారత్ ఆర్గనైజేషన్ చైర్మన్, పిటిషనర్ చిందం నాగేందర్ తరపున హాజరైన న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ ఎన్నారైలకు ఓటుహక్కు కల్పించే బిల్లును ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో ఆమోదించే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. వాదనలను నమోదు చేసుకున్న ధర్మాసనం.. కేసు విచారణను మూడునెలలపాటు వాయిదా వేస్తున్నట్టు పేర్కొన్నది.

## సాంకేతికత వినియోగంలో తెలంగాణ ముందంజ

ఐఆర్ఎస్ అధికారి వెంకటేశ్వరరావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగంతో తెలంగాణ ప్రభుత్వం ముందున్నదని కేంద్ర ఐఆర్ఎస్ అధికారి జీటీ వెంకటేశ్వరరావు అభిప్రాయపడ్డారు. జాతీయ ఈ-గవర్నెన్స్ విభాగం శుక్రవారం ఎంసీఆర్‌హెచ్చార్డీలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలపై ప్రత్యేక వర్క్‌షాప్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం బిగ్‌డాటాను వినియోగించుకొని పరిపాలనలో అనేక అంశాల్ని మెరుగుపరిచిందని చెప్పారు. సెల్ఫీ ద్వారా పెన్షనర్ లైఫ్ సర్టిఫికెట్ అందించే విధానాన్ని తేవడం ద్వారా పింఛన్‌దారులు ఆఫీసులకు వెళ్లాల్సిన అవసరం తప్పిందన్నారు. రిజిస్ట్రేషన్ విభాగం బ్లాక్ చెయిన్ పరిజ్ఞానం ద్వారా చిట్‌ఫండ్ నిర్వహణ చేపడుతున్నదని పేర్కొన్నారు. ఇవన్నీ దేశంలో మొట్టమొదట తెలంగాణ ప్రభుత్వమే అమల్లోకి తెచ్చిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విభాగాల్లో వీటిని విరివిగా వినియోగిస్తున్నామని తెలిపారు. దీంతో పరిపాలనలో పారదర్శకత, జావాబుదారీతనం పెరిగిందని పేర్కొన్నారు.

## విద్వేషపూరిత వ్యాఖ్యలు చేయలేదు

- ఎంఐఎం నేత అక్బరుద్దీన్ వివరణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఇటీవల కరీంనగర్ సభలో తాను విద్వేషపూరిత వ్యాఖ్యలు చేయలేదని ఎంఐఎం ఎల్పీనేత అక్బరుద్దీన్ ఒవైసీ స్పష్టంచేశారు. కొందరు రాజకీయ దురుద్దేశంతో తన మాటలను వక్రీకరించి చిలువలు, పలువలుగా ప్రచారం చేస్తున్నారని ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తంచేశారు. స్వార్థ ప్రయోజనాల కోసం తన ప్రసంగానికి వివాదాస్పద వ్యాఖ్యలను జోడించి సోషల్‌మీడియాలో ప్రచారం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారని పేర్కొన్నారు. ఏ మతాన్ని, వ్యక్తులను రెచ్చగొట్టేలా మాట్లాడలేదని వివరణ ఇచ్చారు. తన ప్రసంగం చట్టపరమైన పరిమితులను అతిక్రమించలేదని తెలిపారు. వివాదాస్పద వ్యాఖ్యలు చేసినందునే అక్బరుద్దీన్ వివరణ ఇచ్చారని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ ట్వీట్‌చేశారు.



సత్పాల్ సింగ్

## కార్గిల్ యోధుడికి డబుల్ ప్రమోషన్

- సీనియర్ కానిస్టేబుల్‌కు ఏఎస్‌ఐగా పదోన్నతి కల్పించిన పంజాబ్ సర్కార్

**చండీగఢ్:** కార్గిల్ యోధుడు సత్పాల్ సింగ్‌కు పంజాబ్ ప్రభుత్వం డబుల్ ప్రమోషన్ కల్పించింది. 1999 కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న ఆయన పాక్ ఆర్మీ అధికారి కెప్టెన్ కర్నల్ షేర్ ఖాన్‌తోపాటు మరో ముగ్గురిని తుదముట్టించారు. టైగర్ హిల్‌ను స్వాధీనం చేసుకోవడంలో సైన్యానికి సహాయంగా నిలిచారు. సత్పాల్ సింగ్ పోరాటపటిమకు గుర్తింపుగా వీర చక్ర అవార్డుతో సన్మానించారు. ఆర్మీ నుంచి బయటకు వచ్చిన తర్వాత 2010లో ఆయన పంజాబ్ పోలీస్ శాఖలో సీనియర్ కానిస్టేబుల్‌గా నియమితులయ్యారు. సత్పాల్ సింగ్ ప్రస్తుతం భవానీగఢ్‌లో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న పంజాబ్ సీఎం అమరీందర్ సింగ్ తన అధికారాలను వినియోగించి శుక్రవారం ఆయనకు అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి కల్పించారు. కార్గిల్ యుద్ధ వీరుడ్ని గత సర్కారు అవమానించిందని ఆరోపించారు.

### మరిచిపోలేని జ్ఞాపకాలు

**కార్గిల్** వీరులకు ప్రధాని మోదీ ట్విట్టర్ ద్వారా నివాళులర్పించారు. 'కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా భరతమాత ముద్దు బిడ్డలందరి కోసం మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నా. జవాన్ల ధైర్యం,శౌర్యం, నిబద్ధతను ఈ రోజు మనకు గుర్తు చేస్తున్నది' అని ప్రధాని ట్వీట్ చేశారు. యుద్ధ సమయంలో తాను జవాన్లను కలిసిన ప్పటి ఫొటోలను షేర్ చేశారు. 'కార్గిల్‌కు వెళ్లి జవాన్లకు సంఘీభావం తెలిపే అవకాశం నాకు లభించింది' అని ఆయన పేర్కొన్నారు.



కార్గిల్ యుద్ధ సమయంలో జవాన్లతో నరేంద్ర మోదీ

## యుద్ధం చేసే దమ్ము పాక్‌కు లేదు

- అందుకే పరోక్ష యుద్ధానికి పాల్పడుతున్నది: రాజ్‌నాథ్
- కార్గిల్ అమరులకు పార్లమెంట్ నివాళి

**న్యూఢిల్లీ:** భారత్‌పై పూర్తిస్థాయి లేదా పరిమిత యుద్ధం చేసే దమ్ము పాకిస్థాన్‌కు లేదని, అందుకే పరోక్ష యుద్ధానికి పాల్పడుతున్నదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ విమర్శించారు.1999 కార్గిల్ యుద్ధం జరిగి శుక్రవారం నాటికి 20 ఏండ్లయ్యింది. లోక్‌సభలో సభ్యులు నిలబడి అమర జవాన్లకు నివాళులు అర్పిస్తూ మౌనం పాటించారు. అనంతరం రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. కార్గిల్ శిఖరాన్ని స్వాధీనం చేసుకోవడంలో మన జవాన్ల శౌర్యం, త్యాగాలను ఎప్పటికీ మరిచిపోలేమని అన్నారు.'మన పొరుగుదేశం (పాక్) భారత్‌తో పూర్తిస్థాయి లేదా పరిమిత స్థాయి యుద్ధం చేయలేదు. అందుకే ఉగ్ర మూకలను ఉసిగొల్పి పరోక్ష యుద్ధం చేస్తున్నది' అని ఆరోపించారు. కార్గిల్ అమరులకు రాజ్యసభ కూడా శుక్రవారం ఘనంగా నివాళి అర్పించింది.

# జయజయహే కార్గిల్



జమ్ముకశ్మీర్‌లోని ద్రాస్‌లో కార్గిల్ స్మారకం వద్ద దీపాలు వెలిగించి అమరులకు నివాళి అర్పిస్తున్న జవాన్లు

## పాకిస్థాన్‌పై ఘన విజయానికి 20 వసంతాలు

దేశవ్యాప్తంగా ఘనంగా కార్గిల్ విజయ్ దివస్

అమరవీరులకు జాతి ఘన నివాళి

జవాన్లకు దేశం రుణపడి ఉంటుందన్న రాష్ట్రపతి కోవింద్

మళ్లీ దుస్సాహసానికి తెగిస్తే ముక్కు పగులుతుంది

పాకిస్థాన్‌కు ఆర్మీ చీఫ్ రావత్ హెచ్చరిక

**న్యూఢిల్లీ/శ్రీనగర్, జూలై 26:** కార్గిల్ యుద్ధంలో భారత్ సేనలు విజయం సాధించిన ఘట్టానికి శుక్రవారంతో రెండు దశాబ్దాలు పూర్తయ్యాయి. భారత భూభాగంలోకి చొరబడిన పాకిస్థాన్ దళాలను 'ఆపరేషన్ విజయ్' ద్వారా తరిమికొట్టి భారత్ విజయభేరి మోగించినందుకు గుర్తుగా ఏటా జూలై 26వ తేదీని 'కార్గిల్ విజయ్ దివస్'గా జరుపుకుంటున్నాం. కశ్మీర్‌లో నియంత్రణ రేఖ వెంబడి ఉన్న ఎత్తైన పర్వత ప్రాంతాల్లో 1999 మే 3 నుంచి జూలై 26 వరకు ఈ సంగ్రామం సాగింది. భారత్ సుమారు 500 మంది సైనికుల్ని కోల్పోయింది. యుద్ధంలో అసువులు బాసిన వీర సైనికులకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని నరేంద్రమోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో పాటు జాతి యావత్తూ ఘనంగా నివాళులర్పించింది. త్రివిధ దళాధిపతులు జనరల్ బిపిన్ రావత్, మార్షల్ బీఎస్ ధనోవా, అడ్మిరల్ కరమ్ బీర్ సింగ్ జమ్ముకశ్మీర్‌లోని ద్రాస్ వద్ద ఉన్న కార్గిల్ యుద్ధ స్మారకం వద్ద వీర జవాన్లకు శ్రద్ధాంజలి ఘటించారు. 'జూలై 26 కార్గిల్ విజయ్‌దివస్‌గా నిలిచిపోతుంది. కార్గిల్ సంగ్రామంలో భారత్ విజయగాథకు ప్రతీకగా నిలుస్తుంది. ద్రాస్, కాక్‌సార్, బటాలిక్, తుర్‌తుక్ సెక్టార్‌లో జరిగిన భీకర పోరులో మన జవాన్లు వీరోచితంగా పోరాడారు. మన అమర జవాన్లు, హీరోల ధైర్యం, శౌర్యం, త్యాగాలకు సెల్యూట్ చేస్తున్నాం' అని ఆర్మీ ఓ ప్రకటనలో తెలిపింది. ఐఏఎఫ్ నాటి ఆపరేషన్‌కు సంబంధించిన వీడియోను పోస్ట్ చేస్తూ అమరజవాన్లకు నివాళులు అర్పించింది. అసమాన ధైర్యం, చెదరని స్థైర్యం అంటూ క్యాప్షన్ పెట్టింది.

**దేశం ఎప్పటికీ రుణపడి ఉంటుంది: రాష్ట్రపతి**

రాష్ట్రపతి కోవింద్ కశ్మీర్‌లోని బదామీ బాగ్ కంటోన్మెంట్‌లోని ఆర్మీ 15 కార్ప్స్ హెడ్‌క్వార్టర్స్ వద్ద అమర జవాన్లకు శ్రద్ధాంజలి ఘటించారు. సందర్శకుల పుస్తకంలో రాష్ట్రపతి సంతకం చేస్తూ.. 'కార్గిల్ విజయ్ దివస్‌కు 20 ఏండ్లు పూర్తయిన సందర్భంగా జాతి తరపున అమరవీరులకు నివాళులర్పిస్తున్నా. సైనికుల అసమాన ధైర్య సాహసాలను స్మరించుకుంటూ దేశ సేవకు పునరంకితమవుతామని నేడు మేము ప్రతిజ్ఞ చేస్తున్నాం' అని పేర్కొన్నారు. అనంతరం ఆయన ట్వీట్ చేస్తూ.. 'కార్గిల్ యుద్ధంలో అసమాన ధైర్య సాహసాలతో దేశ సారభౌమత్వాన్ని కాపాడిన సాయుధ బలగాలకు దేశం యావత్తూ ఎప్పటికీ రుణపడి ఉంటుంది. జై హింద్' అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్, ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక కార్గిల్ అమరవీరులకు నివాళులర్పించారు.

**కార్గిల్ అమరవీరులకు బాలీవుడ్ నివాళి**

బాలీవుడ్‌కు చెందిన పలువురు ప్రముఖులు కార్గిల్ అమరవీరులకు నివాళి అర్పించారు. 'మీ నిశ్చయ పోరాటానికి, త్యాగాలకు సెల్యూట్ చేస్తున్నాం' అని అమితాబ్ బచ్చన్ ట్వీట్ చేశారు. 'దేశం కోసం ప్రాణాలను త్యాగం చేసిన జవాన్లకు శిరసు వంచి నివాళి అర్పిస్తున్నా' అని గాయని లతా మంగేష్కర్ ట్విట్టర్‌లో తెలిపారు. అక్షయ్ కుమార్, సంజయ్‌దత్, విక్కీ కౌషల్, అనుష్క శర్మ, సన్నీ డియోల్, మోహన్‌లాల్ తదితరులు అమర జవాన్లకు ట్విట్టర్ ద్వారా నివాళులర్పించారు.

**గేమ్ చేంజర్.. మిరేజ్ 2000**

కార్గిల్‌లో భారత భూభాగంలోకి చొరబడిన పాక్ దళాలను తరమికొట్టేందుకు భారత్ ఆపరేషన్ విజయ్‌ను చేపట్టింది. 'ఆపరేషన్ సఫేద్ సాగర్' పేరుతో భారత వాయుసేన (ఐఏఎఫ్) కూడా జతకలిసింది. తొలిసారి శత్రు మూకలపై లేజర్ గైడెడ్ హై ప్రెసిషన్ బాంబులను ప్రయోగించింది. ఈ యుద్ధంలో మిరేజ్-2000 యుద్ధ విమానాలు టైగర్ హిల్‌లో శత్రు సైనికులపై బాంబుల వర్షం కురిపించాయి. మిరేజ్-2000 విమానాలే యుద్ధంలో గేమ్ చేంజర్‌గా నిలిచాయని సీనియర్ ఐఏఎఫ్ అధికారి కెప్టెన్ అనుపమ్ బెనర్జీ వ్యాఖ్యానించారు. ఆ సమయంలో 17వ స్క్వాడ్రన్ కమాండింగ్ ఆఫీసర్‌గా ఉన్న ప్రస్తుత వాయుసేన అధిపతి బీఎస్ ధనోవా మాట్లాడుతూ.. జవాన్లకు తోడుగా గగనతలంలో మిరేజ్-2000 విమానాలను కూడా మోహరించడంతో విజయం మన వైపు మొగ్గిందని చెప్పారు. కార్గిల్ విజయ్ దివస్ నేపథ్యంలో ఆర్మీ పలు కార్యక్రమాలు నిర్వహించింది. 1999 ఆపరేషన్‌లోని ముఖ్య ఘట్టాలను తిరిగి కండ్లకు కట్టేలా ఈ నెల 24న గ్వాలియర్ ఎయిర్ బేస్‌ను ఒక థియేటర్‌లాగా మలిచింది.



### నిధుల కోసమే పాక్ హామీలు: రావత్

కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా సైన్యాధిపతి బిపిన్ రావత్.. పాకిస్థాన్‌కు గట్టి హెచ్చరికలు చేశారు. కార్గిల్ తరహా దుస్సాహసానికి మరోసారి తెగబడితే మీ ముక్కు పగులుతుంది అంటూ హెచ్చరించారు. మిలిటెంట్లపై చర్యల తీసుకుంటామని ఆ దేశం ఇస్తున్న హామీలను నమ్మడానికి లేదని ఆయన ఆరోపించారు. 'మాటలకు, చేతలకు తేడా ఉంటుంది. ప్రస్తుతం పాకిస్థాన్ ఏ స్థితిలో ఉందో మనందరికీ తెలుసు. ఆ దేశాన్ని ఎవరు నియంత్రిస్తున్నారో కూడా తెలుసు. డబ్బు కోసం వారు ఏదైనా చేస్తారు. ఒక్కసారి ఆ నిధులు అందిన తర్వాత, వారు ఇప్పటివరకు ఏం చేస్తున్నారో అదే కొనసాగిస్తారు' అని పేర్కొన్నారు. ఆర్మీ ఆయుధ సంపత్తిని ఆధునీకరించేందుకు ప్రాధాన్యమిస్తున్నట్లు వివరించారు. 'ఆర్టిలరీ ఆయుధ వ్యవస్థపై మేం దృష్టిసారించాం. 2020 నాటికి హోవిట్జర్, కే9 వజ్ర శతఘ్నులు అందుతాయి. అలాగే రెండు బోఫోర్స్ తరహా గన్‌లు కూడా స్థానికంగానే తయారవుతున్నాయి. అదేవిధంగా వాయుసేనను కూడా బలోపేతం చేసేందుకు అదనపు యుద్ధ విమానాలను ప్రవేశపెట్టబోతున్నాం' అని రావత్ తెలిపారు.







ఢిల్లీలోని అమరవీరుల స్థూపం వద్ద నివాళి అర్పిస్తున్న కార్గిల్ అమర జవాన్ల బంధువులు, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, సహాయ మంత్రి శ్రీపాద యశోనాయక్

# అబద్ధాల పాక్!

- కార్గిల్ యుద్ధంపై పాకిస్థాన్ కట్టుకథలు.. వాస్తవాలను వెల్లడించిన భారత్
- కార్గిల్ సంగ్రామం అధికారికంగా 'సైనిక ఘర్షణ' మాత్రమే.. యుద్ధం కాదు
- సరిహద్దులను భారత సైన్యం దాటకపోవడమే కారణం

**న్యూఢిల్లీ:** భారత్-పాకిస్థాన్ మధ్య 1999లో జరిగిన కార్గిల్ యుద్ధంలో భారత్ గెలుపొందిన సంగతి ప్రపంచానికి తెలుసు. కానీ అధికారికంగా అది కేవలం సైనిక ఘర్షణ. దీనిక్కారణం పాక్ ఇప్పటికీ నిజాలు ఒప్పుకోకపోవడం. అసలక్కడికి తమ సైన్యమే వెళ్లలేదని పాక్ చెప్పింది. యుద్ధం ముగింపు దశకు చేరుకున్నా.. అవకాశమున్నా.. భారత సైన్యం సరిహద్దు దాటలేదు. దీంతో కార్గిల్ ఘటన అధికారిక యుద్ధంగా నమోదుకాలేదు. కార్గిల్‌పై పాక్ నాటి పచ్చి అబద్ధాలే ఇప్పటికీ సాగిస్తున్నది. భారత్ గట్టి జవాబిచ్చింది.అవేంటో చూద్దాం.



కార్గిల్ యుద్ధంలో విజయం తరువాత త్రివర్ణ పతాకంతో భారత సైనికులు (ఫైల్)

**అబద్ధం-1: చొరబడింది మా సైన్యం కాదు**

ప్రతి శీతాకాలంలో కశ్మీర్‌లో మంచుతీవ్రత దృష్ట్యా భారత్, పాక్ దళాలు ఎత్తైన ప్రాంతాల్లో కొన్ని స్థావరాలను తాత్కాలికంగా మూసేవి. 1999లో ఈ సమయంలోనే పాక్ సైనికులు ఉగ్రవాదుల్లా సరిహద్దు దాటి టోలోలింగ్, టైగర్ హిల్స్‌పై ఉన్న భారత సైనిక స్థావరాలను ఆక్రమించడమే కార్గిల్ పోరుకు దారి తీసింది.

**వాస్తవం:** టోలోలింగ్, టైగర్ హిల్స్ స్వాధీనానికి భారత్ చేపట్టిన 'ఆపరేషన్ విజయ్'కి నేతృత్వం వహించిన రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ అమర్ ఔల్ తెలిపిన వివరాల ప్రకారం 'మేం అక్కడికెళ్లేసరికి 30-40 మంది శత్రువులున్నారు. వారు పాక్ 'నార్తన్ లైట్' పదాతి దళ సైనికులు' అని చెప్పారు. పాక్ జర్నలిస్ట్ నసీమ్ జెహ్రా రాసిన 'కార్గిల్ టు ద కప్: ఈవెంట్స్ దట్ షాక్ పాకిస్థాన్'లో ప్రభుత్వాదేశాలు, సైన్యం ఆధ్వర్యంలోనే చొరబాట్లు జరిగాయన్నారు.

**అబద్ధం-2: ముందస్తు వ్యూహరచన కాదు**

కార్గిల్ చొరబాట్లు ముజాహిదీన్ల పనేనని, ఆ యుద్ధంలో తమ సైన్యం జోక్యం ముందస్తు వ్యూహం కాదని పాక్ కొత్త కథ అల్లింది.

**వాస్తవం:** నాటి పాక్ ఆర్మీ చీఫ్ జహంగీర్ కర్మాత్ ఈ ప్లాన్‌ను ప్రభుత్వానికి తెలిపాడు. ఇది చాలా ప్రమాదకరమని భావించి ప్రభుత్వం ఒప్పుకోలేదు. ముషారఫ్ సైన్యాధిపతిగా బాధ్యతలు స్వీకరించాక అమలుచేశారు. పాక్ సైనికులు ఉగ్రవాదుల్లా భారత సైనిక స్థావరాల్లోకి చొరబడాలని.. భారత్ ప్రశ్నిస్తే తమ సైనికులు కాదని బుకాయించి.. ఉగ్రవాదుల ఖాతాలో వేయాలని పాక్ భావించింది. దీనికి ఆపరేషన్ 'కోహ్ పైమా (పర్వతారోహకుడు)' అని పేరుపెట్టారు. కానీ.. భారత సైన్య పరాక్రమంతో సంగతి బయట పడింది. పాక్ మాజీ ఆర్మీ చీఫ్‌లు నజీమ్ జెహ్రా, అబ్దుల్ మజీద్ మాలిక్ దీనిపై బహిరంగ వ్యాఖ్యలు చేశారు.

**అబద్ధం-3: అంతా ముషారఫే చేశాడు.. ప్రధాని నవాజ్ షరీఫ్‌కు ఏమీ తెలియదు**

పాక్ సైన్యం 'ఆపరేషన్ కోహ్ పైమా' మొత్తం నాటి ఆర్మీ చీఫ్ ముషారఫ్ ఆధ్వర్యంలోనే జరిగిందని ఆ దేశ నిపుణులు, విశ్లేషకులు చెప్పారు. కొందరు మాజీ ఆర్మీ చీఫ్‌లు ఓ అడుగు ముందుకేసి ముషారఫ్‌ను కోర్ట్ మార్షల్ చేసి, శిక్ష విధించాలని నాటకం ఆడారు.

**వాస్తవం:** కానీ ముషారఫ్, షరీఫ్ మధ్య మంచి సంబంధాలు ఉన్నాయని తేలింది. పాక్ సైన్యం ఆపరేషన్ కోహ్ పైమా కోసం ప్రణాళిక రూపొందిస్తున్నప్పుడు 1999 జనవరి-మే మధ్య షరీఫ్ నాలుగుసార్లు కార్గిల్ సెక్టార్‌కు వెళ్లి సమీక్షించారని తెలుస్తున్నది. 1999 మే 17న షరీఫ్ వచ్చినప్పుడు అతడితోపాటు ఇద్దరు రిటైర్డ్ ఆర్మీ చీఫ్‌లు ఉన్నారని తేలింది. పరిస్థితి పాక్‌కు పూర్తి అనుకూలమని భావించాకే నవాజ్ తిరుగుప్రయాణ మయ్యారు.

### అవకాశం ఉన్నా.. హద్దు దాటలేదు

భారత సైన్యం నాటి లెఫ్టినెంట్ జనరల్ అమర్ ఔల్ నేతృత్వంలో 1999 మే 22న ఆపరేషన్ విజయ్ ప్రారంభించింది. రెండు నెలల యుద్ధం తర్వాత పాక్ సైన్యం ఆక్రమించిన అన్ని స్థావరాలనూ తిరిగి స్వాధీనం చేసుకున భారత సైన్యం.. అదే ఊపులో 'పాయింట్ 5353'ను స్వాధీనం చేసుకుంటే పాక్‌కు కోలుకోలేని దెబ్బ తగిలేది. ఇది కశ్మీర్‌లోయను, జమ్ముతో కలిపే ఎన్‌హెచ్-1పై నిఘాకు అనువైంది. అది సరిహద్దు ఆవల ఉండటంతో కేంద్రం ఒప్పుకోలేదు. దీనికి బదులు భారత సైన్యం 'పాయింట్ 5245'ని స్వాధీనం చేసుకుంది. పాక్ నుంచి జరిగే చొరబాట్లపై నిఘాకు ఈ ప్రాంతం అనువుగా ఉంటుంది.

## అల్లుడి విజయంతో ఆనందం

- బ్రిటన్ ప్రభుత్వంలో సునక్‌కు మంత్రి పదవి దక్కడంపై నారాయణ మూర్తి దంపతుల హర్షం



నారాయణమూర్తి, సుధామూర్తి

**బెంగళూరు, జూలై 26:** బ్రిటన్ ప్రధాని బోరిక్ జాన్సన్ ప్రభుత్వంలో తమ అల్లుడు రిషి సునక్‌కు కీలకమైన ట్రెజరీ వ్యవహారాల బాధ్యతలు దక్కడం ఆనందంగా ఉన్నదని ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణమూర్తి, సుధామూర్తి దంపతులు చెప్పారు. 'ప్రజా సేవ చేయడానికి, వారికి అండగా నిలువడంతోపాటు సాయం అందించడానికి వచ్చిన గొప్ప అవకాశం. దీన్ని సద్వినియోగం చేసుకోవాలి' అని సునక్‌కు సూచించానని సుధామూర్తి తెలిపారు. నారాయణమూర్తి స్పందిస్తూ కష్టపడి పనిచేయడం, నిజాయితీగా ఉండటం, సమాజం కోసం ఏదైనా మంచి పనిచేయడం ఇవే తాను సూచించే విషయాలని చెప్పారు. బ్రిటన్‌లో రిచ్‌మండ్ ఎంపీగా రెండుసార్లు గెలిచిన సునక్ మాట్లాడుతూ 'ప్రజలకు సేవ చేయడమే నా ప్రధాన లక్ష్యం' అని పేర్కొన్నారు.

## నీళ్లు తాగాలని గుర్తుచేసే రిస్ట్ బ్యాండ్!

**న్యూఢిల్లీ, జూలై 26:** శరీరంలో నీటి శాతం తగ్గినప్పుడు హెచ్చరిస్తూ.. నీటి స్థాయిల్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించే రిస్ట్ బ్యాండ్(మణికట్టుకు ధరించే బ్యాండ్)ను ఇద్దరు ఐఐటీ విద్యార్థినులు రూపొందించారు. ఐఐటీ గువాహటిలో కెమికల్ ఇంజినీరింగ్ చేస్తున్న గీతికా సొంకే, ఐఐటీ గోవాలో చదువుతున్న ప్రియాంకా అరోరా ఈ బ్యాండ్‌ను ఆవిష్కరించారు. 'హైడ్రో చెక్' పేరుతో పిలిచే ఈ బ్యాండ్‌ను ధరిస్తే నాడి కొట్టుకునే రేటు, శరీర ఉష్ణోగ్రత, పరిసరాల ఉష్ణోగ్రత, బయోఎలక్ట్రికల్ ఇంపెడెన్స్‌ను సెన్సర్ల ద్వారా తెలుసుకోవచ్చని వాళ్లు తెలిపారు.

# కన్నడ పీఠంపై యెడియూరప్ప

నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణం

29న అసెంబ్లీలో బలపరీక్ష

పేరులోని అక్షరాలను మార్చుకున్న బీజేపీ నేత

బల నిరూపణ, మంత్రివర్గ కూర్పు కత్తిమీద సామే

**బెంగళూరు:** కన్నడనాట కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా కర్ణాటక బీజేపీ అధ్యక్షుడు యెడియూరప్ప (75) నాలుగోసారి ప్రమాణ స్వీకారం చేశారు. శుక్రవారం సాయంత్రం రాజ్‌భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ వాజూభాయ్ వాలా ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. సోమవారం అసెంబ్లీలో యెడియూరప్ప మెజార్టీని నిరూపించుకోనున్నారు. సంఖ్యాశాస్త్రంపై నమ్మకంతో ప్రమాణ స్వీకారానికి ముందే యెడియూరప్ప తన పేరులోని అక్షరాలను మార్చుకోవడం గమనార్హం. దీంతో ఆయన పేరు యడ్యూరప్ప కాస్త యెడియూరప్పగా మారింది. కుమారస్వామి నేతృత్వంలోని జేడీఎస్-కాంగ్రెస్ సంకీర్ణ సర్కారు పతనం అయినప్పటికీ కొత్త ప్రభుత్వ ఏర్పాటుపై అనిశ్చితి నెలకొన్న విషయం తెలిసిందే. ముగ్గురు రెబల్ ఎమ్మెల్యేలపై స్పీకర్ రమేశ్ కుమార్ గురువారం అనర్హత వేటు వేయడంతో సస్పెన్స్ మరింత పెరిగింది. అయితే శుక్రవారం ఉదయం పరిణామాలు వేగంగా మారిపోయాయి. ప్రభుత్వ ఏర్పాటుకు తమను ఆహ్వానించాల్సిందిగా యెడియూరప్ప గవర్నర్‌ను కలిశారు. అందుకు ఆయన సమ్మతించడంతో రాష్ట్రంలో బీజేపీ సర్కారు మరోసారి కొలువుదీరింది. శుక్రవారం యెడియూరప్ప ఒక్కరే ప్రమాణం చేశారు. మంత్రివర్గంపై పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాతో చర్చించిన అనంతరం నిర్ణయం తీసుకుంటామని యెడియూరప్ప తెలిపారు. ప్రమాణస్వీకార అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రైతులకు వరాలు ప్రకటించారు. పీఎం కిసాన్ పథకం కింద కేంద్రం ఇస్తున్న రూ.6 వేలకు అదనంగా మరో రూ.4000 అందించనున్నట్లు ప్రకటించారు. అలాగే చేనేతల రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. సోమవారం అసెంబ్లీలో బలాన్ని నిరూపించుకోనున్నట్లు ప్రకటించారు.



యెడియూరప్పతో ప్రమాణం చేయిస్తున్న గవర్నర్

**ముందున్న సవాళ్లు**

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన యెడియూరప్పకు అనేక సవాళ్లు ఎదురుకానున్నాయి. అసెంబ్లీలో మెజారిటీని నిరూపించుకోవడం, మంత్రివర్గ కూర్పు ఆయనకు కత్తి మీద సామేనని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. పార్టీ నేతలతో పాటు రెబెల్ ఎమ్మెల్యేలకు కూడా క్యాబినెట్‌లో చోటు కల్పించాల్సి ఉందని పేర్కొంటున్నాయి. కర్ణాటక అసెంబ్లీలో 225 స్థానాలు ఉన్నాయి. ముగ్గురు రెబెల్ ఎమ్మెల్యేలపై స్పీకర్ అనర్హత వేటు వేయడంతో సభ్యుల సంఖ్య 222కు తగ్గింది. మెజార్టీ మార్క్ 112. ప్రస్తుతం బీజేపీకి 105 మంది ఎమ్మెల్యేలు ఉండగా, ఓ స్వతంత్ర ఎమ్మెల్యే మద్దతునిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వానికి కావాల్సిన సంఖ్యాబలాన్ని ఏవిధంగా కూడగడతారనేది ఆసక్తిగా మారింది.

**సిగ్గుచేటు: కాంగ్రెస్**

బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయడంపై ప్రతిపక్ష కాంగ్రెస్ మండిపడింది. బీజేపీకి కర్ణాటక ప్రయోగశాలగా మారిందని మాజీ సీఎం, కాంగ్రెస్ నేత సిద్దరామయ్య విమర్శించారు. మెజార్టీ లేకపోయినప్పటికీ బీజేపీని ప్రభుత్వం ఏర్పాటుచేసేందుకు రాజ్యాంగంలోని ఏ ఆర్టికల్ ప్రకారం గవర్నర్ అనుమతించారని ప్రశ్నించారు. ఇది నిజంగా సిగ్గుచేటన్నారు.

**సుస్థిర ప్రభుత్వం అందిస్తాం: జేపీ నడ్డా**

కర్ణాటకలో సుస్థిర ప్రభుత్వాన్ని అందిస్తామని బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీ నడ్డా చెప్పారు. 75 ఏండ్లు పైబడిన వారు ప్రభుత్వ పదవి చేపట్టకూడదని పార్టీ పెట్టుకున్న నియమం యెడియూరప్పకు వర్తించదా అని ప్రశ్నించగా.. యెడియూరప్ప బీజేపీ శాసనసభా పక్ష నేతగా ఉన్నారని, సహజంగానే ఆయనను సీఎంగా ఎంపికచేసిందని బదులిచ్చారు.

### దక్షిణాదిన తొలి బీజేపీ సీఎం

లింగాయత్ సామాజిక వర్గానికి చెందిన యెడియూరప్ప 1943 ఫిబ్రవరి 27న మండ్య జిల్లాలోని బూకనకెరె గ్రామంలో జన్మించారు. బాల్యంలోనే ఆర్ఎస్సెస్‌లో చేరారు. 1983లో తొలిసారి శిఖరిపుర స్థానం నుంచి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. అనంతరం ఎనిమిది సార్లు అక్కడి నుంచి గెలుపొందారు. ఎమర్జెన్సీ సమయంలో జైలుకు వెళ్లారు. తాను పనిచేసిన రైస్ మిల్ యజమాని కుమార్తెను ఆయన వివాహమాడారు. 2007 నవంబర్‌లో తొలిసారి ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టి దక్షిణాది నుంచి తొలి బీజేపీ సీఎంగా గుర్తింపు పొందారు.

# ఆజంఖాన్ క్షమాపణ చెప్పాల్సిందే!

లోక్‌సభలో పార్టీలకతీతంగా ఎంపీల డిమాండ్

ఐదేండ్ల సస్పెన్షన్ కోసం మహిళా సభ్యుల లేఖ

29న తన ముందు హాజరు కావాలని ఆజంఖాన్‌కు స్పీకర్ ఆదేశం

**న్యూఢిల్లీ:** లోక్‌సభలో ప్యానెల్ స్పీకర్‌గా వ్యవహరించిన బీజేపీ ఎంపీ రమాదేవిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) సభ్యుడు ఆజంఖాన్ క్షమాపణ చెప్పాలని అన్ని వైపుల నుంచి ఒత్తిడి పెరుగుతున్నది. క్షమాపణ చెప్పకపోతే అతడిపై చర్య తీసుకోవాలన్న డిమాండ్ ఉధృతమవుతున్నది. గురువారం లోక్‌సభలో ట్రిపుల్ తలాక్‌పై జరిగిన చర్చలో పాల్గొన్న ఆజంఖాన్‌ను తన వైపు చూస్తూ మాట్లాడాలని స్పీకర్ స్థానంలో ఉన్న రమాదేవి ఆదేశించినప్పుడు ఆయన ద్వంద్వార్థాలతో కూడిన వ్యాఖ్యలు చేశారు. ఈ అంశంపై శుక్రవారం జీరో అవర్‌లో బీజేపీ ఎంపీ సంఘమిత్ర మౌర్య తీర్మానం ప్రవేశపెట్టగా, బీజేడీ ఎంపీ భర్తృహరి మెహతాబ్ మద్దతు పలికారు. దీనిపై వివిధ పార్టీల సభ్యులు మాట్లాడుతూ అనుచితంగా ప్రవర్తించిన ఆజంఖాన్‌కు వ్యతిరేకంగా చర్య తీసుకోవాల్సిందేనన్నారు. ఐదేండ్లు ఆయనను సభ నుంచి బహిష్కరించాలని కోరుతూ మహిళాసభ్యులు స్పీకర్‌కు లేఖ రాశారు. కాగా, విపక్ష నేతలు, సభ్యులు అధిర్ రంజన్ చౌదరి (కాంగ్రెస్), గల్లా జయదేవ్ (టీడీపీ), దానిష్ అలీ (బీఎస్పీ), సుప్రియా సూలే (ఎన్సీపీ)లతో స్పీకర్ నిర్వహించిన భేటీ.. ఆజంఖాన్ సభలో క్షమాపణ చెప్పాల్సిందేనని తీర్మానించిందని పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. ఒకవేళ క్షమాపణ చెప్పకపోతే ఆయనపై చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌దేనన్నారు. కాగా, సోమవారం (ఈనెల 29) తన ముందు విచారణకు హాజరు కావాలని ఆజంఖాన్‌ను స్పీకర్ ఓం బిర్లా ఆదేశించారు. ఒకవేళ క్షమాపణ చెప్పకపోతే ఆజంఖాన్‌పై చర్య తీసుకునేందుకు స్పీకర్‌కు అధికారం అప్పగిస్తూ లోక్‌సభ ఒక తీర్మానం ఆమోదించే అవకాశం ఉన్నదని తెలుస్తున్నది. అంతకుముందు లోక్‌సభలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ ఈ అంశంపై నిర్ణయం తీసుకోవడానికి గందరగోళం, సంకోచం ఎందుకు? అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. టీఆర్ఎస్ పక్ష నేత నామా నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ ప్రతి ఇంట్లో తల్లి, భార్య, కూతురును లక్ష్మీదేవిలా మహిళలను గౌరవించే సంస్కృతి మనదని, అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన ఆజంఖాన్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ సభా భావోద్వేగాలను తాను గౌరవిస్తున్నానన్నారు. తన వ్యాఖ్యలపై లోక్‌సభలో క్షమాపణ చెప్పాలని ఆజంఖాన్‌కు ఎస్పీ నాయకత్వం సూచించింది.



లోక్‌సభలో మాట్లాడుతున్న నిర్మల

# మరణశిక్ష ఉండాల్సిందే!

పలు రాష్ట్రాల సూచన.. త్వరలో కేంద్రం నిర్ణయం తీసుకుంటుంది

రాజ్యసభలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి

వచ్చే నెల 7 వరకు రాజ్యసభ పొడిగింపు

**న్యూఢిల్లీ:** దేశంలోని 90 శాతం రాష్ట్రాలు మరణశిక్షను కొనసాగించాలని కోరుకుంటున్నట్లు కేంద్రం రాజ్యసభకు తెలిపింది. మరణశిక్షను కొనసాగించే అంశాన్ని పరిశీలించాలంటూ ప్రవేశపెట్టిన ఓ ప్రైవేట్ బిల్లుపై శుక్రవారం చర్చ జరిగింది. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ 'ఉగ్రదాడులకు పాల్పడటం, దేశానికి వ్యతిరేకంగా క్షమించరాని నేరాలకు పాల్పడటం లాంటి ఘటనలు మినహా మిగతా కేసుల్లో మరణశిక్షను రద్దు చేయాలంటూ గతంలో లా కమిషన్ సిఫారసు చేసింది. అయితే ఈ విషయం కేంద్ర, రాష్ట్రాల ఉమ్మడి జాబితాలో ఉండటంతో రాష్ట్రాల అభిప్రాయాలను కేంద్రం కోరింది. దీంతో 14 రాష్ట్రాలు, 5 కేంద్రపాలిత ప్రాంతాలు స్పందించాయి. ఇందులో ఒక్కరాష్ట్రం మినహా మిగతా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు మరణశిక్షను కొనసాగించాలని కోరాయి' అని తెలిపారు. సమాజంలో ఎవరూ కూడా ఒక వ్యక్తి ప్రాణాలను తీయాలని కోరుకోరని, కానీ నిర్భయ లాంటి ఘటనలు జరిగినప్పుడు మరణశిక్ష తప్పకపోవచ్చని పేర్కొన్నారు. మరణశిక్షను కొనసాగించే అంశాన్ని కేంద్రం పరిశీలిస్తున్నదని, త్వరలోనే ఓ నిర్ణయం తీసుకుంటుందని కిషన్‌రెడ్డి వివరించారు. మరోవైపు కేంద్రం పలు కీలక బిల్లులను ఒకటికి రెండుసార్లు పరిశీలించకుండానే తొందర తొందరగా ఆమోదింపజేసుకుంటున్నదని ప్రతిపక్ష పార్టీలు ఆరోపించాయి. ఈ మేరకు 17 పార్టీలు రాజ్యసభ చైర్మన్ వెంకయ్యానాయుడుకు లేఖ రాశాయి. మరోవైపు, రాజ్యసభ బడ్జెట్ సమావేశాలను ఆగస్టు 7 వరకు ప్రభుత్వం పొడిగించింది.



రాజ్యసభలో ప్రసంగిస్తున్న కిషన్‌రెడ్డి



ఆవు మూత్రం, పాలు ఎంతటి ఔషధ విలువలు కలవో అందరికీ తెలుసు. ఆవుకు దగ్గరి పరిసరాల్లో మనం నివసిస్తే టీబీ లాంటి వ్యాధి కూడా నయమవుతుంది. ఉత్తరాఖండ్ కొండ ప్రాంతంలోని ప్రజలు జంతువుల్లో ఆవు మాత్రమే ఆక్సీజన్‌ను తీసుకుని, ఆక్సీజన్‌ను వదులుతుందని విశ్వసిస్తారు.

**త్రివేంద్రసింగ్ రావత్, ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి**



దేశ ప్రజలు సైన్యంపై ఉంచిన బాధ్యతను, విశ్వాసాన్ని ఎంత కష్టసాధ్యమైనా నిలబెడుతామని మేము నమ్మకాన్ని ఇస్తున్నాం. మన సైనికులు సరిహద్దు రక్షణలో నిరంతరం అప్రమత్తంగా ఉంటారు.

**బిపిన్ రావత్, భారత ఆర్మీ చీఫ్**

**చరిత్రలో నేడు**



1839

ఇంగ్లండ్ బర్మింగ్ హామ్‌లో చార్టిస్ట్ ఉద్యమం ప్రారంభం.

1894

'బిల్‌బోర్డ్' ప్రచురణ ప్రారంభం.





1921

'ఇన్సులిన్'ను కనుగొన్న ఫ్రెడరిక్ బాంటింగ్, చార్లెస్ బెస్ట్.

చైనా బుధవారం రక్షణ రంగ శ్వేత పత్రం విడుదల చేసింది. ప్రపంచదేశాలు దీనిద్వారా చైనా జాతీయ రక్షణ విధానాన్ని కచ్చితంగా, సమగ్రంగా అర్థం చేసుకోవచ్చు. సైనిక వ్యవహారాలలో పారదర్శకత ఉండాలనే అంతర్జాతీయ సమాజ కోరిక మేరకు శ్వేత పత్రాన్ని విడుదల చేయవలసి వచ్చింది. బయటి ప్రపంచం పట్ల చైనా సౌహార్ద్రతకు ఇది సూచిక. చైనా ఆధిపత్యాన్ని కోరుకోవడం లేదని ఎన్నోసార్లు స్పష్టం చేసింది. వర్ధమాన శక్తిగా స్వయం నియంత్రణ పాటిస్తున్నది.వలస ప్రాంతాలను కాపాడుకునే క్రమంలో సామ్రాజ్యవాద దేశాల మధ్య యుద్ధాలు జరిగాయి. కానీ చైనాకు వలసలు లేవు.

**గ్లోబల్ టైమ్స్**

గత ఏడాది దుండగులు నిర్మల అనే బాలికపై లైంగికదాడి జరిపి హత్యచేశారు. ఈ దోషులను ఇప్పటివరకు శిక్షించడం కాదు గదా, కనీసం గుర్తించలేదు. ఈ దుర్ఘటన దేశాన్ని కలవరపరిచింది. ఇప్పటికీ ఈ ఘటన ప్రభుత్వాన్ని వెంటాడుతున్నది. దోషులను శిక్షించాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఈ లైంగికదాడి ఘటనపై తీసుకున్న చర్యలేమిటో ప్రభుత్వం ప్రజలకు చెప్పవలసి ఉన్నది. కానీ అందుకు బదులుగా ఈ లైంగికదాడి జరుగడం కొత్తేమీ కాదునీ, గతంలో జరిగాయనీ, భవిష్యత్తులో జరుగతాయని హోం మంత్రి మాట్లాడటం సంస్కార రహితమైంది.

**ది హిమాలయన్ టైమ్స్**



# కర్ణాటక హెచ్చరిక

బీజేపీ నాయకుడు యెడియూరప్ప శుక్రవారం ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడంతో, కర్ణాటకలో అధికారంలోకి రావడానికి బీజేపీ చేసిన ప్రయత్నాలు ఎట్టకేలకు నెరవేరాయి. బీజేపీ గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో మెజారిటీ లేకున్నా సరే, అధికారం చేపట్టి ఆ తరువాత వీలును బట్టి ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి మద్దతు కూడగట్టడానికి ప్రయత్నించింది. కానీ ప్రత్యర్థి పార్టీలైన కాంగ్రెస్, జేడీఎస్ బలంగా ఉండటంతోపాటు, సుప్రీంకోర్టు జోక్యంతో నాటి ప్రయత్నం బెడిసికొట్టింది. మోదీ-అమిత్ షా దుందుడుకు విధానాలు తెలిసిన వారికి ఇంతకాలం కర్ణాటకలో సంకీర్ణ ప్రభుత్వం నిలదొక్కుకోవడమే ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ విజయం సాధించడమే కాదు, కర్ణాటకలోని 28 సీట్లలో రెండు తప్ప అన్నీ కైవసం చేసుకున్న తరువాత, ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని కూలదోయకుండా సంయమనం పాటిస్తుందని ఊహించలేం. మెజారిటీ లేనప్పుడు సంకీర్ణాలు ఏర్పడటం, అవి విభేదాలతో కూలిపోవడం, ప్రతిపక్షం అధికారంలోకి రావడం మొదలైనవి పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో సాధారణమే. కానీ బీజేపీ పెద్దలు- కొందరు ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి, వారి అభిమతమేమిటో స్పీకర్ కూడా తెలుసుకోలేని స్థితిలో, అసెంబ్లీలో బలపరీక్ష సందర్భంలో వారిని మరో రాష్ట్రానికి తరలించి దాచిపెట్టి, రాష్ట్ర ప్రభుత్వాన్ని అత్యంత మొరటుగా కూలదోసిన తీరు దిగ్భ్రాంతిని కలిగిస్తున్నది. దాదాపు ఇరవై రోజుల అనిశ్చితి తరువాత బీజేపీ ప్రభుత్వం అతి కష్టమ్మీద ఏర్పడింది. కానీ ఈ క్రమంలో రాజకీయాలను అత్యంత అథమ స్థాయికి దిగజార్చింది.

**కర్ణాటక పరిణామాలు దేశంలోని ప్రాంతీయశక్తులకు కూడా ప్రమాదకర హెచ్చరిక. అనేక జాతులు, సంస్కృతులున్న విశాలమైన దేశంలో ప్రాంతీయశక్తులు వికసించడానికి భరోసా ఉండాలె. ప్రధాన స్రవంతి రాజకీయాలకు భిన్నంగా ఉండే భావజాలాలకు ఆమోదం ఉండాలె. బలహీనవర్గాలు అధికారం చేపట్టడానికి దారులు తెరిచిపెట్టాలె. దీనివల్ల ప్రజాస్వామ్యానికి మరింత విశ్వసనీయత ఏర్పడుతుంది. కానీ జాతీయ రాజకీయశక్తులు ఎదుగుతున్న పక్షాలను మొగ్గలోనే తుంచి వేస్తూపోతే, పార్లమెంటరీ ప్రజాస్వామ్య పరిధిలో పరివర్తన సాగదు.**

ప్రజాస్వామ్యవ్యవస్థలో గోప్యతకు తావులేదు. అంతర్జాతీయ ఒడంబడికలు మొదలుకొని, దేశ రాజకీయాల వరకు అన్నీ ప్రజలకు తెలిసే విధంగా బాహాటంగా జరుగవలసిందే. కానీ ఎమ్మెల్యేలను దాచిపెట్టడమే అత్యంత దారుణమైన విధానం యథాలాపంగా సాగుతున్నది. ఎమ్మెల్యేలు ధైర్యంగా ప్రజల మధ్య ఉండాలె. ఇటువంటి సంక్షోభ సమయంలో రాష్ట్రంలో ఉంటూ అవసరమైతే స్పీకర్‌ను కలుసుకోవాలె. తమ వైఖరిని ప్రజలకు వివరించాలె. దేశంలో సైనిక పాలన లేదు, చట్టబద్ధపాలన సాగుతున్నది. రాష్ట్రంలో ఉండటం వల్ల వారికి ప్రమాదం ఏర్పడినా, ఒత్తిడులు వచ్చినా చట్ట ప్రకారం భద్రత పొందవచ్చు. దీనికోసం అవసరమైతే సుప్రీం కోర్టును ఆశ్రయించవచ్చు. కానీ మరో రాష్ట్రానికి తరలిపోయి, రహస్య జీవనం సాగించడం ప్రజాప్రతినిధులకు తగనిపని. ఇప్పుడు కర్ణాటక అసెంబ్లీ స్పీకర్ పరాయి రాష్ట్రంలోని శిబిరాలలో ఉన్న ఎమ్మెల్యేల రాజీనామాలను ఆమోదిస్తారా లేక అనర్హులుగా ప్రకటిస్తారా అనేది చర్చానీయాంశం. స్పీకర్ నిర్ణయం నచ్చనివారు సుప్రీం కోర్టును కూడా ఆశ్రయించవచ్చు. కానీ రాజకీయ పక్షాల నాయకత్వాలు, ప్రజాప్రతినిధులే విలువలను పట్టించుకోనప్పుడు ఎన్ని రాజ్యాంగ నిబంధనలను రూపొందించినా ఫలితం ఉండదు. ప్రజాప్రతినిధులను వారి ఇష్టానికి విరుద్ధంగా పార్టీ విధేయతకు కట్టిపడేయడం కూడా ఆచరణలో సాధ్యం కాదు. ఇందుకు ఫిరాయింపు నిరోధక చట్టం వచ్చిన నాటి నుంచి చెప్పుకోవడానికి అనేక ఉదంతాలు ఉన్నాయి. ప్రజాప్రతినిధి తమ ప్రజలకు జవాబుదారీగా, పార్లమెంటులో స్వేచ్ఛగా వ్యవహరించే విధంగా ఉండాలె. ఫిరాయింపుల సంస్కృతిని అరికట్టాలంటే రాజకీయ విలువలను పరిరక్షించడం ద్వారానే సాధ్యం. కానీ ప్రజా ప్రతినిధుల స్వేచ్ఛను కట్టడి చేయడం ద్వారా కాదు. ఇటువంటి కీలక అంశాలను రాజకీయ పక్షాల నాయకులు చర్చించి పరిష్కరించాలె. కానీ రాజకీయపక్షాల నాయకత్వాలే ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ విలువల పతనానికి దోహదపడుతున్నాయి.

కర్ణాటక పరిణామాలు దేశంలోని ప్రాంతీయశక్తులకు కూడా ప్రమాదకర హెచ్చరిక. అనేక జాతులు, సంస్కృతులున్న విశాలమైన దేశంలో ప్రాంతీయశక్తులు వికసించడానికి భరోసా ఉండాలె. ప్రధాన స్రవంతి రాజకీయాలకు భిన్నంగా ఉండే భావజాలాలకు ఆమోదం ఉండాలె. బలహీనవర్గాలు అధికారం చేపట్టడానికి దారులు తెరిచిపెట్టాలె. దీనివల్ల ప్రజాస్వామ్యానికి మరింత విశ్వసనీయత ఏర్పడుతుంది. కానీ జాతీయ రాజకీయశక్తులు ఎదుగుతున్న పక్షాలను మొగ్గలోనే తుంచి వేస్తూ పోతే, పార్లమెంటరీ ప్రజాస్వామ్య పరిధిలో పరివర్తన సాగదు. దీంతో పార్లమెంటేతర మార్గాలను తొక్కవలసి వస్తుంది. కనీసం సమాఖ్య విధానాల పరిరక్షణకైనా భరోసా లభించడం లేదు. బీజేపీ ఈశాన్య రాష్ట్రాలలో వ్యవహరిస్తున్న తీరు ఇందుకు ఉదాహరణ. కేంద్రంలోని పార్టీ కరుణాకటాక్షాల మీదనే బతకాలనడం భావ్యమా? బెంగాల్‌లో మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని వేధిస్తున్న తీరు ఏ మాత్రం సమర్థనీయంగా లేదు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వం లోక్‌సభ ఎన్నికల సందర్భంలో బీజేపీ కన్నా, ప్రాంతీయ, బలహీనవర్గాల రాజకీయపక్షాలే తమ శత్రువులున్నట్టు వ్యవహరించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సార్వత్రిక ఎన్నికలకు ముందు ఫెడరల్ ఫ్రంట్‌ను సూచించడంలోని ఆంతర్యాన్ని ప్రాంతీయపార్టీలు అర్థం చేసుకుంటే బాగుండేది. ఇప్పటికైనా దేశవ్యాప్తంగా ప్రాంతీయ పార్టీలు పరస్పర అవగాహన కోసం చర్చించుకోవాలె.

ముక్తసరి



**దేవులపల్లి ప్రభాకరరావు**

# మాకొద్దీ మతోన్మాద జాడ్యం

భారత స్వాతంత్ర్యాన్ని, పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ ను, రాజ్యాంగాన్ని మతాతీత వైవిధ్య సంస్కృతిని పదిలపరచుకోదలచిన వారు జాగరూకత వహించవలసిన సమయం ఇది. మతోన్మాదం గద్దె ఎక్కి తన కోరలకు పదును పెడుతున్న క్లిష్ట సమయం ఇది.

భారత స్వాతంత్ర్య సమరం రోజుల్లో తెలుగు ప్రాంతాలలోనే కాదు, ప్రపంచమంతటా తెలుగు వాళ్లు ఎక్కడ ఉంటే అక్కడ మార్మోగి, ప్రతి తెలుగు నాలుక మీద తాండవమాడిన గీతం 'మాకొద్దీ తెల్లదొరతనం'. అసంఖ్యాకులను గాంధీజీ నాయకత్వంలోని స్వాతంత్ర్య సమరంలోకి లంఘింపజేసిన ఉద్యమగీతం అది. ఈ గీత రచయిత బ్రిటిష్ పాలకుల ఆగ్రహానికి గురై దాదాపు నాలుగేండ్లు జైలు శిక్ష అనుభవించవలసి వచ్చింది. ఆయన గరిమెళ్ల సత్యనారాయణ. గరీబైనా కవిగా శ్రీమంతుడు, స్వాతంత్ర్యసమరయోధుడు. ఆయన చివరికి తిండిలేక, దిక్కులేక, దారిద్ర్యపు కోరల్లో చిక్కుకుని పక్షవాతం వ్యాధికి గురై, బిచ్చగాడై మరణించినా ఆయన గీతం స్వాతంత్ర్య ప్రియులందరికి చిరస్మరణీయం. తెల్లదొరలు వెళ్లిపోయి 72 ఏండ్లయింది. పోతూ పోతూ వాళ్లు పెట్టిన మతోన్మాదం చిచ్చు భారత ఖండాన్ని రెండు ముక్కలు చేసింది. కశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు ఈ పుణ్యభూమిపై మతోన్మాదం చిచ్చు ఆరడం లేదు. భయంకర స్వరూపంతో మరింత చెలరేగి దేశం మరిన్ని ముక్కలయ్యే ప్రమాదం స్పష్టంగా కన్పిస్తున్నది. ఆరోజు 'మాకొద్దీ తెల్లదొరతనం' అని గర్జించిన దేశ ప్రజలు ఈరోజు సమైక్య భారతదేశంగా, సుస్థిరత్వ, శాంతిప్రియ దేశంగా సర్వతోముఖ అభ్యుదయపథంలో, శ్రేయోరాజ్యం లక్ష్యంగా పురోగమించడానికి 'మాకొద్దీ మతోన్మాద జాడ్యం' అని గొంతెత్తక తప్పదు. మతోన్మాదం మహమ్మారి అని, అది కోట్లాది ప్రజల సంక్షేమానికి, శ్రేయస్సుకు గొడ్డలిపెట్టని స్వతంత్ర భారతం అవతరణ సమయాన వెల్లడైంది. స్వాతంత్ర్యసిద్ధి ఆనందప్రదం కాకుండా ఆరోజు మతోన్మాదం భయంకర, విషాదకర పరిణామాలకు కారణమైంది. ఆనాటి విషాదం దేశ ప్రజలకు, దేశ సమైక్యతను వాంఛిస్తున్న వారందరికి సర్వదా గుణపాఠం కావాలె. ఒక వంక దాదాపు వందేండ్లు (1857-1947), కచ్చితంగా 90ఏండ్ల స్వాతంత్ర్య ఉద్యమం ఫలితంగా స్వతంత్ర భారతం అవతరిస్తున్న శుభ తరుణాన కొన్ని కోట్లమంది ఇల్లూ వాకిలీ, కొంపా గూడు, కష్టార్జితాలను, కుటుంబ సభ్యులను శాశ్వతంగా కోల్పోయి నిర్వాసితులైనారు. లక్షలమంది హతులైనారు. మానవచరిత్రలో అంతవరకు (ఇంతవరకు!) ఎన్నడూ, ఎక్కడా కనీ వినీ ఎరుగని దారుణ విషాదకర పరిణామాలు పసికందు స్వతంత్ర భారత గడ్డమీద సంభవించాయి. కేవలం మతోన్మాదం కారణంగా ఆరోజు మానవులు దానవులై సామూహిక హత్యాకాండకు, అరాజకత్వానికి, అమానుషత్వానికి విచ్చలవిడిగ నడుం బిగించారు. అదంతా మతాల పేరిట మతోన్మాదంతో జరిగింది. బ్రిటిష్ పాలకులకు ఏజెంట్లుగా పని చేసిన వాళ్లు, (వాళ్లను భారత ద్రోహులంటే తప్పుకాదు), స్వాతంత్ర్య ఉద్యమానికి వెన్నుపోట్లు పొడిచిన వాళ్లు స్వాతంత్ర్య సిద్ధి సమయాన మతోన్మాదాన్ని రెచ్చగొట్టి శైశవదశలోని స్వతంత్ర భారతదేశానికి ఆర్థికంగా, సామాజికంగా క్లిష్ట సమస్యలు సృష్టించారు. స్వతంత్ర దేశ ప్రగతిని పదేండ్లు వెనుకకునెట్టారు.

అనేక సంవత్సరాల అపూర్వ శాంతియుత పోరాటం పర్యవసానంగా స్వాతంత్ర్యం సిద్ధిస్తున్న సమయాన, లక్షలాది స్వాతంత్ర్య సమరయోధుల, త్యాగధనుల కలలు ఎట్టకేలకు ఫలిస్తున్న తరుణాన, స్వాతంత్ర్య ఉషోదయ పవిత్ర క్షణాలలో ఈ దేశంలో రాక్షసాకారంతో చెలరేగి వికటాట్టహాసం చేసిన మతోన్మాదం సభ్య ప్రపంచానికి విభ్రాంతి కల్గించింది. స్వాతంత్ర్య సమర సారథి అహింసామూర్తి గాంధీజీ ఆ సమయాన అమిత ఖేదంతో ఖిన్నుడై స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలలో పాల్గొనలేదు. మతసామరస్యం ప్రబోధిస్తూ మతోన్మాదం పైశాచిక రూపం ధరించిన ఢిల్లీ, నౌఖాలి, కలకత్తా తదితర స్థలాలలో పర్యటించారు. 1946-48 సంవత్సరాల్లో గాంధీజీ ఈ దేశానికి స్వాతంత్ర్యం కంటే మత సామరస్యం, పరమత సహనం ముఖ్యమని భావించారు. 1945 అక్టోబర్ 5న జవహర్‌లాల్ నెహ్రూకు రాసిన ఒక లేఖలో గాంధీజీ ఈ దేశానికి సేవచేయడానికి 125 ఏండ్లు జీవించాలనుకుంటున్నానని అన్నారు. కాని, తర్వాత చెలరేగిన మతోన్మాదం గాంధీజీ మనసును వికల పరిచింది. 1946 నవంబర్ 5న నెహ్రూకు రాసిన లేఖలో గాంధీజీ హృదయ భారం, నిస్పృహ ఈ విధంగా వ్యక్తమయినాయి.. 'If in Bihar and other provinces slaughter is not stopped. I must end my life by fasting.. Do not waste time thinking of my death.. leave me in the hands of god..' ఈ మాటల్లో గాంధీజీ నిర్వేదం, ఆవేదన అర్థం చేసుకోవచ్చు. గాంధీజీ ఎంతమాత్రం సహించని మతోన్మాదమే ఆయనను కబళించింది.

గాంధీజీ తన జీవితమంతా, తన ఉద్యమాలన్నిట ఖండించిన, తృణీకరించిన, గాంధీ ప్రాణాన్ని బలిగొన్న మతోన్మాద విషసర్పం గాంధీజీ 150వ జయంతి సమయానికి దేశమంతట విషం కక్కుతూ, బుసలు కొడుతూ, విజృంభిస్తున్న ప్రమాదం కన్పిస్తున్నది. (స్వాతంత్ర్యానంతరం, విశేషించి గాంధీజీ హత్య అనంతరం అప్పటి ఉప ప్రధాని, దేశ వ్యవహారాల మంత్రి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నిషేధం విధించిన సంస్థ ఆర్.ఎస్.ఎస్.) గాంధీజీ హంతకుడిని దేశభక్తుడని పొగిడిన వారు, ఆ హంతకునికి ఆలయాలు కట్టి పూజలు చేస్తామంటున్న వారు ప్రాబల్యం వహిస్తున్న పాడు కాలం ఇది. స్వాతంత్ర్యానంతరం దాదాపు ఆరు దశాబ్దాలు మతోన్మాదం పలు రూపాలు ధరిస్తూ పరదాల వెనుక దాగింది. నాగరిక, సభ్య సమాజం మతోన్మాద అసాంఘికశక్తిని బహిష్కరించి

దక్కన్ ప్రామాణిక చరిత్ర రచనలో ఉద్దండుడుగా ప్రపంచ ప్రసిద్ధి పొందిన పండితుడు, పరిశోధకుడు డాక్టర్ మొహియుద్దీన్ ఖాద్రీ జోర్ రాసిన మాటలివి.. 'Infact in the Deccan the QutubShahi period marks the beginning of the Deccan culture because it was the cherished ideal of the QutubShahi rulers to bring the HIndus and Muslims as one entity in every field and social life...'. గోలకొండ సమీపాన గల గ్రామ నివాసి, సుందరాంగి, నర్తకి భాగమతిని మనసార ప్రేమించిన మొహమ్మద్ కులీ కుతుబ్‌షా మస్తిష్కంలో 1588లో హైదరాబాద్ నగర నిర్మాణం ఆలోచనకు అంకురార్పణ జరిగింది. నగర నిర్మాణ బాధ్యతను ప్రధానమంత్రి మీర్ మొహమ్మద్ మోమిన్‌కు అప్పగించి మొహమ్మద్ కులీ కుతుబ్‌షా శంకుస్థాపన జరిపాడు. (కుతుబ్‌షాహీ రాజులందరు కవులు, సారస్వత ప్రియులు. ఇబ్రాహీమ్ కులీకుతుబ్‌షా మల్కిభ రాముడుగా పేరొందాడు) నాలుగేండ్లలో 1592 నాటికి చార్మినార్, జామామస్జిద్, చార్‌కమాన్ నిర్మాణం జరిగి హైదరాబాద్ నగర విస్తరణ మొదలైంది. 1724లో మొదలై 1948 దాక దాదాపు 225 ఏండ్లు కొనసాగిన ఆసఫ్‌జాహీ పాలనలో గూడ చివరి కొన్నేండ్లను మినహాయిస్తే హైదరాబాద్ నగరం మత సామరస్యానికి మచ్చ పడలేదు. అఘోరనాథ్ చటోపాధ్యాయ (సరోజినినాయుడు తండ్రి) వంటి ప్రముఖులు అనేకులు హైదరాబాద్ నగరంలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. స్వామి వివేకానందుడు, గాంధీ, రవీంద్ర కవీంద్రుడు హైదరాబాద్ నగరం మత సామరస్యం, గంగా జమున తహ్‌జీబ్, అదబ్, సహన సంస్కృతితో ముగ్ధులైనారు.

**రాష్ట్ర అవతరణ తర్వాత ఐదేండ్ల స్వల్ప వ్యవధిలో సర్వతోముఖంగా జరిగిన అద్భుత అభివృద్ధికి, బహుముఖ వికాసానికి పటిష్ఠ హేతువు కేసీఆర్. ఆయన అనుసరించిన సర్వమత సహజీవన పథం. నేతాజీ సుభాష్ చంద్రబోస్ మతసామరస్యం ఆవశ్యకతను వివరిస్తూ కావించిన ఈ ఉద్బోధ తెలంగాణ ప్రజలకు మార్గదర్శకం.**

అస్పృశ్యగా పరిగణించింది. ఇటీవలే మతోన్మాద పూతన నగ్న ప్రదర్శన జరుపడానికి, దేశంలో ప్రజాస్వామ్యానికి విఘాతం కల్గించడానికి సాహసిస్తున్నది. భారత స్వాతంత్ర్యాన్ని, పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను, రాజ్యాంగాన్ని మతాతీత వైవిధ్య సంస్కృతిని పదిలపరచుకోదలచిన వారు జాగరూకత వహించవలసిన సమయం ఇది. మతోన్మాదం గద్దె ఎక్కి తన కోరలకు పదును పెడుతున్న క్లిష్ట సమయం ఇది. ఈ సందర్భాన ప్రముఖ ఆంగ్ల కవి రాబర్ట్ ఫ్రాస్ట్ మాటలు జ్ఞాపకం రావడం సహజం. ఆయన అన్నారు .. 'The woods are lovely, dark and deep, but I have promises to keep, and miles to go befo-re I sleep..'. నిరంతర, నిర్విరామ జాగరూకత ఈనాటి అవసరం.

కామెర్ల రోగికి లోకమంతా పచ్చగా కన్పిస్తుందంటారు. అయి ఉంటుంది. సందేహం లేదు. నిన్నానో మొన్ననో ఈ మధ్యనే ఓ గద్దె ఎక్కిన పెద్ద మనిషి అన్నాడట.. 'గిట్ల ఉందేంది, హైదరాబాద్ నగరమంత పచ్చగ ఉన్నది. అంత అజబ్‌గ ఉంది!' అని. ఆయన ఇక్కడోడె. ఇక్కడ గల్లీ లల్ల తిరిగినోడె. 'చరిత్ర తెలియని వాళ్లు చరిత్ర నిర్మించలేరు' అని అంబేద్కర్ అన్నారు. పై పెద్ద మనిషికి చరిత్ర తెలియకపోవచ్చు. దక్కన్ పీఠభూమికి మణిమయ కిరీటం వలె భాసిస్తున్న తెలంగాణ రాజధాని హైదరాబాద్ నగరానికి మహత్తర, మత సామరస్య చరిత్ర ఉన్నది. బహమనీల రాజ్యం నుంచి వేరై కుతుబ్‌షాహీలు గోలకొండ రాజ్యం స్థాపించిన తర్వాత దక్కను చరిత్రలో ఒక వినూత్న అధ్యాయం ప్రారంభమైంది.

1909లో వెలువడిన ఇంపీరియల్ గెజిటీర్ ఆఫ్ ఇండియా భారతదేశంలో హైదరాబాద్ నగరం నాలుగవ పెద్ద నగరమని వెల్లడించింది. తెలంగాణ ప్రజల కష్టార్జితంతో హైదరాబాద్ నగరం విస్తరించింది.

60ఏండ్ల పరాయి పాలనలో, అణిచివేతలో నలిగినప్పటికి హైదరాబాద్ నగరం తన మతసామరస్య ఉత్తమ సంప్రదాయాలను, ఉదాత్త వైవిధ్య సంస్కృతీ వైభవాన్ని కోల్పోలేదు. తెలంగాణ రాష్ట్ర నిర్మాణానికి దారితీసిన 14 ఏండ్ల తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో మత వైషమ్యాలకు తావు లేకుండా, అన్ని వర్గాలవారు తమ వంతు పాత్ర నిర్వహించడానికి కేసీఆర్ విజ్ఞతాపూర్వక నాయకత్వం ఉపకరించింది. రాష్ట్ర అవతరణ తర్వాత ఐదేండ్ల స్వల్ప వ్యవధిలో సర్వతోముఖంగా జరిగిన అద్భుత అభివృద్ధికి, బహుముఖ వికాసానికి పటిష్ఠ హేతువు కేసీఆర్. ఆయన అనుసరించిన సర్వమత సహజీవన పథం. నేతాజీ సుభాష్ చంద్రబోస్ మతసామరస్యం ఆవశ్యకతను వివరిస్తూ కావించిన ఈ ఉద్బోధ తెలంగాణ ప్రజలకు మార్గదర్శకం. నేతాజీ మాటల్లో.. 'The harmony of all religions which Ramakrishna Parama-hamsa accomplished in his life's endeavour was the key note of Swamy Vivekananda's life, and this ideal again is the bed rock of the nationalism of future India..'.

**జనగళం**

## మట్టిలో మాణిక్యాలను గుర్తించాలె

అస్సాంలో క్రీడా సౌకర్యాలు ఏ మాత్రంలేని మారుమూల గ్రామంలో పుట్టి ప్రపంచ అథ్లెటిక్స్‌లో దేశానికి బంగారు పతకం సాధించిన తొలి అథ్లెట్ హిమదాస్. కేవలం 20రోజుల వ్యవధిలో 5 అంతర్జాతీయ స్వర్ణ పతకాలు సాధించిన ఘనత దక్కించుకున్నది. యావద్భారతావని హర్షించే విధంగా ఆమె విజయాల పరంపర కొనసాగించడం గర్వకారణం.

కానీ ఆమె సాధించిన విజయాలను ఎవరూ పట్టించుకోలేదని, దక్కాల్సిన ఖ్యాతి దక్కలేదని సామాజిక మాధ్యమాలలో విమర్శలు వస్తున్నాయి. హిమదాస్ వెనుకబడిన నిమ్నవర్గాలకు చెందిన క్రీడాకారిణి కాబట్టి ఆమె గురించి మీడియా ప్రాధాన్యం ఇవ్వలేదనే విమర్శలున్నాయి. క్రీడాకారులకు జాతీయ జెండాకు ఉండే గౌరవం ఉంటుంది. క్రీడాకారులకు దేశవిదేశాలలో తమ జాతీయ జెండాను ఎగురవేయాలనే తపన, జాతీయగీతాన్ని మారుమోగించాలని కసి ఉంటుంది. దేశంకోసం పతకాలు సాధించిన క్రీడాకారులకు జీవితకాలం గౌరవం ఉంటుంది. కాకపోతే మన దేశంలో క్రికెట్‌కు ఉన్న ప్రాధాన్యం, ఆదరణ మరే క్రీడకు లేదనేది నిజం. 120కోట్లకు పైగా జనాభా కలిగిన మన దేశం క్రీడల్లో చాలా వెనుకబడి ఉన్నది. స్వాతంత్రం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా స్పష్టమైన సమగ్రమైన క్రీడా విధానం లేకపోవటం విషాదం.

ప్రపంచంలో అతిపెద్ద క్రీడల పండుగ ఒలింపిక్స్. విశ్వవ్యాప్తంగా వందలాది దేశాలు వేలాదిమంది క్రీడాకారులు పాల్గొనే ఈ పోటీలలో మనదేశం చాలా క్రీడాంశాలలో కనీస అర్హత సాధించలేని స్థితి ఉన్నది. జాతీయ క్రీడా శాఖ, వివిధ రాష్ట్ర క్రీడాశాఖలు ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నాయి. శిక్షణా కేంద్రాలు, శిక్షకులు, క్రీడా సామాగ్రి, పోటీల నిర్వహణకు చేస్తున్న ఖర్చుకు సాధించుకున్న ఫలితాలకు పొంతన లేకుండా ఉంటున్నది. ఈ అంశాలపై చర్చ జరుగాల్సిన అవసరం ఉన్నది. క్రీడలు అంటే క్రికెట్ మాత్రమే కాదనే విషయాన్నిఅర్థం చేసుకోవాలి. వివిధ క్రీడలలో దేశానికి ప్రాతినిధ్యం వహించి ఫలితాలు సాధిస్తున్న ప్రతి ఒక్క క్రీడాకారుడిని సమున్నతరీతిలో సత్కరించుకోవాల్సిన,ప్రోత్సహించవలసిన అవసరం ఉన్నది. విశాల భారతావనిలో మట్టిలో మాణిక్యాలను గుర్తించాల్సిన అవసరం ఉన్నది.

**-సురేష్ కాలేరు, హైదరాబాద్**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.** editpage@ntnews.com Fax-040-23291118

# భారతీయ సినిమాపై బెంగాల్ ప్రభావం

విశ్లేషణ



**వారాల ఆనంద్**

అనేక భాషలు, సాహిత్యాలు, సంస్కృతులు, కళలు సమ్మిళతమైన దేశం మనది. అంతేకాదు అత్యంత వైవిధ్యమైన జీవన విధానాలు కలిగింది కూడా. ఎక్కడికక్కడ కళలూ, సాహిత్యం మాత్రమే కాదు ఆధునిక సృజన రూపమైన సినిమా కూడా ఎంతో వైవిధ్యాన్ని సంతరించుకున్నది. అయితే ఏ సృజనాత్మక రూపమైనా స్వతంత్రంగా ఎంత ఎదుగుతుందో అంతే ఇతర భాషా సాంస్కృతుల ప్రభావం కూడా వుంటుంది. ఆ క్రమంలో కొన్ని భాషా సంస్కృతులు మొత్తం దేశ పరిస్థితులపై కూడా తమ ప్రభావాన్ని చాటుతాయి. ఆధునిక సాంకేతిక పరిణామ క్రమంలో భాగంగా ఎదిగివచ్చిన భారతీయ సినిమా కూడా ఇట్లా ఒక ప్రాంతం ప్రభావంలో ఎదిగిందే. ముఖ్యంగా బెంగాల్ ప్రభావం భారతీయ సినిమా రంగంపైన ఎంతో వున్నది. సినిమా తొలినాళ్ళల్లో హిందీ సినిమాపైన వ్యక్తులుగానూ భాషా సాంస్కృతుల పరంగానూ బెంగాల్ ప్రభావం మనకు స్పష్టంగా కనిపిస్తుంది. హిందీ నుంచి క్రమంగా తెలుగు తదితర భాషా సినిమాలపైన కూడా బెంగాలీ సాహిత్య సినిమాల ప్రభావం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. ఇండియన్ సినిమా అంటే హిందీ సినిమాగా ప్రాచుర్యం పొందిన స్థితిలో హిందీ సినిమా పైన బెంగాలీల ప్రభావం ఎన్నదగినది.

సినిమాలపై ఈ ప్రభావం మొదట మూకీ కాలంలోనే విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగోర్‌తో ఆరంభమైంది. మూకీ సినిమాల కాలంలోనే టాగోర్ కథలు సినిమాలుగా వచ్చాయి అట్లా వచ్చిన మొదటి మూకీ సినిమా 1923లో వచ్చినది 'మన్ భంజన్'. 1929లో వచ్చిన 'గహబల' సినిమా టాగోర్ కథ ఆధారమే కాకుండా దానికి టాగోర్ స్క్రిప్ట్ కూడా రాశారు. ఇక పి.సి.బారువా రూపొందించిన 'ముక్తి'లో టాగోర్ గీతాలు ఉపయోగించారు. ఇక 1932లో 'నతిర్ పూజా' టాగోర్ దర్శకత్వంలో వచ్చిన మొదటి సినిమా. అట్లా టాగోర్ ప్రభావంతో ఎదుగుతూ వచ్చిన తర్వాత శరత్ రాసిన 'దేవదాస్'తో సహా అనేక రచనలు బెంగాలీలోనే కాదు హింది తదితర భాషల్లో సినిమాలుగా నిర్మించబడి ఎంత ప్రభావాన్ని చూపాయో మనకు తెలిసిందే. పి.డి.బారువా కె.ఎల్.సైగల్ ప్రధాన పాత్రధారిగా తీసిన దేవదాస్ ఒక క్లాసిక్‌గా మిగిలిపోయింది. ఇక బారువా 'దేవదాస్'కు సినిమాటోగ్రఫీ చేసిన బిమల్‌రాయ్ దిలీప్ కుమార్‌తో మరో దేవదాస్ తీసి దిలీప్‌కి ట్రాజెడీ కింగ్‌గా నిలబెట్టారు. బిమల్ రాయ్ రూపొందించిన 'దోభీగా జమీన్', పరినీత, బిరాజ్ బహు, మధుమతి, యాహూ ది, సుజాత లాంటి సినిమాలు హిందీలో క్లాసిక్స్‌గా పేరుగాంచాయి. అంతేకాదు ఆ ఒరవడి సినిమాలు తెలుగుతో సహా ఇతర ప్రాంతీయ భాషా చిత్రాల్లో కూడా రూపొందేందుకు తోడ్పడ్డాయి. తర్వాత బి.ఎన్ సర్కార్ న్యూ థియేటర్స్‌లో పని చేసిన హృషికేశ్ ముఖర్జీ మొదట బిమల్ రాయ్ దగ్గర పనిచేసి దర్శకుడిగా హృదయానికి హత్తుకునే సినిమాలు అనేకం తీశాడు. హృషీదా రూపొందించిన సత్యకామ్, చూప్కే చూప్కే, అనుపమ, ఆనంద్, అభిమాన్,గుడ్డి,గోల్‌మాల్, ఆశీర్వాద్, బావార్చి మొదలైన సినిమాలు నేటికీ విలువైన హిందీ సినిమాలుగా నిలిచాయి. ఇక గోల్‌మాల్ అయితే చెప్పనవసరమే లేదు. హృషికేష్ ముఖర్జీ సినిమాలకు ఆ కాలంలోనే కాదు నేటికీ రిలెవెన్స్ వుంది. ఆయన సినిమాల్లో పని చేసిన అమితాబ్, రాజేష్ ఖన్నా, జయా బాధురీ, ధర్మేంద్ర లాంటి వాళ్ళు గొప్ప నటులుగా నిలిచారు. తర్వాత బాసు చటర్జీ తన సినిమాల ద్వారా ప్రేమ, పెళ్లి వాటిల్లోని అనుబంధాలు ప్రధానాంశాలుగా తీసుకొని సున్నితమైన సినిమాల్ని హిందీ ప్రపంచానికి పరిచయం చేశారు. ఆయన సినిమాల్లో చోటీ సీ బాత్, చిట్ చోర్, రాజ్నీ గంధా , ప్యార్ కా ఘర్ లాంటివి ప్రత్యేక ఒరవడిని సృష్టించిన సినిమాలుగా మిగిలిపోయాయి. తర్వాత బాసు భట్టాచార్య తన తీస్రీ కసమ్ సినిమాతో జాతీయ అవార్డును అనుకున్నాడు. రాజ్ కపూర్, వహీదా రహమాన్‌లు ప్రధానభూమికల్ని పోషించారు. ఇక సమాంతర సినిమాలల్లో బెంగాల్‌కు చెందిన ట్రియోలో ఒకడైన రిత్విక్ ఘటక్ ప్రభావం ఎనలేనిది. ఆయన దిలీప్ కుమార్ నటించిన 'మధుమతి' సినిమాకు స్క్రిప్ట్ రచనా చేశాడు. షారూఖ్ ఖాన్ హీరోగా వచ్చిన 'ఓం శాంతి ఓం' మధుమతి ఒరవడిలోనే వచ్చింది. మృణాల్ సేన్ తీసిన భువన్ శోమ్, మృగయా లాంటివి దేశంలోనే గొప్ప సినిమాలుగా పెరుగడించాయి.

**హిందీ సినిమా రంగాన్ని దాని ప్రభావంతో ఇతర భారతీయ భాషా చిత్రాల్ని బెంగాలీ సాహిత్యం సంగీతం సంస్కృతి గొప్పగా ప్రభావితం చేసింది. అందుకే అప్పటి రవీంద్రనాథ్ టాగోర్ నుంచి నేటి దాకా భారతీయ సంస్కృతిలో బెంగాలీల పాత్ర ఎన్నదగింది. ఏ భాషా ప్రాంతీయ ప్రత్యేకతలు వాటికి వున్నట్టే తెలుగుకు, తెలంగాణ భాషకూ తమదైన ప్రత్యేకతలున్నాయి. వాటన్నిటి ప్రత్యేకతలు ప్రభావాలూ చర్చించాల్సే వున్నది.**

దర్శకులుగా రచయితలుగా హిందీ సినిమా తొలి దశాబ్దాల నుంచి 1970-80ల దాకా బెంగాలీల ప్రభావం ఎంతో వుంది. ఇక సంగీతం విషయం చెప్పాల్సినే అవసరం లేదు. హిందీ సినిమా రంగంలో మొట్టమొదటి ప్లేబాక్ సాంగ్ 1935లో ఆర్.సి.బోరల్ దర్శకత్వంలో వచ్చిన ధూప్ చావ్ సినిమాలో సంగీత దర్శకుడు పంకజ్ మల్లిక్ ప్రవేశపెట్టాడు. అట్లా నటులే తమ పాటల్ని తామే పాడుకొనే స్థితి నుంచి నటన పైన దృష్టి పెట్టే అవకాశం కలిగింది. ఇక కె.ఎల్.సైగల్ తన గీతాలతో పాటలతో ఎంత గొప్పగా ప్రభావితం చేశాడో అందరికీ తెలిసిందే. హిందీ సినిమా సంగీత ప్రపంచంలో హేమంత్‌కుమార్‌ది విలక్షణమైన బెంగాలీ స్వరం. తర్వాత సలీల్ చౌధురి సంగీతం ఓ సజ్నా భారా.. బహార్ లాంటి పాటలతో వినూత్న ముద్ర వేశారు. తర్వాత ఆర్‌డీ బర్మన్ సంగీతం హిందీ సినిమా సంగీతానికి గొప్ప మలుపు. ఇక బప్పీలాహిరి లాంటి వాళ్ళ సంగీతం పెద్ద విజయాల్నే సాధించింది. ఇక ఇటీవలి కాలంలో శంతను మొయిత్ర 2005లో వచ్చిన పరిణీత సినిమాలే అందించిన సంగీతం కొత్త తరాన్ని ప్రభావితం చేసింది.

హిందీ సినిమా రంగాన్ని దాని ప్రభావంతో ఇతర భారతీయ భాషా చిత్రాల్ని బెంగాలీ సాహిత్యం సంగీతం సంస్కృతి గొప్పగా ప్రభావితం చేసింది. అందుకే అప్పటి రవీంద్రనాథ్ టాగోర్ నుంచి నేటి దాకా భారతీయ సంస్కృతిలో బెంగాలీల పాత్ర ఎన్నదగింది. ఏ భాషా ప్రాంతీయ ప్రత్యేకతలు వాటికి వున్నట్టే తెలుగుకు, తెలంగాణ భాషకూ తమదైన ప్రత్యేకతలున్నాయి. వాటన్నిటి ప్రత్యేకతలు ప్రభావాలూ చర్చించాల్సే వున్నది.

**(హైదరాబాద్‌లో బెంగాలీ ఫిల్మ్ ఫెస్టివల్స్ జరుగుతున్న సందర్భంగా)**

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

# ఆడబిడ్డలు మెచ్చేలా చీరెల డిజైన్లు

బతుకమ్మ చీరెల నాణ్యతలో రాజీ లేదు

చేనేత జౌళిశాఖ డైరెక్టర్ శైలజారామయ్యర్



సిరిసిల్లలో మాట్లాడుతున్న శైలజారామయ్యర్

**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, నమస్తే తెలంగాణ :** రాష్ట్ర ప్రభుత్వం పండుగ కానుగా అందిస్తున్న బతుకమ్మ చీరెలు ఆడబిడ్డలు మెచ్చేలా వంద డిజైన్లతో తయారు చేస్తున్నట్టు చేనేత జౌళీశాఖ డైరెక్టర్ శైలజారామయ్యర్ తెలిపారు. చీరెల నాణ్యతలో రాజీలేదని స్పష్టం చేశారు. సిరిసిల్ల పొదుపు భవన్‌లో శుక్రవారం వస్త్ర ఉత్పత్తిదారులతో తయారీపై ఆమె సమీక్షించారు. ఈఏడాది రాష్ట్రంలోని తెల్లరేషన్ కార్డులున్న మహిళలకు కోటి చీరెలు పంపిణీ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. సిరిసిల్ల మరమగ్గాల కార్మికులకు చేతినిండా పని, గిట్టుబాటు కూలి దక్కే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదన్నారు. సెప్టెంబర్ 15లోగా కోటి చీరెలు, 6.70 కోట్ల మీటర్ల వస్త్రాల తయారీ పూర్తి చేయాలని కోరారు. మొత్తం 20 వేల మరమగ్గాలపై తయారు చేయాల్సి ఉండగా, 17,214 వేల మరమగ్గాలపై తయారుచేస్తున్నారని, మరో మూడు వేల మరమగ్గాలపై వెంటనే ఉత్పత్తులు ప్రారంభించాలన్నారు. సమయం తక్కువగా ఉన్నందున ఇతరప్రాంతాల నుంచి కార్మికులను రప్పించి లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. వచ్చే జనవరిలో మళ్లీ సిరిసిల్లకే ఆర్డర్లు ఇవ్వనున్నట్టు తెలిపారు. చీరెల ఉత్పత్తికి వినియోగించే నూలుపై ప్రభుత్వం ఇస్తున్న 10 శాతం సబ్సిడీ కార్మికులకు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఇందుకోసం కార్మికులకు అవగాహన సదస్సులు నిర్వహించి వివరిస్తామన్నారు. సమావేశంలో టెస్కో జనరల్ మేనేజర్ యాదగిరి, టెక్స్‌టైల్స్ పార్కు అడ్మినిస్ట్రేటర్ తస్లీమా, ఏడీ అశోక్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# పాలమూరులో మినీ శిల్పారామం

సీఎంకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కృతజ్ఞతలు



మహబూబ్‌నగర్ మినీట్యాంక్ బండ్ వద్ద మినీ శిల్పారామం ఏర్పాటు చేసే ప్రాంతం

**మహబూబ్‌నగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ :** మహబూబ్‌నగర్‌లో మినీ శిల్పారామం ఏర్పాటు చేసేందుకు రూ.8 కోట్ల నిధులను విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నం.53 ను విడుదల చేసింది. పట్టణంలో ప్రస్తుతం ఉన్న మినీ ట్యాంక్ బండ్ సమీపంలోనే మినీ శిల్పారామం ఏర్పాటు చేయనున్నారు. మహబూబ్‌నగర్ పట్టణానికి మినీ శిల్పారామాన్ని మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రికి మహబూబ్‌నగర్ పట్టణ ప్రజల తరపున ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. మహబూబ్‌నగర్‌కే తలమానికంగా, ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా మినీ శిల్పారామాన్ని రూపొందిస్తామని మంత్రి తెలిపారు.





నిజామాబాద్ జిల్లా శంకోరలో వంతెనను ప్రారంభిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

## తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం

- స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

**వర్ని :** తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయనీ, వాటిని కేంద్రంతోపాటు ఇతర రాష్ట్రాలు అమలు చేస్తున్నాయని శాసన సభ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. నిజామాబాద్ జిల్లా వర్ని మండలం శంకోరలో రూ.1.25 కోట్లతో నిర్మించిన వంతెనను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం శంకోర, వకీల్‌ఫారంలోహరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. ప్రధాని మోదీ మూడుసార్లు సీఎంగా పని చేసిన గుజరాత్‌లో ఇప్పటి వరకు ఉచిత కరెంటు ఇవ్వలేదనీ, తెలంగాణలో సీఎం కేసీఆర్ వ్యవసాయానికి నాణ్యమైన ఉచిత కరెంట్ అందిస్తున్నారన్నారు. అనంతరం అంతాపూర్‌తండా ప్రజలతో స్పీకర్ ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీచైర్మన్ విఠల్‌రావు, జడ్పీటీసీలు హరిదాస్, గంగారం పాల్గొన్నారు.



నారాయణపేట జిల్లా మక్తల్ మండలం భూత్పూరులో లబ్ధిదారుకు పింఛన్ ప్రొసీడింగ్ పత్రంతోపాటు మొక్కను అందిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ వనజ



శుక్రవారం నారాయణపేట జిల్లా మరికల్‌లో లబ్ధిదారుకు పింఛన్ ప్రొసీడింగ్‌తోపాటు మొక్కను అందిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

# ఆసరాతో ఆనందం

- మిన్నంటిన సంబురం
- సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకాలు
- కొనసాగుతున్న పత్రాల పంపిణీ



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకేంద్రంలోని త్రీఇంక్లైన్‌లో ఆసరా పింఛన్లు తీసుకొని ఆనందం వ్యక్తం చేస్తున్న వృద్ధులు



కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కురిక్యాలలో సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న ఆసరా లబ్ధిదారులు

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** ఆసరా పింఛన్లు రెట్టింపు కావడంతో లబ్ధిదారుల్లో ఆనందం వెల్లివిరుస్తున్నది. పింఛన్లను పెంచిన సీఎం కేసీఆర్ తమ దేవుడంటూ కొనియాడుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం త్రీ ఇంక్లైన్‌లో శుక్రవారం ఎస్బీఐ వినియోగదారుల సేవా కేంద్రంలో వృద్ధులు, వితంతువులు ఆసరా పింఛన్లు తీసుకుని మురిసిపోయారు. ఒకరిపై ఆధారపడకుండా పింఛన్ తమకు భరోసానిస్తుందని వారు పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలం పార్‌పల్లిలో శుక్రవారం ఆసరా పింఛన్ ప్రొసీడింగ్ పత్రాలను అందుకొన్న లబ్ధిదారులు డబ్బులు తీసుకొన్నారు.

**క్షీరాభిషేకాలు**

కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కురిక్యాలలో శుక్రవారం ఆసరా పింఛన్ లబ్ధిదారులు సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. వనపర్తి జిల్లా మదనాపురం మండలం నర్సింగాపురంలో వృద్ధుల సమక్షంలో సర్పంచ్ భాగ్యలక్ష్మమ్మ సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి చిత్రపటాలకు పంచామృతాభిషేకం నిర్వహించారు. వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా పలువురు ఎమ్మెల్యేలు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. పెద్దేముల్ మండలం గాజీపూర్‌లో ఎంపీటీసీ వెంకటేశ్‌చారి, సర్పంచ్ వీరప్ప ఆధ్వర్యంలో వృద్ధులు, వికలాంగులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

**పింఛన్లు తీసుకోండి.. మొక్కలు నాటండి**

నారాయణపేట జిల్లా మక్తల్, మాగనూరు, నర్వ మండల కేంద్రాల్లో, నారాయణపేట నియోజకవర్గంలోని ధన్వాడ, మరికల్ మండల కేంద్రాల్లో శుక్రవారం ఆసర పింఛన్ లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను మక్తల్, నారాయణపేట ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఎస్ రాజేందర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ వనజ తదితరులు పంపిణీ చేశారు. ప్రొసీడింగ్ పత్రాలతోపాటు ప్రతి లబ్ధిదారుకు మొక్కను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ హరితహారంలో భాగంగా ఇంటి ఆవరణలో, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలని సూచించారు. ఇందుకు ఆసరా పింఛన్‌దారులు చొరవ తీసుకోవాలన్నారు.



గోదావరిఖని వద్ద గోదావరిని తిలకిస్తున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

## రేపు ఖనిలో జలజాతర

- ఎమ్మెల్యే కోరుకంటి చందర్

**గోదావరిఖని, నమస్తే తెలంగాణ :** కాళేశ్వరం ప్రాజెక్టు కార్యరూపం దాల్చి గోదావరి ఎదురెక్కి గోదావరిఖని వరకు వచ్చిన సందర్భంగా ఈ నెల 28న స్థానిక సమ్మక్క-సారలమ్మ జాతర ప్రాంగణంలో 20 వేల మందితో జల జాతర నిర్వహిస్తున్నట్లు రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తెలిపారు. అక్కడే అందరితో కలిసి సామూహిక వన భోజనాలు కూడా ఉంటాయని తెలిపారు. ఈ మేరకు క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం టీఆర్‌ఎస్ నాయకులతో సమీక్షించారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## తుమ్మిళ్ల పెండింగ్ పనులను పూర్తి చేయాలి

- ఈఎన్‌సీ మురళీధర్ ఆదేశం

**రాజోళి:** తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం మొదటి దశలోని పెండింగ్ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని, నదికి వరద వచ్చేలోగా పూర్తి చేయాలని ఈఎన్‌సీ మురళీధర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాన్ని ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టుల చీఫ్ ఇంజినీర్ ఖగేందర్‌తో కలిసి పరిశీలించారు. అంతకుముందు పడమటి గార్లపాడు గ్రామంలోకి వెళ్లి అప్రోచ్ కెనాల్‌ను ఫోర్ బేకు తీసుకువచ్చే విధి విధానాలపై చర్చించారు. ఈ క్రమంలో సుంకేసుల బరాజ్, కేసీ కెనాల్‌ను పరిశీలించిన ఆయన.. ప్రస్తుతం తుమ్మిళ్లలో నది నుంచి ఉన్న అప్రోచ్ కెనాల్ సామర్థ్యాన్ని, పెండింగ్‌లో ఉన్న పనులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఎగువ నుంచి నదికి వరదలు వచ్చినా, ఆ నీటిని తీసుకుని ఆయకట్టుకు అందించేందుకు సిద్ధంగా ఉండాలని ఈఎన్‌సీ మురళీధర్ అధికారులకు సూచించారు. డీఈ శ్రీనువాసులు, ఈఈ శ్రీనివాస్, ఏఈఈలు అంజనేయులు, వరుణ్ ఉన్నారు.

## బీజేపీ ఎంపీల వ్యాఖ్యలపై అధికారుల ఆందోళన

**జగిత్యాల రూరల్ :** జగిత్యాల కలెక్టర్ శరత్ ప్రవర్తన మార్చుకోవాలని కరీంనగర్, నిజామాబాద్ ఎంపీలు బండి సంజయ్, అర్వింద్‌ల వ్యాఖ్యలను నిరసిస్తూ శుక్రవారం భోజన విరామ సమయంలో కలెక్టరేట్ ఎదుట తెలంగాణ ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు ఆందోళన నిర్వహించారు. జాతీయ, రాష్ట్రస్థాయిలో ఉత్తమ కలెక్టర్‌గా ప్రశంసలందుకున్న శరత్‌పై ఎంపీల వ్యాఖ్యలతో మనస్తాపానికి గురయ్యామనీ, వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్‌చేశారు. ఉద్యోగ సంఘాల నేతలు బోగ శశిధర్, ఎండీ వకీల్, వెంకటేశ్, గూడూరి శ్రీనివాస్ రావు, హరిఅశోక్‌కుమార్ పాల్గొన్నారు.



కోదాడలో మిషన్ భగీరథ మంచి నీటి సరఫరా శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ తదితరులు

## నెలరోజుల్లో కోదాడకు కాళేశ్వరం నీళ్లు

- మిషన్ భగీరథతో తాగు నీటి సమస్య దూరం
- విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

**కోదాడ, నమస్తే తెలంగాణ :** ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయ్యిందనీ, నెల రోజుల్లో కోదాడ నియోజకవర్గానికి గోదావరి జలాలు రాబోతున్నాయని విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కోదాడలో రూ.80 కోట్లతో చేపట్టిన శుద్ధి చేసిన కృష్ణా జలాల సరఫరాను ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 1.5 కోట్ల ఎకరాలకు సాగు నీరందించేందుకు సీఎం కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారన్నారు. శాశ్వత అవినీతి పీడను తొలగించేందుకే మున్సిపాలిటీ, పంచాయతీరాజ్ చట్టాల్లో పెనుమార్పులు తీసుకువచ్చారన్నారు. టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎర్నేని వెంకటరత్నంబాబు, మాజీ డీసీసీబీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు పాల్గొన్నారు. అనంతరం సూర్యాపేటలో కాంగ్రెస్ నాయకుడు షేక్‌జహీర్, చివ్వెంల బీజేపీ అధ్యక్షుడు ఆర్ నగేశ్ ఆధ్వర్యంలో 1400 మంది మంత్రి సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు.

**పాలిటెక్నిక్ హాస్టల్ భవనం ప్రారంభం**

**నందికొండ :** ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యాప్రమాణాల పెంపునకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నాగార్జునసాగర్ పైలాన్‌కాలనీలో రూ.3 కోట్లతో నిర్మించిన పాలిటెక్నిక్ కళాశాల హాస్టల్ భవనాన్ని ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య, ఎమ్మెల్సీ తేరా చెన్నపరెడ్డి, జెడ్పీ చైర్మన్ నరేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు.

# టెక్స్‌టైల్ పార్క్‌తో మహర్దశ

- రూ.100 కోట్లతో మౌలిక వసతులు
- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో మొక్క నాటుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

**వరంగల్ రూరల్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును దేశానికే ఆదర్శంగా నిలబెట్టాలన్న సంకల్పంతో సీఎం కేసీఆర్ ఉన్నారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. వరంగల్ రూరల్ జిల్లా పరకాల నియోజకవర్గంలో నిర్మాణమవుతున్న టెక్స్‌టైల్ పార్కు పురోగతిపై మంత్రి గురువారం పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేశ్‌రంజన్, టీఎస్ఐఐసీ ఎండీ నరసింహారెడ్డి, కలెక్టర్ హరితతో కలిసి సమీక్షించారు. ఈ పార్కులో 7వేల కోట్ల ఉత్పత్తులు తయారవుతాయని మంత్రి పేర్కొన్నారు. మూడు నెలల్లో పార్కులో మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పార్కులో దాదాపు రూ.100 కోట్లతో పనులు పూర్తి చేసి పరిశ్రమల స్థాపన జరిగితే నేరుగా లక్ష మందికి, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి లభిస్తుందని స్పష్టంచేశారు. వస్త్రపరిశ్రమ పనులు పూర్తి చేసేందుకు సీఎం కేసీఆర్, టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రత్యేక చొరవ చూపుతున్నారన్నారు. పార్క్‌కు అవసరమైన నీటిని శాయంపేట మండలంలోని చలివాగు ప్రాజెక్టు నుంచి దేవాదులనీటిని మళ్లించాలని దీనికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. ఈ పార్కులో 15 సంస్థలు పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకువచ్చాయని పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేశ్‌రంజన్ అన్నారు. అనంతరం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అధికారులతో కలిసి మొక్కలు నాటారు.

**రూ.300 కోట్లతో ఫార్మసీ కంపెనీ**

**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి :** మహబూబాబాద్ జిల్లాకేంద్రంలో త్వరలోనే రూ.300 కోట్లతో ఫార్మసీ కంపెనీ స్థాపించబోతున్నట్టు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌తో కలిసి మంత్రి మీడియాతో మాట్లాడారు. మహబూబాబాద్‌లో పండించే మిర్చి క్యాన్సర్ వ్యాధికి సంబంధించిన మెడిసిన్ తయారీలో వాడుతున్నారన్నారు. దేశంలో మూడు ప్రాంతాలను పరిశీలించిన ఆ సంస్థ ప్రతినిధులు మహబూబాబాద్‌లో ఫార్మసీ కంపెనీ స్థాపించడానికి ముందుకు వచ్చారన్నారు. ఇటీవల సీఎం కేసీఆర్‌ను కలిసి కంపెనీ ప్రతినిధులు మహబూబాబాద్‌లో ఫార్మసీ కంపెనీని స్థాపిస్తామని తెలిపారని వివరించారు.



నిజామాబాద్‌లో డీసీసీబీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, డీసీసీబీ చైర్మన్ గంగాధర్‌రావుపట్వారీ

## సహకార బ్యాంకు సేవలు విస్తరించాలి

- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

**నిజామాబాద్ సిటీ:** సహకార బ్యాంకుల సేవలు మరింత విస్తరించాలని రవాణాశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం జిల్లా సహకార బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. వ్యవసాయ సహకార బ్యాంకులు రైతులకు లాభాపేక్ష లేకుండా సేవలందిస్తున్నాయన్నారు. తన తండ్రి, దివంగత వేముల సురేందర్‌రెడ్డి ద్వారా సహకార సంఘం సేవల గురించి తనకు అవగాహన, అనుబంధం ఉందన్నారు. జిల్లాలో 142 సొసైటీలు 63 బ్యాంకు శాఖలతో నిజామాబాద్ జిల్లా సహకార బ్యాంకు పటిష్టంగా ఉందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు తొలి ఫలాలు నిజామాబాద్ జిల్లాకు అందనున్నాయనీ, ఎస్సారెస్పీలోకి 30 టీఎంసీల నీటిని ఈ సీజన్‌లో రివర్స్ పంపింగ్ ద్వారా నింపే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, కలెక్టర్ రామ్మోహన్‌రావు, జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, డీసీసీబీ చైర్మన్ గంగాధర్‌రావు పట్వారీ పాల్గొన్నారు.

## మద్యానికి బానిసై తల్లిని చంపిన తనయుడు

**ఎడపల్లి:** మద్యానికి బానిసైన ఓ కొడుకు తల్లిని హత్య చేసిన ఘటన నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం మంగల్‌పాడ్‌లో గురువారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గంగాధర్ అనే యువకుడు కొంతకాలంగా మద్యానికి బానిసై జులాయిగా తిరుగుతున్నాడు. నిత్యం తాగి వచ్చి భార్య, తల్లితో గొడవ పడేవాడు. గురువారం రాత్రి సైతం తాగి వచ్చి భార్య కళావతి, తల్లి చిన్నమ్మ(70)తో గొడవకు దిగాడు. అనంతరం భార్యను కొట్టాడు. అడ్డువచ్చిన తల్లిని కూడా విచక్షణారహితంగా కొట్టాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునే లోపే చిన్నమ్మ మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నల్లగొండలో యువకుడి దారుణహత్య

**నీలగిరి:** నల్లగొండలోని ఓ మద్యం దుకాణంలో పనిచేస్తున్న యువకుడు గురువారం రాత్రి దారుణ హత్యకు గురయ్యాడు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటకుచెందిన సాల్వేర్ సుభాష్‌బోస్(30), శంకర్‌రెడ్డి అనే ఇద్దరు కొన్నాళ్లుగా నల్లగొండలోని ఓ మద్యం దుకాణం పర్మిట్‌రూమ్‌లో పని చేస్తున్నారు. గురువారం రాత్రి పని పూర్తయిన తర్వాత రెడ్డిహాస్టల్ సమీపంలోని శ్మశాన వాటికలో శంకర్‌రెడ్డి, సుభాష్‌బోస్ మద్యం తాగారు. శుక్రవారం ఉదయం అటుగా వెళ్లిన శ్మశానవాటిక వాచ్‌మన్‌కు మృతదేహం కన్పించడంతో పోలీసులకు సమాచారమిచ్చాడు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు సుభాష్‌బోస్‌ను బండరాయితో కొట్టి చంపినట్టు అనుమానాలు వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసి శంకర్‌రెడ్డితోపాటు మరికొంతమందిని అరెస్టు చేసి విచారిస్తున్నట్టు తెలిపారు.





వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని శుక్రవారం మంత్రి కొప్పుల ఈశ్వర్, సిద్దిపేట, దుబ్బాక, పాలేరు, పరిగి, వికారాబాద్ ఎమ్మెల్యేలు తన్నీరు హరీశ్‌రావు, సోలిపేట రామలింగారెడ్డి, కందాళ ఉపేందర్‌రెడ్డి, కొప్పుల మహేశ్‌రెడ్డి, మెతుకు ఆనంద్‌లు పరామర్శించారు. మంత్రి నిరంజన్‌రెడ్డి తల్లి తారకమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- వనపర్తి, నమస్తే తెలంగాణ

## వెంటాడిన మృత్యువు

- రెండునెలల క్రితం మృత్యుంజయుడు
- తాజాగా రైలు ఢీకొని రాజమొగిలి మృతి

**జమ్మికుంట రూరల్:** కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం మడిపల్లికి చెందిన వజ్ర రాజమొగిలిని మృత్యువు వెంటాడింది. దాదాపు రెండు నెలల క్రితం వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొని బైక్‌తో సహా బావిలో పడి, 36గంటలు నరకయాతన అనుభవించి తప్పించుకున్నా.. శుక్రవారం అనుకోని రీతిలో రైలు ఢీకొని ప్రాణాలు కోల్పోయాడు. ఆరె కుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా, టీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడిగా, మంత్రి ఈటల రాజేందర్ ముఖ్య అనుచరుడిగా ఉన్న రాజమొగిలి మృతితో స్వగ్రామం మడిపల్లి విషాదంలో మునిగింది. గ్రామానికి వజ్ర రాజమొగిలి బంధువుల శుభకార్యం కోసం హన్మకొండకు వెళ్లి జూన్ ఒకటి తెల్లవారుజామున నాలుగు గంటలకు తన బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. వరంగల్ అర్బన్ జిల్లా హసన్‌పర్తి మండలం నాగారం సబ్‌స్టేషన్ వద్ద వెనుకనుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో బైక్‌తో సహా రోడ్డు పక్కన ఉన్న వ్యవసాయ బావిలో పడిపోయాడు. ఈత వచ్చిన మొగిలి ఐదు మీటర్ల మేర నీరున్న ఆ బావిలో పైపును పట్టుకొని బిక్కుబిక్కుమంటూ అలాగే ఉండిపోయాడు. మరుసటి రోజు ఉదయం సదరు బావి యజమాని కరెంట్ మోటర్ పెట్టేందుకు బావి దగ్గరకి రాగా, నీటిలో పైపును పట్టుకుని కొట్టుమిట్టాడుతున్న రాజమొగిలిని గమనించాడు. వెంటనే చుట్టుపక్కల వారికి సమాచారమిచ్చి తాళ్ల సహాయంతో బయటకుతీసి, కుటుంబ సభ్యులకు తెలియజేశారు. దాదాపు 30 గంటలు నీటిలో మృత్యువుతో పోరాడి ప్రాణాలతో బయటపడ్డాడు. కానీ, శుక్రవారం మరో ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. వ్యాపార రీత్యా మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం మాదారంలోని అడ్తీదారును కలిసేందుకు తన గుమస్తా శ్రీనివాస్‌తో శుక్రవారం ఉదయం ఇంటర్‌సిటీ రైలులో వెళ్లాడు. రేచిన్‌రోడ్ రైల్వే స్టేషన్‌లో దిగి ప్లాట్‌ఫాం దాటుతుండగా ఎదురుగా వస్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని, అక్కడికక్కడే మృతిచెందాడు. నాడు బావిలో 36గంటల పాటు పోరాడి మృత్యువును జయించిన రాజమొగిలి రైలు ప్రమాదంలో ఓడిపోయాడు.



రెండునెలల క్రితం బావిలోనుంచి తాళ్ల సాయంతో పైకి వస్తున్న రాజమొగిలి(ఫైల్), ఇన్‌సెట్లో రాజమొగిలి

## ఏసీబీకి చిక్కిన ఐబీ డీఈఈ



లంచం డబ్బులతో డీఈఈ రవికాంత్, కారు డ్రైవర్ బోనగిరి రాజు

**కలెక్టరేట్:** మిషన్ కాకతీయ పనులకు సంబంధించిన బిల్లు చెల్లింపు కోసం లంచం తీసుకొంటూ ఐబీ డీఈఈ రవికాంత్ ఏసీబీ అధికారులకు చిక్కాడు. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం ఇందుర్తికి చెందిన కావేటి రాజు మిషన్ కాకతీయ పథకంలో చేసిన పనులకు సంబంధించి బిల్లుల కోసం కొద్దిరోజులుగా ఇంజినీరింగ్ అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. రూ.40 లక్షలకుపైగా బిల్లులు రావాల్సి ఉండటంతో అందుకు ఎంబీ రికార్డులు చేసిన ఏఈ చెక్‌మెజర్ కోసం డీఈఈ వద్దకు పంపించాడు. బిల్లుల చెల్లించాలంటే రూ.లక్ష లంచంగా ఇస్తేనే పని పూర్తి చేస్తామని సంబంధిత కాంట్రాక్టర్‌కు డీఈఈ రవికాంత్ తేల్చి చెప్పాడు. రూ. 80 వేలు ఇచ్చేందుకు బాధితుడు అంగీకరించాడు. శుక్రవారం పెద్దకల్వల ఎస్సారెస్పీ క్యాంపు ఆవరణలో డీఈఈ కార్యాలయంలో ఉన్న డీఈఈ రవికాంత్‌కు రూ. 80 వేలు లంచం ఇస్తుండగా అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రవికాంత్‌తోపాటు అతని కారు డ్రైవర్ బోనగిరి రాజును కూడా అరెస్టు చేసి శనివారం ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్టు తెలిపారు.

**తాసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు**

**వేంసూరు :** ఖమ్మం జిల్లా వేంసూరు తాసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఏసీబీ డీఎస్పీ ప్రతాప్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. కార్యాలయం అధికారులు, సిబ్బందిపై ఆరోపణలు రావడంతో తనిఖీలు నిర్వహించారు.

## చెట్టుపైనుంచి పడి గీత కార్మికుడి మృతి

**ఇల్లంతకుంట :** తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి చెందిన ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంటలో శుక్రవారం చోటుచేసుకుంది. ఇల్లంతకుంటకు చెందిన బండారి శ్రీనివాస్ (38) రోజువారిగానే శుక్రవారం ఉదయం కల్లు గీసేందుకు వెళ్లాడు. తాటి చెట్టు ఎక్కిన తరువాత మోకు పట్టు తప్పి కింద పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.



మెట్రో వాటర్‌బోర్డు యూనియన్ అధ్యక్షునిగా ఎన్నికైన రాంబాబుయాదవ్ శుక్రవారం తెలంగాణభవన్‌లో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న దృశ్యం



నీరా చట్టాన్ని అమలుచేయాలని కోరుతూ శుక్రవారం తెలంగాణభవన్‌లో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు వినతిపత్రం అందజేసిన తెలంగాణ గౌడ సంఘం అధ్యక్షుడు నారాయణగౌడ్

# తెలంగాణలో నీరా చట్టం

ముఖ్యమంత్రి కేసీఆర్ యోచన.. త్వరలో హైదరాబాద్‌లో మూడు యూనిట్లు

గౌడ ఐక్యసాధన సమితి నేతలతో కేటీఆర్

7 కోట్ల బకాయిల రద్దు హర్షణీయం.. సీఎంకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కృతజ్ఞతలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో నీరా చట్టాన్ని తీసుకురావాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు యోచిస్తున్నట్లు టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు వెల్లడించారు. గౌడ ఐక్య సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంబాల నారాయణ నేతృత్వంలో సంఘం ప్రతినిధులు రామరాజు గౌడ్, జగన్, మద్దెల రమేశ్‌బాబు, మహేశ్ గౌడ్, భిక్షపతిగౌడ్ తదితరులు శుక్రవారం కేటీఆర్‌తో సమావేశమై రాష్ట్రంలో నీరా యూనిట్ల ఏర్పాటుపై వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన కేటీఆర్.. రాష్ట్రంలో నీరా చట్టం అమలుకు సీఎం కేసీఆర్ సానుకూలంగా ఉన్నారని, త్వరలో హైదరాబాద్‌లో 3 నీరా యూనిట్లు ఏర్పాటుచేయనున్నట్టు తెలిపారు.

**బకాయిల రద్దు హర్షణీయం: శ్రీనివాస్‌గౌడ్**

గౌడ వృత్తిదారుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని రూ.7,98,99,372 పాత బకాయిలను ప్రభుత్వం రద్దుచేయడంపై ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రాష్ట్ర ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్‌శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. దీనితో 2.20 లక్షలమంది గీత వృత్తిదారులకు లబ్ధి చేకూరుతుందని చెప్పారు. శుక్రవారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, గీత కార్మికుల సహకార సంఘం ఆధ్వర్యంలో 4,342 టాడీ షాప్స్, టీసీఎస్/టీఎఫ్‌టీల ఆధ్వర్యంలో 3688 లబ్ధిదారులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. గతంలో గౌడ కులస్థులు తాటిచెట్లు ఎక్కే క్రమంలో ప్రమాదవశాత్తు మరణిస్తే ప్రభుత్వం రెండు లక్షల నష్టపరిహారం చెల్లించేదని, తెలంగాణ ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ఆదేశాలమేరకు ఇప్పుడు రూ.5 లక్షలు ఇస్తున్నట్లు తెలిపారు. శాశ్వత అంగవైకల్యం పొందిన గీత కార్మికులకు పరిహారాన్ని 50 వేల నుంచి ఐదు లక్షలకు పెంచారని చెప్పారు. లెసెన్సుల రెన్యువల్‌ను 5 నుంచి 10 ఏండ్లకు పెంచారన్నారు. రూ.16 కోట్ల పన్ను రద్దుచేసి గీత కార్మికులను ఆదుకున్నామని చెప్పారు. గీత కార్మికులకు లబ్ధి చేకూర్చే ఉద్దేశంతో జీహెచ్‌ఎంసీ పరిధిలో మూసివేసిన 85 కల్లు దుకాణాలకు తిరిగి అనుమతి ఇవ్వడంతో 2963 మంది గీత కార్మికులకు లబ్ధి చేకూరిందన్నారు. హరితహారం కింద 2.54 కోట్ల తాటి, ఈత, ఖర్జూర మొక్కలు నాటినట్టు తెలిపారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ పాల్గొన్నారు.



శుక్రవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ కూడా ఉన్నారు

**కల్లు దుకాణాల పన్ను రద్దుపై హర్షం..**

గౌడ కులస్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కల్లు దుకాణాలపై ఉన్న పన్ను రూ.7.98 కోట్లను రద్దుచేస్తూ ప్రభుత్వం జీవో జారీచేయడంపై టీఎస్‌ఎఫ్‌సీ చైర్మన్ రాజేశంగౌడ్, మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణగౌడ్, గౌడ సంక్షేమ సంఘం యువజన అధ్యక్షుడు కుంభం సతీశ్‌గౌడ్ హర్షం వ్యక్తంచేశారు. సీఎం కేసీఆర్, టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# సీఎం కేసీఆర్‌కు సాటిలేరెవరు

హోంమంత్రి మహమూద్‌అలీ

శంషాబాద్‌లో హజ్ యాత్రికులకు ఘన వీడ్కోలు

**శంషాబాద్:** మత సామరస్యంలో సీఎం కేసీఆర్‌కు దేశంలో మరే ముఖ్యమంత్రీ సాటిరారని హోంమంత్రి మహమూద్‌అలీ ప్రశంసించారు. హజ్ యాత్రికుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని సదుపాయాలును కల్పిస్తున్నదని చెప్పారు. శుక్రవారం రాత్రి తెలంగాణ హజ్ కమిటీ హజ్ ఆపరేషన్స్ -2019.. హైదరాబాద్ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టులోని హజ్ టర్మినల్‌లో హజ్ యాత్రికుల మొదటి విమాన ప్రయాణాన్ని కమిటీ అధికార ప్రతినిధులతో కలిసి ఆయన జెండాఊపి ప్రారంభించారు. రెండు ఎయిర్‌ఇండియా విమానాలు 776 మంది యాత్రికులతో బయల్దేరాయి. వారికి మహమూద్‌అలితోపాటు హజ్ కమిటీ అధికార ప్రతినిధులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ హజ్‌యాత్రను విజయవతంగా పూర్తి చేసుకొని సురక్షితంగా చేరుకోవాలని ఆకాంక్షించారు. హజ్ యాత్రికులకు వసతులు కల్పిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హజ్ కమిటీ ప్రతినిధులు మసిఉల్లా, షఫిఉల్లా, సలీం తదితరులు పాల్గొన్నారు.



శంషాబాద్ ఎయిర్‌పోర్టులోని హజ్ టర్మినల్‌లో మొదటి విమాన ప్రయాణాన్ని ప్రారంభిస్తున్న హోంమంత్రి మహమూద్ అలీ

# అట్రాసిటీ కేసుల్లో అలసత్వం తగదు

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తులో అలసత్వం తగదని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా తాను బాధ్యతలు చేపట్టాక కమిషన్ దృష్టికి వచ్చిన 6వేల కేసుల్లో 5వేల కేసుల బాధితులకు న్యాయం చేసి రూ.33 కోట్లకు పైగా సాయం అందించామన్నారు. కేసుల దర్యాప్తులో జాప్యం చేసినందుకు మాదాపూర్ ఏసీపీ శ్యాంప్రసాద్ శుక్రవారం కమిషన్ ఎదుట హాజరయ్యారు.

# తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడైనా రేషన్

ఒకే దేశం- ఒకే కార్డు' ప్రయోగం సక్సెస్

హైదరాబాద్‌లో ఏపీ లబ్ధిదారులకు రేషన్

ఆగస్టు 1 నుంచి 4 రాష్ట్రాల్లో ప్రయోగాత్మకంగా

నేషనల్ పోర్టబిలిటీకి ఆదర్శంగా తెలంగాణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ స్ఫూర్తితో దేశంలో ఎక్కడైనా రేషన్ పొందేలా కేంద్రం ప్రభుత్వం అమలులోకి తీసుకురానున్న 'ఒకే దేశం- ఒకే కార్డు' తొలి ప్రయోగం విజయవంతమయింది. వచ్చేఏడాది జూన్‌లోగా దేశవ్యాప్తంగా నేషనల్ పోర్టబిలిటీని అమలు చేయనున్న కేంద్రప్రభుత్వం.. ఆగస్టు 1నుంచి నాలుగు రాష్ట్రాల్లో ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని అమల్లోకి తీసుకురానున్నది. తెలంగాణ – ఆంధ్రప్రదేశ్‌ను ఒక క్లస్టర్‌గా, గుజరాత్–మహారాష్ట్రను ఒక క్లస్టర్‌గా ఏర్పాటుచేసి అమలుచేయనున్నది. ఇందులోభాగంగా గురువారం హైదరాబాద్ పంజాగుట్టలోని ఒక రేషన్‌షాపులో దేశంలోనే మొదటిసారిగా నిర్వహించిన ట్రయల్‌రన్ విజయవంతమయింది. ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన ఈశ్వర్‌రావు, విశాఖపట్నం జిల్లా యలమంచలికి చెందిన అప్పారావు పంజాగుట్టలోని రేషన్ దుకాణం నుంచి సరుకులు తీసుకున్నారు. పోర్టబిలిటీ ట్రయల్‌రన్ విజయవంతం కావటంపై పౌరసరఫరాలశాఖ కమిషనర్ అకున్ సబర్వాల్ హర్షం వ్యక్తంచేశారు. సాంకేతిక సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

**దేశంలోనే తొలిసారి తెలంగాణలో..**

ఇతర ప్రాంతాలకు వలసవెళ్లిన పేదలు రేషన్ పొందలేక ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ సరుకులు తీసుకునేలా తెలంగాణ ప్రభుత్వం పోర్టబిలిటీ విధానాన్ని తీసుకొచ్చింది. రాష్ట్రంలో ప్రజాపంపిణీ ద్వారా ప్రయెజనం పొందుతున్న 2.82 కోట్ల లబ్ధిదారులు ఏ రేషన్‌షాపు నుంచైనా సరుకులు తీసుకునేలా ఈ విధానాన్ని గతేడాది ఏప్రిల్ 1న అమల్లోకి తెచ్చింది. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇప్పటివరకు 2.07 కోట్ల మంది ఈ విధానంలో సరుకులు పొందారు. ఇందులో అత్యధికంగా హైదరాబాద్ జిల్లాలో 42 లక్షలు, మేడ్చల్‌లో 29 లక్షలు, రంగారెడ్డిలో 18 లక్షలు, నిజామాబాద్‌లో 10 లక్షలు, వరంగల్‌లో 9 లక్షల మంది లబ్ధిదారులు పోర్టబిలిటీ ద్వారా సరుకులు తీసుకున్నారు. జీవనోపాధి కోసం గ్రామాల నుంచి పట్టణ ప్రాంతాలకు వచ్చినవారికి ఈ విధానం ఎంతోమేలు చేస్తున్నది.



పంజాగుట్ట రేషన్ షాపులో సరుకులు తీసుకుంటున్న ఆంధ్రప్రదేశ్ రేషన్‌కార్డుదారులు

**వచ్చే జూన్ నుంచి దేశవ్యాప్తంగా అమలు..**

తెలంగాణలో విజయవంతమైన రేషన్ పోర్టబిలిటీ విధానాన్ని వచ్చే ఏడాది జూన్ నుంచి దేశవ్యాప్తంగా అమలుచేయాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం మార్గదర్శకాలను జారీచేసింది. దీనిప్రకారం కేంద్ర ఆహార భద్రత పరిధిలో ఉన్న లబ్ధిదారులకు మాత్రమే ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుంది. లబ్ధిదారుడి ఆధార్‌నంబర్ రేషన్‌కార్డుతో సీడింగ్ అయిఉండాలి. తెలంగాణ, ఏపీ రాష్ట్రాలను ఒక క్లస్టర్‌గా, గుజరాత్, మహారాష్ట్రలను రెండవ క్లస్టర్‌గా ఏర్పాటుచేసింది. క్లస్టర్‌లో ఉన్న లబ్ధిదారులు ఆ రెండురాష్ట్రాల్లో ఎక్కడి నుంచైనా రేషన్ సరుకులు తీసుకోవచ్చు. ఆహార భద్రతాచట్టం కింద కేంద్రప్రభుత్వం గుర్తించిన లబ్ధిదారులు మాత్రమే ఈ పోర్టబిలిటీ విధానం ద్వారా సరుకులు తీసుకునే అవకాశం కల్పించింది. దీనిప్రకారం తెలంగాణలో 56 లక్షల మంది లబ్ధిదారులు ఈ సౌకర్యాన్ని పొందనున్నారు. బియ్యం, గోధుమలు, చిరుధాన్యాలను కేంద్రప్రభుత్వం నిర్దేశించిన మొత్తంలో, నిర్ణయించిన ధరల ప్రకారం, లబ్ధిదారులకు సరఫరా చేస్తారు. ఒక్కరికి కిలో బియ్యం రూ. 3 చొప్పున ఐదు కిలోలు, గోధుమలు కిలో రూ.2కు పంపిణీ చేయనున్నది. ప్రజాపంపిణీ వ్యవస్థ సమగ్ర నిర్వహణ పథకాన్ని పర్యవేక్షించడానికి ప్రధానకార్యదర్శి చైర్మన్‌గా రాష్ట్ర అపెక్స్ కమిటీ, పౌరసరఫరాలశాఖ కమిషనర్ చైర్మన్‌గా రాష్ట్ర ప్రాజెక్టు ఈ – మిషన్ బృందాన్ని కేంద్రప్రభుత్వం ఏర్పాటుచేసింది.

# అంబేద్కర్ ఓవర్సీస్ పథకానికి విద్యార్థుల ఎంపిక

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద విదేశాల్లో ఉన్నత విద్యాభ్యాసానికి దరఖాస్తు చేసుకొన్న గిరిజన విద్యార్థుల ఎంపిక ప్రక్రియను ప్రారంభమైంది. శుక్రవారం సచివాలయంలో గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి బెనహర్ మహేశ్‌దత్ ఎక్కా ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ విద్యా సంవత్సరానికి మొత్తం 26 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. 25 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు. ఈ పథకం కింద రూ.20 లక్షల ఆర్థిక సాయాన్ని అందించేందుకు వీరిలో నుంచి 9 మందిని ఎంపికచేశారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ క్రిస్టినా ఝడ్ చోంగ్తూ, జేఎన్టీయూహెచ్ ప్రొఫెసర్ ఆంజనేయప్రసాద్, ఉన్నత విద్యామండలి కార్యదర్శి శ్రీనివాసరావు, ఎస్సీ అభివృద్ధిశాఖ డీడీ శ్రీనివాస్‌రెడ్డి, గిరిజన సంక్షేమశాఖ జేడీ నవీన్‌నికోలస్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన సంక్షేమ నివేదిక ఆవిష్కరణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ద్వారా 2018–19 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాలు, వాటి అమలుతీరు, ఆదాయం, ఖర్చుల వివరాలతో గిరిజన సాధికారికత పేరిట రూపొందించిన నివేదికను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఆవిష్కరించారు. శుక్రవారం సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటకశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి బెనహర్ మహేశ్‌దత్ ఎక్కా, కమిషనర్ క్రిస్టినా ఝడ్ చోంగ్తూ తదితర అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్రానికి 14 ఫుడ్ ప్రాసెసింగ్ ప్రాజెక్టులు

మంజూరుచేశామన్న కేంద్రమంత్రి హర్‌సిమ్రత్ కౌర్ బాదల్

రాజ్యసభ క్వశ్చన్‌అవర్‌లో టీఆర్‌ఎస్ ఎంపీ కేకే ప్రశ్నకు సమాధానం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణకు కేంద్రం ఇప్పటివరకు 14 ఫుడ్ ప్రాసెసింగ్ ప్రాజెక్టులను మంజూరు చేసిందని ఫుడ్ ప్రాసెసింగ్‌శాఖ మంత్రి హర్‌సిమ్రత్ కౌర్ బాదల్ తెలిపారు. ఇందులో రెండు మెగా ఫుడ్ పార్కులు కూడా ఉన్నాయని శుక్రవారం రాజ్యసభ క్వశ్చన్‌అవర్‌లో టీఆర్‌ఎస్ పక్షనేత కే కేశవరావు అడిగిన ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు. రాష్ట్రం చేసిన ప్రతిపాదనలేవీ పెండింగ్‌లో లేవని స్పష్టంచేశారు. 'తెలంగాణకు మేం 14 ప్రాజెక్టులను మంజూరు చేశాం. ఇందుకోసం రూ.187.4 కోట్ల సాయాన్ని అందించేందుకు కేంద్రం ఆమోదం తెలుపగా, ఇప్పటివరకు దశలవారీగా రూ. 93.28 కోట్లను మంజూరుచేసింది. మౌలిక సదుపాయాలు పూర్తయ్యేకొద్దీ నిధులు విడుదలవుతాయి. ఇవన్నీ ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులు' అని హర్‌సిమ్రత్ కౌర్ బాదల్ చెప్పారు. ఈ ప్రాజెక్టులకు ప్రధాన్‌మంత్రి సంపద యోజన కింద నిధులు ఇస్తున్నామని తెలిపారు. ఇక్కడ ఎలాంటి పెండింగ్ ప్రాజెక్టులు లేవని, మార్గదర్శకాల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తాను మూడు (ఫుడ్) పార్కులు అడిగాననీ, కానీ వాటిని ఇవ్వలేదని ఎంపీ కేకే పేర్కొన్నారు. దీనికి మంత్రి స్పందిస్తూ అలా అనడం సరికాదని, మార్గదర్శకాల ప్రకారం ప్రతిపాదనలు లేకపోతే తిరస్కరిస్తారని చెప్పారు. ప్రతిపాదనలను టెక్నికల్ కమిటీ అంచనావేసి ఆమోదిస్తుందని, టీఆర్‌ఎస్ నాయకులు మరోసారి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మెగా ఫుడ్ పార్కులను ఖమ్మం, మేడ్చల్ జిల్లాల్లో ఏర్పాటుచేయనున్నట్టు చెప్పారు.





రాజ్యసభ క్వశ్చన్ అవర్‌లో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి హర్‌సిమ్రత్‌కౌర్ బాదల్, టీఆర్‌ఎస్ రాజ్యసభాపక్ష నేత కే కేశవరావు

# సిరుల గని.. సింగరేణి

2018-19లో రూ.1,766 కోట్ల నికర లాభం

ఐదేండ్లలో 322 శాతం పెరిగిన లాభాల వృద్ధి

550వ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో సీఎండీ శ్రీధర్ వెల్లడి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ కొంగు బంగారం సింగరేణి.. సిరుల పంటగా మారింది. గడిచిన ఐదేండ్లుగా నిర్దిష్టమైన లక్ష్యాలను చేరుకొంటూ సింగరేణి కార్మికులు లాభాల పంటను పండిస్తున్నారు. 2018–19 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.1,766 కోట్ల నికర లాభాలను ఆర్జించింది. ఈ వివరాలను శుక్రవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో జరిగిన 550వ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో సంస్థ సీఎండీ ఎన్ శ్రీధర్ ప్రకటించారు. లాభాల్లో గత ఏడాదికన్నా 50 శాతం వృద్ధి సాధించడంపై సమావేశం హర్షం ప్రకటించింది. సింగరేణి రథసారథి, సీఎండీ ఎన్ శ్రీధర్‌ను అభినందిస్తూ తీర్మానం చేసింది. గత ఏడాది రికార్డు స్థాయిలో 644 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 677 లక్షల టన్నుల బొగ్గు రవాణా సాధించి రూ.25,828 కోట్ల అమ్మకాలు జరిపింది. దీంతో సంస్థ రూ.1,766 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. ఇది అంతకుముందు ఏడాది (2017–18) సాధించిన రూ.1,177 కోట్ల నికర లాభం కన్నా 50 శాతం అధికం.

**ఐదేండ్లలో 322 శాతం లాభాల వృద్ధి**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తరువాత సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తి, రవాణా, అమ్మకాలు, లాభాల్లో అద్భుతంగా పురోగమిస్తున్నది. తెలంగాణ రాకముందు అంటే.. 2013–14 ఆర్థిక సంవత్సరంలో రూ.418.74 కోట్ల లాభాలను ఆర్జించిన కంపెనీ.. ఐదేండ్ల కాలంలో 2018–19 నాటికి రూ.1,766 కోట్ల నికర లాభాలను ఆర్జించి అభివృద్ధి దిశగా ప్రస్థానం సాగిస్తున్నది. గడిచిన ఐదేండ్లలో సింగరేణి సంస్థ నికర లాభాల్లో సాధించిన వృద్ధి 322 శాతం. దేశంలోని ఏ ప్రభుత్వ రంగ సంస్థగానీ మహారత్న కంపెనీగానీ ఐదేండ్లలో ఈ స్థాయిలో లాభాలను సాధించలేదు. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు దిశానిర్దేశంలో సీఎండీ ఎన్ శ్రీధర్ తీసుకొంటున్న చర్యలు, చేపట్టిన సంస్కరణలు, రోజువారీ సమీక్షలకు తోడు కార్మికులు పట్టుదలతో శ్రమించడంతో ఈ అనూహ్య విజయం సాధ్యమయ్యింది.



**బోనస్‌పై త్వరలో సీఎంకు వినతి**

నికర లాభాలను సింగరేణి బోర్డు ఆమోదించిన నేపథ్యంలో కార్మికులకు చెల్లించే లాభాల వాటాపై త్వరలోనే సీఎం కేసీఆర్‌ను కలిసి నివేదించనున్నట్టు, త్వరలోనే బోనస్‌ను కార్మికులు అందుకొనేలా ముఖ్యమంత్రికి విజ్ఞప్తిచేయనున్నట్టు సీఎండీ ఎన్ శ్రీధర్ తెలిపారు. సంస్థ అభివృద్ధికి అడుగడుగునా సహకరిస్తున్న సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కొత్త గనులు, ఓబీ పనుల అనుమతులు తదితర విషయాలపై చర్చించి నిర్ణయాలు తీసుకొన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి కే రామకృష్ణారావు, కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ డిప్యూటీ సెక్రటరీ పీఎస్ఎల్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో పరిశుభ్రత పాటించండి

డీఈవోలను ఆదేశించిన విద్యాశాఖ కార్యదర్శి, పాఠశాల విద్యాశాఖ కమిషనర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) పరిశుభ్రత పాటించాలని విద్యాశాఖ కార్యదర్శి బీ జనార్దన్‌రెడ్డి, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ టీ విజయ్‌కుమార్ జిల్లా విద్యాధికారులను ఆదేశించారు. కేజీబీవీల్లో పనిచేస్తున్న ప్రత్యేక అధికారులు బాలికలకు శానిటరీ నాప్‌కిన్ల వినియోగం.. మరుగుదొడ్ల వాడకంపై అవగాహన కల్పించాలని శుక్రవారం ఓ ప్రకటనలలో సూచించారు. పాఠశాల గోడలు, మరుగుదొడ్ల లోపటి గోడలపై దీనికి సంబంధించిన సూచనలు రాయాలని ఆదేశించారు. విద్యార్థినులు చేతులు కడుక్కోవడానికి సబ్బు, నీళ్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

# సీఎన్జీ వాహనాలతో కాలుష్య నివారణ

నేషనల్ పర్మిట్‌కు కేంద్ర ఆమోదం.. లైసెన్స్ మంజూరుకు విద్యార్హత అవసరం లేదు

ఇకనుంచి ఆన్‌లైన్‌లోనే వాహన రిజిస్ట్రేషన్లు

'ప్రవాస్-2019' సదస్సులో కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్‌గడ్కరీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సీఎన్జీ వాహనాల వాడకంతో వాయు కాలుష్యం నివారణ సాధ్యమని కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్‌గడ్కరీ అన్నారు. ముంబైలోని సిడ్‌కో ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహిస్తున్న 'ప్రవాస్–2019 ప్యాసెంజర్స్ మొబిలిటీ' సదస్సులో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. నేషనల్ పర్మిట్ స్కీముకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, త్వరలోనే అమలు చేయనున్నామని తెలిపారు. నేషనల్ పర్మిట్ అనేది కేవలం ట్రక్కులకు మాత్రమే కాదు బస్సులకూ వర్తిస్తుందని తెలిపారు. నేషనల్ పర్మిట్ ద్వారా వచ్చే ఆదాయాన్ని రాష్ట్రాలకే ఇవ్వనున్నామని ప్రకటించారు. దేశవ్యాప్తంగా 25 లక్షల మంది డ్రైవర్ల కొరత ఉందని, అందుకే విద్యార్హత లేకున్నా అత్యుత్తమ ప్రతిభ ఉన్నవారికి లైసెన్స్ మంజూరు చేసే చట్టాన్ని రూపొందించామని తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం వాహనాన్ని ఆర్టీవో పరిశీలించాల్సిన అవసరం లేదని, ఆన్‌లైన్‌లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఎక్స్‌ప్రెస్ హైవేలపై విద్యుత్ ప్రసారం ద్వారానే వాహనాలు ప్రయాణిస్తాయని, దీని ద్వారా ఇంధన ఖర్చు గణనీయంగా తగ్గుతుందని పేర్కొన్నారు. ఎలక్ట్రికల్ బస్సులు, కార్లు, ఆటోలు, టాక్సీలకు పర్మిట్ అవసరం లేదన్నారు. ఈ సందర్భంగా పలువురికి ప్రవాస్ ఎక్సలెన్స్ అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కేరళ రవాణాశాఖ మంత్రి శశీంద్రన్, ఎమ్మెల్యే ప్రశాంత్‌ఠాకూర్, బొకి అధ్యక్షుడు ప్రసన్న పట్వర్ధన్ పాల్గొన్నారు.

**ePROCUREMENT SHORT TENDER NOTICE NO. 1/2019-20, DATE: 16.07.2019 (EXTENSION-1)**

The e-tenders for supply of various materials (i.e. Spec 1 to 5) extended up to @ 1.00 pm on 02-08-2019. Tenders opening starts @ 2.30 pm on 02.08.2019. Contact: 94408-14060/14061. email: cesssirsilla@gmail.com Sd/- **Managing Director (FAC)**

తెలంగాణ ప్రభుత్వం
పంచాయతీ రాజ్ శాఖ, నల్గొండ

e-proc. Notice No. PR/06 to 10/2019-20, **ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన** తేది: 19-07-2019

**పని పేరు:** PR రీజియన్, నల్గొండలో సార్ల మైసమ్మ దేవాలయం, అల్లాపూర్ (గ్రా) వద్ద షెడ్ నిర్మాణం, షీప్ మార్కెట్ యార్డ్ నిర్మాణం, ఆశ్రమ్ పాఠశాలలకు అదనపు తరగతి గదుల నిర్మాణం మొ|| పనులు. మొత్తం ECV: రూ. 140.00 లక్షలు. టెండర్లు డౌన్‌లోడ్ ప్రారంభ & ముగింపు తేదీ: 30-07-2019 నుండి 06-08-2019 వరకు. ఇ-మెయిల్: seprnlgd@gmail.com. తదుపరి వివరాల కొరకు www.eprocurement.gov.in దర్శించండి.

DIPR RO.No. 741-DP/CL/ADVT/1/2019-20, Dt: 26-07-2019 సం/- **రీజినల్ ఆఫీసర్, రీజినల్ ఆఫీస్, PR నల్గొండ**

తెలంగాణ ప్రభుత్వం
వైద్య విద్యా శాఖ
టెండరు ప్రకటన

**1) Rc No. CS-1/SPL/2019** **తేది:** 24.07.2019

టెండరు ప్రారంభ తేదీ నుండి (01) ఒక సంవత్సర కాలానికి కాకతీయ మెడికల్ కాలేజ్, వరంగల్ అవరణలో కొత్త క్యాంటీన్ నడుపుటకు ఆమోదిత కాంట్రాక్టర్లు/డీలర్ల నుండి సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. టెండరు దరఖాస్తు ధర: రూ. 1000/-, ప్రిన్సిపాల్, KMC, వరంగల్ పేరున DD ద్వారా చెల్లించాలి. 2) Rc No. CS-1/LC/16/2019, తేది: 24.07.2019, టెండరు ప్రారంభ తేదీ నుండి (1) ఒక సంవత్సర కాలానికి KMC, వరంగల్‌కు లేబొరేటరీ కెమికల్స్, రీఏజెంట్స్ మరియు కిట్స్ మొ||వి సరఫరా చేయుట. 3) Rc. No. CS-1/SPL/ 2019, తేది: 24.07.2019. KMC, వరంగల్‌లోని వివిధ శాఖల పాత ఉడెన్ & ఐరన్ స్క్రాప్ యొక్క బహిరంగ వేలం. టెండరు దరఖాస్తు విక్రయం: 29.07.2019 నుండి 08.08.2019, ఉ. 11.00 గం|| నుండి సా. 4.00 గం||. టెండరు స్వీకరణకు ఆఖరి తేదీ: 14.08.2019న సా. 4.00 గం||వరకు. టెండరు తెరచుట: 16.08.2019న ఉ. 11.00 గం||కు. బయానా: రూ. 10,000/-లు DD ద్వారా చెల్లించాలి. అన్ని తదుపరి వివరాలను దిగువ సంతకందారు నుండి పొందవచ్చును.

సం/- ప్రిన్సిపాల్, KMC వరంగల్

DIPR R.O.No.745 DP/CL/Advt/1/2019-20 Dt: 26.07.2019

# ఇన్సూరెన్స్ డబ్బుల కోసం తల్లిదండ్రుల హత్య

**అమరావతి, నమస్తే తెలంగాణ:** ఇన్సూరెన్స్ డబ్బుల కోసం ఓ కొడుకు కన్నవారిని కడతేర్చాడు. ఏపీలోని ప్రకాశం జిల్లా దర్శిలో ఈ నెల 21న జరిగిన జంట హత్యల కేసును అక్కడి పోలీసులు ఛేదించారు. తల్లిదండ్రుల పేరున ఉన్న ఇన్సూరెన్స్ డబ్బుల కోసం వారి కుమారుడు అన్నెపు నారాయణరెడ్డి వారిని హత్య చేసినట్టు తేలగా అతన్ని పోలీసులు అరెస్టు చేశారు. దర్శి పోలీసుల కథనం ప్రకారం.. ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో పనిచేసే అతను సంస్థకు చెందిన రూ.3 లక్షలను సొంతానికి వాడుకొని మోసానికి పాల్పడగా ఉద్యోగంలోంచి తొలగించారు. వాడుకున్న డబ్బు చెల్లించాలని సంస్థ ఒత్తిడి తేవడంతో అతను సులువుగా డబ్బు సంపాదించేందుకు పథకం వేసి, తాను నామినీగా తల్లి ఆదెమ్మ పేరుతో రూ.15 లక్షలకు టర్మ్ పాలసీ తీసుకున్నాడు. ఈ నెల 20న రాత్రి మజ్జిగలో నిద్రమాత్రలను కలిపి తండ్రి వెంకట్‌రెడ్డి (70), తల్లి ఆదెమ్మ (51)కు తాగమని ఇచ్చాడు. వారు తాగాక వారి చేతిన రాలను కోసేశాడు. దొంగతనంగా భ్రమింపజేసేందుకు ఇంటి గ్రిల్స్‌ను సైతం విరగ్గొట్టాడు. ఇంట్లో నిద్రిస్తున్న తల్లిదండ్రులను గుర్తుతెలియని వ్యక్తులు హత్యచేశారని, తాను బయటపడుకున్నానని పోలీసులను నమ్మించే ప్రయత్నం చేశాడు. అనుమానం వచ్చి పోలీసులు గట్టిగా ప్రశ్నించడంతో ఇన్సూరెన్స్ డబ్బులకోసం తానే హత్య చేశానని అంగీకరించాడు.

# కొత్త తరహాలో ఎన్‌ఐఎన్ పరిశోధనలు

మారుతున్న కాలానికి అనుగుణంగా అధ్యయనం

ఆహార సమతుల్యతపై పరిశోధన చేపట్టిన ఎన్‌ఐఎన్

2019 చివరికల్లా సవరించిన ఆర్డీఏను తీసుకొస్తాం

ఎన్‌ఐఎన్ డైరెక్టర్ హేమలత వెల్లడి

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** పోషకాహారాలకు సంబంధించిన పరిశోధనలు జరుపుతూ ప్రజలను ఎప్పటికప్పుడు జాగృతం చేస్తున్న జాతీయ పోషకాహార సంస్థ (ఎన్‌ఐఎన్) ఈసారి కొత్త తరహా పరిశోధనలు మొదలుపెట్టింది. ఇంతవరకు రెకమండెడ్ డైటరీ అలవెన్స్ (ఆర్డీఏ) పద్ధతిలో మనిషికి కావాల్సిన పోషకాహారాన్ని నిర్ధారించే ఈ సంస్థ.. ఈసారి మూడు కోణాలను పరిగణనలోకి తీసుకొని పరిశోధనలు చేస్తున్నది. ఒక్క ఆర్డీఏ విధానంలోనే కాకుండా ఎస్టిమేటెడ్ యావరేజ్ రిక్వైర్‌మెంట్ (ఈఏఆర్), టాలరబుల్ అప్పర్ లిమిటెడ్ (టీయూఎల్) పద్ధతుల ద్వారా ఏయే రకం మనుషులు ఎంత స్థాయిలో పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలనే విషయాలను నిర్ధారించనున్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) ఆధ్వర్యంలో ఎన్‌ఐఎన్ పరిశోధనలు నిర్వహిస్తూ మనుషులు ఏయే వయసుల్లో.. ఏయే సందర్భాల్లో ఎంత ఆహారం తీసుకోవాలి? ఏయే పోషకాహారాలను ఎంత మోతాదులో తీసుకోవాలి? అనే విషయాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నది. ఎన్‌ఐఎన్ పరిశోధనలను ప్రజలు చాలావరకు ప్రామాణికంగా తీసుకొంటున్నారు. ఇప్పటివరకు ఎంత పని ఆధారంగా ఏయే గ్రూప్ పురుషులు, స్త్రీలు ఎంత విటమిన్ తీసుకోవాలి? ఏయే పోషకవిలువలు కలిగిన ఆహారపదార్థాలను ఎంతమేర తీసుకోవాలనే విషయంపై సిఫారసు చేస్తున్నది. 2011లో పోషకాహారం విషయంలో సిఫారసులు చేసిన ఎన్‌ఐఎన్.. తొమ్మిదేండ్ల కాలంలో వేగంగా వచ్చిన మార్పులను శాస్త్రవేత్తలు పరిగణలోకి తీసుకొంటున్నారు. ఈసారి వృద్ధులు, గర్భిణులు, పిల్లలు, యుక్తవయసువారు ఏఏ పరిస్థితుల్లో ఎంత మోతాదులో పోషక పదార్థాలు తీసుకోవాలో నిర్ధారించబోతున్నారు.

**మూడు పద్ధతుల్లో పరిశోధన: హేమలత**



ఆర్డీఏ పద్ధతితోపాటు ఎస్టిమేటెడ్ యావరేజి రిక్వైర్‌మెంట్, టాలరబుల్ అప్పర్ లిమిటెడ్‌లను పరిగణనలోకి తీసుకొంటున్నట్టు ఐసీఎంఆర్–ఎన్‌ఐఎన్ డైరెక్టర్ డాక్టర్ ఆర్ హేమలత వెల్లడించారు. ఇప్పటివరకు ఆర్డీఏలో సగటు ఆహారం ఎంత అవసరమనే అంచనాను ఈసారి పరిగణనలోకి తీసుకోనున్నట్టు తెలిపారు. అలాగే టాలరబుల్ అప్పర్ లిమిటెడ్ ఆహారాన్ని తీసుకోవచ్చనే విషయాలపై కూడా పరిశోధన చేస్తున్నట్టు చెప్పారు. ఆర్డీఏపై పునర్విమర్శ 2011లో జరిగిందని, 2019 చివరికల్లా సవరించిన ఆర్డీఏను తీసుకువస్తామని స్పష్టంచేశారు. పోషకవిలువలు కలిగిన ఆహారం ఎక్కువ మోతాదులో తీసుకొంటే కలిగే దుష్పరిణామాలను కూడా వివరించనున్నట్టు ఎన్‌ఐఎన్ సీనియర్ శాస్త్రవేత్త జీఎం సుబ్బారావు తెలిపారు.

నమస్తే తెలంగాణ

# ధర్మగంట

మీ వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిన చిరునామాలు

ధర్మగంట
నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9
రోడ్డు నంబర్ 10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034.
పై అడ్రస్‌కు పోస్టుద్వారా పంపించండి.

Whatsapp No.
9346979997

dharmaganta@ntnews.com
అడ్రస్‌కు ఈ-మెయిల్ చేయండి.

స్థానిక నమస్తే తెలంగాణ కార్యాలయంలో వివరాలు అందించండి.

/NTDAILYONLINE





రైతు సర్వన్, అతని భార్య కవితకు 1-బీ అందజేస్తున్న తాసిల్దార్ కృష్ణ, ఇతర సిబ్బంది

## రైతు సర్వన్‌కు పట్టా మంజూరు

- సమస్యను పరిష్కరించి 1-బీ అందించిన గార్ల తాసిల్దార్
- 'పట్టాల కోసం పాట్లు' కథనానికి అధికారుల స్పందన

**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** 'పట్టాల కోసం పాట్లు' శీర్షికతో గురువారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం మద్దివంచ రెవెన్యూ కొత్తతండాకు చెందిన రైతు దారవత్ సర్వన్‌కు తన 4.20 ఎకరాల భూమికి సంబంధించి అన్ని హక్కుపత్రాలు ఉన్నా పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వకుండా రెవెన్యూ అధికారులు ఇబ్బంది పెట్టారు. దీనిపై కథనం ప్రచురితమవడంతో గురువారం కొత్తతండాను సందర్శించిన తాసిల్దార్ కృష్ణ.. బాధితుడు సర్వన్‌తోపాటు పలువురు రైతుల భూమి హక్కుపత్రాలను పరిశీలించారు. శుక్రవారం తాసిల్ కార్యాలయంలో సర్వన్ పేరిట మూడెకరాలు, అతని భార్య కవిత పేరిట 8 గుంటల భూమికి తాసిల్దార్ కృష్ణ, డిప్యూటీ తాసిల్దార్ మాల్య పట్టాదారు పాస్‌పుస్తకం మంజూరు చేసి, 1-బీలను అందించారు. మిగిలిన భూమికి సంబంధించి అన్నదమ్ముల మధ్య వివాదం ఉండటంతో పట్టా మంజూరు చేయలేదని, సమస్య పరిష్కారమైన వెంటనే పట్టా ఇస్తామని తాసిల్దార్ తెలిపారు. ఈ సందర్భంగా బాధిత రైతు సర్వన్ 'నమస్తే తెలంగాణ'కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# 12 ఎకరాలు అన్యాక్రాంతం

- రికార్డుల్లో మారిన పట్టాదారు పేరు
- న్యాయంకోసం వెళ్తే ఫైల్ దొరకడంలేదంటున్న తాసిల్ సిబ్బంది
- అక్రమాలను కప్పిపుచ్చుకొనేందుకు దేవరకొండ అధికారుల సాకు
- తమ వారసత్వ భూమి ఫైల్ మాయంపై బాధితుల ఆందోళన
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన బాధిత వృద్ధ మహిళలు



బాధితులు పాల్వాయి జంగమ్మ, ఇమ్మడిశెట్టి చెన్న కిష్టమ్మ, ఇమ్మడిశెట్టి సత్యమ్మ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం తెలుగుపల్లికి చెందిన శేవకపు రాములమ్మకు తాటికోల్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 698/రు, 699/అ, ఆ, 700, 701, 702, 703 లలో 12.19 ఎకరాల భూమి ఉన్నది. రాములమ్మకు నలుగురు కుమార్తెలు పాల్వాయి జంగమ్మ, ఇమ్మడిశెట్టి చెన్న కిష్టమ్మ, ఇమ్మడిశెట్టి లక్ష్మమ్మ, ఇమ్మడిశెట్టి సత్యమ్మ ఉన్నారు. వీళ్లందరికీ పెండ్లిళ్లు జరిగి ఎవరి అత్తగారింట్లో వారున్నారు. రాములమ్మకు కుమారులు లేరు. 1995 సెప్టెంబర్ 29న ఆమె చనిపోయారు. అయితే రెవెన్యూ రికార్డుల్లో ఆ భూములు రాములమ్మ పేరిటే కొనసాగుతూ వస్తున్నాయి. కుమారులు లేనందున వాస్తవంగా ఆమె పేరిట ఉన్న 12.19 ఎకరాలు వారసత్వంగా నలుగురు కుమార్తెలకు దక్కాలి. కానీ పట్టాదారు చనిపోవడం.. కుమార్తెలు స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో రాములమ్మ బంధువులు ఈ భూమిపై కన్నేశారు. ఇంకేముంది.. ఇలాంటి అదును కోసం ఎదురుచూసే రెవెన్యూ అధికారులు తలుపులు బార్లా తెరిచారు. 2010-11 సంవత్సరం వరకు ఈ 12.19 ఎకరాల భూమి రాములమ్మ పేరిటే ఉన్నది. కానీ 2011-12 సంవత్సరం రికార్డుల్లో సర్వే నంబర్లు 701, 702, 703 లలోని 6.28 ఎకరాల భూమిని దొంతం పర్వతాలు, దొంతం గోవర్ధన్, దొంతం బాలరాజు పేరిట నమోదుచేశారు. తాసిల్దార్ ఉత్తర్వుల నంబర్ బీ/1368/10 ప్రకారం పట్టాదారు పేర్లు మార్చినట్టు రికార్డుల్లో పొందుపరిచారు. అయితే తాసిల్దార్ ఈ ఉత్తర్వులు ఎందుకిచ్చారనే దానిపై అధికారుల నుంచి సరైన సమాధానం లేదని బాధితులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తమకు దక్కాల్సిన భూమిని ఎలా బదలాయించారంటూ ప్రశ్నించగా.. రాములమ్మ బతికి ఉన్న సమయంలో వీరికి రాసిచ్చారంటూ సమాధానమిస్తున్నారని వాపోయారు. ఒకవేళ వారికి రాసిచ్చి ఉంటే తల్లి తమకు చెప్పేదని అంటున్నారు. 'నిజంగా మా తల్లి వారికి రాసిచ్చినా, విక్రయించినా.. ఆమె బతికి ఉన్న సమయంలో ఎందుకు మ్యుటేషన్ చేయించుకోలేదు? 1995లో ఆమె మరణిస్తే ఆ తర్వాతనైనా మ్యుటేషన్ చేయించుకోవాలి. 2010-11 వరకు ఎందుకు చేయించుకోలేదు?' అని బాధితులు ప్రశ్నిస్తున్నారు. అయితే వాస్తవంగా కొన్నేండ్ల కిందటే ఈ అక్రమ వ్యవహారం జరిగిందని, కానీ పాత తేదీల్లో ఆ ప్రక్రియ పూర్తిచేశారని అనుమానం వ్యక్తంచేస్తున్నారు. దీనిపై తాము చాలాకాలంగా అధికారులకు ఫిర్యాదుచేస్తున్నా సరైన సమాధానం చెప్పకుండా తప్పించుకు తిరుగుతున్నారే తప్ప న్యాయంచేయడంలేదని వాపోతున్నారు.

**మిగిలింది కుమార్తెలే అమ్ముకున్నారట!**

రాములమ్మకు ఉన్న 12.19 ఎకరాల్లో 6.28 ఎకరాలను రెవెన్యూ అధికారులు ఇతరుల పేరిట రాయగా.. మిగిలిన 5.31 ఎకరాలు 2017 వరకు రాములమ్మ పేరిటే వచ్చింది. 2018 ఆ మిగిలిన భూమికీ రెవెన్యూ అధికారులు ఎసరు పెట్టారు. ఈసారి కూడా రాములమ్మ బంధువుల పేరిటే మార్చారు. పసునూరి కృష్ణయ్య, పసునూరి శీనయ్య, పసునూరి బ్రహ్మయ్య, పసునూరి వెంకటయ్య పేరిట 5.31 ఎకరాలను బదలాయించారు. అయితే ఈ బదలాయింపు సాదాబైనామా కింద చేయడం గమనార్హం. దీనికి అధికారులు చెప్పే సమాధానం మరీ విచిత్రంగా ఉన్నది. రాములమ్మ కుమార్తెలు నలుగురు వీరికి విక్రయించారని, అందుకే తాము సాదాబైనామా కింద పేర్లు మార్చామని సమాధానమిస్తున్నారు. కానీ నలుగురు కుమార్తెలు మాత్రం తాము ఎవరికీ భూమి రాసియ్యలేదని, తామెక్కడా వేలిముద్రలు కూడా వేయలేదని స్పష్టంచేశారు.

**ఫైల్ దొరకడంలేదంటున్న ఆర్ఐ**

తమకు చెందాల్సిన 12.19 ఎకరాల భూమిని ఇతరుల పేరిట అక్రమంగా బదలాయించడంపై నెలల తరబడి అధికారుల చుట్టూ తిరిగి విసిపోయిన వృద్ధులు గత మంగళవారం 'ధర్మగంట'ను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో 'నమస్తే తెలంగాణ' సంబంధిత వీఆర్వో కృష్ణయ్యను సంప్రదించగా.. తనకేం తెలియదని, అంతా ఆర్ఐకే తెలుసునని చెప్పారు. దీంతో దేవరకొండ ఆర్ఐ దయాకర్‌రెడ్డిని ఫోన్‌లో సంప్రదించగా.. సంబంధిత ఫైల్ దేవరకొండ తాసిల్ కార్యాలయంలోనే ఉన్నదని, వస్తే ఆ ప్రతులను చూపిస్తానంటూ రెండు రోజుల వ్యవధి అడిగారు. దీంతో రెండు రోజులపాటు బాధిత వృద్ధుల తరపున వీరి మనుమడు శేఖర్ దేవరకొండ తాసిల్ కార్యాలయం వద్ద పడిగాపులు కాశారు. చివరకు శుక్రవారం మధ్యాహ్నం మరోసారి ఆర్ఐను ఫోన్‌లో సంప్రదించగా.. 'ఆ ఫైల్ ఉన్నది. ఏదో ఒక అల్మారాలో ఉన్నది. మావాళ్లు వెతుకుతున్నారు. దొరకగానే నేనే ఫోన్ చేసి ప్రతులు ఇస్తా' అంటూ సమాధానమిచ్చారు. అయితే ఇలా తప్పించుకోవడం ఇప్పుడు కొత్తకాదని, ఎప్పుడు వెళ్లినా అధికారుల నుంచి ఇలాంటి సమాధానమే వస్తున్నదే తప్ప అసలు ఏ ఆధారంతో భూమిని వాళ్ల పేరిట బదలాయించారనే విషయాన్ని మాత్రం అధికారులు బయటపెట్టడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వాస్తవంగా తమ బంధువులతో కుమ్మక్కై రెవెన్యూ అధికారులు ఈ అక్రమానికి పాల్పడ్డారని, ఇప్పుడు తాము ప్రశ్నిస్తుండటంతో కుంటి సాకులతో తప్పించుకొంటున్నారని తెలిపారు. నిజంగా ఆధారాలుంటే ఎప్పుడో బయటపెట్టేవారని, ఇప్పటికైనా రెవెన్యూ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి తమ తల్లి భూమిని ఇప్పించాలని.. అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

## మ్యుటేషన్ కోసం ట్యాంక్ ఎక్కిన రైతు

ఎల్కతుర్తి తాసిల్దార్ హామీతో దిగివచ్చిన బాధితుడు



ట్యాంక్ ఎక్కిన రైతు ఆనందం

**ఎల్కతుర్తి:** తన భూమికి మ్యుటేషన్ అమలుచేయడం లేదని ఓ రైతు వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపారు. వరంగల్ అర్బన్ జిల్లా ఎల్కతుర్తి మండలం వీరనారాయణపూర్‌కు చెందిన నార్లగిరి జానమ్మకు సర్వే నంబర్లు 40, 41లో 1.28 ఎకరాల భూమి ఉన్నది. ఈ భూమిని ఆమె నలుగురు కుమారులు పంచుకొన్నారు. రెండో కుమారుడు ఆనందం తన వాటా 17 గుంటలతోపాటు సోదరుడి వాటా భూమిని కూడా కొన్నారు. ఇందులో 22 గుంటలను తన కుమారుడు మహేందర్ పేరిట, గ్రామానికే చెందిన స్వామి పేరిట మరో 20 గుంటలు రిజిస్ట్రేషన్‌చేశారు. తర్వాత మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసుకొన్నారు. కాగా ఆనందానికి 34 గుంటల భూమే ఉన్నదని.. తమ భూమిని ఆక్రమించుకొని కుమారుడికి, మరోవ్యక్తికి అక్రమంగా రిజిస్ట్రేషన్‌చేశారని అతడి సోదరులు అధికారులకు ఫిర్యాదుచేశారు. దీంతో అధికారులు మ్యుటేషన్‌ను నిలిపివేశారు. తాను సాగుచేస్తున్న భూమినే రిజిస్ట్రేషన్ చేశానని.. జేష్టభాగం పాలుతీసుకొన్న పెద్దన్న భూమిని తాను కొన్నానని ఆనందం చెప్తున్నారు. శుక్రవారం గ్రామంలోని వాటర్ ట్యాంక్ ఎక్కి, తనకు మ్యుటేషన్ అమలు చేయాలని డిమాండ్‌చేశారు. విషయం తెలుసుకొన్న ఎల్కతుర్తి తాసిల్దార్ వెంకటరమణ, ఎస్సై శ్రీధర్ అక్కడికి చేరుకొని న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆనందం దిగివచ్చారు.

## మా భూమిని కాపాడాలి

- కోర్టు ఆర్డర్లు వచ్చినా న్యాయం జరుగడం లేదు
- 'ధర్మగంట'కు మొరపెట్టుకున్న నాగర్‌కర్నూల్ జిల్లా రైతు రాంచందర్



**చారకొండ:** వారసత్వంగా వస్తున్న భూమిని కొందరు ఆక్రమించుకొని, చంపుతామని బెదిరిస్తున్నారని నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని శిరుసగండ్ల గ్రామానికి చెందిన కామోజి రాంచందర్ 'ధర్మగంట'ను ఆశ్రయించారు. శిరుసగండ్ల శివారులోని సర్వే నంబర్లు 234/రూ లో 24 గుంటలు, 234/3లో 1.38 ఎకరాల భూమి రాంచందర్‌కు వారసత్వంగా సంక్రమించింది. 1990లో విరాసత్ కూడా అయింది. వృత్తిరీత్యా రాంచందర్ 1988లో హైదరాబాద్‌కు వెళ్లారు. దీనిని అదునుగా తీసుకొని రాంచందర్ భూమిని.. పక్కనే ఉన్న కోళ్ల నర్సయ్య, వెంకటనర్సమ్మ, సింగరాజుపల్లి మనోహర్‌రావు, దీపం మధుసూదన్‌రెడ్డి ఆక్రమించుకొన్నారు. భూరికార్డుల ప్రక్షాళనలో ఈ భూమి రాంచందర్ పేరిటే వచ్చింది. రైతుబంధు చెక్ కూడా అందింది. కానీ మోఖా మీదకు పోతే చంపుతామని కబ్జాకోరులు బెదిరిస్తున్నారని బాధితుడు వాపోయారు. దీనిపై గతేడాది కోర్టుకు వెళ్తే రాంచందర్‌కు అనుకూలంగా తీర్పు ఇస్తూ ఇంజంక్షన్ ఆర్డర్ ఇచ్చింది. ఆ ఆర్డర్ సహాయంతో పొలాన్ని ఎలాగో స్వాధీనం చేసుకొని మక్కజొన్న పంట సాగుచేస్తే కబ్జాదారులు ధ్వంసంచేశారని బాధితుడు రాంచందర్ వాపోయారు. ఈ వ్యవహారాన్ని రెవెన్యూ అధికారులకు తెలిపినా పట్టించుకోవడంలేదన్నారు. అధికారులు విచారణచేసి తన భూమి దక్కేలా చేయాలని బాధితుడు వేడుకొంటున్నారు.

# జోరుగా భూపరిష్కారాలు

- భూపాలపల్లి జిల్లాలో కొనసాగుతున్న 'భూపరిష్కార వేదిక'
- ఎడతెరిపిలేని వానలోనూ తరలివచ్చిన రైతులు
- పాస్‌పుస్తకాలు, 1-బీ ప్రతులు అందజేత
- పర్యవేక్షించిన కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు
- మొత్తం 1,643 భూసమస్యలు పరిష్కారం



శుక్రవారం భూపాలపల్లి మండలం పెద్దాపూర్‌లో మహిళా రైతుకు 1-బీ అందజేస్తున్న జిల్లా కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు. చిత్రంలో జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ కల్లెపు శోభ తదితరులు ఉన్నారు.

**జయశంకర్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** రైతుల భూసమస్యల పరిష్కారం కోసం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు చేపట్టిన 'భూపరిష్కార వేదిక- రైతుల చెంతకే రెవెన్యూ సిబ్బంది' కార్యక్రమం శుక్రవారం జోరు వానలోనూ కొనసాగింది. ఎడతెరపి లేకుండా వర్షం పడటంతో రెవెన్యూ అధికారులు గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ఈ సదస్సులను నిర్వహించారు. భూసమస్యలను ఎదుర్కొంటున్న రైతులు పరిష్కారం కోసం వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సదస్సులకు హాజరయ్యారు. ఈ నెల 22న ప్రారంభమైన ఈ కార్యక్రమాన్ని ప్రతిరోజు పదకొండు గ్రామాల్లో నిర్వహిస్తున్నారు. గురువారం రాత్రి నుంచి ఎడతెరిపిలేకుండా వర్షం కురిసినప్పటికీ ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం గ్రామాల్లో సదస్సులు ఏర్పాటుచేశారు. భారీ వర్షంతో వాగులు పొంగి రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో ఒక పలిమెల మండలంలో మాత్రం ఈ కార్యక్రమం వాయిదా పడింది. వర్షంలోనే ఆయా మండలాల తాసిల్దార్లు, డిప్యూటీ తాసిల్దార్లు, ఆర్ఐలు, వీఆర్వోలు, ఇతర సిబ్బంది ఉదయమే ఆయా గ్రామాలకు చేరుకొన్నారు. రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలను పరిశీలించి అర్హులైనవారికి అక్కడికక్కడే పాస్‌పుస్తకాలు, 1-బీ ప్రతులను అందజేశారు. రెవెన్యూ రికార్డుల్లో సవరణలుచేశారు. జిల్లా కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు వర్షంలోనే గ్రామాల్లో పర్యటించారు. భూపాలపల్లి, గణపురం, రేగొండ మండలాల్లోని పెద్దాపూర్, బుద్దారం, దమ్మన్నపేట గ్రామాల్లో జరిగిన సదస్సుల్లో పాల్గొన్నారు. భూసమస్యల పరిష్కారం పొందిన రైతులకు ఆయన పాస్‌పుస్తకాలు, 1-బీ ప్రతులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో భూసమస్య ఒక్కటి కూడా పెండింగ్‌లో ఉండకుండా వందశాతం పరిష్కరించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని చెప్పారు. జిల్లాలోని రైతులెవరూ భూసమస్యలతో రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగి ఇబ్బంది పడొద్దనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లోనే ధరణి వెబ్‌సైట్ ద్వారా భూరికార్డులను సరిచేస్తున్నందున రైతులు తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. ఈ ఐదురోజుల్లో 'భూపరిష్కార వేదిక- రైతుల చెంతకే రెవెన్యూ సిబ్బంది' సదస్సుల ద్వారా జిల్లాలో మొత్తం 1,643 భూసమస్యలను పరిష్కరించినట్టు ప్రకటించారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మొగుళ్లపల్లి, టేకుమట్ల, చిట్యాల, రేగొండ మండలాల్లోని పర్లపల్లి, కలికోట, చల్లగరిగ, దమ్మన్నపేట గ్రామాల్లో జరిగిన రెవెన్యూ సదస్సులకు హాజరయ్యారు. ఆయా సదస్సుల్లో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ కల్లెపు శోభ రఘుపతిరావు, రేగొండ ఎంపీపీ పున్నం లక్ష్మి రవి, తాసిల్దార్లు రమేశ్, సమ్మయ్య, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

## తాతల నాటి భూమి తారుమారు

- రిటైర్డ్ సర్వేయర్ భూమికే దిక్కులేదు
- ఆర్డీవో, సివిల్ కోర్టు డిక్రీ ఇచ్చినా సరిచేయని అధికారులు
- తొమ్మిదేండ్లుగా బాధితుడి నిరీక్షణ



రిటైర్డ్ సర్వేయర్ మహ్మద్ సర్వర్

**హసన్‌పర్తి:** రెవెన్యూ అధికారుల పనితీరు రిటైర్డ్ సర్వేయర్ భూమికే ఎసరుపెట్టింది. తాతల కాలం నుంచి ఆయన అనుభవిస్తున్న భూమి తారుమారై, పట్టా కాలంలో తన పేరుకు బదులుగా మరొకరి పేరు పుట్టుకొచ్చింది. రికార్డులు సవరించి తనకు న్యాయం చేయాలని సదరు రిటైర్డ్ సర్వేయర్ రెవెన్యూ అధికారులను వేడుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నది. వరంగల్ అర్బన్ జిల్లా హసన్‌పర్తికి చెందిన మహ్మద్‌గౌస్ కుమారుడు, రిటైర్డ్ సర్వేయర్ మహ్మద్ సర్వర్ కొంతకాలంగా వరంగల్‌లోని హన్మకొండలో నివాసముంటున్నారు. తండ్రి నుంచి వారసత్వంగా తనకు సంక్రమించిన హసన్‌పర్తి రెవెన్యూ శివారు బొత్తలకుంట సమీపంలోని ఖాతా నంబర్ 176, 1 'బీ' లో సర్వే నంబర్ 93/సీలో 15 గుంటలు, 95/ఏలో 19 గుంటలతో కలిపి మొత్తం 34 గుంటల భూమి ఉన్నది. ఈ భూమిలో సర్వర్ కాస్తు చేస్తున్నా, పహాణీలో మాత్రం బొక్క మార్తమ్మ పేరు నమోదైంది. రెవెన్యూ అధికారులు బొక్క మార్తమ్మకు ఎలాంటి ఆధారాలు లేకుండానే ఆర్వోఆర్, 1 బీ పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీచేశారు. దీంతో గౌస్ వారసుడు, రిటైర్డ్ సర్వేయర్ సర్వర్ రెవెన్యూ అధికారిని ఆశ్రయించి తన గోడు వెల్లబోసుకున్నారు. వారసత్వంగా వస్తున్న తమ భూమిని అక్రమంగా వేరొకరి పేరిట రికార్డుల్లో నమోదుచేసి పాస్‌పుస్తకాలు జారీచేయడం సరికాదని, వారి పేర్లను తొలగించి తమకు విరాసత్ ద్వారా పాస్‌పుస్తకాలు అందించాలని తాసిల్దార్‌ను వేడుకొన్నారు. తాసిల్దార్ పట్టించుకోకపోవడంతో ఆర్డీవో, సివిల్ కోర్టును ఆశ్రయించి దావా వేశారు. సివిల్ కోర్టులో రిటైర్డ్ సర్వేయర్ మహ్మద్ సర్వర్‌కు ఓఎస్ నంబర్ 564/2010, ఆర్డీవో ఆర్సీ నంబర్ ఏ/107/2010 కోర్టు 27-02-2018లో డిక్రీ వచ్చింది. ఆర్డీవో, సివిల్ కోర్టు డిక్రీ కాపీతో తనకు న్యాయంచేయాలని ఏడాదిగా అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా రెవెన్యూ ఉన్నతాధికారులు న్యాయం చేయాలని కోరుతున్నారు.

> **విచారణ చేస్తా**
>
> రిటైర్డ్ సర్వేయర్ మహ్మద్ సర్వర్‌కు సంబంధించిన భూ వివాదం నా దృష్టికి రాలేదు. సర్వర్ దరఖాస్తు ఇచ్చారు. దాన్ని పరిశీలించి విచారణ జరిపి బాధితుడికి తప్పకుండా న్యాయం చేస్తాం
>
> - రాజ్‌కుమార్, తాసిల్దార్

# కౌలుకిస్తే.. కాజేశాడు!

- ఆక్రమించిన వ్యక్తికి అసైన్డ్ భూమి పట్టాచేశారు
- పహాణీలోనూ పేరుమార్చిన రెవెన్యూ అధికారులు
- న్యాయం కోసం 'ధర్మగంట'ను ఆశ్రయించిన బాధితురాలు

**పేదలకు ప్రభుత్వం ఇచ్చిన భూమి అన్యాక్రాంతమైంది. రెవెన్యూ సిబ్బంది రికార్డుల్లో మార్పులుచేర్పులు చేసి మరీ ఆక్రమించుకున్న వ్యక్తికి సహకరించారు. అసైన్డ్ భూమి అయినా పట్టాచేసిచ్చారు. భూమిని అప్పగించాలని బాధితులు కోరుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు.**



బాధితురాలు వీరమ్మ

**కూసుమంచి:** ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నేలపట్ల గ్రామంలోని 640 సర్వే నంబర్‌లో ఎకరం భూమిని ఆ గ్రామానికి చెందిన చెరుకుపల్లి వెంకయ్యకు ప్రభుత్వం సుమారు 50 ఏండ్లకిందట పట్టా ఇచ్చింది. ఆ భూమిని వెంకయ్య కుటుంబం సాగుచేసుకొని జీవించింది. కొన్నేండ్ల కిందట కుటుంబ అవసరాల కోసం గ్రామానికి చెందిన కలకొండ వెంకటి వద్ద కొంత అప్పుచేశారు. అప్పుతీర్చలేని పరిస్థితుల్లో భూమిని అతనికి కౌలుకు ఇచ్చారు. కొంతకాలానికి వెంకయ్య చనిపోయారు. అతని కుమారుడు వీరస్వామి ఆ భూమిని తన పేరుమీదికి మార్చుకోలేదు. 2017లో వీరస్వామి మృతిచెందగా ఆ కుటుంబం నేలపట్ల నుంచి హైదరాబాద్‌కు వలస వెళ్లింది. అనంతరం ఈ భూమిని కౌలుకు తీసుకొన్న వ్యక్తి 2012-13 పహాణీలో అనుభవదారుడిగా తన పేరును నమోదు చేయించుకొన్నారు. గత ఏడాది సాదాబైనామాను చూపించి భూమికి పట్టాదారు పాస్‌పుస్తకం కూడా పొందారు. ఎకరం భూమిలో 10 గుంటలు తమ స్వాధీనంలో ఉన్నదని, మిగతా 30 గుంటలు కలకొండ వెంకటి ఆక్రమించుకొన్నారని చెరుకుపల్లి వెంకయ్య కోడలు చెరుకుపల్లి వీరమ్మ చెప్పారు. ఈ భూమిలో నుంచి పై పొలాలకు గతంలో దారి ఉండేదని, ఆ దారిని కూడా వెంకటి ఆక్రమించారని గ్రామ రైతులు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ భూమిని నిబంధనలకు విరుద్ధంగా రెవెన్యూ అధికారులు మరొకరికి పట్టాచేశారని, కలకొండ వెంకటికి అక్రమంగా ఇచ్చిన పట్టాదారు పాస్‌పుస్తకాన్ని రద్దుచేసి, తమ భూమిని తమకు స్వాధీనం చేయాలని రెవెన్యూ అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదని వీరమ్మ వాపోయారు.

> **నిబంధనల మేరకే పట్టా**
>
> కొన్నేండ్లుగా భూమిని కలకొండ వెంకటి సాగుచేస్తున్నట్టు మా సిబ్బంది పరిశీలనలో వెల్లడైంది. ఆరేండ్లుగా అనుభవదారుడిగా అతని పేరు రికార్డుల్లో నమోదైంది. వెంకయ్య కుటుంబీకులు అడ్డు చెప్పలేదు. పట్టాదారు పాస్‌పుస్తకం జారీకి ముందు కూడా అభ్యంతరం తెలుపలేదు. ఇంతవరకు ఫిర్యాదు సైతం చేయలేదు. నిబంధనల మేరకే పట్టా చేశాం.
>
> - జే స్వర్ణ, కూసుమంచి తాసిల్దార్

# నాలుగు దశాబ్దాలుగా పట్టాకాలే

రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్ బాధితుడు గేమానాయక్ ఆవేదన



**ఆదిబట్ల:** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొంగరకలాన్‌కు చెందిన కోలా గేమానాయక్ గ్రామ రెవెన్యూ పరిధిలోని తుర్కోనిబాయి పొలంలో సర్వే నంబర్లు 185, 186 ఏ, 190లలో ఉన్న కోలా గోట్యా, కోలా గోపాల్, కోలా చంద్రుల ఎకరం భూమిని సాదాబైనామా ద్వారా 1978లో కొన్నారు. నాటి నుంచి ఆ భూమిని గేమానాయక్ సాగుచేసుకొంటున్నారు. కాస్తు కాలంలో కూడా గేమానాయక్ పేరు పహాణీలో రెవెన్యూ అధికారులు నమోదుచేశారు. ఈ భూమిని తన పేరిట పట్టాచేయాలని గేమానాయక్ తాసిల్ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. భూమిని పరిశీలించి పట్టాచేసి, పాస్‌బుక్ ఇవ్వాలని గేమానాయక్ జిల్లా కలెక్టర్, ఇబ్రహీంపట్నం రెవెన్యూ అధికారులకు అనేకమార్లు దరఖాస్తుచేశారు. భూరికార్డుల ప్రక్షాళనలో కూడా అధికారులకు మొరపెట్టుకొన్నారు. అయినప్పటికీ రెవెన్యూ అధికారులు న్యాయంచేయడం లేదని వాపోతున్నారు. 2002లో పహాణీలో అనుభవదారుడిగా గేమానాయక్ పేరు నమోదైంది. రిమార్కు కాలంలో అతను భూమిని కొన్నట్టుగా రాశారు. కానీ పట్టాదారుడిగా నమోదుచేయడంలో అధికారులు శ్రద్ధ చూపడం లేదు. గతంలో కొంగరకలాన్‌లో పనిచేసిన వీఆర్వోలు ఎలాంటి విచారణ చేయకుండానే గేమానాయక్‌కు భూమి అమ్మిన వారి పేర్లను పట్టాదారు కాలంలో నమోదుచేయడం అనేక అనుమానాలకు తావిస్తున్నది. రెవెన్యూ అధికారులు చేసిన నిర్లక్ష్యం, పొరపాటు కారణంగా బాధితుడు ఏండ్ల తరబడి రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగలేక, వృద్ధాప్యంతో ఇబ్బందిపడుతున్నారు. నోరు కట్టుకొని కూడబెట్టిన పైసలతో భూమి కొన్నానని.. ఇప్పుడు ముసలోన్నయ్యానని, కొన్న భూమిని గుర్తించి పట్టాచేసి, వెంటనే పాస్‌బుక్ ఇవ్వాలని గేమానాయక్ కన్నీటి పర్యంతమయ్యారు.

> **న్యాయంచేస్తాం**
>
> కొంగరకలాన్ రెవెన్యూలో గేమానాయక్ కొన్న భూమికి సంబంధించి పూర్తిగా విచారణ చేయిస్తా. ఈ సమస్య చాలా ఏండ్లది. అప్పుడు ఇక్కడ పనిచేసిన తాసిల్దార్లు ఎందుకు పట్టాచేయలేదో తెలియదు. నేను దీనిపై సమగ్ర విచారణ జరుపుతాను. విచారణలో వాస్తవాలు తె లుసుకొని బాధితుడికి న్యాయంచేసేందుకు కృషిచేస్తాను.
>
> - వెంకటేశ్వర్లు, ఇబ్రహీంపట్నం తాసిల్దార్

నమస్తే తెలంగాణ
# ఆట
10
కరీంనగర్
శనివారం 27 జూలై 2019
WWW.NTNEWS.COM

**పీకేఎల్‌లో నేడు**

యుముంబా X పుణేరీ - 7.30గం.
జైపూర్ X బెంగాల్ - 8.30గం.
స్టార్ స్పోర్ట్స్‌లో



## కపిల్ నేతృత్వంలో కోచ్ ఎంపిక

**న్యూఢిల్లీ:** భారత మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ నేతృత్వంలోని క్రికెట్ సలహాదారుల కమిటీ(సీఏసీ) చీఫ్ కోచ్‌ను ఎంపిక చేయనుంది. ఈ మేరకు శుక్రవారం సమావేశమైన క్రికెట్ పరిపాలన కమిటీ(సీవోఏ) నిర్ణయం తీసుకుంది. కపిల్‌తో పాటు సీఏసీలో మాజీ కోచ్ అన్షుమన్ గైక్వాడ్, మహిళల జట్టు మాజీ కెప్టెన్ శాంత రంగస్వామి సభ్యులుగా ఉంటారు. టీమ్‌ఇండియా ప్రధాన కోచ్ ఎంపిక కోసం సీఏసీ సభ్యులు ఆగస్టులో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఇదిలా ఉంటే ఇటీవలే ఏర్పడ్డ భారత క్రికెటర్స్ అసోసియేషన్(ఐసీఏ)లో సభ్యులుగా ఉన్న కపిల్‌దేవ్, రంగస్వామికి పరస్పర విరుద్ధ ప్రయోజనాలు వర్తిస్తాయా అన్నది బీసీసీఐ ఎథిక్స్ ఆఫీసర్ డీకే జైన్ నిర్ణయించనున్నారు. 'కపిల్, గైక్వాడ్, రంగస్వామి కలిసి భారత చీఫ్ కోచ్‌ను ఎంపిక చేస్తారు. ఇది అడ్‌హాక్ బాడీ కాదు. పరస్పర విరుద్ధ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వీరితో కమిటీ ఏర్పాటు చేశాం. ఆగస్టులో వీరు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు' అని సీవోఏ చీఫ్ వినోద్ రాయ్ అన్నారు.



సచివాలయంలో శుక్రవారం పెరల్ సిటీ ఆలిండియా ఫిడే రేటింగ్ చెస్ టోర్నీ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర యువజన, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు



## వన్డేలకు సెలవు

### 50ఓవర్ల ఫార్మాట్ నుంచి మలింగ రిటైర్మెంట్
### టీ20ల్లో కొనసాగనున్న యార్కర్ కింగ్

**నమస్తే తెలంగాణ క్రీడావిభాగం :** ప్రత్యేకమైన బౌలింగ్ శైలి.. పర్ఫెక్ట్ యార్కర్లతో 15ఏళ్లుగా ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌ను బెంబేలెత్తించిన శ్రీలంక దిగ్గజ బౌలర్ లసిత్ మలింగ వన్డేలకు వీడ్కోలు పలికాడు. కొలంబోలోని ప్రేమదాస మైదానంలో బంగ్లాతో శుక్రవారం తన చివరి వన్డేను ఆడాడు. ఈ మ్యాచ్‌లోనూ తనదైన మ్యాజిక్ యార్కర్లతో తమీమ్, సర్కార్‌ను వెనక్కి పంపడం సహా కెరీర్ చివరి బంతికి కూడా వికెట్ తీశాడు. 2007 నుంచి 2014 మధ్య శ్రీలంక ఎన్నో చిరస్మరణీయ విజయాలు సాధించడంలో మలింగ ప్రధానపాత్ర పోషించాడు. 2007, 2011 వన్డే ప్రపంచకప్ టోర్నీల్లో ఫైనల్ వరకు శ్రీలంక చేరడంలోనూ, 2014 టీ20 ప్రపంచకప్ గెలవడంలోనూ మలింగదే కీలకపాత్ర. ఇటీవల జరిగిన ప్రపంచకప్ టోర్నీలోనూ 13 వికెట్లు తీసి లంక తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. 2011లోనే టెస్టుల నుంచి వైదొలిగిన మలింగ.. ప్రస్తుతం వన్డేలకు సెలవు చెప్పేశాడు. ఇక టీ20లో ఫార్మాట్‌లో కొనసాగనున్నాడు. 2004లో వన్డేల్లో అరంగేట్రం చేసిన మలింగ.. మొత్తం 226 వన్డేల్లో మొత్తం 338 వికెట్లు తీసి... శ్రీలంక తరఫున మురళీధరన్(534), వాస్(400) తర్వాత అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు.

### శ్రీలంక గెలుపు

**కొలంబో:** దిగ్గజ బౌలర్ లసిత్ మలింగకు శ్రీలంక జట్టు గెలుపుతో వీడ్కోలు పలికింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా కొలంబోలోని ప్రేమదాస మైదానంలో బంగ్లాతో జరిగిన తొలి మ్యాచ్‌లో 91 పరుగుల తేడాతో గెలిచింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక.. కుశాల్ పెరీరా(99బంతుల్లో 111) రాణించడంతో 8వికెట్లు కోల్పోయి 314పరుగులు చేసింది. భారీ లక్ష్య ఛేదనకు దిగిన బంగ్లాదేశ్ 223 పరుగులకే 41.4ఓవర్లలో ఆలౌటైంది.

**3**

వన్డేల్లో 3సార్లు హ్యాట్రిక్ సాధించిన ఒకేఒక్కడు మలింగ. దక్షిణాఫ్రికా, కెన్యా, ఆస్ట్రేలియాలపై అతడు హ్యాట్రిక్‌లు తీశాడు. అలాగే వన్డే చరిత్రలో 4బంతులకు 4వికెట్లు తీసిన ఒకేఒక్కడిగా నిలిచాడు.

# మనోళ్ల పంచ్ అదుర్స్

## సత్తాచాటిన తెలంగాణ బాక్సర్లు
### థాయ్‌లాండ్ ఫైనల్లో నిఖత్, హుస్సాముద్దీన్..





**తెలంగాణ బాక్సర్లు నిఖత్ జరీన్, మహ్మద్ హుస్సాముద్దీన్ అంతర్జాతీయ వేదికపై మరోమారు తళుక్కుమన్నారు. తమ అద్భుత ప్రదర్శనతో ప్రత్యర్థులను చిత్తుచేస్తూ సత్తాచాటారు. థాయ్‌లాండ్ బాక్సింగ్ టోర్నీలో సహచరులు విఫలమైన చోట నిఖత్ బెబ్బులిలా చెలరేగుతూ పసిడి పతక పోరులోకి దూసుకెళ్లింది. సెమీస్‌లో థాయ్‌లాండ్ బాక్సర్ జుటామస్ జిట్‌పాంగ్‌ను పవర్‌ఫుల్ పంచ్‌లతో చిత్తుచేసింది. ఎక్కడా అవకాశమివ్వకుండా చెలరేగుతూ చైనా బాక్సర్‌తో పోరుకు సిద్ధమైంది. తన ఆర్మీ పవర్ రుచి ఏంటో చూపిస్తూ హుస్సాముద్దీన్...థాయ్‌లాండ్ బాక్సర్‌ను మట్టికరిపించాడు. మొత్తంగా మన పంచ్ పవర్‌ను ఈ ఇందూరు బాక్సర్లు ప్రపంచానికి పరిచయం చేసి వారెవ్వా అనిపించారు.**

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ వేదికపై తెలంగాణ పతాక సగర్వంగా ఎగిరింది. ప్రతిభ ఉంటే ప్రపంచాన్నైనా జయించవచ్చని నిరూపించారు మనోళ్లు. బ్యాంకాక్ వేదికగా జరుగుతున్న థాయ్‌లాండ్ అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నీలో నిజామాబాద్ యువ బాక్సర్లు నిఖత్ జరీన్, మహ్మద్ హుస్సాముద్దీన్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. శుక్రవారం జరిగిన వేర్వేరు ఫైనల్స్‌లో ప్రత్యర్థులను చిత్తుచేస్తూ పసిడి పోరులో నిలిచారు. నిఖత్, హుస్సాముద్దీన్ సహా దీపక్ సింగ్, ఆశిష్ కుమార్, బ్రిజేశ్ యాదవ్ ఫైనల్లోకి ప్రవేశించి కనీసం రజతం ఖాయం చేసుకున్నారు.

**ఇందూరు పంచ్ అదుర్స్**

ఇందూరు యువ బాక్సర్లు నిఖత్ జరీన్, హుస్సాముద్దీన్ తమ పంచ్ పవర్ ఏంటో ప్రత్యర్థులకు రుచి చూపించారు. ఎదురైన వారినల్లా చిత్తుచేస్తూ టైటిల్ పోరుకు అర్హత సాధించారు. శుక్రవారం జరిగిన మహిళల 51కిలోల సెమీస్ బౌట్‌లో బరిలోకి దిగిన నిఖత్ 4-1 తేడాతో జుటామస్ జిట్‌పాంగ్‌పై అద్భుత విజయం సాధించింది. ఆది నుంచే పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తూ పదునైన పంచ్‌లతో విరుచుకుపడింది. బౌట్‌లో చిరుతలా కదులుతూ పంచ్‌లకు తోడు జాబ్స్, హుక్స్‌తో చెలరేగి కీలక పాయింట్లు కొల్లగొట్టింది. ఈ ఇందూరు అమ్మాయి కొట్టిన పంచ్‌లకు థాయ్‌లాండ్ బాక్సర్ నుంచి సరైన సమాధానం లేకపోయింది. రిఫరీ విజేతను నిర్ణయించే సమయంలో ఒక్కసారిగా స్టేడియం దద్దరిల్లేలా అరిచి నిఖత్ తన విజయాన్ని ఆస్వాదించింది. శనివారం జరిగే ఫైనల్లో చైనా బాక్సర్ చువాన్ చుతో జరీన్ తలపడుతుంది. బౌట్ ముగిసిన తర్వాత మీడియాతో మాట్లాడుతూ 'థాయ్‌లాండ్ టోర్నీ సెమీస్ బౌట్ విజయాన్ని దేశం కోసం కార్గిల్ యుద్ధంలో అమరులైన వీర జవాన్లకు అంకితమిస్తున్నాను' అని నిఖత్ ప్రకటించింది. మిగతా విభాగాల్లో మంజు రాణి(48కి), భాగ్యబతి కచారీ(81కి) ఓటమితో కాంస్య పతకాలు అందుకున్నారు. మరోవైపు పురుషుల 56కిలోల విభాగం సెమీస్‌లో హుస్సాముద్దీన్ 3-2తో అమైత్ యవోదామ్‌పై గెలిచి ఫైనల్ పోరులో నిలిచాడు. తనదైన దూకుడు కనబరుస్తూ థాయ్‌లాండ్ బాక్సర్‌పై హుస్సాముద్దీన్ క్లీన్‌పంచ్‌లు విసిరాడు. దీపక్ సింగ్(49కి), ఆశిష్ కుమార్(75కి), బ్రిజేశ్ యాదవ్(81కి) ఫైనల్లోకి ప్రవేశించారు. మొత్తంగా ఎనిమిది మందికి గాను ఐదుగురు భారత బాక్సర్లు టైటిల్ పోరులో నిలిచారు.



హుస్సాముద్దీన్

# ఐర్లాండ్ 38 ఆలౌట్

### వోక్స్, బ్రాడ్ విజృంభణ.. ఏకైక టెస్ట్‌లో ఇంగ్లండ్ ఘన విజయం

**లండన్ :** తొలి ఇన్నింగ్స్ పీడకల నుంచి త్వరగానే కోలుకున్న ఇంగ్లండ్ అనూహ్యంగా పుంజుకొని ఐర్లాండ్‌ను చిత్తుగా ఓడించింది. లార్డ్స్ వేదికగా ఐరిష్ జట్టుతో జరిగిన ఏకైక టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో బౌలర్లు చెలరేగడంతో ఇంగ్లిష్ జట్టు 143 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఓవర్ నైట్ స్కోరు 303/9తో శుక్రవారం మూడో రోజు ఆటకు బరిలోకి దిగిన ఇంగ్లండ్ ఒక్కపరుగు కూడా చేయకుండానే వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత 182 పరుగుల లక్ష్యఛేదనకు దిగిన ఐర్లాండ్‌ను క్రిస్ వోక్స్(6/17 ), స్టువర్ట్ బ్రాడ్(4/19) నిప్పులు చెరిగే బంతులతో 15.4 ఓవర్లలో 38 పరుగులకే కుప్పకూల్చేశారు. ఐరిష్ జట్టులో మెక్‌కల్లమ్ మాత్రమే 11పరుగులు చేయగా.. మిగతా 10 మంది సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. 94 బంతుల్లోనే ఐర్లాండ్ మొత్తం ఆలౌటైపోయింది. రెండో ఇన్నింగ్స్‌లో 92 పరుగులు చేసిన ఇంగ్లండ్ ఓపెనర్ జాక్ లీచ్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది.

**ఇద్దరే కూల్చేశారు**

తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్‌ను 85 పరుగులకు ఔట్ చేసి.. 122 పరుగుల ఆధిక్యం సాధించి మ్యాచ్ గెలుపుపై ఆశపడ్డ ఐర్లాండ్‌కు రెండో ఇన్నింగ్స్‌లో ఘోర భంగపాటు ఎదురైంది. 182 పరుగుల లక్ష్యఛేదనకు బరిలోకి దిగిన ఆ జట్టు బ్యాట్స్‌మెన్ వచ్చిన వారు వచ్చినట్టు పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఇంగ్లండ్ బౌలర్లు క్రిస్ వోక్స్(7.4ఓవర్లు), స్టువర్ట్ బ్రాడ్(8 ఓవర్లు) మాత్రమే బౌలింగ్ చేసి ఐర్లాండ్‌ను ఆలౌట్ చేశారు. పరిస్థితులు అనుకూలించడంతో వేగం, స్వింగ్‌తో వారిద్దరూ రెచ్చిపోతూ పోటీపడి వికెట్లు పడగొట్టారు. దీంతో 15.4 ఓవర్లలోనే 38 పరుగులకే ఐర్లాండ్ పేకమేడలా కుప్పకూలింది. జేమ్స్ మెకల్లమ్ చేసిన 11 పరుగులే ఐర్లాండ్ ఇన్నింగ్స్‌లో అత్యధికం. నలుగురు పరుగుల ఖాతా కూడా తెరవకుండానే నిష్క్రమించారు. ప్రపంచకప్ గెలిచిన తర్వాత పసికూనతో పరాభవం తప్పదేమో అని భయపడ్డ ఇంగ్లండ్ ఎట్టకేలకు భారీ విజయం సాధించి ఆగస్టు 1 నుంచి ప్రారంభమయ్యే యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియాతో తలపడేందుకు ఆత్మవిశ్వాసంతో సిద్ధమైంది.

**సంక్షిప్త స్కోర్లు**

**తొలి ఇన్నింగ్స్ : ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్;** 85 ఆలౌట్; **ఐర్లాండ్ తొలి ఇన్నింగ్స్;** 207- ఆలౌట్

**ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్:** 303 ఆలౌట్; **ఐర్లాండ్ రెండో ఇన్నింగ్స్:** 15.4 ఓవర్లలో 38 ఆలౌట్(మెక్‌కల్లమ్ 11, ఆదిర్ 8, వోక్స్ 6/17, బ్రాడ్ 4/19)




**7**

టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఐర్లాండ్ ఏడో అత్యల్ప స్కోరు (38 ఆలౌట్)ను నమోదు చేసింది. 1955లో ఇంగ్లండ్‌పై న్యూజిలాండ్ 26 పరుగులకే కుప్పకూలింది.

# సింధు నిష్క్రమణ

### క్వార్టర్స్‌లో యమగుచి చేతిలో ఓటమి
### సెమీస్ చేరిన సాయి ప్రణీత్
### జపాన్ ఓపెన్

**సీజన్‌లో తొలి టైటిల్ సాధించాలన్న పీవీ సింధు కల మరోసారి చెదిరింది. ఇండోనేషియా ఓపెన్‌లో ఫైనల్ వరకు వెళ్లి ఆశను నీరుగార్చుకున్న తెలుగు షట్లర్... జపాన్ ఓపెన్‌లో క్వార్టర్స్‌లోనే నిష్క్రమించింది. ఐదో సీడ్ సింధును రెండుసార్లు యమగూచి(జపాన్)నే ఓడించింది. మరోవైపు భారత యువషట్లర్, ఆన్‌సీడెడ్ సాయి ప్రణీత్ క్వార్టర్స్‌లో అద్భుతంగా ఆడి జపాన్ ఓపెన్‌లో తొలిసారి సెమీస్‌కు దూసుకెళ్లి.. భారత్ టైటిల్ ఆశలను సజీవంగా ఉంచాడు.**



**టోక్యో:** జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో అంచనాలకు మించి రాణిస్తూ.. అద్భుత ఆటతీరుతో భారత యువ షట్లర్ సాయి ప్రణీత్ సెమీఫైనల్‌కు దూసుకెళితే... స్థాయికి తగ్గ ఆటను ప్రదర్శించడంలో విఫలమైన స్టార్ షట్లర్ పీవీ సింధు క్వార్టర్స్‌లోనే నిష్క్రమించింది. ఇండోనేషియా ఓపెన్‌లో ఓడిన యమగుచి చేతిలోనే శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో 18-21, 15-21 తేడాతో ఈ తెలుగమ్మాయి పరాజయం పాలైంది. పురుషుల డబుల్స్ క్వార్టర్స్‌లోనూ సాత్విక్ సాయిరాజ్ రాంకీరెడ్డి, చిరాగ్ శెట్టి జోడీ 19-21, 18-21 తేడాతో జపాన్ ద్వయంపై ఓడి టోర్నీ నుంచి ఔటైంది.

**ఆధిపత్యాన్ని నిలుపుకోలేక..**

మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో యమగుచిపై 50 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో ప్రారంభంలో పీవీ సింధు ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. 12-7తో నిలిచి తొలి గేమ్‌ను సొంతం చేసుకుటుందనుకుంటున్న స్థితిలో అనవసర తప్పిదాలు చేసి ప్రత్యర్థికి వరుసగా పాయింట్లను సమర్పించింది. దీంతో 14-14తో పాయింట్లు సమమయ్యాయి. అక్కడి నుంచి దూకుడైన ఆటతో 18-15 ఆధిక్యంలో దూసుకెళ్లిన యమగుచి.. 20-16 వద్దకు చేరింది. ఆ సమయంలో గేమ్‌ను నిలబెట్టుకునేందుకు సింధు రెండు పాయింట్లు సాధించి శ్రమించినా ఫలితం లేకపోయింది. 18-21తో తొలిగేమ్‌ను కోల్పోయింది. రెండో గేమ్ హోరాహోరీగా సాగగా 6-6తో ఓ దశలో సింధు, యమగుచి సమానపాయింట్లతో నిలిచారు. ఆ సమయంలో జపాన్ స్టార్ మరోసారి అద్భుతమైన షాట్లు ఆడి 13-7కు.. ఆ తర్వాత 16-10కి చేరుకుంది. ఇక అప్పటి నుంచి కోలుకోలేకపోయిన సింధు.. 15-21తో రెండో గేమ్‌ను కూడా చేజార్చుకొని టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఒలింపిక్స్‌కు ఏడాది మాత్రమే సమయమున్న నేపథ్యంలో సింధు సహా భారత స్టార్ షట్లర్ల ప్రదర్శన కాస్త ఆందోళనకరంగా కనిపిస్తున్నది.

**సూపర్.. ప్రణీత్**

పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో భారత యువ ఆటగాడు, అన్ సీడెడ్ ప్లేయర్ సాయి ప్రణీత్ అదరగొట్టాడు. టామీ సుగియార్తో (ఇండోనేషియా)పై 21-12, 21-15 తేడాతో సునాయాసంగా గెలిచి సత్తాచాటాడు. 36 నిమిషాల్లోనే ప్రత్యర్థిని మట్టికరిపించి తొలిసారి జపాన్ ఓపెన్‌లో సెమీఫైనల్ చేరాడు. తొలి గేమ్ ఆసాంతం ప్రణీత్ పూర్తి ఆధిక్యంలోనే కొనసాగాడు. రెండో గేమ్‌లో ప్రత్యర్థి నుంచి కాస్త ప్రతిఘటనను ఎదుర్కొన్నా.. దూకుడు ప్రదర్శించి 18-15 ఉన్న సమయంలో వరుస పాయింట్లు సాధించి మ్యాచ్‌ను అలవోకగా చేజిక్కించుకున్నాడు. సెమీస్‌లో టాప్ సీడ్ కెంటో మొమొంటా(జపాన్)తో తలపడతాడు. మరోవైపు పురుషుల డబుల్స్‌లో భారత జోడీ సాత్విక్ సాయిరాజ్ రాంకీరెడ్డి, చిరాగ్‌శెట్టి జోడీ 19-21, 18-21 తేడాతో జపాన్ ద్వయం తకేషీ కమురా, కీగో సోనోదాపై పరాజయం పాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది.



సాయి ప్రణీత్

## విండీస్ వన్డే జట్టులో గేల్

**సెయింట్‌జాన్స్(అంటిగ్వా):** భారత్‌తో వచ్చే నెలలో సొంతగడ్డపై జరిగే మూడు వన్డేల సిరీస్ కోసం గేల్.. విండీస్ జట్టులో చోటు దక్కించుకున్నాడు. 14 మంది ఆటగాళ్లతో వెస్టిండీస్ బోర్డు శుక్రవారం ప్రకటించిన జట్టులో క్యాంప్‌బెల్, రోస్టన్ చేస్, కీమో పాల్ కూడా ఉన్నారు. ప్రపంచకప్ ముగిశాక అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైరవుతానని ఈ ఏడాది మార్చిలో ప్రకటించిన గేల్ ఆ తర్వాత మనసు మార్చుకొని భారత్‌తో సిరీస్ కోసం అందుబాటులో ఉంటానంటూ ప్రకటించిన సంగతి తెలిసిందే. గ్లోబల్ టీ20 టోర్నీ ఆడుతున్న అతడు వచ్చే నెల 3న ప్రారంభమయ్యే టీ20 సిరీస్‌కు దూరమయ్యాడు.

## టెస్టులకు ఆమిర్ గుడ్‌బై



**కరాచీ :** పాకిస్థాన్ స్టార్ ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ ఆమిర్ అనూహ్యంగా టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో కొనసాగుతానని స్పష్టం చేశాడు. బంతిని ఇరువైపులా స్వింగ్ చేస్తూ స్టార్ బ్యాట్స్‌మెన్‌కు సైతం ఈ పాకిస్థానీ బౌలర్ అనేక సందర్భాల్లో చెమటలు పట్టించాడు. 17 ఏండ్ల వయసు(2009)లోనే శ్రీలంకతో టెస్టులో అరంగేట్రం చేసి అద్భుతమైన స్వింగ్ బౌలింగ్‌తో పాకిస్థాన్‌కు దొరికిన మరో ఆణిముత్యం అంటూ ప్రశంసలు పొందాడు. అయితే 2010లో స్పాట్ ఫిక్సింగ్ ఆరోపణలతో ఆమిర్ కెరీర్ ప్రమాదంలో పడింది. ఫిక్సింగ్‌లో దోషిగా తేలడంతో అతడు 2010 నుంచి ఐదేండ్ల పాటు నిషేధాన్ని ఎదుర్కొన్నాడు. కొంతకాలం జైలు జీవితాన్ని గడిపాడు. పాక్ తరఫున 39 టెస్టులాడిన ఆమిర్ 119 వికెట్లు తీశాడు. ఇప్పటి వరకు 59 వన్డేలు,49 టీ 20లు ఆడాడు.

## టైటాన్స్ నాలుగోసారి

### పాట్నా పైరేట్స్ చేతిలో ఓటమి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** సొంతగడ్డపై బోణీ కొట్టాలన్న తెలుగు టైటాన్స్ ఆశలు నెరవేరలేదు. కోచ్, కెప్టెన్ మారినా జట్టు ఆటతీరులో మాత్రం మార్పు రాలేదు. అభిమానులను నిరాశ పరుస్తూ తమ తొలి అంచె పోటీలను టైటాన్స్ విజయం లేకుండానే ముగించింది. శుక్రవారం స్థానిక గచ్చిబౌలి స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 22-34 తేడాతో పాట్నా పైరేట్స్ చేతిలో ఓటమిపాలైంది. టైటాన్స్ తరఫున రైడింగ్‌లో సిద్దార్థ్ దేశాయ్(5), డిఫెన్స్‌లో విశాల్ భరద్వాజ్(2) ఆకట్టుకోగా, పాట్నా జట్టులో పర్‌దీప్ నార్వల్(7), జైదీప్(6) రాణించారు. వరుసగా నాలుగో ఓటమితో టైటాన్స్ రెండు పాయింట్లతో పదో స్థానానికి పరిమితం కాగా, పైరేట్స్ 6 పాయింట్లతో నాలుగులో ఉంది. మ్యాచ్‌లో మొదటి నుంచి టైటాన్స్ తడబడగా.. పైరేట్స్ మాత్రం దూకుడు కనబరుస్తూ పాయింట్లు కొల్లగొట్టింది. ఓవైపు పర్‌దీప్‌నార్వల్ రైడింగ్‌లో రాణిస్తే..డిఫెన్స్‌లో జాంగ్ కున్‌లీ, హాది ఒష్తోరక్, మహమ్మద్ మగ్సోద్లౌ గెలుపులో కీలకంగా వ్యవహరించారు. బాహుబలి బ్రదర్స్ సిద్దార్థ్ దేశాయ్, సూరజ్ దేశాయ్‌ను కట్టడి చేస్తూ టైటాన్స్ గెలుపు అవకాశాలను దెబ్బతీశారు. రైడింగ్ వచ్చిన దాదాపు ప్రతిసారి సిద్దార్థ్‌ను ఒడిసిపడుతూ మ్యాచ్‌పై పట్టు బిగించింది. అంతకు ముందు జరిగిన మరో మ్యాచ్‌లో గుజరాత్ ఫార్చున్ జెయింట్స్ 44-19తో యూపీ యోధాపై గెలిచింది.



## నిస్సాన్‌లో 1,700 సిబ్బందిపై వేటు!

**న్యూఢిల్లీ, జూలై 26:** జపాన్‌కు చెందిన వాహన తయారీ సంస్థ నిస్సాన్..దేశవ్యాప్తంగా 1,700 మంది సిబ్బందిని తొలిగించాలనుకుంటున్నది. ప్రపంచవ్యాప్తంగా 6 వేల మంది సిబ్బందిని తగ్గించుకోవాలని చూస్తున్న సంస్థ.. తయారీ యూనిట్‌లో అత్యధిక మందిపై వేటు వేయాలనుకుంటున్నది. ఇండస్ట్రీ వర్గాల ప్రకారం చెన్నైలో ఉన్న రెనో-నిస్సాన్ ప్లాంట్లో విధులు నిర్వహిస్తున్న 1,700 మంది ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉన్నదని తెలిపారు. దీనిపై నిస్సాన్ మోటార్ వర్గాలు స్పందించడానికి నిరాకరించారు.



## ఎట్టకేలకు లాభాల్లోకి పీఎన్‌బీ

### తొలి త్రైమాసికంలో రూ.1,019 కోట్లు

**న్యూఢిల్లీ, జూలై 26:** ప్రభుత్వరంగ సంస్థ పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) ఎట్టకేలకు లాభాల్లోకి వచ్చింది. నీరవ్ మోదీ దెబ్బకు గడిచిన రెండేండ్లుగా నష్టాలతో కాలంవెళ్లదీసిన బ్యాంక్ తిరిగి కోలుకున్నది. జూన్ 30తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను బ్యాంక్ రూ.1,019 కోట్ల లాభాన్ని గడించింది. మొండి బకాయిలు తగ్గుముఖం పట్టడం, ఆస్తుల నాణ్యత ప్రమాణాలు మెరుగుపడటం ఇందుకు దోహదం చేశాయి. అంతక్రితం ఏడాది ఇదే కాలానికిగాను బ్యాంక్ రూ.940 కోట్ల నష్టాన్ని చవిచూసింది. మార్చి 31తో ముగిసిన త్రైమాసికంలో రూ.4,750 కోట్ల నష్టాన్ని నమోదు చేసుకున్న బ్యాంక్..గతేడాది మొత్తానికిగాను రూ.9,975 కోట్లు నష్టపోయింది. బ్యాంకుకు చెడు రోజులు పోయి మంచి రోజులు వచ్చాయని..వచ్చే త్రైమాసికాల్లో మరింత వృద్ధిని సాధిస్తామని పీఎన్‌బీ ఎండీ, సీఈవో సునీల్ మెహతా తెలిపారు. సంస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని, దీనివల్లనే నిలకడైన వృద్ధి, ఆస్తుల నాణ్యత ప్రమాణాలు మెరుగుపడ్డాయని ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన చెప్పారు. సమీక్షకాలంలో బ్యాంక్ ఆదాయం రూ.15,072.41 కోట్ల నుంచి రూ.15,161.74 కోట్లకు చేరాయి. రుణాల ప్రాసెసింగ్ వ్యవస్థను కేంద్రీకరించడం, ఒత్తిడిలో ఉన్న ఆస్తులను విక్రయించడం, ప్రస్తుతం రుణాల రికవరీకి ఉన్న వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇచ్చాయన్నారు. 2018-19లో 18.26 శాతంగా(రూ.82,888.79 కోట్లు) ఉన్న స్థూల నిరర్థక ఆస్తుల విలువ గత త్రైమాసికానికిగాను 16.49 శాతానికి(రూ.77,267.29 కోట్లు) తగ్గాయి. అలాగే నికర ఎన్‌పీఏ కూడా 10.58 శాతం(రూ.43,872.47 కోట్లు) నుంచి 7.17 శాతానికి(రూ.30,179.66 కోట్లు) పరిమితమయ్యాయి. మొండి బకాయిలు తగ్గుముఖం పట్టాయన్న మెహతా..వచ్చే మార్చి నాటికి స్థూల నిరర్థక ఆస్తుల విలువ అడ్వాన్స్‌లో 10-12 శాతానికి తగ్గించేదానిపై ఆయన గట్టి నమ్మకాన్ని వ్యక్తం చేశారు. గత త్రైమాసికంలో బ్యాంక్ మొండి బకాయిలను పూడ్చుకోవడానికి రూ.2,147.13 కోట్ల నిధులను మాత్రమే వెచ్చించింది. అంతక్రితం ఏడాది ఇది రూ.4,981.99 కోట్లుగా ఉన్నాయి.రూ.5,412 కోట్ల మొండి బకాయిలను తగ్గించుకున్న బ్యాంక్..కొత్తగా రూ.4,711 కోట్ల రుణాలు నిరర్థక ఆస్తులుగా గుర్తించింది. జూన్ 30 నాటికి దేశవ్యాప్తంగా బ్యాంక్ డిపాజిట్లు రూ.4.86 లక్షల కోట్ల నుంచి రూ.6.49 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించడంతో బ్యాంక్ షేరు ధర 2.95 శాతం బలపడి రూ.68 వద్ద ముగిసింది.

# నిరాశపరిచిన మారుతి

### క్యూ1లో 32 శాతం తగ్గిన లాభం.. దెబ్బతీసిన అమ్మకాలు, తరుగుదల




**న్యూఢిల్లీ, జూలై 26:**
దేశంలో అతిపెద్ద వాహన తయారీ సంస్థ మారుతి సుజుకీ నిరాశాజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. జూన్ 30తో ముగిసిన త్రైమాసికానికిగాను సంస్థ రూ.1,376.80 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే కాలానికి నమోదైన రూ.2,015.10 కోట్ల లాభంతో పోలిస్తే 31.67 శాతం క్షీణించింది. అమ్మకాలు పడిపోవడం, తరుగుదల ఖర్చులు అధికమవడం ఆర్థిక ఫలితాలపై ప్రభావం చూపాయని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఏప్రిల్-జూన్ మధ్యకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 14 శాతం క్షీణించి రూ.18,738.80 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది ఇది రూ.21,813.80 కోట్లుగా ఉన్నది. గత త్రైమాసికంలో తరుగుదల, రుణ విమోచన ఖర్చులు రూ.720.30 కోట్ల నుంచి రూ.919 కోట్లకు చేరుకోవడం లాభాలపై ప్రతికూల ప్రభావం చూపింది. సమీక్షకాలంలో కంపెనీ 4,02,594 వాహనాలను విక్రయించింది. వీటిలో దేశవ్యాప్తంగా 3,74,481 యూనిట్లను విక్రయించగా, 28,113లను ఇతర దేశాలకు ఎగుమతి చేసింది. ఆటోమొబైల్ రంగంలో నెలకొన్న మందకొడి పరిస్థితుల కారణంగా అమ్మకాలు భారీగా పడిపోయాయని, వరుసగా నాలుగో త్రైమాసికంలోనూ అమ్మకాలు పడిపోయాయని కంపెనీ సీఎఫ్‌వో అజయ్ సేథ్ తెలిపారు. గత త్రైమాసికంలో దేశవ్యాప్తంగా ప్యాసింజర్ వాహన విక్రయలు 18 శాతం పతనమవగా, దీంతో కంపెనీ సేల్స్ కూడా 19.3 శాతం దిగువకు పడిపోయాయన్నారు. ప్రస్తుత ఇబ్బందికర పరిస్థితుల నుంచి గట్టెక్కడానికి సంస్థ అన్ని రకాలుగా ప్రయత్నిస్తున్నదని చెప్పారు. గ్రామాల్లో కార్లను కొనుగోలు చేసేవారు తగ్గిపోవడంతో మొత్తం ఇండస్ట్రీ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నదని మారుతి సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(మార్కెటింగ్ అండ్ సేల్స్) ఆర్‌ఎస్ కల్సీ తెలిపారు. తొలి త్రైమాసికంలో అమ్ముడైన ప్యాసింజర్ వాహనాల్లో 66 శాతం పెట్రోల్ వాహనాలేనని, దీంతో కంపెనీ మొత్తం విక్రయాల్లో పెట్రోల్ ఇంజిన్ కలిగిన వాహనాల వాటా 72 శాతం నుంచి 78 శాతానికి పెరిగినట్లు ఆయన చెప్పారు.

**మూడేండ్ల వరకు సుజుకీకి రాయల్టీ యెన్లలో చెల్లింపులు**

తన అనుబంధ సంస్థయైన సుజుకీ మోటర్ కార్పొరేషన్‌కు రాయల్టీ కింద చెల్లించాల్సిన చెల్లింపులను వచ్చే మూడేండ్ల వరకు యెన్ కరెన్సీ రూపంలో చెల్లింపులు జరుపబోతున్నట్లు సంస్థ ప్రకటించింది. ప్రస్తుతం కంపెనీకి వచ్చిన మొత్తం ఆదాయంలో 5.2 శాతం రాయల్టీ రూపంలో చెల్లిస్తున్నది. 2021-22 తర్వాత అన్ని రకాల వాహనాలపై యెన్‌లకు బదులు రూపాయల్లో చెల్లించాల్సి ఉంటుందని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. 2016లో విటారా బ్రెజ్జాను విడుదల చేసిన 2016 నుంచి సంస్థ సుజుకీకి రూపాయికి బదులు యెన్లలో రాయల్టీ చెల్లిస్తున్నది. ఇటీవల జరిగిన సమావేశంలో కంపెనీ చైర్మన్ ఆర్‌సీ భార్గవ మాట్లాడుతూ..2025 నాటికి రాయల్టీని రూపాయల్లో చెల్లించే అవకాశం ఉంటుందన్నారు. మరోవైపు వాతావరణ కాలుష్యం తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా అన్ని రకాల కార్లను బీఎస్-6 ప్రమాణాలకు తగ్గట్టుగా తయారు చేయనున్నట్లు కల్సీ ప్రకటించారు. వచ్చే ఏప్రిల్ వరకు గడువునిచ్చింది. కంపెనీకి చెందిన అన్ని మోడళ్లు ఈ ఏడాది చివరినాటికి సిద్ధమవనున్నాయని, ఇప్పటికే ఆల్టో, వ్యాగన్‌ఆర్, స్విఫ్ట్, డిజైర్, బాలెనోలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి కంపెనీ షేరు ధర స్వల్పంగా పెరిగి రూ.5,805.55 వద్ద ముగిసింది.

### బజాజ్ ఆటో ప్రాఫిట్ డౌన్

ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ బజాజ్ ఆటో నిరాశాజనక ఆర్థిక ఫలితాలను నమోదు చేసుకున్నది. జూన్ 30తో ముగిసిన మూడు నెలల కాలానికి కంపెనీ నికర లాభం ఏడాది ప్రాతిపదికన 3 శాతం క్షీణించి రూ.1,012.16 కోట్లకు పడిపోయింది. అంతక్రితం ఏడాది ఇది రూ.1,041.77 కోట్లుగా ఉన్నది. సమీక్షకాలంలో రూ.7,755.82 కోట్ల ఆదాయాన్ని ఆర్జించినట్లు సంస్థ బీఎస్‌ఈకి సమాచారం అందించింది. మొత్తంగా సంస్థ 12,47,174 యూనిట్ల వాహనాలను విక్రయించింది. అలాగే 5,50,021 వాహనాలను ఇతర దేశాలకు ఎగుమతి చేయగా, వీటిలో 78 వేలు కమర్షియల్ వాహనాలు. దేశీయ మోటార్‌సైకిల్ మార్కెట్లో కంపెనీ వాటా 16.3 శాతం నుంచి 18.3 శాతానికి పెరిగింది. అలాగే కమర్షియల్ వాహన సెగ్మెంట్‌లో అగ్రస్థాయిలో దూసుకుపోతున్న కంపెనీ గత మూడు నెలల్లో 86 వేల యూనిట్లను విక్రయించింది. ప్రస్తుతం సంస్థ వద్ద రూ.17,126 కోట్ల నగదు నిల్వలు ఉన్నాయి. స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి కంపెనీ షేరు ధర 4.71 శాతం బలపడి రూ.2,665 వద్ద ముగిసింది.

## కంపెనీల సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**న్యూఢిల్లీ, జూలై 26:** మోసపూరిత కంపెనీలకు చెక్‌పెట్టడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంపెనీల సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లు దెబ్బకు ఇప్పటికే 4 లక్షల దొంగ కంపెనీలు రిజిస్ట్రేషన్లను రద్దుచేసుకోగా, అలాగే సీఎస్‌ఆర్ నిబంధనలను మరింత కఠినతరం చేయడానికి ఈ బిల్లులో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ బిల్లును కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. కార్పొరేట్ సంస్థలకు వచ్చిన మొత్తం లాభాల్లో కచ్చితంగా రెండు శాతం సీఎస్‌ఆర్ కింద ఖర్చు చేయడం లేదు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ఈ కంపెనీల సవరణ బిల్లుతో సులభతర వాణిజ్య పనితీరు మెరుగుపడనున్నదని, అలాగే కంపెనీలపై పడుతున్న భారం తగ్గనున్నదని, ముఖ్యంగా చిన్న స్థాయి సంస్థలకు ఊరట లభించనున్నదని వ్యాఖ్యానించారు. షెల్ కంపెనీలపై సభ్యులు లేవనెత్తిన ఆందోళనపై మంత్రి సమాధానమిస్తూ..మోస పూరిత కంపెనీలకు చెక్ పెట్టాలనే ఉద్దేశంతో ఈ సవరణ బిల్లును ప్రవేశపెట్టినట్లు, ఒకే చిరునామా కింద పదుల సంఖ్యలో సంస్థలు నడుస్తున్నాయన్నారు. సరాసరిగా మూడేండ్ల వరకు రూ.5 కోట్ల నికర లాభాన్ని, రూ.100 కోట్ల టర్నోవర్ లేదా రూ.500 కోట్ల నికర విలువ కలిగిన సంస్థలు తమకు వచ్చిన లాభంలో రెండు శాతం సీఎస్‌ఆర్ కింద ఖర్చు చేయాలని గతంలో కేంద్రం ఆదేశించింది.

# అగ్రస్థానానికి జియో

### 33 కోట్ల వినియోగదారులతో తొలిస్థానం

### వొడాఫోన్ ఐడియాను రెండోస్థానానికి నెట్టిన సంస్థ

### టెలికం సేవలు ఆరంభించి మూడేండ్లలోనే ఈ ఘనత

**న్యూఢిల్లీ, జూలై 26:** ముకేశ్ అంబానీకి చెందిన టెలికం సంస్థ రిలయన్స్ జియో మరో రికార్డును సృష్టించింది. టెలికం సేవలు ఆరంభించిన మూడేండ్లలో దేశంలో అతిపెద్ద టెలికం సంస్థగా అవతరించింది. జూన్ 30 నాటికి 33.13 కోట్ల వినియోగదారులతో ఈ స్థానానికి చేరుకున్నది. ఇన్నాళ్లు తొలిస్థానంలో ఉన్న వొడాఫోన్ ఐడియా వినియోగదారులు 32 కోట్లకు పడిపోయినట్లు సంస్థ శుక్రవారం ప్రకటించడంతో జియో తొలిస్థానాన్ని ఆక్రమించుకున్నట్లు అయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆర్థిక ఫలితాలను విడుదల చేసినప్పుడు జియో వినియోగదారుల సంఖ్య 33.13 కోట్లుగా ఉన్నట్లు వెల్లడించింది. ఈ ఏడాది మే నెలలో భారతీ ఎయిర్‌టెల్‌ను దాటేసి రెండో అతిపెద్ద సంస్థగా అవతరించిన జియో..ఆ మరుసటి నెలలోనే వొడాఫోన్ ఐడియాను దాటేయడం విశేషం. టెలికం నియంత్రణ మండలి ట్రాయ్ విడుదల చేసిన నివేదిక ప్రకారం జియోకు 32.29 కోట్ల మంది సబ్‌స్క్రైబర్లు, 27.80 శాతం మార్కెట్ వాటా కలిగివున్నది. ప్రస్తుతం ఎయిర్‌టెల్‌కు 32.03 కోట్ల మంది వినియోగదారులు ఉండగా, మార్కెట్ వాటా 27.6 శాతంగా ఉన్నది. జూన్ 30 నాటికి సబ్‌స్క్రైబర్ల సంఖ్య 33 కోట్ల నుంచి 32 కోట్లకు తగ్గినట్లు వొడాఫోన్ ఐడియా ప్రకటించింది. వొడాఫోన్ ఇండియా, ఐడియా సెల్యులార్ విలీనమైనప్పుడు 40 కోట్ల కంటే అధికంగా ఉన్న వినియోగదారులు క్రమంగా తగ్గుముఖం పట్టారు. జియో ప్రకటించిన ఆఫర్ల దెబ్బకు ఇతర టెలికం సంస్థలు ఆర్థికంగాను, ఇటు వినియోగదారుల రూపంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. విలీనమైన నాటి నుంచి వొడాఫోన్ ఐడియా సంస్థ కస్టమర్లను క్రమంగా కోల్పోతున్నది.

## వొడాఫోన్-ఐడియా నష్టం రూ.4,874 కోట్లు

### రూ. 11,270 కోట్లకు తగ్గిన ఆదాయం.. 32 కోట్లకు తగ్గిన వినియోగదారులు

**న్యూఢిల్లీ, జూలై 26:** ప్రముఖ టెలికం సంస్థ వొడాఫోన్-ఐడియా నష్టాల పరంపర కొనసాగుతున్నది. జూన్30తో ముగిసిన మూడు నెలల కాలానికి సంస్థ రూ.4,873.90 కోట్ల నష్టాన్ని నమోదు చేసుకున్నది. 2018-19 ఏడాది ఇదే సమయంలో నమోదైన రూ.4,881.90 కోట్లతో పోలిస్తే స్వల్పంగా తగ్గింది. గతేడాది ఆగస్టు 31నే ఐడియా సెల్యులార్‌ను వొడాఫోన్ గ్రూపులో విలీనమైన విషయం తెలిసిందే. దీంతో దేశంలో అతిపెద్ద టెలికం సంస్థగా అవతరించాయి. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.11,775 కోట్ల నుంచి రూ.11,269.90 కోట్లకు పడిపోయింది. ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ జియో రంగప్రవేశం చేసిననాటి నుంచి భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. గతేడాది నాలుగో త్రైమాసికంలో నమోదైన ఆదాయంతో పోలిస్తే తొలి త్రైమాసికం నాటికి 4.3 శాతం తగ్గింది. వ్యాపార విస్తరణకు అవసరమైన నిధుల్లో రూ.25 వేల కోట్లను రైట్స్ ఇష్యూ ద్వారా సేకరించింది. నిరాశాజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించినప్పటికీ నెట్‌వర్క్‌ను మరింత విస్తరించడంతోపాటు వినియోగదారులకు నూతన డాటా అనుభవం కల్పించడానికి ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసినట్లు వొడాఫోన్ ఐడియా సీఈవో బాలేష్ శర్మ తెలిపారు. వచ్చే ఏడాది తొలి త్రైమాసికం నాటికి పరిస్థితులు అన్ని కుదుటపడే అవకాశం ఉందన్నారు. తొలి త్రైమాసికంలో వ్యాపారాన్ని మరింత విస్తరించడానికి రూ.2,840 కోట్ల నిధులను వెచ్చించగా, ఇదే సమయంలో కంపెనీకి మొత్తం అప్పు రూ.12,044 కోట్లుగా ఉన్నది. గతేడాది చివరి త్రైమాసికంలో 33.41 కోట్లుగా ఉన్న వినియోగదారులు గత నెల చివరినాటికి 32 కోట్లకు తగ్గారు. జియో ఉచిత సేవలు, చౌకకే డాటాను అందించడంతోపాటు టెలికం నియంత్రణ మండలి ట్రాయ్ టర్మినేషన్ చార్జీలను తగ్గించేయోచనలో ఉండటం భవిష్యత్తులో మరింత ప్రభావం పడనున్నదని ఆయన చెప్పారు. రెండో టెలికం సంస్థగా అవతరించిన రిలయన్స్ జియో నికర లాభం ఏడాది ప్రాతిపదికన 45.6 శాతం ఎగబాకి రూ.891 కోట్లకు చేరుకోగా, ఆదాయం 44 శాతం పెరిగి రూ.11,679 కోట్లకు చేరుకున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే.

## వీఆర్‌ఎస్‌పై ముందే చర్చించాను

■ మాజీ ఆర్థిక కార్యదర్శి ఎస్‌సీ గార్గ్



**న్యూఢిల్లీ, జూలై 26:** బదిలీ కంటే ముందే స్వచ్ఛంద పదవీ విరమణ విషయంపై ప్రధాన మంత్రి కార్యాలయం(పీఎంవో)తో ఈ నెల 18న చర్చించినట్లు మాజీ ఆర్థిక కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ స్పష్టంచేశారు. వీఆర్‌ఎస్‌పై చర్చించిన తర్వాత బదిలీ ఆర్డర్ వచ్చిందని, ఈ రెండింటికి ఎలాంటి సంబంధం లేదని విలేకరులతో గార్గ్ చెప్పారు. ప్రభుత్వ మద్దతుతో ఆర్థిక శాఖలో ఎన్నో కీలక నిర్ణయాలు తీసుకున్నానని, వీఆర్‌ఎస్ ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం ఆమోదిస్తాదని అనుకుంటున్నట్లు తెలిపారు. అంతకుముందు ఆయన నూతన విద్యుత్ కార్యదర్శిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆర్థిక మంత్రిత్వ శాఖలో సీనియర్ అధికారి అయిన గార్గ్‌ను ఇటీవల విద్యుత్ మంత్రిత్వ శాఖకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. అక్టోబర్ 31 నుంచి వీఆర్‌ఎస్‌కు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరినట్లు చెప్పారు. మరో ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ..బిమల్ జలాన్ కమిటీ(ఆర్బీఐ రిజర్వులు)లో కొనసాగేదానిపై స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. ఆర్థిక మంత్రిత్వశాఖతోపాటు విద్యుత్ శాఖ కూడా చాలా కీలమని, ఈ రంగంలో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉన్నదన్నారు.

## వేదాంతా లాభంలో 12 శాతం క్షీణత




**న్యూఢిల్లీ, జూలై 26:** మైనింగ్ దిగ్గజం అనిల్ అగర్వాల్‌కు చెందిన వేదాంత లిమిటెడ్ నిరాశాజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను సంస్థ రూ.1,351 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో వచ్చిన 1,533 కోట్ల రూపాయల లాభంతో పోలిస్తే 11.8 శాతం క్షీణించింది. కన్సాలిడేటెడ్ ఆదాయం రూ.22,624 కోట్ల నుంచి రూ.21,754 కోట్లకు పడిపోయింది. కమోడిటీ ధరలు తగ్గడం వల్లనే లాభాల్లో గండిపడిందని వేదాంతా సీఈవో శ్రీనివాసన్ వెంకటకృష్ణన్ తెలిపారు. వెండి ఉత్పత్తి అంచనాలకుమించి వృద్ధిని నమోదు చేసుకోగా, అల్యూమినియం ప్రొడక్షన్ నిలకడైన వృద్ధిని సాధించిందన్నారు. ప్రస్తుతం సంస్థకు రూ.59,517 కోట్ల స్థాయిలో అప్పు ఉండగా, ఇదే సమయంలో రూ.30,774 కోట్ల నగదు నిల్వలు ఉన్నాయి. మరోవైపు, ఆంగ్లో అమెరికన్ కంపెనీ నుంచి అనిల్ అగర్వాల్ వైదొలుగుతున్నట్లు ప్రకటించారు. రెండేండ్లుగా 20 శాతం వాటాతో అతిపెద్ద వాటాదారుడిగా కొనసాగిన అగర్వాల్..ఈ వాటాను పూర్తి విక్రయించనున్నట్లు ప్రకటించారు.

## 25 విమానాశ్రయాల ప్రైవేటీకరణ!



■ ఏఏఐ చైర్మన్ గురుప్రసాద్ వెల్లడి



(ముంబై ఎయిర్‌పోర్టు)

**న్యూఢిలీ, జూలై 26:** ఈ ఏడాది మొదట్లో ఆరు విమానాశ్రయాలను ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టిన కేంద్ర ప్రభుత్వం..మరో 20 నుంచి 25 విమానాశ్రయాలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలని చూస్తున్నది. విదేశీ విమానాశ్రయాలు నిర్వహిస్తున్న సంస్థలను భాగస్వామ్యం చేయాలనే ఉద్దేశంతో రెండోదశలో భాగంగా పాతిక ఎయిర్‌పోర్టులను గుర్తించినట్లు ఏఏఐ చైర్మన్ గురుప్రసాద్ మోహపాత్ర శుక్రవారం వెల్లడించారు. ఫిబ్రవరిలో నిర్వహించిన ఎయిర్‌పోర్ట్‌ల ప్రైవేటీకరణలో అదానీ గ్రూపు బిడ్డింగ్‌లో పాల్గొని ఆరు ఎయిర్‌పోర్ట్‌లను చేజిక్కించుకున్నది. వీటిలో లక్నో, అహ్మదాబాద్, జైపూర్, మంగళూరు, తిరువనంతపురం, గువాహాటిలు ఉన్నాయి. 'ఇప్పటికే ఆరు ఎయిర్‌పోర్ట్‌లను ప్రైవేటీకరించాం.. రెండో విడుతలో భాగంగా మరో 20 నుంచి 25 విమానాశ్రయాలను ప్రైవేటీకరించాలని అనుకుంటున్నాం' అని మోహపాత్రా విలేకరులతో వెల్లడించారు. ఏయే విమానాశ్రయాలను ప్రైవేటీకరించేదానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని, త్వరలోనే ఏఏఐ వీటి పేర్లను ప్రకటించనున్నదని తెలిపారు. వార్షికంగా 15 లక్షల మంది ప్రయాణికులు తమ గమ్యస్థానాలను చేర్చే విమానాశ్రయాలను ఇందుకు ఎంపిక చేయనున్నట్లు, ఆ తర్వాత పౌర విమానయాన మంత్రిత్వశాఖకు సిఫారస్ చేయనున్నట్లు ఆయన సూచనప్రాయంగా చెప్పారు. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనున్నది. సీనియర్ ఉన్నతాధికారుల బదిలీల్లో భాగంగా మోహపాత్ర కూడా డిపార్ట్‌మెంట్ ఆఫ్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్(డీపీఐఐటీ)కి బదిలీ అయ్యారు. ఆయన ఆగస్టు 1న డీపీఐఐటీ సెక్రటరీగా పదవీ బాధ్యతలు స్వీకరించబోతున్నారు. ఈ విమానాశ్రయాలను గుర్తించడానికి కన్సల్టెన్సీని ఏర్పాటు చేసినట్లు, వారిచ్చిన సమాచారం ఆధారంగా నిర్ణయం తీసుకోనున్నట్లు చెప్పారు. రెండోసారి నిర్వహించబోతున్న బిడ్డింగ్‌లో ఏ సంస్థయైన పాల్గొనవచ్చని, తొలి రౌండ్ వేలం విజయవంతం కావడంతో రెండోదఫాపై భారీ ఆశలు పెట్టుకున్నట్లు తెలిపారు. డబ్లిన్, మునిచ్ విమానాశ్రయాలకోసం ప్రైవేట్ సంస్థలు పోటీపడే అవకాశాలున్నాయన్నారు. గతేడాది నవంబర్‌లోనే ఈ ఆరు ఎయిర్‌పోర్టులను పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్(పీపీపీ) పద్ధతిన ప్రైవేటీకరించాలని కేంద్రం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఫిబ్రవరిలో నిర్వహించిన బిడ్డింగ్‌లో అదానీ గ్రూపు ఈ ఆరింటిని దక్కించుకున్నది. వీటికి కేంద్ర క్యాబినెట్ ఇటీవల ఆమోదం తెలిపింది.

# ఆరు రోజుల పతనానికి బ్రేక్

### 52 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్




**ముంబై, జూలై 26:**
దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస నష్టాలకు అడ్డుకట్ట పడింది. బలహీన అంతర్జాతీయ సంకేతాలు, విదేశీ పెట్టుబడులు తరలిపోవడంతో గత ఆరు సెషన్లుగా నష్టాలను చవిచూసిన సూచీలు ఎట్టకేలకు లాభాల్లోకి వచ్చాయి. బలహీన సంకేతాలతో ఉదయం నష్టాల్లో ప్రారంభమైన సూచీలు వారాంతం ట్రేడింగ్ ముగిసే సరికి లాభాల్లోకి మళ్లాయి. కార్పొరేట్ కంపెనీల నిరుత్సాహక ఫలితాలపై మదుపరులు దృష్టి పెట్టడంతో సూచీలు ఆద్యంతం ఒడుదుడుకులకు లోనుకావడంతో స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్నది. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 51.81 పాయింట్ల లాభంతో 37,882.79 వద్ద, నిఫ్టీ 32.15 పాయింట్లు అందుకొని 11,284.30 వద్ద ముగిశాయి. ఈ వారం మొత్తానికి సెన్సెక్స్ 454.22 పాయింట్లు(1.18 శాతం) నష్టపోగా, నిఫ్టీ కూడా 134.95 పాయింట్లు(1.18 శాతం) పతనం చెందాయి. యెస్ బ్యాంక్ అత్యధికంగా 9.64 శాతం లాభపడి మార్కెట్లను లాభాల్లోకి తీసుకొచ్చింది. వీటితోపాటు బజాజ్ ఫైనాన్స్ 7.20 శాతం ఎగబాకింది. హీరో మోటోకార్ప్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఆటో, టాటా మోటర్స్, ఏషియన్ పెయింట్స్, కొటక్ మహీంద్రా బ్యాంక్‌ల షేర్లు 3.21 శాతం వరకు లాభపడ్డాయి. మరోవైపు వేదాంతా, రిలయన్స్ ఇండస్ట్రీస్, భారతీ ఎయిర్‌టెల్, ఓఎన్‌జీసీ, హెచ్‌డీఎఫ్‌సీ, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫోసిస్‌లు ఐదు శాతం వరకు నష్టపోయాయి. వరుసగా ఆరు రోజుల తర్వాత రికవరీ బాట పట్టిన సూచీలకు ఆర్థిక ఫలితాలు అడ్డుకట్టవేశాయని, వచ్చే వారాల్లో సరాసరి కంటే అధిక స్థాయిలో వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ అంచనా ఊరటనిచ్చిందని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. దేశ ఆర్థిక పరిస్థితులు నిరుత్సాహకరంగా ఉండటంతో విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు నిధుల ఉపసంహరణకు మొగ్గుచూపడం కూడా ఈక్విటీలపై ఒత్తిడి పెంచిందన్నారు. రంగాలవారీగా చూస్తే ఆటో, బ్యాంకెక్స్, క్యాపిటల్ గూడ్స్, హెల్త్‌కేర్, ఇండస్ట్రీయల్, ఫైనాన్స్, కన్జ్యూమర్ డ్యూరబుల్ షేర్లు రెండు శాతం వరకు బలపడ్డాయి. కానీ, ఐటీ, టెక్, ఆయిల్ అండ్ గ్యాస్, యుటిలిటీ, విద్యుత్ రంగ షేర్లు ఒక్కశాతం వరకు నష్టపోయాయి. మరోవైపు, అంతర్జాతీయ మార్కెట్లో బ్యారెల్ క్రూడాయిల్ ధర స్వల్పంగా పెరిగి 63.77 డాలర్ల వద్ద ముగిసింది.

### కోలుకున్న రూపాయి




వరుసగా నాలుగు రోజులపాటు నష్టాన్ని నమోదు చేసుకున్న రూపాయి విలువ ఎట్టకేలకు కోలుకున్నది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 15 పైసలు బలపడి 68.89 వద్ద ముగిసింది. దేశీయ ఈక్విటీ మార్కెట్లు లాభాల బాట పట్టడం రూపాయి బలపడటానికి దోహదం చేశాయి. 69.12 వద్ద ప్రారంభమైన కరెన్సీ విలువ ఒక దశలో 68.85 గరిష్ఠ స్థాయికి చేరుకున్నది. చివరకు నిన్నటి ముగింపుతో పోలిస్తే 15 పైసలు పెరిగి 68.89 వద్ద ముగిసింది. దేశీయ ఈక్విటీ మార్కెట్లలోకి విదేశీ ఇన్వెస్టర్లు నిధులను కుమ్మరించడం రూపాయి బలోపేతానికి పరోక్షంగా కారణమైందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ హెడ్ వీకే శర్మ తెలిపారు. ఈ వారంలో మారకం విలువ 9 పైసలు ఎగబాకింది.


ఆషాఢం ఆఫర్ సేల్
ఆనందం హోల్‌సేల్
అదృష్ట ఆషాఢం సేల్
2 ఆరణి చెక్స్ శారీస్ ₹333
2 కుప్పాడం జరీ శారీస్ ₹444
2 మాస్టర్ కార్డ్ శారీస్ ₹555
2 విపుల్ కేటలాగ్ శారీస్ ₹666
అన్నిరకాల సరికొత్త వస్త్రాలపై 63% వరకు తగ్గింపు
MENS ₹999
WOMENS 1+1 1+2
BOYS 1+2
GIRLS 1+2
₹1225/- తగ్గింపు
బంగారు ఆషాఢం
గొలుసులు గాజుల పై 6%
తరుగు - మజూరీ లేదు
₹1000
J.C.Brothers
THE FAMILY SHOPPING MALL
DILSUKHNAGAR - KUKATPALLY - ZAHEERABAD
పట్టు శారీస్ • డిజైనర్ శారీస్ • ఫ్యాన్సీ శారీస్ • కాటన్ శారీస్ • సల్వార్ సూట్స్ • గాఘ్రాస్ • మెన్స్ వేర్ • కిడ్స్‌వేర్


AADI KG SALE
Once in a Year OFFER
అతితక్కువ ధరలు
కొద్దిరోజులు మాత్రమే
Levi's BUY 3 50% OFF
INDIAN TERRAIN BUY 4 50% OFF
MUFTI BUY 1 40% BUY 2 50%
KILLAR BUY 1 30% BUY 2 40%
ARROW BUY 1 30% BUY 2 40%
otto FLAT 10% OFF
FLAT 20% OFF
BLACKBERRYS BUY 1 GET 1 FREE
PETER ENGLAND BUY 2 GET 2 FREE
Pepe Jeans BUY 2 GET 2 FREE
BUY 2 GET 1 FREE
నమ్మశక్యంకాని ఆషాఢం అద్భుత ఆఫర్లు
బంగారు ఆభరణాలపై ఆషాఢం ఆఫర్లు
6% తరుగు
1250
లేదు
1000
The CHENNAI SHOPPING MALL
HYDERABAD & SECUNDERABAD
PhonePe
BAJAJ FINSERV


sprint
SMT. PRAVEENA KADIYALA PRESENTS
Gnapika Entertainments
BASED ON TRUE INCIDENTS
U/A
ఆగస్టు 2 విడుదల
గుణ 369
ARJUN JANDYALA
ANIL KADIYALA TIRUMAL REDDY
CHAITAN BHARADWAJ RAAM THAMMIRAJU GM SHEKAR RAMAKRISHNA
Meet Hero
Mr.KARTHIKEYA
at LOT Mobiles Store,
Balaji Nagar, KUKATPALLY
Today at 6.00 pm.
Brand Partner LOT
LOT
150 STORES ACROSS TS & AP
SMART AASHADAM SALE
UPTO 60% DISCOUNT On Exchange*
PRE-BOOK NOW
K20 PRO 4 GB+128 GB 8 GB+256 GB
K20 6 GB+64 GB 6 GB+128 GB
Xiaomi
FLAT 30% CASH BACK Paytm
UPTO CASH BACK HDFC BANK
ONE TIME SCREEN REPLACEMENT FREE
*On Selected Models
1 MONTH EMI FREE
Helpline: 1800 123 3567
లాట్‌లో ఖచ్చితమైన బహుమతులు ఎన్నో..మరెన్నో..
*Conditions Apply

నమస్తే తెలంగాణ
జిందగీ
శనివారం 27 జూలై 2019
WWW. NTNEWS.COM
/nt.zindagi



జీవితంలో ఎన్నో మధుర క్షణాలు ఉంటాయి..
అందులో పెండ్లి వేడుక చాలా ప్రత్యేకం..
వేద మంత్రాలు.. అష్ట దిక్కులు.. అగ్ని సాక్షిగా..
ఈ తంతు అంగరంగ వైభవంగా చేసుకోవడం చూస్తూనే ఉన్నాం..
తాహతుకు తగినట్టుగా.. పెండ్లికి ముందు.. తర్వాత వేడుకలకైతే కొదువే లేదు..
మరి ఈ ఆనంద క్షణాలను.. అనుభూతులను..
బంధించడానికి కెమెరా కన్ను చాలా పని చేయాల్సి ఉంటుంది..
ఫొటోగ్రఫీ రంగంలో ఇప్పటిదాకా మగవాళ్ల హవానే చూశాం..
కానీ ఈ అమ్మాయి ఆ రంగాన్ని ఎంచుకోవడమే కాదు..
ఇందులో యంగెస్ట్ అచీవర్‌గా కూడా పేరు తెచ్చుకున్నది.
ఆమే **అర్పితా పటేల్**. నిశ్చితార్థం నుంచి రిసెప్షన్ వేడుక దాకా..
ఏదీ వదులకుండా తన ఫొటోగ్రఫీతో ప్రత్యేకత చాటుకుంటున్నది..

# కెమెరాకే.. ఆమె జీవితం అర్పితం!

**సహజ చిత్రీకరణ కే ప్రాధాన్యం**

**ఒకప్పుడు** పెండ్లి వేడుక అంటే పురోహితుల హడావుడి ఎక్కువగా కనిపించేది. కానీ, ఇప్పుడు ఈ స్థానాన్ని ఫొటోగ్రాఫర్లు భర్తీ చేశారంటే అతిశయోక్తి కాదేమో! సమయానికి జీలకర్ర పెట్టించడం అది కూడా అందంగా కనిపించేలా ఉంచడంలో వీరి పాత్ర ఎక్కువగా ఉంటుంది. తాళి తంతు.. ఆ పై అప్పగింతలు.. అబ్బో ఒక్కటేమిటి ఇంట్లో చుట్టాల కంటే వీళ్ల హంగామానే ఎక్కువ. వచ్చిన వాళ్లను కూడా వదలకుండా స్టిల్స్ పెట్టించి.. ఆల్బమ్‌ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంలో ఒక్కొక్కరిదీ ఒక్కో ప్రత్యేకత. అర్పితది కూడా అలాంటి ప్రత్యేకమైన స్టైలే. కాకపోతే ఇప్పుడున్న వారికి కాస్త భిన్నం. పాత తరంలో పెండ్లి ఎంత అందంగా జరిగేదో.. అందరూ ఆ పెండ్లిని ఎలా ఆనందించేవారో అలాగే పెండ్లి జరిపించి.. ఆ క్షణాలను తన కెమెరాలో బంధిస్తుంది. అందుకే ఆమెను 'యంగెస్ట్ ఫొటోగ్రాఫర్ ఇన్ సిటీ' అవార్డు వరించింది.

### మొదటి సంపాదన

గుజరాత్‌కు చెందిన అర్పిత కుటుంబం ఎప్పుడో హైదరాబాద్ తరలి వచ్చింది. తాతల కాలం నుంచే ఇక్కడ స్థిరపడిన కుటుంబం వాళ్లది. తండ్రి ధీరజ్ పటేల్ బిజినెస్ చేస్తున్నాడు. తల్లి రమిలా పటేల్ గృహిణి. అర్పితకు ఒక తమ్ముడు ఉన్నాడు. ఆమె హైదరాబాద్‌లోని అరోరా కాలేజ్‌లో డిగ్రీ చేసింది. చదువు మీద పెద్దగా ఆసక్తి ఉండేది కాదట. కానీ తండ్రి ఏమంటాడోనన్న భయం, ఏదో ఒక డిగ్రీ చేతికి రావాలని  చేసింది. కాకపోతే చిన్నప్పటి నుంచి తండ్రి ఫోన్‌లో ఫొటోలు తీయడం ఒక హాబీగా వచ్చింది. అదే ఆమె ప్రొఫెషన్‌గా మారుతుందని అప్పుడు అనుకోలేదు. కేవలం ఫొటోలే తీయడం కాకుండా.. వాటిని ఎడిట్ చేసి రకరకాల ఫొటోఫ్రేమ్‌లను పెట్టి అమ్మకు చూపించేది. అర్పితకు తల్లి ప్రోత్సాహం ఎక్కువగా ఉండేది. ఒక విధంగా చెప్పాలంటే ఫొటోగ్రఫీ తల్లి నుంచే అబ్బింది. ఆమెకు కూడా నచ్చిన చిత్రాలను కెమెరాలో బంధించడమంటే ఇష్టం. డిగ్రీ తర్వాత ఫొటోగ్రఫీ చేస్తానని తండ్రికి చెప్పింది. మొదట వద్దన్నాడు. అర్పితకు ఫొటోగ్రఫీ మీద ఉన్న ఆసక్తిని చూసి ఒప్పుకోక తప్పలేదు. మొత్తానికి ఫొటోగ్రాఫర్ అయింది. కీటకాలు, ఈగలు, జంతువులను అందంగా ఫొటోలు తీసి ఇన్‌స్టాగ్రామ్‌లో పెడుతుండేది. ఆ ఫొటోలకు ఫాలోవర్స్ కూడా ఎక్కువగా ఉన్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె ఫొటోలు చూసి ఒక పెండ్లికి ఫిమేల్ ఫొటోగ్రాఫర్ కావాలని అర్పితను కలిశారు. అప్పటిదాకా ఇలాంటి ఫొటోగ్రఫీ చేయలేదు. కానీ చాలెంజింగ్‌గా తీసుకొని ఆ ప్రాజెక్ట్‌ని పూర్తి చేసింది. ఆ తర్వాత 'శ్రేయాన్ దుంగర్వాలా' దగ్గర పెండ్లి ఫొటోగ్రఫీకి సంబంధించి ప్రత్యేక శిక్షణ తీసుకున్నది.

### ట్రావెలింగ్ అంటే ఇష్టం..

అర్పితకు ఫొటోగ్రఫీతో పాటు ట్రావెల్ చేయడమంటే చాలా ఇష్టం. ఇతర ప్రదేశాలకు వెళ్లి అక్కడ ప్రత్యేకతల్ని ఫొటోలు తీస్తుంది. ట్రావెల్ ఫొటోలు తీసి ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టేది. ఆ ఫొటోలు చూసి ట్రావెల్ కంపెనీలు అర్పితను కలిసి చాన్స్ ఇచ్చారు. ట్రిప్‌కు అయ్యే ఖర్చంతా వారే భరిస్తారు. అందుకుగాను అక్కడి ఫొటోలు తీసి ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇలా పోయిన యేడాది లడఖ్, భూటాన్ ప్రదేశాలు చుట్టొచ్చింది. ఈ యేడాది కూడా సెప్టెంబర్‌లో ఫొటోగ్రాఫర్ల ట్రిప్‌నకు వెళ్తున్నది. ఎక్కడికి వెళ్లినా అక్కడి ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడుతుంటుంది. వారి భాష, సంప్రదాయాలు తెలుసుకుంటుంది. ఫొటోగ్రాఫర్‌కు కమ్యూనికేషన్ ముఖ్యం అంటున్నది అర్పిత. ఇలా ఒకవైపు ట్రావెలాగ్ ఫొటోలు మరోవైపు పెండ్లిండ్లు రెండింటినీ బ్యాలెన్స్ చేసుకుంటున్నది. అర్పిత ఎన్ని పడితే అన్ని కాకుండా.. నెలకు మూడు పెండ్లిండ్లకు ఫొటోలు తీసి వాటిని నీట్‌గా ఎడిట్ చేసి క్లైంట్‌కు ఇస్తున్నది.

### వర్క్‌షాప్‌లు..

అర్పిత డిగ్రీ 2015లో పూర్తయింది. అప్పటి నుంచి ఎంతో శ్రమపడి ఫొటోగ్రఫీ నేర్చుకున్నది. 2017 నుంచి సొంత కెమెరాతో ఫొటోషూట్ చేయడం మొదలుపెట్టింది. ఈ మధ్య కాలంలో ఆరు వర్క్‌షాపులు నిర్వహించి చాలామందికి ఉచితంగా ఫొటోగ్రఫీ నేర్పించింది. చాలామంది ఫాలోవర్స్ ఫొటోగ్రఫీ నేర్పించమని అడుగుతుంటారు. అలా అడిగిన ఒక్కొక్కరు కనీసం 20 మంది అయితే వారికి వర్క్‌షాప్ టైం, తేదీ, ప్రదేశం చెబుతుంది. అందరికీ వీలయ్యేలా ఆదివారమే ఈ వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నది. కొంతమందికి నేర్పిస్తూ.. తాను కూడా ఓ స్టూడెంట్‌లా ఫొటోగ్రఫీని ఇప్పటికీ నేర్చుకుంటూనే ఉన్నానంటున్నది అర్పిత.

చిన్న ఫొటోగ్రఫీ వర్క్‌షాపులు చేశాను. నా పనితనం చూసి లయోలా కాలేజ్ వాళ్లు నన్ను పిలిచి 'యంగెస్ట్ ఫిమేల్ ఫొటోగ్రఫర్ ఇన్ సిటీ'గా బిరుదునిచ్చారు. ఆ కాలేజ్‌లోనే కొన్నిరోజులకు ఫొటోగ్రఫీ పోటీలు జరిగాయి. అప్పుడు న్యాయ నిర్ణేతగా వ్యవహరించాను. ఆ తర్వాత జూన్‌లో సెయింట్ పీటర్స్ కాలేజ్, భవాన్స్ కాలేజ్‌లో జడ్జ్‌గా వెళ్లి అవార్డులు తీసుకున్నాను. ఇప్పటివరకు నేను చేసిన ఫొటోగ్రఫీలో లడఖ్ ట్రిప్ నాకు బాగా బూస్టప్ ఇచ్చింది. కొంచెం ఖాళీ దొరికినా సరే సినిమాలు చూస్తాను. అందులో వచ్చే సీన్స్‌కి కెమెరా డైరెక్షన్ ఎలా తీసుకున్నారు, ఏ లెన్స్ వాడారో తెలుసుకుంటాను. అవి చూసినప్పుడు కొంచెం క్రియేటివ్ ఆలోచనలు వస్తాయి. ఇవి కెరీర్‌కు బాగా ఉపయోగపడుతాయి. అందరి ఫొటోగ్రాఫర్లకు నాకు వ్యత్యాసం ఏంటంటే.. పెండ్లికూతురు గాజులు వేసుకునేటప్పుడు, తిలకం దిద్దేటప్పుడు, మెహిందీ పెట్టేటప్పుడు అలాంటి ఆనంద క్షణాల్ని నాచురల్‌గా ఫొటోలు తీసి వారిని సర్‌ప్రైజ్ చేస్తాను. పెండ్లి జరిగేటప్పుడు నన్ను పట్టించుకోకుండా మీ పనితో మీరు ఎంజాయ్ చేస్తుండండి అని చెప్తాను. వారు నన్ను చూడకపోయినా ప్రతీ ఫొటోనూ క్లిక్ చేస్తాను. ఇదే నా ప్రత్యేకత.
ఇన్‌స్టాగ్రామ్ :www.instagram.com/passionographer_7
ఫేస్‌బుక్ : www.facebook.com/arpitapatelpassionographer



'ఫొటోగ్రఫీలో ముందుగా కెమెరా పట్టుకోవడం రావాలి. ఎలా పడితే అలా పట్టుకోకూడదు. కెమెరాను గౌరవించాలి' అంటున్నది ఈ అచీవర్. అర్పిత ఈ మధ్యే ఫుడ్‌పై ఫొటోగ్రఫీ చేయడం కూడా ప్రారంభించింది. పెండ్లి ఫొటోలు చూసి జూబ్లిహిల్స్‌లోని బి-డబ్స్ బఫెల్లో వింగ్స్ అనే అమెరికన్ రెస్టారెంట్ అర్పితాకు అవకాశం ఇచ్చారు. ఫుడ్‌పై అంతగా పరిచయం లేకపోయినా.. ఆ ఫొటోగ్రఫీ ఎలా చేయాలో నేర్చుకుంటూ ప్రాజెక్ట్‌ను మొదలుపెట్టింది. అది బిగ్ అచీవ్‌మెంట్‌గా భావిస్తున్నది అర్పిత. యాక్టర్ అమల 'బ్లూ క్రాస్'కి నాలుగు నెలలు ఫొటోగ్రాఫర్‌గా పని చేసిందీ అమ్మాయి. 'రన్ రాజా రన్' సినిమాలో ఫొటోగ్రఫీ అసిస్టెంట్‌గా కూడా చేసింది.





భూటాన్ మెమోరియల్ చోర్టెన్



...✍ వనజ వనిపెంట
📷 గడసంతల శ్రీనివాస్

# నా బడి.. నా తోట!



ఎక్కడ సమస్య ఉంటుందో.. అక్కడే ఓ పరిష్కారం కూడా ఉంటుంది. మిజోరాంలోని లవాంగ్లయ్ జిల్లా డిప్యూటీ కమిషనర్ శశాంక ఆలోచనే దీనికి ఒక ఉదాహరణ.

మిజోరాంలోని లవాంగ్లయ్ జిల్లా రాజధానికి 296 కిలోమీటర్ల దూరంలో చాలా సమస్యాత్మక ప్రాంతం ఉంది. ఎప్పుడూ విపత్తుల భయం పొంచి ఉండే ప్రదేశం. మాన్‌సూన్‌లో అయితే పరిస్థితి దారుణంగా ఉంటుంది. చెడిపోయిన రోడ్డు, విరిగిపడే కొండ చరియలతో భయంకరంగా ఉంటుంది. ఒకప్పుడు ఉన్న 170 గ్రామాలు ఇప్పుడు 40 గ్రామాలకు తగ్గిపోయాయి. ప్రధానంగా అక్కడ మాన్‌సూన్‌లో నిత్యావసర సరుకుల, కూరగాయల సమస్య ఎక్కువ ఉంటుంది. రవాణా సౌకర్యం కొరత, విపత్తుల భయం వల్ల ఎక్కువ దూరం వెళ్లడానికి ఉండదు. దీంతో హర్యానా నుంచి ఇతర వ్యాపారులు వచ్చి ఎక్కువ ధరలకు సరుకులు అమ్ముతారు. ఈ సమయంలోనే అక్కడ డిప్యూటీ కమిషనర్‌గా శశాంక విధుల్లో చేరింది. జిల్లా హెడ్‌క్వార్టర్‌లోనూ కూరగాయల సమస్య ఉండడంతో ఆమె సొంతంగా పండించాలనుకున్నది. అలా ఒక తోటను ఏర్పాటు చేసింది. ఈ తోటలను పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎందుకు విస్తరించకూడదని అనుకున్నది. వెంటనే ఉన్నతాధికారులతో మాట్లాడి ' మై స్కూల్, మై ఫామ్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రతి స్కూల్‌లో, అంగన్‌వాడీ కేంద్రంలోని ఖాళీ స్థలంలో ఇలాంటి ఫామ్‌లు ఏర్పాటు చేయాలనీ, స్థలం లేకపోతే టెర్రస్ గార్డెనింగ్‌లు తయారు చేయాలని అధికారులను కోరింది. దీని పర్యవేక్షణ, నియంత్రణను స్కూల్ హెడ్‌మాస్టర్ల నుంచి వ్యవసాయ శాఖ అధికారుల వరకూ అందరూ చూసేందుకు కృషి చేసింది. దీనివల్ల స్థానికులకు కూరగాయలు చవకగా దొరకడంతోపాటు విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం సాధ్యం అవుతుందని అందరికీ అవగాహన కల్పించింది. ఇప్పుడు దాదాపు అన్ని పాఠశాలల్లో టమాటలు, అల్లం, పసుపు, మొక్కజొన్న, ముల్లంగి పంటలు పండించడం ప్రారంభించారు. 2020 కల్లా ఇవన్నీ చేతికి అందుతాయనీ, పౌష్టికాహారం, కూరగాయల సమస్య తీరుతుందనీ శశాంక అంటున్నది.



# నెలసరికి ఇవి సరి

నెలసరి సమయంలో స్త్రీలకు చాలా ఇబ్బందికరంగా, అసౌకర్యంగా ఉంటుంది. ఆ సమయంలో నీరసంగా, బలహీనంగా ఉంటారు. ఏమీ తినాలనిపించదు. ఏమీ తోచదు కూడా. కొందరిలో వికారం, తిమ్మిర్లు వంటి లక్షణాలు కూడా ఉంటాయి. అలాగే రుతుస్రావం సరైన సమయానికి రాకపోయినా ఎన్నో ఆరోగ్య ఇబ్బందులు ఎదురవుతుంటాయి. పీరియడ్స్ సమయంలో, ఇర్రెగ్యులర్ పీరియడ్స్ సమయంలో ఎలాంటి ఆహారం తీసుకోవాలంటే...



- చాలా ఉపయోగకరంగా ఉండే కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్లను రుతుస్రావం సమయంలో డైట్‌లో చేర్చుకోవాలి. పండ్లు, తృణధాన్యాలు, ఆకుపచ్చని కూరగాయలను జోడించాలి. శరీరంలోని చక్కెరస్థాయిని నియంత్రించడానికి నారింజ, క్యారట్లు, రేగు పండ్లు కూడా తింటే మంచిది.
- డార్క్ చాక్లెట్ తినడానికి నెలసరి సమయం ఖచ్చితమైంది. డార్క్ చాక్లెట్ మీ మానసిక స్థితిని నియంత్రించే విధంగా పనిచేసే 'సెరోటోనిన్' అనే హార్మోన్లను ఉత్పత్తి చేయడానికి సహాయపడుతుంది. కోడి గుడ్లు, పాలు కూడా మంచి బలమైన ఆహారం.
- విటమిన్లు లేని ఆహారాలతో రాజీ పడకండి. వాస్తవానికి ప్రతి స్త్రీ పీరియడ్స్ సమయంలో విటమిన్లు, ప్రోటీన్లను ఎక్కువగా తీసుకోవాలి. సిట్రస్ పండ్లు, బెర్రీలు, ద్రాక్షాల నుంచి విటమిన్-సి ని పొందండి, ఇవి రీ ప్రొడక్టివ్ సిస్టమ్ ఆరోగ్యాన్ని మెరుగుపర్చడానికి సహాయపడుతాయి.
- పీరియడ్స్ సమయంలో అనేకమంది స్త్రీలు ఎదుర్కొంటున్న సాధారణ సమస్యల్లో ఒకటి కడుపులో తిమ్మిరి. ఈ తిమ్మిరికి కారణం హార్మోన్ల హెచ్చుతగ్గులు. అవసరమైన ఫ్యాటీ ఆసిడ్స్‌ను తీసుకోవడం ద్వారా వాటిని నియంత్రించవచ్చు. గుమ్మడికాయ గింజలు, అవిసె గింజలు, పొద్దు తిరుగుడు విత్తనాలను మీ ఆహారంలో చేర్చుకోండి. వీటిలో ఫ్యాటీ ఆసిడ్స్ ఉంటాయి.
- రుతుస్రావం సమయంలో రక్తం కోల్పోవడం ఒక సాధారణ విషయం. మహిళలు తగిన ఐరన్ రిచ్ ఫుడ్స్ తీసుకోవాలి. ఐరన్ ఎక్కువగా తీసుకోవడం వల్ల రక్తహీనతతో కూడా పోరాడవచ్చు. బలహీనతను తగ్గించడానికి కూడా ఐరన్ సహాయపడుతుంది.

# చక్కెరతో చక్కని చిట్కాలు

చర్మంపై మృతకణాలను తొలగించడంలో చక్కెర చాలాబాగా పని చేస్తుంది. ముఖ్యంగా మోకాళ్లు, మోచేతులపై ఉండే మృత కణాలను నిమ్మకాయ ముక్కకు పంచదారను అద్ది రుద్దితే నల్లగా ఉన్న చర్మం కాంతివంతంగా మారుతుంది. చక్కెరతో ఇంట్లో ప్రతినిత్యం అనేక రకాల ప్రయోజనాలను పొందొచ్చు.



- అరకప్పు బ్రౌన్ షుగర్‌లో కొన్ని అరటిపండు ముక్కలు వేసి ముద్దలా చేయాలి. దీన్ని శరీరానికి మర్దన చేసి కొద్దిసేపటి తర్వాత కడిగేయాలి. ఇలా చేయడం వల్ల చర్మం మెరుస్తుంది.
- మొక్కల ఆహారంలో చక్కెర అతి ముఖ్యమైంది. మొక్కలు కూడా గ్లూకోజ్‌ను చాలా బాగా ఇష్టపడతాయి. అయితే ఇంట్లో ఉన్న మొక్కలకు పంచదారతోపాటు కాస్త వెనిగర్ కూడా కలిపితే చీమలు, ఈగలు,కీటకాలు రాకుండా ఉంటాయి.
- కొన్ని సందర్భాల్లో పెదాలకు ఉన్న లిప్‌స్టిక్ గ్లాసులకు, ఇతర పాత్రలకు అంటినప్పుడు  తొలగించడం చాలా కష్టం. అటువంటప్పుడు  కొంచెం చక్కెర తీసుకుని రుద్దితే మరకలు పోతాయి.
- బొగ్గులతో నిప్పులు రాజేసే సమయంలో మంట పుట్టించేందుకు పంచదార ఉపకరిస్తుంది.
- స్పైసీగా ఉన్న పదార్థాలను తిన్నప్పుడు పట్టలేనంత కారం వేసినప్పుడు నాలుకపై కాస్త చక్కెర వేస్తే సరి వెంటనే ఉపశమనం కలుగుతుంది.
- నెయ్యి, వెన్న పాలమీద మీగడ గానీ చేతికి అంటినప్పుడు అంత తేలికగా జిడ్డు వదలదు. అటువంటి జిడ్డును పంచదారతో ఇట్టే వదిలించవచ్చు.

# దేశానికే తొలి ప్రపంచ సుందరి

**ఏ వ్యక్తిలో అయితే శారీరక లోపం ఉంటుందో.. అ వ్యక్తిలోనే ప్రతిభ దాగి ఉంటుంది. దానికి ఉదాహరణే విదిశ భలియన్ జీవితం. ఈమె మిస్ వరల్డ్ డెఫ్ పోటీల్లో విజయం సాధించింది. భారతదేశం తరపున ఆ కిరీటాన్ని దక్కించుకున్న మొదటి అమ్మాయి.**





ఒకరి విజయం వారిని మాత్రమే ప్రభావితం చేయదు. అది ఇతరులను కూడా ప్రభావితం చేస్తుంది. ఎంతోమందికి ధైర్యాన్ని నింపుతుంది. అందుకే విజేతలెప్పుడూ ఇతరులకు ఆదర్శంగా ఉండాలి. అందుకే  ఈమె విజేతగా నిలవాలనుకుంది. తన లాంటి అంగవైకల్యం ఉన్న వారికి కొండంత ధైర్యం ఇవ్వాలనుకుంది. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన 21ఏండ్ల చెవిటి మహిళ  విదిశ భలియన్ 'మిస్ వరల్డ్ డెఫ్ పోటీ'ల్లో పాల్గొన్నది. పదహారు దేశాల నుంచి వచ్చిన వారితో పోటీ పడి ఈ కిరీటాన్ని దక్కించుకున్నది. విదిశ యూపీలోని ఘాజియాబాద్‌కు చెందిన మహిళ. అంతకు ముందు ఈమె ఇంటర్నేషనల్ టెన్నిస్  ప్లేయర్. ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో డిగ్రీ చేసి తన జీవితాన్ని క్రీడారంగంలో కొనసాగించాలనుకున్నది. ప్రపంచ డెఫ్లెంపిక్స్ పోటీల్లో సిల్వర్ మెడల్ కూడా సాధించింది. ఈ పోటీల తర్వాత వెన్ను నొప్పితో బాధపడింది. అప్పుడే మోడలింగ్‌లో తన ప్రయాణం మొదలు పెట్టింది. నోయిడా, గురుగావ్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకుంది. తర్వాత ప్రపంచ పోటీల్లో తన ప్రతిభతో కిరీటం దక్కించుకుంది. 'నాలాంటి వారికి ఆత్మస్థైర్యం నింపడానికే ఈ పోటీల్లో ఉంటున్న. ఇలాంటి పోటీతత్వం ఉన్న వేదికల మీద నుంచి వారిని మోటివేట్ చేయాలనుకుంటున్నాను' అని చెబుతున్నది విదిశ.

## వంటింటి చిట్కాలు



- పులుసులో ఉప్పు ఎక్కువైనప్పుడు కాస్త చపాతీ పిండిని ఏడు లేదా ఎనిమిది ఉండలుగా చేసి దానిని పులుసులో వేసి కాసేపాగి తీసేయాలి. పులుసు రుచిగా ఉంటుంది.
- పచ్చిమిర్చి అధిక కారం ఉండొద్దనుకుంటే.. కోసేటప్పుడు కత్తికి కాస్త ఉప్పు రాసి దానితో పచ్చిమిర్చిని కోయాలి. అలాగే కాసిన్ని మెంతులు, మినుపప్పును నూరి మజ్జిగలో ఉప్పు వేసి పచ్చిమిర్చిని ఊరబెడితే రుచిగా ఉంటాయి.
- కొత్తిమీర ఆకులను వాడి వాటి కాడలను పడేస్తుంటాం. పులుసు లేదా సాంబార్‌లో వేస్తే మంచి వాసన వస్తుంది. సాంబార్‌లో వేస్తే అదనపు రుచి కూడా వస్తుంది.
- సాంబార్ చేసేందుకు కందిపప్పును ఉడికిస్తాం. ఉడికించే సమయంలో ఇందులో కాసిన్ని మెంతులు కూడా వేస్తే రాత్రి వరకు పాడవకుండా ఉంటుంది. దీంతో పాటు ఆరోగ్యం కూడా బాగుంటుంది.
- ఇడ్లీలు చేసేటప్పుడు ఇడ్లీ పాత్రలపై ఒక్కో బొట్టు నూనె చుక్క వేయాలి. పాత్రల్లోంచి తీసేటప్పుడు ఇడ్లీలు సులభంగా వస్తాయి.

నమస్తే తెలంగాణ
నిధి
[ కరీంనగర్ ]
శనివారం 27 జూలై 2019

అసలే కొత్త ఉద్యోగం.. నెల రాగానే చేతికొచ్చే జీతంతో స్నేహితులతో సినిమాలు, షికార్లలో మునిగిపోతుంటారు. నవతరం ఉద్యోగుల్లో కొందరు పొదుపు చేయడాన్ని పెద్దగా పట్టించుకోరు. కొందరు తెలివైనవారు మాత్రం.. జీతాన్ని జాగ్రత్తగా కాపాడుకుంటూ జీవితంలో నిలదొక్కుకోవడానికి ప్రాధాన్యతనిస్తారు. అందుకే, జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే.. ముందు నుంచీ ఆర్థిక ప్రణాళికల్ని పక్కాగా రచించుకోవాలి. ఈ నేపథ్యంలో, ప్రతీ కొత్త ఉద్యోగి ఐదు అంశాలపై కచ్చితంగా దృష్టి సారించాలి. అప్పుడే, ఎలాంటి ఆర్థిక సమస్యలు ఎదురైనా సమర్థంగా అధిగమిస్తారు.



# కొత్త ఉద్యోగి.. ఈ ఐదు చెయ్యి!

**జీ**తం రాగానే దేనికెంత ఖర్చు పెట్టాలో ముందుగా రాసుకోవాలి. చెల్లించాల్సిన అద్దె, సరుకులు, ఆఫీసుకు రానుపోను ఖర్చులు, కొనాల్సిన వస్తువుల గురించి ముందే ఓ జాబితా సిద్ధం చేసుకోవాలి. కొన్ని చిల్లర ఖర్చులను మనలో చాలామంది పెద్దగా పరిగణనలోకి తీసుకోరు. కానీ, నెల చివరికి వచ్చేసరికి అవే పెద్దగా కనిపిస్తుంటాయి. అందుకే, కొత్త ఉద్యోగులెప్పుడూ జీతం వచ్చిన తొలి రోజుల్లో తమ నెలవారీ ఖర్చుల గురించి తప్పకుండా రాసుకోవాలి. ఎక్కడెక్కడ ఎంతెంత సొమ్ము ఖర్చు చేస్తున్నామనే విషయంపై దృష్టి సారించాలి.

### అప్పులు వద్దే వద్దు..

ఉద్యోగంలో చేరిన తర్వాత స్నేహితులతో కలిసి కొత్త ప్రదేశాలకు వెళ్లడమో లేదా ఖరీదైన ఎలక్ట్రానిక్ ఉపకరణం కొనడమో చేయకూడదు. మన దేశంలో సుమారు 85 శాతం ట్రావెల్ లోన్ దరఖాస్తులు కొత్త ఉద్యోగంలో చేరిన వ్యక్తుల నుంచే రావడం గమనార్హం. కాకపోతే, ఉద్యోగం చేరిన కొన్నాళ్లకే రుణాలెక్కువ తీసుకోవడం కరెక్టు కాదని గుర్తుంచుకోండి. వ్యక్తిగత రుణం తీసుకుంటే ఏటా 20 నుంచి 24 శాతం దాకా వడ్డీ చెల్లించాలి. క్రెడిట్ కార్డులను ఇష్టం వచ్చినట్లు వినియోగిస్తే మరింత భారమవుతుందని గుర్తుంచుకోవాలి. క్రెడిట్ కార్డుల్ని వినియోగించేవారు గడువు తేదిలోపే సొమ్ము చెల్లించాలి. లేకపోతే, మీరు బకాయి పడ్డ సొమ్ము మీద అదనంగా కొంత వడ్డీ కట్టాల్సి ఉంటుందని గుర్తుంచుకోండి. బకాయి పడ్డ సొమ్ముతో బాటు మళ్లీ కొత్తగా క్రెడిట్ కార్డును వినియోగించడం వల్ల.. నెలసరి సొమ్ములో దాదాపు నలభై శాతం ఇవి కట్టడానికే సరిపోవచ్చు.

**30 శాతం కంటే అధిక మొత్తం చెల్లింపుల కోసం వినియోగించకూడదు)**

### మీరేం చేయాలంటే?

జీతం బ్యాంకులో పడగానే కొంత మొత్తాన్ని అలాగే ఉంచుకోవాలి. వచ్చే 3 నుంచి 4 ఏండ్లలో కారు కొనాలని ఉన్నా, ఉన్నత చదువులకు వెళ్లాలన్నా.. హైబ్రిడ్ ఫండ్లలో మదుపు చేయాలి. గుడ్డిగా పొదుపు చేయడం కంటే.. మీ లక్ష్యానికి తగ్గట్టుగా పెట్టుబడులు పెట్టడం ఉత్తమం.

### అత్యవసర నిధి అవసరమే..

అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకోవడం అత్యంత కీలకమైన విషయమని గుర్తుంచుకోవాలి. ఉద్యోగంలో చేరిన కొన్నాళ్లకే మీరు తీసుకున్న వాహనంతో సమస్య వచ్చినా, ఖరీదైన మొబైల్ ఫోనుకు మరమ్మతులు చేయించాల్సి వచ్చినా కష్టమే కదా! పైగా ఉద్యోగం కోల్పోయినా, ఆరోగ్య సమస్యలు తలెత్తినా ఎలాంటి అప్పులు చేయకుండా పరిష్కరించుకునేలా ఉండాలి. ప్రస్తుతమున్న ఉద్యోగం వదిలేసి కొత్త కోర్సులో చేరి సరికొత్త ఉద్యోగంలో చేరాలని భావించేవారి సంఖ్య పెరుగుతున్నది. ఇలాంటి వారంతా ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండాలంటే ఈ ఏర్పాటు అత్యవసరమే.

### మీరేం చేయాలంటే?

మీ నెలసరి ఖర్చుల్లో మూడు నుంచి ఆరు నెలలు ఖర్చును తట్టుకునేలా అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకోవాలి. అప్పులు చెల్లించడం, అద్దెలు కట్టడం వంటివాటినీ దృష్టిలో పెట్టుకోవాలి. ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు తలెత్తినా అధిగమించడానికి హీనపక్షం రెండు నుంచి మూడు నెలల ఖర్చును అట్టి పెట్టుకోవాలి.

### బీమా పాలసీ కీలకమే!

మీరు ఉద్యోగంలో చేరిన కొత్తలోనే జీవిత, ఆరోగ్య బీమా పాలసీలు తీసుకుంటే ప్రీమియం తక్కువుంటుందని గుర్తుంచుకోండి. ఈ సమయంలో తక్కువ ప్రీమియం పాలసీ తీసుకోవడం కంటే సరైన పాలసీని ఎంచుకోవడం అన్నివిధాల ఉత్తమం. మీపై ఆధారపడిన వారు లేకపోతే ఎల్ఐసీ పాలసీలు తీసుకోకపోవడమే మేలు. అవసరం లేకుండానే పాలసీలు తీసుకోవడం వల్ల కొత్త బరువు అని గుర్తుంచుకోవాలి. మీరు విద్యారుణం చెల్లిస్తుంటే మాత్రం.. అంతే మొత్తానికి టెర్మ్ ప్లాన్‌ను ఎంచుకోవడం అన్నివిధాల మేలు. విద్యారుణం సాయంతో కొత్తగా ఉద్యోగంలో చేరిన వ్యక్తులు, ముందుగా ఆ రుణాన్ని చెల్లించడానికి ప్రాధాన్యమివ్వాలి. ఇది మంచి రుణమే అయినప్పటికీ, వడ్డీ చెల్లించడం కొంత ఇబ్బందికరమైన విషయమనే చెప్పాలి. పైగా, విద్యారుణం తీసుకున్నవారు చేసే వడ్డీ చెల్లింపులపై సెక్షన్ 80 ఈ కింద పన్ను రాయితీ లభిస్తుంది. పైగా, ఇది కేవలం ఎనిమిదేండ్లు మాత్రమేనని గుర్తుంచుకోవాలి.

### మీరేం చేయాలంటే?

పన్ను ఆదాయాన్ని పొందేందుకు యువకులకు ఎండోమెంట్ పాలసీలను ఎంచుకోవచ్చు. వీటి ద్వారా మూడు రకాల ప్రయోజనాలు లభిస్తాయి. బీమా, పన్ను ఆదా, సంపద సృష్టికి ఉపకరిస్తాయి. సంప్రదాయ పాలసీల కంటే 5-6 శాతం ఆదాయం తక్కువొస్తుందని గుర్తుంచుకోవాలి. కొత్త ఉద్యోగులకు అప్పులు పెద్దగా ఉండవు. పైగా, చేతికొచ్చే జీతమూ మెరుగ్గానే ఉంటుంది. కాబట్టి, అప్పు తిరిగి చెల్లించడం కష్టమేం కాకపోవచ్చు. కాకపోతే, ఇదే సమయంలో పెద్ద రుణాలు తీసుకోకుండా జాగ్రత్తపడటం అన్నివిధాల ఉత్తమం.

### పన్ను ఆదా తెలుసా..

ఏడాదికి రూ. 5 లక్షలు ఆర్జించేవారు ఎలాంటి పన్ను చెల్లించనక్కర్లేదు. కొత్తగా ఉద్యోగంలో చేరినవారంతా అధిక శాతం ఇదే విభాగంలోకి వస్తారు. అందుకే, ఏడాదికి రూ.6 నుంచి 7 లక్షలు ఆదాయాన్ని ఆర్జించేవారు.. పన్ను ప్రణాళికలపై మెరుగైన రీతిలో దృష్టి సారించాలి. ఆదాయాన్ని రూ.5 లక్షల్లోపు ఉండేలా చూసుకోవడం ఉత్తమం. కేవలం పన్ను ఆదా కోసమే మదుపు చేయకుండా అధిక రాబడిని అందించే ఫండ్ల పై దృష్టి సారించండి. ముక్కూమొహం లేని వ్యక్తులు చెప్పే పొదుపు సలహాలు తీసుకోవద్దు. నేషనల్ పెన్షన్ స్కీమ్‌లో మదుపు చేస్తే అరవై ఏండ్లలోపు సొమ్ము తీసుకోవడానికి వీలు ఉండదు. అదే, ఈక్విటీ ఆధారిత పొదుపు పథకాల్లో మదుపు చేస్తే పన్ను ఆదా అవుతుంది. అధిక రాబడి లభిస్తుంది. ఇదే సమయంలో పీపీఎఫ్ మీద తక్కువ మొత్తాన్ని పెట్టుబడిగా పెట్టి, ఈక్విటీల్లో అధిక శాతం సొమ్మును మదుపు చేయాలి.

### మీరేం చేయాలంటే?

కొన్ని సంస్థలు ఉద్యోగులకు పన్నురహిత చెల్లింపులకు అవకాశాల్ని ఇస్తాయి. ఈ క్రమంలో వాటిని ఎలా వినియోగించాలో తెలుసుకోవాలి. ఉదాహరణకు, కొన్ని సంస్థలు పలు షోరూములు, సూపర్ మార్కెట్లలో వినియోగించేందుకు ఆహార కూపన్లను అందిస్తాయి. సెక్షన్ 80సీసీడీ (2) కింద ఎన్‌పీఎస్ లాభాన్ని అందుకోవడమో చక్కటి ప్రత్యామ్నాయం.

## ఇదీ ముఖ్యమే!



కెరీర్ ప్రారంభంలో చేతికొచ్చే సొమ్ము ద్వారా జీవితాన్ని ఆస్వాదించాలని యువత కోరుకోవడం సహజమే. ఎందుకంటే, ఈ వయసులో బాధ్యతలు పెద్దగా ఉండవు. అందుకే, చేతికి ఎంత సొమ్ము వస్తే అంత మొత్తాన్ని ఖర్చు చేయాలని కొందరు భావిస్తారు. ఇలాంటి వారంతా నెలసరి బిల్లుల్ని చెల్లించి, అత్యవసర నిధికి కొంత సొమ్మును పక్కన పెట్టేసిన తర్వాత.. దాదాపు 8 నుంచి 10 శాతం సొమ్మును నియంత్రణలో లేని ఖర్చు కోసం దాచి పెట్టుకోవాలి. ఇదే సొమ్ముతో వీలైతే బూట్లు కొనుక్కోవడం, కన్సర్ట్‌కు వెళ్లడం వంటివి చేయడం ఉత్తమం.

### మీరేం చేయాలంటే?

ఆర్థికంగా ఎలాంటి బాధ్యతలు లేనిపక్షంలో, మీ వద్ద ఉన్న సొమ్మును ఖర్చు చేయండి. కాకపోతే, ఎట్టి పరిస్థితుల్లో అప్పు చేయకూడదు. క్రెడిట్ కార్డులను వినియోగించవద్దు. కొత్తగా ఉద్యోగంలో చేరిన తర్వాత వచ్చే జీతంతో వీలైనంత వరకూ ఉన్నదాంట్లో ఖర్చు చేయడం ఉత్తమం. అంతేతప్ప, అలా జీతం రాగానే ఇలా జల్సాలకు ఖర్చు చేయడం కరెక్టు కాదు.

---

# క్రెడిట్‌కార్డు తిరస్కరణ?



**నగదురహిత లావాదేవీలకు ప్రాధాన్యత పెరగడంతో.. అధిక శాతం మంది క్రెడిట్ కార్డుల పట్ల మొగ్గు చూపుతున్నారు. జాగ్రత్తగా వాడుకుంటే క్రెడిట్ కార్డును మించిన ప్రత్యామ్నాయం మరోటి లేదని కొందరు భావిస్తారు. ఈ క్రమంలో ఎలాగైనా క్రెడిట్ కార్డు తీసుకోవాలని ప్రయత్నిస్తారు. కాకపోతే, కొన్ని సందర్భాల్లో పలు బ్యాంకులు క్రెడిట్ కార్డును మంజూరు చేయడానికి తిరస్కరిస్తున్నాయి.**

### రుణ చెల్లింపుల్లో నిర్లక్ష్యమా?

మీరు క్రెడిట్ కార్డు రుణాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనప్పుడు లేదా సేవలను వినియోగించడంలో 3 నుంచి 6 నెలలు నిలిపేసినప్పుడు బ్యాంకులు మీకు నోటీసులు పంపేందుకు ఆస్కారం ఉంటుంది. అయినప్పటికీ మీరు చెల్లింపుల్లో నిర్లక్ష్యం వహిస్తే మీ కార్డును డిఫాల్ట్‌గా పరిగణిస్తారు. ఇదంతా క్రెడిట్ రిపోర్టులో నమోదవుతుంది. దీని ద్వారా మీ క్రెడిట్ కార్డు దరఖాస్తును తిరస్కరించవచ్చు. అందుకే మీరు క్రెడిట్ కార్డుకు దరఖాస్తు చేసుకునే 6-12 నెలల ముందు వరకు ఎలాంటి డిఫాల్ట్ లేకుండా చూసుకోవాలి. అలా చేస్తే మీ క్రెడిట్ కార్డు దరఖాస్తుకు ఆమోదం పొందేందుకు అవకాశాలు మెరుగుపర్చుకోవచ్చు.

**మీ** పేరిట ఇప్పటికే ఒక క్రెడిట్ కార్డు ఉంటే ఇబ్బంది లేదు. కాకపోతే, అంతకుమించి తీసుకుంటానంటే కష్టమే. మీకు రుణభారం పెరుగుతుందని భావించి క్రెడిట్ కార్డు ఇవ్వడానికి బ్యాంకులు తిరస్కరిస్తాయి. ఇలా జరగకూడదంటే? క్రెడిట్ కార్డు దరఖాస్తు చేసుకునే ముందే వీలైనంత త్వరగా రుణాన్ని తీర్చివేయాలి. ఇదివరకే రెండు లేదా అంతకంటే ఎక్కువ క్రెడిట్ కార్డులను కలిగి ఉండి, అధిక బ్యాలెన్స్ పరిమితి ఉంటే మీరు ఆర్థిక నిర్వహణలో నిర్లక్ష్యం చూపుతున్నారని బ్యాంకులు భావిస్తాయి. మీ క్రెడిట్ కార్డు వినియోగపు నిష్పత్తి 50 శాతం కన్నా ఎక్కువగా ఉన్నా మీ క్రెడిట్ కార్డు దరఖాస్తును బ్యాంకు ఆమోదించదు.

### క్రెడిట్ రిపోర్ట్‌పై విచారణ

మీరు ఏ రకమైన రుణానికి దరఖాస్తు చేసుకున్నా బ్యాంకు క్రెడిట్ స్కోరును తనిఖీ చేస్తుంది. ఈ ప్రక్రియ మొత్తం మీ క్రెడిట్ వివరాల్లో నమోదు అవుతుంది. తరచుగా క్రెడిట్ స్కోరు తనిఖీలుంటే మీకు క్రెడిట్ కార్డు ఇవ్వడానికి బ్యాంకు ఆసక్తి చూపకపోవచ్చు. దీని బారిన పడకుండా ఉండాలంటే సాధ్యమైనంత వరకు క్రెడిట్ స్కోరు తనిఖీల మధ్య కనీసం నాలుగు నెలల మధ్య వ్యత్యాసం ఉండేలా చూసుకోవాలి. దీంతోపాటు తనిఖీలు తగ్గించుకోవడం వలన క్రెడిట్ కార్డు పొందవచ్చు. క్రెడిట్ కార్డును ఇచ్చేటప్పుడు బ్యాంకులు ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుంటాయి. నిబంధనల్లో సూచించిన విధంగా నెలవారీ ఆదాయ పరిమితిని కలిగి ఉండాలి. వారు ఇచ్చిన నిబంధనలకు మీ ఆదాయ స్థాయి సరిపోకపోతే మీ దరఖాస్తు తిరస్కరణకు గురి కావచ్చు.

---

# చిరు వ్యాపారులకు నెలనెలా పింఛన్

**పదవీవిరమణ తర్వాత ఉద్యోగులకు పింఛన్ అందుతుంది. అంటే, దాదాపు అరవై ఏండ్లు దాటిన తర్వాత, ఉద్యోగులు నెలకు ఎంతోకొంత ఆదాయం చేతికొచ్చేలా ప్రణాళికలు రచిస్తారు. కానీ, చిరువ్యాపారుల సంగతేమిటి? దుకాణాల్ని నిర్వహించేవారు, రైస్ మిల్లు యజమానులు, మెకానిక్ షెడ్డుల ఓనర్లు, రియల్ ఎస్టేట్ బ్రోకర్లు, కమిషన్ ఏజెంట్లు, చిన్న హోటళ్లు, రెస్టారెంట్ల యజమానులు.. ఇలా కాస్త చిన్న స్థాయిలో వ్యాపారాన్ని నిర్వహించేవారు.. ఇక నుంచి అరవై ఏండ్ల తర్వాత పింఛన్‌ను అందుకోవచ్చు. అదెలా అంటారా? ఇటీవల ప్రారంభమైన 'ప్రధానమంత్రి లఘువ్యాపారి మాన్-ధన్ యోజన 2019' అనే పథకం ద్వారా ఈ ప్రయోజనాన్ని కల్పిస్తుంది. ఈ పెన్షన్ ఫండ్‌ను సక్రమంగా నిర్వహించేందుకు ఫండ్ మేనేజర్‌గా ఎల్ఐసీని నియమించారు.**



**ఏ**టా రూ.1.5 కోట్ల టర్నోవర్‌ను మించని వ్యాపారులు ఈ పథకంలో చేరడానికి అర్హులు. వయసు 18 ఏండ్ల నుంచి 45 ఏండ్ల దాకా ఉన్నవారు తమ బ్యాంకు పొదుపు ఖాతా వివరాలు, ఆధార్ కార్డు, స్వయం ధృవీకరణ పత్రాన్ని అందజేయాల్సి ఉంటుంది. ఒకవేళ, ఇప్పటికే ఎవరైనా నేషనల్ పెన్షన్ స్కీమ్ కింద చేరి ఉన్నట్లయితే వారు అనర్హులుగా పరిగణిస్తారు. ఒకవేళ, ఎవరైనా పదేండ్ల లోపు ఈ పథకం నుంచి పక్కకు జరిగితే, తను చెల్లించిన మొత్తానికి, అదనంగా కొంత బ్యాంకు వడ్డీ రేటును లెక్కించి చెల్లిస్తారు. పదేండ్ల కంటే ఎక్కువ కాలానికి సొమ్ము చెల్లించిన వ్యక్తి.. అరవై ఏండ్ల వయసు రాక ముందే.. ఈ పథకం నుంచి వెనక్కి వచ్చేయాలని భావిస్తే.. అప్పటివరకూ చెల్లించిన సొమ్ముపై పింఛన్ ఫండ్ ద్వారా వచ్చిన వడ్డీని లెక్కగట్టి అందజేస్తారు.

### నెలకు ఎంత చెల్లించాలి?

ఈ పథకం కింద చేరడానికి చిరువ్యాపారుల వయసును బట్టి నెలసరి ప్రీమియం ఆధారపడుతుంది. ఉదాహరణకు, 18 ఏండ్ల వయసు గల అబ్బాయి లేదా అమ్మాయి ఈ పథకంలో చేరాలంటే, తొలుత రూ.55 రూపాయలు చెల్లించాల్సి వస్తుంది. 29 ఏండ్లు గలవారు నెలకు రూ.100 కట్టాలి. 40 ఏండ్ల వ్యక్తి అయితే నెలకు కట్టాల్సింది కేవలం రెండు వందలు మాత్రమే. ఇందులో చేరిన వ్యక్తులు ప్రతినెలా చెల్లించే సొమ్ము బట్టి, కేంద్ర ప్రభుత్వం తన వాటా కింద అంతే మొత్తాన్ని జత చేస్తుంది. ఉదాహరణకు 18 ఏండ్ల వయసు గలవారు నెలకు రూ.55 చెల్లిస్తే, అంతే మొత్తాన్ని కేంద్ర తన వాటాగా జమ చేస్తుంది.

### ఒకవేళ మరణిస్తే ఎలా?

ఈ పథకంలో చేరిన వ్యక్తి దురదృష్టవశాత్తు మరణిస్తే.. అప్పటివరకూ చెల్లించిన సొమ్ముకు బ్యాంకు వడ్డీ జోడించి వెనక్కి ఇచ్చేస్తారు. లేదా మరణించిన వ్యక్తి వయసును బట్టి పెన్షన్ ఫండ్ వడ్డీ లెక్కగట్టి అందజేస్తారు. అలా కాకుండా, ఆ పథకాన్ని అలాగే కొనసాగిస్తామని చెప్పినా అంగీకరిస్తారు. అయితే, ఈ పథకం కింద పింఛన్ అందుకునే వ్యక్తి దుర్మరణం చెందితే, కేవలం యాభై శాతం పింఛన్ మాత్రమే అతని భార్యకు అందజేస్తారు. అరవై ఏండ్లు రాక ముందే, అర్హుడైన వ్యక్తికి శాశ్వతంగా వికలాంగుడైతే, ఆయా పథకాన్ని కొనసాగించొచ్చు. లేకపోతే, చెల్లించిన కాలానికి గాను సొమ్ము లెక్కగడతారు.

**ఈ పథకంలో చేరిన వ్యక్తికి అరవై ఏండ్లు వచ్చాక, ఎల్ఐసీ ద్వారా నెలకు రూ.3,000 పింఛన్‌ని అందజేస్తారు.**

---

# మంచి రాబడి.. పన్ను ప్రయోజనం



**అధిక శాతం పన్ను పోటును తప్పించుకోవడానికి.. క్రమం తప్పకుండా ఆదాయాన్ని అందించే పొదుపు పథకాలను ఎంచుకోవాలి. మరి, ఇందుకోసం మనకు అందుబాటులో పన్ను ఆధారిత పథకాలు ఏమేం ఉన్నాయంటే..**

**యూ**నిట్ ఆధారిత బీమా పథకాలను యూలిప్‌లుగా పిలుస్తారు. దీన్ని ప్రత్యేకత ఏమిటంటే.. బీమా రక్షణను అందించడంతో పాటు పెట్టుబడి మీద ఆదాయం కూడా అందజేస్తుంది. ఇందులో పెట్టుబడి పెడితే, గరిష్ఠంగా రూ.లక్షన్నర దాకా పన్ను ప్రయోజనాన్ని అందుకోవచ్చనే విషయాన్ని మర్చిపోవద్దు. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే.. క్రమం తప్పకుండా ప్రీమియం చెల్లించినప్పుడే పన్ను ప్రయోజనాలు లభిస్తాయి. ఒకవేళ, రెండేండ్ల కంటే ముందే, యులిప్‌లో మదుపు చేయడం నిలిపివేస్తే మాత్రం.. ఎలాంటి ఉపయోగమూ ఉండదని గుర్తుంచుకోండి. కొందరు తెలివిగా ఏం చేస్తారంటే, మొదటి ఏడాది పన్ను ప్రయోజనాన్ని అందుకుని, రెండో ఏడాది యులిప్‌లో పెట్టుబడి పెట్టడాన్ని హఠాత్తుగా నిలిపివేస్తారు. దీంతో, మొదటి ఏడాది తగ్గిన సొమ్మును రెండో ఏడాది ఆదాయంగా పరిగణిస్తారు. కాబట్టి, ఈ విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలి.

### పెన్షన్ ప్లాన్లు..

వీటిని రిటైర్మెంట్ ప్లాన్లుగా పిలుస్తారు. ఇందులో మదుపు చేస్తే బీమా సౌకర్యాన్ని కల్పించడంతో పాటు పెట్టుబడి ప్రయోజనాన్ని అందుకోవచ్చు. ఇందులో క్రమం తప్పకుండా పెట్టుబడి పెడితే సరిపోతుంది. సెక్షన్ 80సీసీసీ కింద పన్ను మినహాయింపూ ఉంటుంది.

### నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్లు..

భారతదేశంలోని అన్ని పోస్టాఫీసుల్లో లభ్యమయ్యే పథకమే.. నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్. ఐదేండ్లు లేదా పదేండ్ల కాలానికి సొమ్ము పెట్టాల్సి ఉంటుంది. ముఖ్యమైన విషయం ఏమిటంటే.. గరిష్ఠంగా పెట్టే పెట్టుబడి మీద ఎలాంటి పరిమితి ఉండకపోవడమే సానుకూలాంశం. ఇందులో పెట్టే సొమ్ముపై గరిష్ఠంగా ఎనిమిది శాతం దాకా వడ్డీని అందుకోవచ్చు. ఈ శాతం అటూఇటూ మారే వీలుంది. సెక్షన్ 80 సి కింద పన్ను మినహాయింపును అందుకోవచ్చు. వడ్డీపై ఎలాంటి పన్నూ ఉండదు.

---

## సుడోకు

**డైలీ సుడోకు 103 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 5 | 8 | 3 | 7 | 9 | 2 | 6 | 4 | 1 |
| 4 | 6 | 7 | 1 | 3 | 8 | 5 | 2 | 9 |
| 9 | 2 | 1 | 6 | 5 | 4 | 7 | 3 | 8 |
| 1 | 7 | 8 | 9 | 4 | 6 | 2 | 5 | 3 |
| 2 | 4 | 5 | 3 | 7 | 1 | 8 | 9 | 6 |
| 3 | 9 | 6 | 8 | 2 | 5 | 1 | 7 | 4 |
| 6 | 3 | 9 | 5 | 1 | 7 | 4 | 8 | 2 |
| 7 | 1 | 4 | 2 | 8 | 9 | 3 | 6 | 5 |
| 8 | 5 | 2 | 4 | 6 | 3 | 9 | 1 | 7 |

1. నిలువుగా, అడ్డంగా ప్రతి వరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

**డైలీ సుడోకు -104**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | | 6 | | 3 | | | |
| 7 | | | | 2 | | | 9 | |
| | 3 | 9 | 4 | | 5 | 1 | | |
| | | | 2 | | | | 4 | 3 |
| 4 | 7 | | 8 | | 9 | | 1 | 6 |
| 3 | 2 | | | | 6 | | | |
| | | 3 | 5 | | 7 | 6 | 2 | |
| | 9 | | | 6 | | | | 1 |
| | | | 9 | | 4 | | | |



# ఇల్లు.. ఆఫీసు.. పక్కపక్కనే

**వాక్ టు వర్క్ కాన్సెప్ట్‌కు ప్రత్యేక ప్రోత్సాహం | డెవలపర్లకు ప్రత్యేక రాయితీలు | సిద్ధమవుతున్న సరికొత్త పాలసీ**

**మనం నివసించే ఇల్లు.. పని చేసే ఆఫీసు.. పక్కపక్కనే ఉంటే ఎంత బాగుంటుంది కదా? వాహనాలు బయటికి తీయనక్కర్లేదు.. పెట్రోల్ ఖర్చూ ఉండదు.. ట్రాఫిక్‌లో ఇరుక్కుపోనక్కర్లేదు.. పైగా, రవాణా సమయమెంతో ఆదా అవుతుంది. అంతేకాదు, తీరిక వేళల్లో షాపింగ్ చేయడానికి మాళ్లు, సినిమాలకు మల్టీప్లెక్స్ థియేటర్లు, అత్యవసరాల్లో ఆస్పత్రులు.. ఇవన్నీ ఒకే ఆవరణలో ఉంటే.. జీవితమెంతో సాఫీగా సాగిపోతుంది. ఇలా పట్టణాల్లో నివసించే ప్రజల జీవితాల్లో సరికొత్త మార్పును తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'వాక్ టు వర్క్' కాన్సెప్ట్‌ను ప్రోత్సహిస్తూ కొత్త మున్సిపల్ చట్టాన్ని తీసుకొచ్చింది. వీటిని నిర్మించాలని గతంలో కేవలం జీవోలను తీసుకొచ్చాయి అప్పటి ప్రభుత్వాలు. కానీ, ప్రస్తుత ప్రభుత్వం వాక్ టు వర్క్ కాన్సెప్ట్ తరహా నిర్మాణాల్ని ప్రోత్సహించడానికి ఏకంగా పురపాలక చట్టంలో పొందుపర్చడం విశేషం.**

తెలంగాణ అర్బన్ ప్రాంతాల్లో వాక్ టు వర్క్ కాన్సెప్ట్‌ను ప్రోత్సహించాలని ప్రభుత్వం గట్టిగా తీర్మానించుకున్నది. ఈ క్రమంలో ఏకంగా కొత్త చట్టాన్ని తీసుకొచ్చింది. పైగా వీటిని ఒక్క హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా.. రాష్ట్రంలోని 13 కార్పొరేషన్లు, 128 మున్సిపాలిటీల్లో అభివృద్ధి చేసేందుకు ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్పులను ప్రోత్సహిస్తున్నది. వీటిని అభివృద్ధి చేయడానికి కాస్త ఎక్కువ సమయం పడుతుండటంతో.. ఈ తరహా టౌన్‌షిప్పులను చేపట్టడానికి ముందుకొచ్చే డెవలపర్లకు ప్రత్యేక రాయితీలను అందించేందుకు ప్రభుత్వం సంసిద్ధంగా ఉన్నది. ఇందుకోసం ఏకంగా సరికొత్త నిబంధనల్ని రూపొందించే పనిలో నిమగ్నమైంది. ప్రస్తుతం హైదరాబాద్ జనసాంద్రత విషయానికి వస్తే.. కిలోమీటర్‌కు 11 వేల మంది ఉన్నారని సమాచారం. ఇది రానున్న రోజుల్లో ఎంతలేదన్నా 20 వేలకు చేరుకుంటుందని అంచనా. అదే గనక జరిగితే హైదరాబాద్ మొత్తం అస్తవ్యస్తంగా మారే ప్రమాదమున్నది. ఈ అంశాన్ని ముందే గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం శివారు ప్రాంతాల్లో టౌన్‌షిప్పులను నిర్మించి.. నగరం మీద ఒత్తిడిని తగ్గించే ప్రయత్నాల్ని ముమ్మరం చేసింది. కేవలం హైదరాబాద్‌లోనే కాకుండా వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, రామగుండం, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, గజ్వేల్ వంటి పట్టణాల్లో వీటిని అభివృద్ధి చేయాలని నిర్ణయించింది.

### కోకాపేట్ హాట్ గురూ..

పశ్చిమ హైదరాబాద్‌లోని కోకాపేట్ ఒక్కసారిగా వార్తల్లోకెక్కింది. ఈ ప్రాంతంలో వచ్చే ఐదు నుంచి ఏడేండ్లలోపు కొత్త టౌన్‌షిప్పును ఏర్పాటు చేస్తున్నామని పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్ కుమార్ ఇటీవల ప్రకటించారు. ఇందులో దాదాపు 9 కోట్ల చదరపు అడుగుల విస్తీర్ణంలో వర్క్ స్పేస్‌ను నిర్మిస్తామని వెల్లడించారు. దీంతో, ఒక్కసారిగా అందరి దృష్టి కోకాపేట్ మీద పడింది. వాస్తవానికి, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లకు అతి చేరువలో కోకాపేట్ ఉండగా.. ఇప్పటికే ఈ ప్రాంతంలో అనేక బహుళ అంతస్తుల భవనాలు, ఆకాశహర్మ్యాల నిర్మాణాలు జోరుగా జరుగుతున్నాయి. నగరంలోని పేరెన్నిక గల సంస్థలు కోకాపేట్‌లో బడా ప్రాజెక్టుల్ని అభివృద్ధి చేస్తున్నాయి. ఇక్కడ్నుంచి అటు గచ్చిబౌలికి ఇటు శంషాబాద్ విమానాశ్రయానికి సులువుగా రాకపోకల్ని సాగించొచ్చు. పశ్చిమంలో కీలకమైన ప్రాంతంలో కోకాపేట్ ఉండగా.. ఇప్పుడీ ప్రాంతం మరింత హాట్ లొకేషన్‌గా అభివృద్ధి చెందనున్నది. హైటెక్ సిటీ నుంచి పాఠాలను నేర్చుకున్న తర్వాతే గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టు తరహాలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇక్కడి కొత్త టౌన్‌షిప్‌ను అభివృద్ధి చేస్తారు. వాక్ టు వర్క్ కాన్సెప్ట్ తరహాలో ఇది ఏర్పాటు కానున్నది. ఈ తరహా కట్టడాల్ని అభివృద్ధి చేసేందుకు ముందుకొచ్చే డెవలపర్లకు ప్రత్యేక ప్రోత్సాహకాల్ని అందజేస్తారు. అయితే, కోకాపేట్‌లో స్థిరనివాసాన్ని ఏర్పాటు చేసుకోవాలని భావించేవారు.. ప్రస్తుతమున్న రేట్లను పూర్తిగా పరిశీలించాకే ఫ్లాట్లను కొనుగోలు చేయాలి.

### హమారా షహర్.. మహాన్!

2019 నుంచి 2035 మధ్యలో ప్రపంచంలోనే అతివేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో హైదరాబాద్ ప్రముఖంగా నిలుస్తుందని వరల్డ్ ఎకనామిక్ ఫోరం అభివర్ణించింది. ఐక్యరాజ్యసమితి 2018లో విడుదల చేసిన నివేదికలో నగర జనాభా 56 లక్షల నుంచి 95 లక్షలకు పెరిగిందని వెల్లడించింది. ఇది 2030 నాటికల్లా కోటీ ఇరవై ఎనిమిది లక్షలకు చేరుకుంటుందని అంచనా వేసింది. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకుని భాగ్యనగరం అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. గత ఐదేండ్లలో ప్రపంచ దిగ్గజ ఐటీ, ఫార్మా సంస్థలను విశేషంగా ఆకర్షించింది.

### రిటైల్ జోరు..

హైదరాబాద్‌లో ఐటీ రంగం విశేషంగా మెరుగు అవుతుండటంతో రిటైల్ రంగం అభివృద్ధిలో దూసుకెళుతున్నది. దీంతో, ప్రపంచంలో పేరెన్నిక గల బ్రాండ్లు ఇక్కడికొస్తున్నాయి. ఈ క్రమంలో సరికొత్త షాపింగ్ మాళ్లు ఏర్పాటవుతున్నాయి. 2016 నుంచి షాపింగ్ మాళ్లలో అద్దెలకు ఎక్కడ్లేని గిరాకీ పెరుగుతున్నది. 2030 నాటికల్లా నగరంలో సుమారు ఒక కోటీ నుంచి కోటీ ఇరవై లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో కొత్త షాపింగ్ మాళ్లకు గిరాకీ ఉన్నది. ఇప్పటికే 70 లక్షల చదరపు అడుగుల స్థలంలో ఇవి నిర్మాణంలో ఉండటం గమనార్హం. 2030 నాటికల్లా రిటైల్ షాపింగ్ మాళ్ల సంఖ్య రెండింతలు పెరిగే ఆస్కారమున్నది. కనీసం కోటీ అరవై లక్షల నుంచి కోటీ ఎనభై లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో మాళ్లు ఏర్పాటు కానున్నాయి. కొత్త మాళ్లు తూర్పు, ఉత్తర హైదరాబాద్లోని ఈసీఐఎల్, దిల్‌సుఖ్‌నగర్, నిజాంపేట్, ఎల్బీనగర్, మియాపూర్, మదీనాగూడ, నానక్‌రాంగూడ వంటి ప్రాంతాల్లో ఏర్పాటు కానున్నాయి.

### హైదరాబాద్‌కే ఆదరణ..



టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం చేపట్టాక ఒక్కసారి పట్టణాభివృద్ధిలో జోరు పెరిగింది. నగరాలకు కీలకమైన మౌలిక సదుపాయాల్ని అభివృద్ధి చేసేందుకు పెద్దపీట వేసింది. అందుకు తగ్గ నిధుల్ని కేటాయించింది. గ్రీన్ కవర్‌ను పెంచడానికి ముమ్మర ప్రయత్నం చేస్తున్నది. ఇంకా, ఏయే అంశాల వల్ల హైదరాబాద్‌కు అదరణ పెరుగుతుందంటే..

- 13 ప్రముఖ విశ్వవిద్యాలయాలు, పలు బిజినెస్ స్కూళ్లకు హైదరాబాద్ కేంద్రబిందువు.
- ఇక్కడ ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విదేశీ విద్యార్థుల సంఖ్య: 4000 మంది
- గ్రీన్‌కవర్‌ను 24% నుంచి 33% పెంచేందుకు కృషి
- 180 ఫారెస్ట్ బ్లాకుల్లో 230 కోట్ల మొక్కల్ని నాటడానికి పక్కా ప్రణాళికలు
- 40 ఎలక్ట్రిక్ బస్సుల రంగప్రవేశం. త్వరలో మరికొన్ని
- 2009–19మధ్యకాలంలో.. హైదరాబాద్‌లో 65% పెరిగిన ఆస్తుల ధరలు
- ఓఆర్ఆర్, మెట్రో వల్ల పెరిగింది.. 50%
- 2009– 19 మధ్యలో.. ఓఆర్ఆర్ 1 ఫేజు పూర్తయ్యాక.. గచ్చిబౌలి చుట్టుపక్కల వచ్చిన కొత్త ఫ్లాట్ల సంఖ్య.. 28,000
- ఇదే కాలంలో కొండాపూర్ చుట్టుపక్కల ఆరంభమైన ఫ్లాట్లు.. 17,000

### డెవలపర్లకు ప్రత్యేక రాయితీలు..



ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్పులకు సంబంధించి ప్రత్యేక పాలసీని రూపొందిస్తున్నాం. వీటిని అభివృద్ధి చేసేందుకు డెవలపర్లను ప్రోత్సహించేందుకు ప్రత్యేక రాయితీలను అందించాలని భావిస్తున్నాం. ప్రజలు రవాణా కోసం తమ సమయాన్ని వృథా చేయకుండా ఉండటానికి, నగరంపై ఒత్తిడి తగ్గేందుకు వాక్ టు వర్క్ కాన్సెప్ట్‌ను అభివృద్ధి చేస్తున్నాం. ఈ పాలసీ వచ్చాక.. ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్పుల్లో నివాస సముదాయాలతో పాటు స్కూళ్లు, ఆరోగ్య సదుపాయాలు, వాణిజ్య సముదాయాలు వంటివన్నీ నివాసితులకు అందుబాటులో ఉంటాయి.

– అరవింద్ కుమార్,
ముఖ్యకార్యదర్శి, పురపాలక శాఖ

### ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



ప్రభుత్వం హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా అభివృద్ధి చేయడానికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి నగరానికొచ్చి స్థిరపడే వారి సంఖ్య పెరుగుతున్నది. మరి, వీరందరూ సాఫీగా భాగ్యనగరంలో నివసించాలన్న.. రవాణా తిప్పలు తగ్గాలన్నా.. రానున్న రోజుల్లో ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్పుల సంఖ్య పెరగాల్సిన అవసరమున్నది. పైగా, హైదరాబాద్‌మీద ఒత్తిడి కూడా గణనీయంగా తగ్గాల్సిన అవసరం ఉన్నది. అందుకే, ప్రభుత్వం వాక్ టు వర్క్ కాన్సెప్ట్ తరహాలో టౌన్‌షిప్పులను ప్రోత్సహించడానికి చట్టంలో పొందుపర్చినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

– జీవీ రావు, అధ్యక్షుడు,
తెలంగాణ డెవలపర్స్ అసోసియేషన్

---

**మన హైదరాబాద్.. మోస్ట్ లివబుల్ సిటీ! వెరీ సేఫ్టీ సిటీ.. అభివృద్ధిలో పరుగు పెడుతున్న సిటీ.. 158 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డు రాకతో హైదరాబాద్ రూపురేఖలు సంపూర్ణంగా మారిపోయాయి. మౌలికంగా వృద్ధి చెందడంతో.. నగరం చుట్టూ సరికొత్త ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయి. ఉద్యోగావకాశాల్ని కల్పించే సంస్థలు ఏర్పడుతున్నాయి. సరికొత్త హబ్‌లు పుట్టుకొస్తున్నాయి. ఫలితంగా, గృహసముదాయాలు ఏర్పాటు అవుతున్నాయి. తూర్పులో బయోటెక్ హబ్, జినోమ్ వ్యాలీ.. దక్షిణంలో ఐటీ, ఉత్పత్తి హబ్.. ఇలా చెప్పుకుంటూ పోతే, అనేక ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయి. మరి, ఓఆర్ఆర్ చుట్టూ ఏయే ఏరియాలు వృద్ధిలోకి వస్తున్నాయంటే..**

# ఓఆర్ఆర్.. గ్రోత్ సూపర్




### కొంపల్లి/గుండ్లపోచంపల్లి.. చౌక గృహాలు

కొంపల్లి, గుండ్లపోచంపల్లి ప్రాంతాలు ఉత్తర హైదరాబాద్‌లో గణనీయంగా వృద్ధి చెందుతున్నది. ఎడ్యుకేషన్ హబ్‌గా స్థిరపడిన ఈ ప్రాంతంలో అందుబాటు గృహాల ప్రాజెక్టుల సంఖ్య ఇటీవల కాలంలో పెరిగింది. ధర తక్కువ గల ప్లాట్లను కొనడానికివే హాట్ లొకేషన్లు.

### గణనీయ అభివృద్ధికి ఘట్‌కేసర్

ఔటర్ రింగ్ రోడ్డు రాకతో ఘట్‌కేసర్‌లో ఇన్ఫోసిస్, రహేజా మైండ్ స్పేస్ వంటి ఐటీ సముదాయాలకు చక్కటి అనుసంధానం ఏర్పడింది. దీని వల్ల ఘట్‌కేసర్ కొత్త పుంతలు తొక్కుతున్నది. ఈ ప్రాంతాన్ని ఈస్ట్ ఐటీ కారిడార్‌గా అభివర్ణిస్తున్నారు.

### పక్కా అభివృద్ధి.. పటాన్‌చెరు

హైదరాబాద్‌లోని ప్రముఖ పారిశ్రామిక కేంద్రమైన పటాన్‌చెరు ఔటర్ రింగ్ రోడ్డు వల్ల మెరుగైన ప్రయోజనం పొందుతున్నది. ఇక్కడ కొత్తగా ఏర్పాటవుతున్న నివాస సముదాయాల సంఖ్య తక్కువేం కాదు. ఇండిపెండెంట్ విల్లాలను నిర్మించేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతున్నది.

### పెరుగుతున్న పెద్ద అంబర్‌పేట్

హైదరాబాద్–విజయవాడ రహదారి మీద ఉన్న ఈ ప్రాంతం.. ఔటర్ రింగ్ రోడ్డు ద్వారా ఇతర ప్రాంతాలను అనుసంధానం చేస్తున్నది. దీంతో, పెద్ద అంబర్‌పేట్ చుట్టుపక్కల కొత్త ప్రాంతాలు నివాస సముదాయాలుగా అభివృద్ధి చెందడానికి ఆస్కారమేర్పడింది.

### ఆదిభట్ల అదుర్స్

ఎయిర్‌పోర్టుతో పాటు ఆదిభట్లను ఓఆర్ఆర్ అనుసంధానం అవుతుంది. దీంతో టీసీఎస్, టాటా ఎయిరో డిఫెన్స్, ఇతర రక్షణ ఉత్పత్తి పరిశ్రమలు ఇక్కడే ఏర్పాటయ్యాయి. ఈ క్రమంలో అనేక గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయి.

### ఇబ్రహీంపట్నం ఎడ్యుకేషన్ హబ్..

ఎడ్యుకేషన్ హబ్‌గా ప్రాచుర్యం పొందిన ఇబ్రహీంపట్నం.. క్రమక్రమంగా నివాస సముదాయంగా అభివృద్ధి చెందుతున్నది. ఇక్కడ కొత్తగా లేఅవుట్లు, గృహసముదాయాల ప్రాజెక్టుల సంఖ్య పెరుగుతున్నది. బొంగలూరు, నాదర్‌గుల్ వంటి ప్రాంతాలు మెరుగ్గా అభివృద్ధి చెందుతున్నాయి.

ఔటర్ రింగ్ రోడ్డు రాకతో కొత్త ప్రాంతాలు అభివృద్ధిలోకి వస్తున్నాయి. కాకపోతే, చాలామంది రియల్టర్లు పది, పదిహేనేండ్ల తర్వాత పెరగాల్సిన రేట్లను ఇప్పుడే పెంచేసి విక్రయిస్తున్నారు. ఒకవేళ, ఉద్యోగాల్ని కల్పించే సంస్థలు ఏర్పడి, నివసించడానికి అవసరమయ్యే మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలను గుర్తించి.. అక్కడ ప్లాట్లు కొనుగోలు చేయడంలో తప్పు లేదు. ఓ ఐదారేళ్ల తర్వాతనైనా, ఆయా ప్రాంతాల్లో రేట్లు పెరగడానికి ఆస్కారముంటుంది. కాకపోతే, కొందరు మధ్యవర్తులు కృత్రిమంగా ధరల్ని పెంచుతూ.. అమాయకులకు ప్లాట్లను అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారు. వీరి వద్ద ప్లాట్లు కొనే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. ఎయిర్‌పోర్టు నిర్మాణ సమయంలో మహేశ్వరంలో అడ్డగోలుగా ధరలు పెరిగినప్పుడు కొందరు ప్లాట్లను కొనుగోలు చేసి ఓ పదేండ్ల దాకా ఇబ్బందిపడిన విషయం తెలిసిందే. ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో పదేండ్ల క్రితం పలికిన రేట్లు కూడా లేవంటే అతిశయోక్తి కాదేమో. కాబట్టి, వాస్తవికంగా ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలి.

# సాఫ్ట్ లాంచ్‌లు.. సరికొత్త మోసం..

**మియాపూర్‌లో ఫ్లాట్ ధర.. చదరపు అడుక్కీ రూ.6,300 ముందే కొంటే.. రూ.5,300 మాత్రమే..**

**వరంగల్ రహదారి మీద 500 ఎకరాల లేఅవుట్ ముందే కొంటే.. గజానికి రూ.3,800**



నగరంలోని కొందరు ప్రమోటర్లు రెరాను బేఖాతరు చేస్తున్నారు. రెరా అనుమతి లేకుండా ప్లాట్లు, ఫ్లాట్లను విక్రయించకూడదనే విషయాన్ని గాలికొదిలేసి.. ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరిస్తున్నారు. అసలు స్థానిక సంస్థల నుంచి తుది అనుమతి రాక ముందే.. రెరా పచ్చజెండా ఊపకముందే.. సాఫ్ట్‌లాంచ్ పేరిట ప్లాట్లు, ఫ్లాట్లను విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. మియాపూర్ నుంచి బాచుపల్లి రహదారిలో ఒక నిర్మాణ సంస్థ ప్రీ లాంచ్ పేరిట కొనుగోలుదారుల్ని బుట్టలో వేసుకునే ప్రయత్నం చేస్తున్నది. తక్కువ రేటు అంటూ ఆశచూపెడుతూ ఐటీ ఉద్యోగులకు గాలం వేస్తున్నది. పైగా ఆకాశహర్మ్యం కడుతున్నామంటూ ప్రచారం చేస్తున్నది. ఇదే నిజమేనా అంటూ కొందరు సాఫ్ట్‌వేర్ నిపుణులు 'సంపద'ను సంప్రదించారు. ఆకాశహర్మ్యం గురించి స్థానిక సంస్థల వద్ద వాకబు చేస్తే.. అంత బడా నిర్మాణం గురించి తమకు తెలియదని సమాచారమిచ్చారు. మరో సంస్థ, వరంగల్ రహదారిలో 500 ఎకరాల లేఅవుట్‌ను ప్రీలాంచ్‌లో కొంటే చదరపు గజానికి రూ.3,800కే విక్రయిస్తామంటూ కొనుగోలుదారులకు అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారు. తెలంగాణ రెరా అథారిటీ అనుమతి లేకుండా ఇలాంటి వాటిలో కొనుగోలు చేస్తే.. ఏదైనా తేడా జరిగితే అంతిమంగా ఇబ్బందిపడేది కొనుగోలుదారులే. ప్రాజెక్టు అనుమతి ఆలస్యమైనా, అమ్మకాలు సరిగ్గా లేక నిర్మాణ పనులను ఆలస్యం చేసినా.. తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది.

■ హైదరాబాద్‌లో అధిక శాతం ప్రమోటర్లు రెరా అనుమతి తీసుకున్నాకే ఫ్లాట్లను విక్రయిస్తున్నారు. కానీ, కొందరు అమాయక కొనుగోలుదారులకు కుచ్చుటోపి వేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇలాంటి వారి వ్యవహారశైలి వల్ల, అనుమతులన్నీ పక్కాగా తీసుకున్న డెవలపర్ల అమ్మకాల మీద ప్రభావం పడే ప్రమాదమున్నది. అసలు రెరా ఆరంభమైందే.. మోసపూరిత డెవలపర్ల నుంచి కొనుగోలుదారులను రక్షించడానికే. అంతా పక్కాగా ఉందని నిర్ధారించుకున్నాక సొంతిల్లు కొనుక్కోవడానికే. కానీ, ఇలాంటి ప్రమోటర్ల వ్యవహారం వల్ల సామాన్యులే మోసపోతారు. మరి, ఇలాంటి ప్రమోటర్ల ఆగడాలకు అడ్డుకట్ట వేయడానికి తెలంగాణ రెరా అథారిటీ ఎలాంటి చర్యల్ని తీసుకుంటుందో?

# ఏ విల్లా.. ఎంత రేటు?

ఫ్లాట్లలలో నివసించాలనే వారి కంటే.. వ్యక్తిగత గృహాల్లో నివసించాలనే వారి సంఖ్య నగరంలో పెరుగుతున్నది. ట్రాఫిక్, కాలుష్యం, స్థలాభావం తదితర కారణాలు దీనికి దోహదం చేస్తున్నాయి. నగరం నుంచి కాస్త దూరమైనా పర్వాలేదు కానీ.. విశాలంగా ఉండే ప్రశాంతమైన విల్లాల్లో నివసించాలని అనుకుంటున్నారు. దీంతో పలువురు బిల్డర్లు అన్ని హంగులతో కూడిన సరికొత్త విల్లాలను నిర్మించి అందిస్తున్నారు. ఇలాంటి వారి కోసం నగరంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న విల్లాల వివరాలు...



| ప్రాజెక్టు పేరు | బిల్డర్ | ఎక్కడ? | ధర (చ.అడుక్కీ) | సంఖ్య |
|---|---|---|---|---|
| ముప్పాస్ ఇంద్రప్రస్థ | ముప్పా | తెల్లాపూర్ | రూ.7000 | 300 |
| వినయ్ కాసా కారినో | ఎస్ఎంఆర్ – ఎస్ఎంఎస్ | బండ్లగూడ జాగిర్ | రూ.8,000 | 92 |
| వెసెల్లా మీడోస్ | వెసెల్లా గ్రూప్ | నార్సింగి | రూ.9,300 | 242 |
| ఇఐపీఎల్ రివర్ ఎడ్జ్ | ఇఐపీఎల్ గ్రూప్ | కోకాపేట్ | రూ.10,000 | 36 |
| రాంకీ ట్రాంక్విల్లాస్ | రాంకీ ఎస్టేట్స్ | కిస్మత్‌పుర్ | రూ.8,150 | 100 |
| మౌంట్ కైలాష్ | అరాన్ ఇన్ఫ్రా | గుండ్ల పోచంపల్లి | రూ. 4,800 | 60 |
| రాజపుష్ప గ్రీన్ డేల్ | రాజపుష్ప ప్రాపర్టీస్ | తెల్లాపూర్ | రూ.8,200 | 201 |
| మెజిస్టిక్ మిడోస్ | మాగ్నా హోమ్స్ | కొల్లూర్ | రూ.7,000 | 222 |
| బెల్లా విస్టా | ఆర్‌కే సీపీఆర్ కన్‌స్ట్రక్షన్ | గోపనపల్లి | – | 78 |
| ఎస్ఎం వ్యాలీ | ఎస్ఎం ప్రాజెక్ట్స్ | సైనిక్‌పురి | రూ.4,400 | 100 |

* కేవలం అవగాహన కోసమే ఈ వివరాలు. పూర్తి సమాచారం తెలుసుకునాకే తుది నిర్ణయం తీసుకోవాలి.

నమస్తే తెలంగాణ
# చిత్రం
[ కరీంనగర్ ]
శనివారం 27 జూలై 2019



'కురుక్షేత్రం' చిత్రంలో ఓ దృశ్యం

## 'దాన వీర శూర కర్ణ'తో పోలుస్తున్నారు!

మహాభారత కురుక్షేత్రాన్ని ప్రధాన ఇతివృత్తంగా తీసుకుని కన్నడలో తెరకెక్కిస్తున్న త్రీడీ చిత్రం 'కురుక్షేత్రం'. నాగన్న దర్శకుడు. దర్శన్, అర్జున్, నిఖిల్ గౌడ, సోనూసూద్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. రాక్‌లైన్ వెంకటేష్ సమర్పణలో మునిరత్నం ఐదు భాషల్లో విడుదల చేస్తున్నారు. తెలుగులో ఇదే పేరుతో విడుదల కానుంది. ఇటీవల ఈ చిత్ర ట్రైలర్‌ని బీవీఎస్ఎన్ ప్రసాద్, బన్నీవాసు సంయుక్తంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'ఈ చిత్రాన్ని కొంత మంది 'దాన వీర శూర కర్ణ'తో పోలుస్తున్నారు. అలాంటి చిత్రాలు ఒకసారే వస్తాయి. కానీ 'బాహుబలి' లాంటి చిత్రాలు మాత్రం వస్తూనే వుంటాయి. ఎవరు చేసినా ప్రేక్షకుల్ని ఎంటర్‌టైన్ చేయడం కోసమే. కానీ ఈ చిత్రం మాత్రం ఎంటర్‌టైన్ చేయడానికి, ఈ జనరేషన్‌కు మహాభారతాన్ని గుర్తుచేయడం కోసం చేశాం. కన్నడ సినిమా ఇండస్ట్రీ చాలా చిన్నది. ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నందుకు ఆనందంగా వుంది. దర్శన్ దుర్యోధనుడిగా, సోనూసూద్ అర్జునుడిగా, అర్జున్ కర్ణుడిగా, కీర్తిశేషులు అంబరీష్ భీష్ముడిగా నటించారు. ఐదు భాషల్లో చిత్రాన్ని ఒకేసారి రిలీజ్ చేస్తున్నాం' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'నిర్మాత మునిరత్నం ఈ చిత్రాన్ని ఎక్కడా రాజీపడకుండా నిర్మించారు. మన దేశంలో మొట్టమొదటిసారి మైథలాజికల్ చిత్రాన్ని త్రీడీలో చేసిన ఘనత ఆయనకే దక్కుతుంది' అని తెలిపారు.

## ఖోఖో నేపథ్యంలో 'రథేరా'

పూల సిద్ధేశ్వరరావు హీరోగా నటిస్తున్న చిత్రం 'రథేరా'. జూకెట్ రమేష్ దర్శకుడు. పూల సిద్ధేశ్వరరావు, నరేష్ యాదవ్, వై.ఎస్. కృష్ణమూర్తి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ట్రైలర్‌ని దర్శకుడు వి.వి.వినాయక్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 'ట్రైలర్ బాగుంది. అంతా కొత్తవారితో దర్శకుడు చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించినట్లుగా కనిపిస్తోంది. టైటిల్



'రథేరా' ట్రైలర్ విడుదల చేస్తున్న వినాయక్

ఆసక్తికరంగా వుంది. హీరోకిది తొలి చిత్రమైనా అనుభవం వున్న వాడిలా నటించాడు' అన్నారు. ఖోఖో క్రీడ నేపథ్యంలో సాగే చిత్రమిదని దర్శకుడు చెప్పారు.

## అక్షయ్‌కుమార్ 'బచ్చన్‌పాండే'



'బచ్చన్‌పాండే' చిత్రంలో అక్షయ్‌కుమార్

ప్రధాన స్రవంతి చిత్రాల్లో వైవిధ్యమైన, ప్రయోగాత్మక ఇతివృత్తాలకు పెద్దపీట వేస్తూ కెరీర్‌లో దూసుకుపోతున్నారు బాలీవుడ్ అగ్ర నటుడు అక్షయ్‌కుమార్. 'బచ్చన్ పాండే' పేరుతో ఆయన మరో చిత్రానికి శ్రీకారం చుట్టబోతున్నారు. ఈ విషయాన్ని ట్విట్టర్ ద్వారా వెల్లడించారాయన. సినిమాలో తన లుక్‌కు సంబంధించిన ఓ పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. నల్లటి లుంగీ ధరించి, మెడలో బరువైన ఆభరణాలతో, నుదుటి నిండా విభూతి రాసుకొని కోపోద్రిక్తుడై చూస్తున్న ఆయన ఫొటో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. 'రౌడీ రాథోడ్' తరహాలో సాగే మసాలా యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రమిదని సమాచారం. ఈ చిత్రానికి ఫర్హాద్ సామ్జీ దర్శకత్వం వహించబోతున్నాడు. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది క్రిస్మస్ పర్వదినం సందర్భంగా విడుదల చేయబోతున్నట్లు అక్షయ్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం అక్షయ్‌కుమార్ బాలీవుడ్‌లో ఐదు చిత్రాల్లో నటిస్తున్నారు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన 'మిషన్ మంగళ్' ఆగస్ట్ 15న విడుదలకు సిద్ధమవుతున్నది.

## ప్రేమ కోసం గుణ



కార్తికేయ

కార్తికేయ, అనఘ జంటగా నటిస్తున్న చిత్రం 'గుణ 369'. స్ప్రింట్ ఫిలిమ్స్, జ్ఞాపిక ఎంటర్‌టైన్‌మెంట్స్, ఎస్‌జీ మూవీస్ పతాకాలపై అనిల్ కడియాల, తిరుమల్‌రెడ్డి నిర్మిస్తున్నారు. అర్జున్ జంధ్యాల దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సెన్సార్ పూర్తయింది. యు.ఏ సర్టిఫికెట్ లభించింది. ఆగస్ట్ 2న ఈ చిత్రం విడుదలకానుంది. నిర్మాతలు మాట్లాడుతూ 'గొడవలకు దూరంగా ఉండాలనే మనస్తత్వమున్న గుణ అనే యువకుడి కథ ఇది. మనిషి రూపం సింపుల్‌గా ఉన్నా స్వరూపం మాత్రం రఫ్‌గా ఉంటుంది. కుటుంబం, ప్రియురాలి కోసం గుణ ఎలాంటి పోరాటం చేశాడన్నది తెరపై ఆసక్తిని పంచుతుంది. మంచి సినిమా చేశామనే సంతృప్తితో ఉన్నాం. ట్రైలర్, పాటలకు చక్కటి స్పందన లభిస్తున్నది' అని తెలిపారు. 'యథార్థ సంఘటనల ఆధారంగా రూపొందించిన చిత్రమిది. కార్తికేయ, అనఘ కెమిస్ట్రీ ఆకట్టుకుంటుంది. కథ, కథనాల్లోని సహజత్వం మనసుల్ని కదిలిస్తుంది' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం:చైతన్ భరద్వాజ్, ఛాయాగ్రహణం: రామ్, ఎడిటింగ్: తమ్మిరాజు, ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: సత్యకిషోర్, శివమల్లాల.



శేఖర్‌వర్మ, వివియా

## 'నివాసి' ప్రేమప్రయాణం

శేఖర్‌వర్మ, వివియా, విద్య నాయకానాయికలుగా నటిస్తున్న చిత్రం 'నివాసి'. సతీష్ రేగళ్ల దర్శకుడు. కె.ఎన్.రావు నిర్మాత. ఆగస్ట్ 9న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'ఫ్యామిలీ ఎమోషన్స్, యాక్షన్ హంగులు మేళవించిన చిత్రమిది. ఓ ప్రయాణం నేపథ్యంలో కథ నడుస్తుంది. కథానుగుణంగా టైటిల్ పెట్టాం. హీరో శేఖర్‌లోని మరో కోణాన్ని ఆవిష్కరిస్తూ అతనికి గుర్తింపు తెచ్చే చిత్రమవుతుంది' అన్నారు. 'ప్రతి ఒక్కరిలో ఆలోచనల్ని రేకెత్తించే కథాంశమిది. సినిమాలోని భావోద్వేగాలు కట్టిపడేస్తాయి. నా కెరీర్‌కు బ్రేక్‌నిచ్చే చిత్రమవుతుందనే నమ్మకం ఉంది' అని హీరో శేఖర్ వర్మ తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కె.చిట్టిబాబు, సంగీతం: చరణ్-అర్జున్, దర్శకత్వం: సతీష్ రేగళ్ల.










